మంగళవారం
27•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 261

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
• పేజీలు : 16 + (24/16)
PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





సోమవారం కరీంనగర్‌లో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో నాగలి పట్టిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్ కూడా ఉన్నారు.. సదస్సుకు పెద్దసంఖ్యలో హాజరైన రైతులు

కేసీఆర్ మరో వరం

రైతుకు బీమా 5 లక్షలు

అనారోగ్యంతోనైనా.. అకాలమరణమైనా వర్తింపు ■ 70 లక్షల మంది రైతులకు వ్యక్తిగత బీమా.. మొత్తం ప్రీమియం ప్రభుత్వమే భరిస్తుంది

- ఈ యాసంగి నుంచే మద్దతు ధరలు కల్పిస్తాం
- సమిష్టితత్వంతోనే సమస్యల పరిష్కారం
- రెండు పంటలు పండే భూమి కోటి ఎకరాలపైనే
- సమైక్య పాలనలో 75వేల చెరువులను నాశనం చేశారు
- ఈ ఏడాదే కాళేశ్వరం నుంచి మిడ్ మానేరుకు నీళ్లు
- సాగునీటి ప్రాజెక్టులకు దేశంలోనే భారీ బడ్జెట్ మనది



- పల్లెల్లో ఎల్‌ఈడీ బల్బులు గులాబీ జెండా పుణ్యమే
- కౌలు రైతులకు పెట్టుబడి ఇవ్వడం సాధ్యంకాదు
- కరీంనగర్ ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి కేసీఆర్
- రైతు వేదికల నిర్మాణానికి ముందుకొచ్చిన దాతలు
- పంట పెట్టుబడి వదులుకుంటామని పలువురి హామీ

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలంగాణ రైతు లోకానికి మరో వరాన్ని అందించారు. రాష్ట్రంలో 70లక్షలకుపైగా ఉన్న రైతులకు రూ.5 లక్షల చొప్పున వ్యక్తిగత బీమా పథకాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన మొత్తం ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. ఇందుకోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడబోమని స్పష్టంచేశారు. సోమవారం కరీంనగర్‌లో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, వరంగల్‌రూరల్, వరంగల్ అర్బన్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సభ్యులు హాజరయ్యారు. సదస్సులో ఉదయం గంటా పది నిముషాలపాటు ప్రసంగించిన ముఖ్యమంత్రి, మధ్యాహ్నం సెషన్‌లో రైతుల ప్రశ్నలకు వివరంగా సమాధానాలిచ్చారు. వ్యవసాయరంగం బాగుకోసం రాష్ట్రం చేపడుతున్న చర్యలు, రైతులు చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు.

అన్నదాతలకు బీమా పథకం

'కరీంనగర్ గడ్డపై నుంచి నేను ఏది ప్రకటించినా సఫలీకృతమైంది. ఇదే గడ్డపై నుంచి ఈరోజు సంతోషకరమైన వార్త తెలంగాణ రైతు లోకానికి చెప్తున్నా. రైతులు అనారోగ్యానికి గురైనా, అకాల మరణం చెందినా ఐదు లక్షల రూపాయలు వ్యక్తిగత బీమా వర్తించే విధంగా

మిగతా 2వ పేజీలో

లడాయి మొదలుపెడ్తం

రైతుల సంక్షోభం కాంగ్రెస్, బీజేపీ పుణ్యమే

24 లక్షల కోట్ల బడ్జెట్‌లో రైతులకు 2 లక్షల కోట్లు కేటాయించలేరా?

దేశంలో 70 వేల టీఎంసీల నీటి లభ్యత ఉంటే 35 శాతమే ఎందుకు వినియోగం?

దమ్ముంటే బీజేపీ, కాంగ్రెస్ సమాధానం చెప్పాలి

గోదావరిలో మా వాటా ఎంతో చెప్పరేం?

కేంద్రం వైఖరి మారకుంటే రైతుల తిరుగుబాటు తప్పదు

అదే జరిగితే తెలంగాణ రైతు సమన్వయ సమితిదే నాయకత్వం

కరీంనగర్ ప్రాంతీయ రైతు సదస్సులో సీఎం కేసీఆర్ నిప్పులు

'ఉపాధిహామీ'ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని తీర్మానం

2

గుండెపోటు కాదు..



అచేతనంగా..

బాత్‌టబ్‌లో మునిగి

శ్రీదేవి మృతిపై ఫోరెన్సిక్ నివేదిక

ఆమె మద్యం మత్తులో ఉన్నారన్న దుబాయ్ మీడియా

బాత్‌టబ్‌లో మునగడానికి కారణాలను ఆరాతీస్తున్న స్థానిక పోలీసులు

బోనీకపూర్‌ను మూడు గంటలపాటు ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు

కేసు దర్యాప్తు పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ

మృతదేహం అప్పగింతపై కొనసాగుతున్న జాప్యం

5

అన్ని రంగాల్లో టెక్నాలజీ

సామాన్యుడి జీవితంలో మార్పు కోసం సీఎం కేసీఆర్ తపన



- విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టిన సీఎం
- త్వరలో టీయాప్ ఫోలియో పేరుతో 180 సేవలు
- ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సులో మంత్రి కే తారకరామారావు
- డిజిటల్ ఇండియాకు ప్రజల ఆమోదం
- కేంద్రమంత్రి సీఆర్ చౌదరి

సోమవారం ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సులో కేంద్రమంత్రి సీఆర్ చౌదరితో కలిసి స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తపిస్తుంటారని, ఇందుకు టెక్నాలజీ ఆధారంగా ఆయన ప్రవేశపెట్టిన పథకాలే నిదర్శనమని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. ఇంటింటికీ సురక్షిత తాగునీటి సరఫరాతో ఇంటర్నెట్ సౌకర్యం జోడించడం మొదలుకొని.. రాష్ట్రంలోని భూములను రికార్డుల్లోకి ఎక్కించడం వరకు సీఎం చేపట్టిన పలు కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ వేదికగా ప్రారంభమైన ఈ-గవర్నెన్స్ 21వ జాతీయ సదస్సుకు సోమవారం మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర వినియోగదారులు, ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ మంత్రి సీఆర్ చౌదరి, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి, కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్‌శాఖ కార్యదర్శి అజయ్‌ప్రకాశ్ సాన్నే, యూఐడీఏఐ సీఈవో అజయ్‌భూషణ్ పాండే, కేంద్ర డీఏఆర్‌పీ, పెన్షన్లశాఖ కార్యదర్శి కేవీ ఈపన్, డీఏఆర్‌పీ అదనపు కార్యదర్శి వసుధామిశ్రా, వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రతినిధులు, పలురంగాలకు చెందిన నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ-గవర్నెన్స్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని నొక్కిచెప్పారు. భూకమతాల నుంచి పౌరసేవల వరకు అన్నిరంగాల్లో టెక్నాలజీని ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని వివరించారు. 'తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే ఈ-గవర్నెన్స్‌తో ప్రజలకు ఇంకా మెరుగైనసేవలు అందించవచ్చని మేం భావించి అందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేశాం' అని తెలిపారు. ఎం-వ్యాలెట్ ద్వారా అనేకపత్రాలు జేబులో పెట్టుకుని తిరుగాల్సిన అవసరం తప్పిందని అన్నారు. ఇక పౌరసేవల కోసం రాష్ట్రవ్యాప్తంగా 4,500 మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేశామని, త్వరలోనే టీయాప్ ఫోలియో పేరుతో 180 సేవలతో కూడిన ఇంటిగ్రేటెడ్ యాప్ విడుదల చేయబోతున్నామని

మిగతా 11వ పేజీలో

మార్కెట్ కమిటీ చైర్మన్ల గౌరవ వేతనం పెంపు

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం.. ఉన్నత శ్రేణి మార్కెట్ కమిటీ చైర్మన్‌కు రూ.25 వేలు

ప్రత్యేక శ్రేణి మార్కెట్ కమిటీ చైర్మన్‌కు రూ.20 వేలు

ఇతర శ్రేణి మార్కెట్ కమిటీ చైర్మన్లకు రూ.15 వేలు

రూ.150 నుంచి రూ.వెయ్యికి పెరిగిన సమావేశాల భత్యం

3

మే 2 నుంచి 7 వరకు ఎంసెట్

తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహణ

- నేడు నోటిఫికేషన్ విడుదల
- మార్చి 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు గడువు
- దరఖాస్తుల్లో విద్యార్థుల ఈ మెయిల్ ఐడీ తప్పనిసరి
- పెరిగిన ఆన్‌లైన్ దరఖాస్తుల ఫీజుల ధర
- ఇంగ్లిష్, తెలుగుతోపాటు ఉర్దూలోనూ ప్రశ్నాపత్రం
- మే 9న ప్రాథమిక కీ విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ, హార్టీకల్చర్ కాలేజీల్లో సీట్ల భర్తీకి మే 2 నుంచి 7 వరకు ఆన్‌లైన్‌లో ఎంసెట్ నిర్వహించనున్నామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. మంగళవారం నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంసెట్-2018 అడ్మిషన్ కమిటీ సోమవారం జేఎన్‌టీయూహెచ్‌లో సమావేశమైంది. 2018-19 విద్యాసంవత్సరానికి నిర్వహించనున్న ఎంసెట్ ప్రవేశపరీక్ష, షెడ్యూల్ గురించి కమిటీసభ్యులు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి,



ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదయ్య, రెక్టార్ ప్రొఫెసర్ దామోదర్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి వివరాలు వెల్లడించారు.

రెండు దశల్లో ఆన్‌లైన్ పరీక్షలు

రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న ఆన్‌లైన్ ఎంసెట్ పరీక్షలను ప్రతిరోజూ

మిగతా 11వ పేజీలో



సదస్సులో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్





సోమవారం కరీంనగర్‌లో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సుకు హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు వినోద్‌కుమార్, సీతారాంనాయక్, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా ఉన్నారు.

రైతుకు బీమా 5 లక్షలు

మొదటిపేజీ తరువాయి...

రైతు బీమా పథకాన్ని ప్రకటిస్తున్నా. ఇందుకు సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ వేదికపై నుంచే ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు చెప్తున్నా.. ఇంకా 500 కోట్లు అప్పు తెచ్చైనా సరే మన 70 లక్షల మంది రైతులకు బీమా చెల్లించాల్సిందే' అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఈ సమయంలో సభ మొత్తం చప్పట్లతో మారుమోగింది. 'జై కేసీఆర్' అంటూ అన్నదాతలు నినాదాలుచేశారు. సభావేదిక పైనున్న ప్రజాప్రతినిధులందరూ ఒక్కసారిగా లేచి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. బీమా చేయించే విషయంలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర రైతు సమన్వయ సమితులు నాయకత్వం వహించాలని కేసీఆర్ సూచించారు. న్యాయబద్ధంగా ఒక్క రైతును విస్మరించకూడదని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలు త్వరలో వస్తాయన్నారు.

సమిష్టితత్వమే సమస్యకు పరిష్కారం

'బాధ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరికి చేతులెత్తి నమస్కరించి చెప్తున్నా.. ఇవి రాజకీయ పదవులు కావు. మీరు తీసుకున్న బాధ్యత ఆషామాషీ వ్యవహారం కాదు. అయితే కొంత కష్టపడితే సాధించలేనిది ఏదీ ఉండదు. ఒక్కరుగా ఏమీ చేయలేం. అదే సమిష్టిగా, సమూహంగా కదిలితే ప్రభుత్వం, రాజ్యాలే తలవంచుతాయి. దీనికి ఉదాహరణ ప్రత్యేక తెలంగాణ కోసం పదిహేనేండ్లు మనం చేసిన పోరాటమే. కరీంనగర్ గడ్డ మీద నుంచి సింహగర్జన చేసి ప్రారంభించి, తెలంగాణ సమూహం ఒక్కటై స్వరాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. ఈరోజు రైతాంగాన్ని పూర్తిస్థాయిలో ఆదుకుని, అన్ని రకాలుగా పైకి తేవడం బ్రహ్మపదార్థమేమీకాదు. వంద శాతం సాధించవచ్చు. దానిలో ఎటువంటి అనుమానం లేదు. అనుకున్న పద్ధతిలో పనిచేయాలే. ప్రభుత్వం, అధికారులు కలిస్తే గమ్యాన్ని చేరుకుంటాం' అన్నారు.

పంటలపై సరైన లెక్కలు లేవు

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో ఏ పంటలు పండుతున్నాయో లెక్కలు లేవని సీఎం కేసీఆర్ అన్నారు. మన ఆహార అవసరాలు ఏమిటో తెలియదని చెప్పారు. అందుకే మన యూనివర్సిటీవాళ్లు సర్వే చేసి, అన్ని వివరాలు సేకరించారని తెలిపారు. 'ఉదాహరణకు.. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం మనిషి ఐదు గ్రాములు ఉప్పు తినాలి. కానీ మనం 20 గ్రాములు తింటున్నం. అందుకే మనకు రోషం ఎక్కువ. దీంతో బీపీ ఎక్కువవుతున్నది' అని సీఎం అనగానే సభలో నవ్వులు విరిశాయి. 'బంగారు తెలంగాణ కావాలంటే పాడి, పంట సమృద్ధిగా ఉండాలే. మూడున్నర కోట్ల ప్రజలు మూడు పూటలా కడుపునిండా తిని, కంటి నిండా నిద్రపోతే అది బంగారు తెలంగాణకు తొలి మెట్టు' అన్నారు. రైతులు అప్పుల్లేకుండా ఉండాలని, బిచ్చమెత్తుకునే పరిస్థితి ఉండవద్దన్న లక్ష్యంతో సమితులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. 'దీనిపై లేవనోడు, లేసినోడు, ఏమీ తెలియనోడు అడ్డంపొడుగు మాట్లాడుతున్నారు' అని విమర్శించారు. రైతు సమన్వయ సమితులు ఏర్పాటుచేస్తే స్థానిక సంస్థలు నిర్వీర్యం అవుతాయని కాంగ్రెస్ చెప్పడాన్ని కొట్టిపారేశారు. స్థానిక సంస్థలకు, దీనికి సంబంధమేంటని నిలదీశారు.

రెండు పంటలు పండే భూమి కోటి ఎకరాలపైనే

రాష్ట్రంలో కోటికి పైగా ఎకరాల్లో రెండు పంటలు పండించే భూమి ఉందని సీఎం కేసీఆర్ చెప్పారు. మరో 50 లక్షల ఎకరాల వరకు ఒక పంట పండించే భూములున్నాయని అన్నారు. 'వాటికికావాల్సింది నీరు. సమైక్య రాష్ట్రంలో చెరువులు దారుణంగా దెబ్బతిన్నాయి. మన వాటా మనకివ్వక పోగా, ప్రాజెక్టు కడుతామని చెప్పి వాటిని కాగితాలకే పరిమితం చేశారు. అందుకే మనం మేజర్ ప్రాజెక్టులతోపాటు మిషన్ కాకతీయ పనులు చేస్తున్నాం. సమైక్య పాలనలో 75 వేల చెరువులు నాశనం చేశారు. మళ్లీ వాటిని పునరుద్ధరించుకుంటున్నాం' అని తెలిపారు. కాళేశ్వరం, సీతారామ, పాలమూరు, దేవాదుల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమాతోపాటు పెండింగ్‌లో ఉన్న ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఈ సంవత్సరంలోనే మధ్య మానేరుకు నీరు వచ్చేలా పనులు చేస్తున్నామని, వరదకాల్వ ద్వారా ఎస్సారెస్పీ వరకు నీటిని తీసుకెళ్తామని అన్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి భద్రాద్రి వరకు 460 టీఎంసీలను వినియోగించుకునేలా అన్ని ప్రాంతాల్లో ప్రాజెక్టులకు రూపకల్పన చేయడమేకాకుండా, యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని వివరించారు. 'కాళేశ్వరం పూర్తయితే నేను బతికుండగా రైతులు వానకోసం మొగులువైపు చూడాల్సిన అవసరం రాదు' అని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 230 కిలోమీటర్లు ప్రవహించే గోదావరి ఏడాది పొడుగునా 65 టీఎంసీలతో కళకళలాడుతుందని చెప్పారు. అది తన కల అన్నారు. ప్రజలంతా దాన్ని చూస్తారని చెప్పారు.



కరీంనగర్‌కు వచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ



కరీంనగర్‌లో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సు వేదికపై నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు బొడిగె శోభ, కొండా సురేఖ, రేఖానాయక్, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ

కరీంనగర్‌లోనే సీఎం బస

రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సు అనంతరం సోమవారం సాయంత్రం.. సీఎం కేసీఆర్ కరీంనగర్ మండల తీగల గుట్టపల్లెవద్ద గల తన నివాసానికి రాత్రి బసచేసేందుకు వెళ్లారు. అక్కడ పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో రాత్రి వరకు వివిధ అంశాలపై మాట్లాడినట్టు తెలుస్తున్నది. ముఖ్యమంతి మంగళవారం ఉదయం పది గంటలకు అక్కడ నుంచి బయలుదేరుతారు. మంగళవారంనాడు పెద్దపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు.

పలు కొత్త ప్రాజెక్టులతోపాటు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి, అనుకున్న లక్ష్యం మేరకు సాగు, తాగునీరు అందిస్తామని స్పష్టంచేశారు. ఇందుకోసం దేశంలో ఏ రాష్ట్రం పెట్టనంత బడ్జెట్‌ను ఈసారి ప్రాజెక్టులకు కేటాయించనున్నట్టు తెలిపారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఈసారి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

చిమ్మచీకట్లు అవుతాయన్నోడే సన్నాసైండు

'రాష్ట్రంలో 23 లక్షల పంపుసెట్లు ఉన్నాయి. తెలంగాణ వస్తే కరంటు రాదని, చిమ్మచీకట్లు అవుతాయని ఓ పుణ్యాత్ముడు విమర్శించాడు. మీరు సన్నాసులు అవుతారని చెప్పాడు. కానీ చెప్పినోడే సన్నాసైండు. మనం కాలేదు' అని సీఎం అన్నారు. 'ఇప్పుడు 24 గంటల కరంటు ఇచ్చుకుంటున్నాం. ఇకముందు తెలంగాణలో సెకన్ కూడా కరంటు పోదు' అని ఉద్ఘాటించారు. రైతాంగాన్ని ఆదుకోవడానికి రెండు పంటలకు ఎకరానికి రూ.8వేల చొప్పున 12వేల కోట్లను బడ్జెట్‌లో పెట్టుకొని పెట్టుబడి అందిస్తామని చెప్పారు. ఈ చెక్కులను ఎమ్మెల్యేలద్వారా అందిస్తామని తెలిపారు. రైతులు సంఘటితంగా ఉండి ఈ ఏడాది మంచి విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో యూనియన్ అంటూ లేనిది ఒక రైతాంగానికేనన్నారు. దేశంలో సంఘటిత శక్తి బలమేందో తెలియదని, అది తెలిసి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. వచ్చే వానకాలం సీజన్‌లో తెలంగాణలోకి ఎవరైనా కల్తీ విత్తనం తీసుకురావాలంటే వణుకు పుట్టాలని అన్నారు.

పంటల వివరాలు లేకే మార్కెట్ల వద్ద లొల్లి

వచ్చే జూన్ నుంచి ఏ ఎకరంలో ఏ పంట ఉందన్న విషయం తెలియాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం లెక్కలు, వివరాలు లేకపోవడం వల్లే మార్కెట్ కమిటీల వద్ద లొల్లులు జరుగుతున్నాయని అన్నారు. ఇక ఈ విధానానికి స్వస్తి పలికే విషయంలో రైతు సమన్వయ సమితులు ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. 'మార్కెట్ దగ్గర లొల్లి అయితే చాలు.. గతంలో సమైక్య రాష్ట్రాన్ని ఏలిన పాలకులే జెండాలు పట్టుకొని దిగుతారు. ఈ దుస్థితికి కారణం ఎవరో ఒక్కసారి రైతులు ఆలోచన చేయాలి' అని సీఎం విజ్ఞప్తి చేశారు. 'అసెంబ్లీలో నేను స్వయంగా చూశాను. టీడీపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ అధికారంలో ఉంటే టీడీపీ వాళ్లు ఎండిపోయిన కంకులు, కందిళ్లు పట్టుకొని వచ్చేవారు. సమైక్య పాలనలో అసెంబ్లీకి ఎండిపోయిన కంకులొచ్చాయే తప్ప రైతులకు కరంటు మాత్రం రాలేదు. కరంటు తెచ్చింది, ఇచ్చింది, ఇచ్చేది ఒక్క గులాబీ జెండాయే. ఇప్పుడు అసెంబ్లీలో ఎండిపోయిన కంకులు, కందిళ్లు బందయ్యాయి. పల్లెల్లో, తండాల్లో, గూడేల్లో ఎల్‌ఈడీ బల్బులు వెలుగుతున్నాయి. ఇది గులాబీ జెండా పుణ్యమే. ఇదే గులాబీ జెండా కోరుకుంటున్నది' అని సీఎం చెప్పారు.

యాసంగి నుంచే మద్దతు ధరలు సాధిద్దాం

రైతులు నియంత్రిత పద్ధతిలో పంట వేసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ యాసంగి నుంచే కనీస మద్దతు ధర రాబట్టే ప్రయత్నం చేద్దామని చెప్పారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితికి రూ.7500 కోట్లతో ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిందని, అవసరమైతే రూ.10 వేల కోట్లకు కూడా గ్యారంటీ ఇస్తామని అన్నారు. రైతు సమన్వయ సమితులు నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. సమన్వయ సమితుల్లో వందకు వందశాతం టీఆర్ఎస్ వాళ్లే ఉంటారని తేల్చి చెప్పారు. తెలంగాణ కోసం కొట్లాడిందే వారే కాబట్టి ప్రస్తుతం వారే ఉంటారని అసెంబ్లీలోనే చెప్పానని గుర్తుచేశారు. 'మీపై గురుతరమైన బాధ్యత ఉంది. రైతులు విజయం సాధించే విషయంలో బాధ్యతాయుత పాత్ర పోషించాలి' అని సమన్వయ సమితుల సభ్యులకు సీఎం సూచించారు. వీటితోపాటు త్వరలో రిజిస్ట్రేషన్ విధానంలో తెచ్చే మార్పులు, తద్వారా చేకూరే ప్రయోజనాలు, తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకోసం అనుసరించాల్సిన పద్ధతులను సీఎం సవివరంగా తెలియజేశారు. ఈ సమయంలో రైతులు పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేస్తూ 'జై కేసీఆర్' అంటూ నినదించారు. గోదాముల నిర్మాణం, శీతల గిడ్డంగులు, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు, రైతు వేదికల నిర్మాణాలు, కొత్తగా చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి సీఎం వివరించారు. కౌలు రైతులకు పెట్టుబడి ఇవ్వాలంటూ ఓ రైతు కోరగా, సీఎం స్పందిస్తూ అది సాధ్యం కాదని తేల్చిచెప్పారు. రైతు వేదికల నిర్మాణానికి స్వచ్ఛందంగా విరాళాలు, భూములు ఇవ్వడానికి ముందుకు రావాలని సీఎం ఇచ్చిన పిలుపునకు విశేష స్పందన లభించింది. ధనిక రైతులు పంట పెట్టుబడి సహాయం వదులుకోవడానికి ముందుకు రావాలని కోరగా.. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముందుకొచ్చారు. ముందుకొచ్చిన వారి పేర్లను సభావేదికపై నుంచి సీఎం చదివి వినిపించారు. ఈ సదస్సులో స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కల్వకుంట్ల కవిత, వినోద్‌కుమార్, బాల్క సుమన్, శ్రీనివాసరెడ్డి, పాటిల్, నగేశ్, దయాకర్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లడాయి మొదలుపెడ్తం

వ్యవసాయ సంక్షోభం కాంగ్రెస్, బీజేపీ పుణ్యమే

24 లక్షల కోట్ల బడ్జెట్‌లో రైతులకు 2 లక్షల కోట్లు కేటాయించలేరా? ■ దేశంలో 70 వేల టీఎంసీల నీటి లభ్యత ఉంటే 35 శాతమే ఎందుకు వినియోగం? ■ దమ్ముంటే బీజేపీ, కాంగ్రెస్ సమాధానం చెప్పాలి

గోదావరిలో మా వాటా ఎంతో చెప్పరే? ■ కేంద్రం వైఖరి మారకుంటే రైతుల తిరుగుబాటు తప్పదు

అదే జరిగే రైతు సమన్వయ సమితిదే నాయకత్వం ■ కర్ణాటక ఎన్నికల కోసమే గోదావరి-కావేరి అనుసంధానం డ్రామా

కరీంనగర్ ప్రాంతీయ అవగాహన సదస్సులో సీఎం కేసీఆర్ నిప్పులు

ముహూర్తం




సూర్యోదయం: 6.39 గంటలకు



సూర్యాస్తమయం: 6.18 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం ద్వాదశి మధ్యాహ్నం 2.41 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: పునర్వసు ఉదయం 6.00 వరకు, తదుపరి పుష్యమి, అమృతఘడియలు: తె. 3.49 నుంచి 5.25 వరకు, తిరిగి రాత్రి 10.02 నుంచి 11.38 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 4.51 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.59 నుంచి 9.46 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.25 నుంచి 3.12 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 1.18 నుంచి 2.54 వరకు.

లోకం పోకడ



రైతు సమన్వయ సమితి సదస్సుకు తీసుకుపొమ్మని రైతులంతా ఎక్కికూసుకున్నారు సార్!

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: దేశంలో అన్నదాతల ఆత్మహత్యలకు, వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోవడానికి గత కాంగ్రెస్, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాలే కారణమని సీఎం కేసీఆర్ విమర్శించారు. దేశంలో 70వేల టీఎంసీల నీటి లభ్యత ఉంటే స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా నేటికీ 35% నీటిని మాత్రమే వినియోగించుకునే దౌర్భాగ్య పరిస్థితి ఎందుకు పట్టిందో దమ్ముంటే చెప్పాలని కాంగ్రెస్, బీజేపీకి సవాల్ విసిరారు. ఈ రెండు ప్రభుత్వాల అసమర్థ పాలనవల్లే దేశవ్యాప్తంగా రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందనేది కఠోర సత్యమని తేల్చిచెప్పారు. ఇకనైనా కేంద్రం వైఖరి మారకపోతే రైతులే తిరుగుబాటు చేయాల్సిన రోజులు వస్తాయని హెచ్చరించారు. అదే జరిగితే ఆ ఉద్యమానికి తెలంగాణ రైతు సమన్వయ సమితులే నాయత్వం వహిస్తాయని ప్రకటించారు. గోదావరిలో మా వాటా ఎంతో చెప్పమంటే ఎందుకు చెప్పడం లేదు? ప్రధాని గద్దె కోత్తండా ?అని మండిపడ్డారు. రైతుల విషయంలో దేశంలో ఇప్పటి వరకు ఉన్న స్తబ్ధతను కేసీఆర్ ఉండనీయడని, గ్యారంటీగా ఎక్కడ మొదలుపెట్టాలో అక్కడే లడాయి మొదలుపెడుతామని ప్రకటించారు. రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సు సోమవారం కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ సదస్సులో మాట్లాడిన సీఎం.. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి దేశంలోనూ, సమైక్య రాష్ట్రంలోనూ రైతులకు జరిగిన అన్యాయాలపై నిప్పులు చెరిగారు.

అద్భుత దేశం మనది

'మనది అద్భుతమైన దేశం. సుసంపన్నమైనది. బంగారం పండే నేలలున్నాయి. తెలంగాణలోనూ ఎర్రనేలలు, నల్లనేలలు, ఇసుకనేలలు, తేలికపాటినేలలు.. చవుడుభూములు కూడా కొన్నిచోట్ల ఉన్నాయి. భారతదేశం కూడా ఇంచుమించుగా ఇదే విధంగా ఉంది. అనేక జీవనదులు, డెల్టాలు, రేగడి భూములున్నాయి. మన రాష్ట్రంలో కోటీ 62 లక్షల ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా ఉందని లెక్కలు చెప్తున్నాయి. మొత్తం దేశం లెక్క చూస్తే 40 కోట్ల ఎకరాల్లో పంటలు పండుతున్నాయని చెప్తున్నారు. చైనా మనకంటే రెండుంపావు రెట్లు భౌగోళికంగా పెద్దది. కానీ చైనాకు పశ్చిమంలో ఎడారి.. మధ్య చైనా అంతా పర్వతాలు.. అనుకూలత తక్కువ. చైనా కంటే భారతదేశంలోనే వ్యవసాయానికి అనుకూలమైన భూమి ఎక్కువ. దీనినే కల్టివబుల్ ల్యాండ్ అంటారు. చైనా వాళ్లు అనేక యూరప్ దేశాలకు ఆహార పదార్థాలను ఎగుమతి చేస్తారు. వాళ్లది జనాభాలో మనకంటే పెద్ద దేశం. వారు ఆహారరంగంలో స్వావలంబన సాధించి ఇతర దేశాలకు ఎగుమతి చేసి, విదేశీ మారకాన్ని సంపాదించి రైతాంగాన్ని బ్రహ్మాండంగా ఆదుకుంటున్నారు' అని సీఎం వివరించారు.

మనకెందుకీ ఖర్మ?

'మరి మన దేశానికేం ఖర్మ? నదుల్లేకనా? భూముల్లేకనా? కష్టపడి పనిచేసే మనుషుల్లేకనా? ఏం దరిద్రం పట్టుకుంది ఈ దేశానికి? ఎందుకు రైతు ఆత్మహత్యలు జరిగే పరిస్థితి సంక్రమించింది?' అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. 'ఎవరు ఏమనుకున్నా నేను భయపడను. ఉన్నది ఉన్నట్లుగానే మాట్లాడుతా. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండే రెండు పార్టీలు (కాంగ్రెస్, బీజేపీ) 70 ఏండ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్నవి. ఈ రెండు ప్రభుత్వాల ఆధ్వర్యంలో అసమర్థ, అవివేకమైన, తెలివిహీనమైన, ప్రజావ్యతిరేక, రైతు వ్యతిరేకమైన పాలన జరిగింది కాబట్టే దేశవ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఇది కఠోర సత్యం' అని అన్నారు. ఇలా అంటే కొందరికి కోపం రావచ్చు కానీ ఇవన్నీ వాస్తవాలని చెప్పారు. 'దేశంలో కురిసే వర్షపాతం 1100 మిల్లీమీటర్లు. దేశంలో అద్భుతమైనటువంటి గంగ, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణ లాంటివి ఎన్నో నదులు ఉన్నాయి. అద్భుతమైన జల సంపద ఉన్నది. ఇతర దేశాల నుంచి కూడా సుమారు 3వేల టీఎంసీల నీళ్లు మన దేశంలోకి వస్తాయి. మంచు, వర్షం రూపంలో కురిసే నీరు అంతా కలిపి చూస్తే దేశంలో ఏటా 70వేల టీఎంసీల పైచిలుకు నీటి లభ్యత ఉంది' అని తెలిపారు.

రైతు స్థితిగతులు అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ విఫలం

దేశంలోని రైతుల స్థితిగతులను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ దారుణంగా విఫలమయ్యాయని సీఎం మండిపడ్డారు. తాను ఒక రైతు బిడ్డగా ఈ ఆరోపణ చేస్తున్నానని చెప్పారు. 'దేశం మొత్తం మీద 70వేల టీఎంసీల నీటి లభ్యత ఉంటే కేవలం 26-27 వేల టీఎంసీల నీరు మాత్రమే ఎందుకు వినియోగం అవుతున్నది? లభ్యత ఉన్న నీటిలో 35% మాత్రమే ఎందుకు వినియోగించుకోవాల్సి వస్తున్నది? కాంగ్రెస్, బీజేపీ హైకమాండ్‌లకు దమ్ముంటే నా ప్రశ్నలకు జవాబు చెప్పాలి' అని కేసీఆర్ సవాలు విసిరారు. రైతును రాజును చేస్తున్నాం.. రైతుకు కిరీటం పెడుతున్నాం అని చెప్తున్న పార్టీలు ఎందుకు ఈ విషయంపై దృష్టి సారించలేకపోయాయని నిలదీశారు. 'జై జవాన్-జైకిసాన్ అంటూ లాల్ బహదూర్ శాస్త్రి చెప్పారు. కానీ నేడు దేశం పరిస్థితి ఏందీ? నీటి లభ్యత ఉన్నా ఎందుకు వినియోగించుకోలేకపోతున్నాం? ఏమిటీ దురవస్థ? తెలివితక్కువ కాంగ్రెస్, బీజేపీ నాయకుల, ప్రభుత్వాల వైఫల్యం కాదా ఇది?' అని ప్రశ్నించారు. 'ఎలక్షన్లు వచ్చాయంటే.. నువ్వు దొంగవంటే నువ్వని.. ఆ బ్యాంకు ముంచారంటే, ఇప్పుడు ఈ బ్యాంకు ముంచారంటూ విమర్శలు చేసుకుంటున్నారే తప్ప..రైతుల పరిస్థితి కానీ, దేశంలోని సామాన్యుల పరిస్థితులు కానీ ఆలోచిస్తున్నారా?'అని ప్రశ్నించారు. ప్రజలకు కావాల్సింది పరస్పర విమర్శలు, ధర్నాలు కాదని, సమస్య పరిష్కారం కావాలని కేసీఆర్ చెప్పారు. 'పనికిమాలిన ప్రసంగాలతో ప్రజలు అసహనానికి గురి అవుతుండ్రు. ప్రజలు నిలదీసి తన్నాలా? ఇప్పటికైనా సిగ్గు రావాలి పాలకులకు. ఇకనుంచైనా బుద్ధి తెచ్చుకొని దుర్మార్గమైన ఆరోపణలు, ప్రత్యారోపణలు, చిల్లర రాజకీయాలను రెండు జాతీయ పార్టీలు మానుకొని ప్రజలకు జవాబు చెప్పాలి' అన్నారు. 'చాటలో తవుడు పోసి కుక్కల కొట్లాట పెట్టినట్లుగా ఉంది నీటి పంపకాల విషయంలో కేంద్రం పద్ధతి. తెలంగాణ ఏర్పడి నాలుగేండ్లు అవుతున్నది. గోదావరిలో మా వాటా ఎంతంటే చెప్పరే? ట్రిబ్యునల్‌లో వేస్తమంటరే? దశాబ్దాలు గడుస్తున్నాయి. కేంద్రం, ప్రధానమంత్రి గద్దె కోత్తండా ? ఎవరి వాటా ఎంతో చెప్పే ధైర్యం లేదా? ఒక సిస్టమ్ తీసుకొని రారాదా? అని నిప్పులు కురిపించారు.

గోదావరి-కావేరీ అనుసంధానం డ్రామా

చైనాలో యాంగ్జీ నది 1400 కిలోమీటర్లు ఉందని, మంగోలియా ప్రాంతానికి వెయ్యి టీఎంసీల నీటిని తీసుకుపోతున్నారని సీఎం తెలిపారు. ఆ సోయి మనకెందుకు లేదని ప్రశ్నించారు. 'కర్ణాటకలో ఎన్నికలు ఉన్నాయి కాబట్టే ఇప్పుడు కేంద్రం గోదావరి, కావేరి అనుసంధానం అంటూ డ్రామా మొదలుపెట్టింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఈ అనుసంధాన ప్రాజెక్టు ఎందుకు చేపట్టలేదు? కర్ణాటక ఎలక్షన్లు వస్తేనే అనుసంధానం గుర్తుకు వస్తుందా?' అని నిలదీశారు. '70 ఏండ్ల పాలనలో రైతులకు నీరందించే తెలివి లేదు. ఇంకా ఇంత గొప్పోల్లం అంత గొప్పోల్లం అంటూ జీడీపీలు, జీడీకేలు బొంద బోకే అంటూ చివరికి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి తెచ్చారు. ఈ మాట రాజకీయ ఉద్దేశంతో చెప్పడం లేదు.. బాధతో చెప్తున్న. మభ్యపెట్టి మాయచేస్తున్నరు' అని సీఎం అన్నారు. రూ.24 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో ఓ రెండు లక్షల కోట్లు రైతుల కోసం కేటాయించలేరా? చేత కాదా? అని మోదీ సర్కారును ప్రశ్నించారు.

రైతులకు మద్దతు ధర ఏది?

రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని అడిగితే దానిపై మాట్లాడటం లేదని సీఎం అన్నారు. 'ఉద్యోగులకు రెండేండ్లకోసారి, ఐదేండ్లకోసారి వేతనాలు పెంచుతున్నారు. వాళ్లకు ఇవ్వద్దు అంటలేను. ధరలకనుగుణంగా రైతులకు కూడా మద్దతు ధర ఎందుకు పెంచరు? అని ప్రశ్నించారు. 'రైతులకు నోరు లేదు.. అమాయకులు.. వీళ్లకు నాయకులు లేరు.. అడిగే వారు లేరు.. దిక్కులేక ఓటేస్తరు.. అనే పద్ధతిలో రైతు పట్ల నిర్లక్ష్య భావం ఏర్పడ్డది. కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయి. దేశ రైతాంగం కదిలి, వాళ్లకు నిద్రలేకుండా చేసిన నాడే రైతాంగానికి న్యాయం జరుగుతుంది' అని కేసీఆర్ చెప్పారు. 'దీనికి శ్రీకారం తెలంగాణ నుంచే మొదలవుతుంది. దానికి నాయకత్వం అవసరమైతే తెలంగాణే వహిస్తుందని గంట బజాయించి చెప్తున్న' అన్నారు. దేశ రైతాంగం సహనం, ఓపికను కోల్పోతున్నదని సీఎం చెప్పారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే రైతుల తిరుగుబాటు తప్పదన్నారు. ఆ పరిస్థితే వస్తే దేశ రైతాంగానికి తెలంగాణ రైతు సమన్వయ సమితులే నాయకత్వం వహిస్తాయని ప్రకటించారు. ఆ దిశగా పోరాటానికి కూడా తెలంగాణ సంసిద్ధంగా ఉంటుందని చెప్పారు.

కేంద్రం వైఖరిలో మార్పు రావాలి

కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంద్వారా ఏర్పడుతున్న ఇబ్బందులు, రైతులకు కూలీలు దొరకక వస్తున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాను. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలని 20సార్లు కేంద్రానికి చెప్పాను. చాలాసార్లు ప్రధానమంత్రి మోదీకి లేఖలు రాశాను. ఆరోగ్యశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌కు, అరుణ్ జైట్లీకి, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారుడు సుబ్రమణ్యానికి కూడా చెప్పాను. అయినా చీమ చిటుక్కుమంటలేదు. వాళ్లకు ఇబ్బంది లేదు. సోదులు తప్ప.. ప్రాక్టికల్‌గా ఏర్పడుతున్న ఇబ్బందులను వారికి చెప్తే వాళ్లు కదలడం లేదు' అని సీఎం నిప్పులు చెరిగారు. ఈ సమయంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే వ్యవసాయానికి అనుసంధానం చేయాలంటూ సదస్సులో ఏకగ్రీవ తీర్మానం చేయాలని ముఖ్యమంత్రి కోరగా.. రైతులు తమ హర్షధ్వానాల మధ్య ఆమోదం తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానించే విషయంపై కచ్చితంగా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని అన్నారు. మార్చి ఐదు నుంచి జరిగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రైతాంగం పక్షాన గట్టిగా పోరాటం చేయాలని ఎంపీలను కోరారు. ఈ విషయంలో తన వంతు కృషిచేస్తానని చెప్పారు. కనీస మద్దతు ధర పెంచే అంశం కేంద్రం వద్ద ఉందని, కానీ పెంచడం లేదని అన్నారు. ఈ విషయంపైనే తాను జాతీయపార్టీల గురించి ముందుగా మాట్లాడాల్సి వచ్చిందని చెప్పారు. ఈ విషయంలో తనతో కొంతమంది కలిసి వస్తామని చెప్పారని తెలిపారు. రైతుల విషయంలో దేశంలో ఇప్పటివరకు ఉన్న స్తబ్ధతను కేసీఆర్ ఉండనీయడని అన్నారు. గ్యారంటీగా ఎక్కడ మొదలు పెట్టాలో అక్కడే లడాయి మొదలు పెడుతాం' అని ప్రకటించారు.



కరీంనగర్‌లో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో రైతులకు రూ. 5 లక్షల బీమాను సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేస్తూ జై తెలంగాణ నినాదాలు చేస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సార్.. మీరు పీఎం కావాలి

- ఓ సభ్యుడి ఆకాంక్ష
- మోదీకి నాకు పంచాయితీ పెడ్తావయ్యా
- నవ్వుతూ తోసిపుచ్చిన సీఎం కేసీఆర్
- ఆద్యంతం చలోక్తులతో ఆసక్తిగా సాగిన సభ


కరీంనగర్ సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రధాని కావాలని అకాంక్షిస్తున్న ఇబ్రహీంపట్నం రైతు ప్రతాప్‌రెడ్డి

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'సార్ ఆనాడు నక్సలైట్లు రైతు సంఘాలు ఏర్పాటు చేశారు. ఇపుడు మీరు చేస్తున్నారు.. మీ ఆలోచనలకు అచ్చం నక్సలైట్ల లెక్కనే ఉన్నయ్ సారు.. మీరు ప్రధాని అయితే దేశం బాగుపడ్తది' అంటూ మెట్‌పల్లికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే రైతు సభలో సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. దీంతో సభలో హర్షధ్వానాలు మారుమోగాయి. వేదికపై ఉన్న ఎంపీ బాల్కసుమన్ సహా పలువురు ఎమ్మెల్యేలు నిల్చొని చప్పట్లు కొట్టారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ముసిముసిగా నవ్వుతూ 'నన్ను నక్సలైటును చేసినావయ్యా, రేప్పొద్దుగాల ఇదో గొడువైతది. మళ్ల మోదీతోని పంచాయితీ పెట్టిస్తవా ఏంది' అంటూ చలోక్తిగా అన్నారు. సభ ఆద్యంతం సరదా మాటలతో సాగింది. సభ్యులను సీఎం కేసీఆర్ నవ్విస్తూ ఆకట్టుకున్నారు. 12.36 గంటలకు వేదికపైకి వచ్చిన కేసీఆర్ 12.40కి తన మొదటి ప్రసంగం ప్రారంభించారు. 'మీకు అధికారులు ఈ పుస్తకాలు ఇచ్చిన్రు. వాటిని ఇంటికి తీస్కపోయి అటుకు మీద ఏసేరు.. బాగా చదువుకుని రైతులకు చెప్పాలని' అనడంతో సభలో నవ్వులు వినిపించాయి. కాంగ్రెస్, బీజేపీల ప్రస్తావన వచ్చినపుడు 'ఢాంఢూమ్మని డైలాగులు చెప్పి రైతుల కోసం అది చేస్తున్నం. ఇది చేస్తున్నమని చెప్పితే కండ్లకు చెక్కరచ్చేదని' నవ్వులు పూయించారు. 'సంఘటితం అంటే ఎర్కేనా మీకు.. ఒక్క ఏలుతోని కొడితే దెబ్బ తాకుతదా.. అదే పిడికిలి బిగించి కొట్టుని.. మొఖం పచ్చడై పోతది. ఇదే సంఘటితం అంటే' అని రైతు సమన్వయ సమితుల ఐక్యతపై కేసీఆర్ చేసిన వ్యాఖ్య సభను ఆకట్టుకున్నది. సీఎం ఉద్వేగంతో మాట్లాడుతున్నపుడు సభలో సభ్యులు ఈలలు వేస్తూ హర్షం తెలిపారు. సీఎం వారిని వారిస్తూ.. 'అరే సీటీలు కొట్టకుండ్రయ్యా.. రైతుల సమస్యలు పరిష్కరించినపుడు అందరం సంబురాలు చేసుకుందాం' అని చెప్పారు.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు



- 5,500 వరినాటు యంత్రాలిస్తాం: వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- కుప్తి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన
- ఎస్సారెస్పీ చివరి అయకట్టు వరకు నీళ్లిస్తాం: నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు
- రైతుల ప్రశ్నలు.. మంత్రుల సమాధానాలు



కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో భోజనాల అనంతరం.. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నీటిపారులశాఖ మంత్రి హరీశ్‌రావు సమాధానాలు చెప్పారు. ముందుగా పోచారం మాట్లాడారు. వరినాటు యంత్రాలు సరిపడా అందించాలని, డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని సమితి సభ్యుడు కోరడంతో.. ఒక్కో మండలానికి 10 చొప్పున వరి నాటు యంత్రాలు, అందిస్తామని మంత్రి పోచారం ప్రకటించారు. 5,500 వరి నాటు యంత్రాలు సబ్సిడీపై అందిస్తామని చెప్పారు. డ్రిప్ ఇరిరేషన్ పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీపై ఇస్తుండగా.. బీసీ, సన్న చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 85 శాతం సబ్సిడీతో అందిస్తున్నామని వివరించారు. దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడంలేదని కొందరు సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా అమలయ్యేలా బ్యాంకులకు ఆదేశాలిస్తామని చెప్పారు. 75 శాతం రాయితీతో వరిలో ఆడ, మగ విత్తనాలకు సరఫరాచేస్తున్నామని మరో సభ్యుని ప్రశ్నకు మంత్రి పోచారం సమాధానం చెప్పారు. కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచాలని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు భారీ నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు సమాధానం చెబుతూ.. కడెం ప్రాజెక్టు ఎత్తుపెంచడానికి సీఎం కేసీఆర్ ఇప్పటికే అనేక ప్రయత్నాలు చేశారనీ, అక్కడ వైల్డ్‌లైఫ్ అనుమతులు లభించడంలేదని వివరించారు. 7.63 టీఎంసీల సామర్థ్యం కలిగిన కడెం ప్రాజెక్టులో మూడు టీఎంసీలు డెడ్‌స్టోరేజీగా ఉంటే.. మిగిలిన నీరు ఏమాత్రం సరిపోవడం లేదనే విషయాన్ని గుర్తించి.. కుప్టి వద్ద మరో ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామని హరీశ్‌రావు ప్రకటించారు. మంచిర్యాలలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు కృషిచేస్తామని చెప్పారు. ఎస్సారెస్పీ చివరి కాల్వల వరకు నీళ్లు ఇవ్వడానికి కాకతీయ కాల్వల సామర్థ్యం పెంచే పనులు చేపట్టామని చెప్పారు. చీఫ్ విఫ్ కొప్పుల ఈశ్వర్, ఎంపీ బాల్కసుమన్ ధర్మారం మండలం పత్తిపాక వద్ద రిజర్వాయర్ కావాలని కోరుతున్నారని, దీనికి సీఎం అమోదం తెలిపారని, డీపీఆర్ రాగానే పనులు చేపడుతామని వివరించారు. ఎస్సారెస్పీ నీరు ఇచ్చే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. వంద కోట్లతో కొత్తగా పది కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుచేయబోతున్నామని చెప్పారు.

కర్షకోత్సాహం

- వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వ కృషిపై రైతుల్లో హర్షం
- రూ.5 లక్షల వ్యక్తిగత బీమా అమలుపై ఆనందం
- రైతు కుటుంబాలకు సర్కారు భరోసాపై ప్రశంసల వర్షం

కరీంనగర్ కార్పొరేషన్/టవర్‌సర్కిల్ / కొత్తపల్లి/ ముకరంపుర, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రైతులను అన్నివిధాలా ఆదుకోవడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణ కర్షకుల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నది. దేశంలో ఎక్కడా లేనివిధంగా వినూత్న పథకాల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కంకణం కట్టుకున్న సీఎం కేసీఆర్, తాజాగా ఆరుగాలం కష్టించే అన్నదాతలకు రూ.5 లక్షల వ్యక్తిగత బీమా అమలుచేస్తామని ప్రకటించడంపై రైతులు, సమన్వయ సమితుల్లో హర్షంవ్యక్తమైంది. పంటలకు గిట్టుబాటు ధర దక్కేలా చూడడంతోపాటు రైతు కుటుంబాలకు భరోసా కల్పించేలా సర్కారు తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తున్నది.

బీమాతో ధీమా



రైతులకు ప్రభుత్వం వ్యక్తిగత బీమా అమలు చేయడంతో రైతులు, వారి కుటుంబాలు ధీమాగా బతికే అవకాశం లభించింది.

– అన్నమల్ల వెంకటేశ్వర్‌రావు,
జిల్లా రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్

వీధినపడకుండా ఆదుకుంటుంది



వ్యక్తిగత బీమాతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. ఏదైనా అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబానికి అండగా నిలిచి వీధిన పడకుండా ఆదుకుంటుంది.

–విశ్వపతి,
జిల్లా రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ (వరంగల్ రూరల్)

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయం.

– ముల్యాల కిషన్,
మండల రైతు సమన్వయ సమితి సభ్యుడు (ముధోల్)

వ్యవసాయానికి మంచి రోజులు



రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో వ్యవసాయానికి మంచి రోజులొస్తున్నాయి. వ్యవసాయం చేయడమంటే నామోషి అనే రోజులు పోతున్నాయి.

– కే గీత, సిరిపురం,
మండల రైతు సమన్వయ సమితి సభ్యురాలు (ఖమ్మం జిల్లా)

సమూల మార్పులొస్తాయి



రైతు సమన్వయ సమితులతో వ్యవసాయరంగంలో సమూల మార్పులొస్తాయి.

–ముద్దమల్ల భార్గవ్, రాష్ట్ర రైతు సమన్వయ సమితి సభ్యుడు (జయశంకర్ భూపాల్‌పల్లి)

దళారీ వ్యవస్థ కనుమరుగు



సమన్వయ సమితులవల్ల గిట్టుబాటుధరను నిర్ణయించుకొనే అవకాశం రైతులే దక్కడం గొప్పవిషయం. దీంతో దళారీ వ్యవస్థ కనుమరుగు కావడం ఖాయం.

– అహ్మద్ అజీముద్దీన్, మండల రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ (ఉట్నూర్, ఆదిలాబాద్)

లాభసాటి వ్యవసాయం



ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం చేపడుతున్న చర్యలు వ్యవసాయాన్ని త్వరలోనే లాభసాటిగా మారుస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

–దుద్దాల అంజిరెడ్డి,
రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు (కామారెడ్డి)

నష్టపోయే పరిస్థితి ఉండదు



వ్యవసాయరంగానికి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు బాగుంది. రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో ఇక సాగులో నష్టం అన్నది ఉండదు.

– పీ వెంకట్‌రెడ్డి, మండల సమన్వయ సమితి కో ఆర్డినేటర్ (నెల్లికుదునూర్, మహబూబ్‌నగర్ జిల్లా)

పోలీసుశాఖలో
అంతర్గత బదిలీలకు అనుమతి

జీవో జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీసుశాఖలో సిబ్బంది అంతర్గత బదిలీలకు డీజీపీకి అనుమతిస్తూ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది జీవో – 24ను జారీచేశారు. ఈ ఉత్తర్వుల మేరకు అంతర్గత సిబ్బంది బదిలీలపై త్వరలో మార్గదర్శకాలు రూపొందించనున్నారు. ఆ మార్గదర్శకాల ఆధారంగా బదిలీలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ జీవో జారీపై రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

రైతు వేదికల కోసం భూవిరాళాలు

సీఎం పిలుపునకు భారీ స్పందన

- పంట పెట్టుబడిని వదులుకుంటామన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు
- వదులుకొన్న పెట్టుబడి సాయాన్ని రైతు సమితులకే ఇస్తామన్న సీఎం
- భూముల పత్రాలు, చెక్కులు సీఎంకు అందజేత

(కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ)

ధనవంతులైన రైతులు గ్రామాలవారీగా నిర్మిస్తున్న రైతు వేదికలకు భూములు విరాళంగా ఇవ్వాలనీ, స్వచ్ఛందంగా పంట పెట్టుబడిని త్యాగం చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఇచ్చిన పిలుపునకు భారీస్పందన వచ్చింది. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన 17 జిల్లాల రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో వివిధ జిల్లాలకు చెందిన భూమి, నగదు విరాళాలు ప్రకటించారు. భూముల పత్రాలు, చెక్కులు సీఎం కేసీఆర్‌కు అందించారు. రైతు వేదికల కోసం సిరిసిల్ల జిల్లా కోరెంకు చెందిన కొండల్‌రావు ఎకరం భూమిని విరాళంగా ఇచ్చారు. ఖమ్మం జిల్లా రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్ రావు, బోనకల్ మండలం రాజన్నపేటలో 20 గుంట లు, ఉప్పు శ్రీహరి మానకొండూర్ మండల కేంద్రం లో 20 గుంటల్లో రైతు వేదిక భవనాన్ని నిర్మించి ఇస్తానని ముందుకు వచ్చారు. భూపాల్‌పల్లి జిల్లా యామన్‌పల్లి సర్పంచ్ కల్వచర్ల రాజు ఎకరం భూ మి, ఖమ్మం జిల్లా హమ్మిల్లో ఏ హన్మంతరావు 20 గుంటలు, ఇదే జిల్లా సాలెబంజరలో చోడె రమేశ్ లత ఎకరం, ముదిగొండ మండలం వల్లవిలో బోట్ల వెంకటప్రసాద్ 20 గుంటలు, మంచిర్యాల జిల్లా దేవునిగూడెంలో రాజారాంరెడ్డి 20 గుంటలు, భూపాలపల్లి జిల్లా మల్లంపల్లిలో జంపయ్య 20 గుంటలు, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో కవ్వ లక్ష్మారెడ్డి 20 గుంటలు, మహబూబాబాద్ జిల్లా నారాయణపూర్‌లో యాకూబ్‌రెడ్డి ఎకరం, జనగామ ఎమ్మెల్యే ఋచ్చిరెడ్డి మద్దూరులో ఎకరం, కొమురవెల్లిలో ఎకరం భూమిని విరాళంగా అందించారు. గజ్వేల్‌కు చెందిన మద్ది రాజిరెడ్డి రూ. లక్ష, మద్దూరి శ్రీనివాస్ రెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించారు. సిద్దిపేట జిల్లా ఆర్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ వంగ నాగిరెడ్డి రూ.లక్ష వేదికపైనే సీఎంకు విరాళంగా అందించారు.

పెట్టుబడి సహాయం వదులుకుంటాం

ధనవంతులైన రైతులు పెట్టుబడి సహాయాన్ని వదులుకుంటే రైతు సమన్వయ సమితులకు ఉపయోగపడతాయని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా వదులుకొన్న పెట్టుబడి మొత్తాన్ని రైతు సమితులకే ఇస్తామని పేర్కొన్నారు. దీంతో వేదికపై ఉన్న స్పీకర్ మధుసూదనాచారి, మంత్రులు పోచారం, టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, కొమ్మురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటి ల్, బాల్క సుమన్, నగేశ్, దయాకర్, కవిత, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్యేలు కమలాకర్, రామలింగారెడ్డి, కోవ లక్ష్మి, రేఖానాయక్, జీవన్‌రెడ్డి, వాసిరెడ్డి గోవర్ధన్‌తోపాటు వేముల ప్రశాంత్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ భానుప్రసాద్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి స్వచ్ఛందంగా తమ పెట్టుబడి సహాయాన్ని వదులుకుంటామని సీఎం ఎదుట ప్రకటించారు.

నేడు మూడు జిల్లాల్లో సీఎం పర్యటన

- పెద్దపల్లిలో రెండు ఎత్తిపోతల పథకాలు, మంచిర్యాలలో భూగర్భ గనులకు శంకుస్థాపన
- ఆదిలాబాద్‌లో చనకా-కోరటా బరాజ్ పనుల పరిశీలన


ఆదిలాబాద్‌లో సభా వేదికను పరిశీలిస్తున్న మంత్రి జోగు రామన్న

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం పెద్దపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవన్ నుంచి ఉదయం 10:15 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాం మండలం మూర్మూర్‌లో రెండు ఎత్తిపోతల పథకాల పనులు ప్రారంభిస్తారు. మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శిస్తారు. ఉదయం 11గంటలకు పెద్దపల్లి జిల్లా నుంచి బయలు దేరి, 11.40గంటలకు ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని చనాక–కోరటా బరాజ్‌కు చేరుకొని, పనుల ప్రగతిని పరిశీలిస్తారు. అక్కడి నుంచి 11.55 గంటలకు బయలుదేరి 12.10 గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకొని, డైట్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరై మాట్లాడుతారు. మధ్యాహ్న భోజన అనంతరం 3గంటలకు మంచిర్యాల జిల్లాకు చేరుకొని, భూగర్భ గనులకు శంకుస్థాపన చేస్తారు.సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు. కాగా, సీఎం పర్యటన ఏర్పాట్లను పెద్దపల్లిలో కలెక్టర్ శ్రీదేవసేన, రామగుండం ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ సత్యనారాయణ, ఆదిలాబాద్‌లో రాష్ట్ర అటవీ పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, మంచిర్యాలలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, సింగరేణి సీ అండ్ ఎండీ శ్రీధర్ పరిశీలించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ల
గౌరవ వేతనం పెంపు

- మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం
- ఉన్నత శ్రేణి మార్కెట్ చైర్మన్‌కు రూ.25 వేలు
- ప్రత్యేక శ్రేణి మార్కెట్ చైర్మన్‌కు రూ.20 వేలు
- ఇతర శ్రేణి మార్కెట్ చైర్మన్లకు రూ.15 వేలు
- రూ.150 నుంచి రూ.వెయ్యికి పెరిగిన సమావేశాల భత్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మార్కెట్ కమిటీ చైర్మన్ల గౌరవ వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. చైర్మన్లకు గ్రేడ్ల వారీగా గౌరవ వేతనాన్ని ఖరారు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అంతేకాకుండా మార్కెట్ కమిటీ సమావేశాలకు హాజరయ్యే పాలకవర్గానికి సమావేశ భత్యాన్ని కూడా పెంచారు. చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులకు సిట్టింగ్ సమావేశ ఖర్చుల కింద రూ.వెయ్యి ఇవ్వనున్నట్టు జీవోలో పేర్కొన్నారు. గతంలో మార్కెట్ కమిటీలకు రూ.వందల్లో మాత్రమే గౌరవ వేతనం ఉండేది. అవి కూడా ఏండ్ల తరబడి విడుదలయ్యేవి కావు. మార్కెట్ కమిటీలకు గౌరవ వేతనాన్ని ఇవ్వాలని గతంలో పలువురు చైర్మన్లు సర్కారుకు విజ్ఞప్తిచేశారు. దీనిపై సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. గత ఏడాది డిసెంబర్ 6న గౌరవ వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకుంటూ అభ్యంతరాలు, సలహాల కోసం నెల రోజుల గడువు విధించారు. పెంపుపై వ్యతిరేకత రాకపోవడంతో సోమవారం వేతనాలను పెంచుతూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. మొత్తానికి 16 ఏండ్ల తర్వాత మార్కెట్ కమిటీ చైర్మన్ల వేతనాలు పెరిగాయి. ఉన్నత శ్రేణి మార్కెట్ కమిటీ చైర్మన్‌కు రూ.25 వేల వేతనాన్ని ఖరారు చేశారు. గతంలో వీరి నెల జీతం రూ.2 వేలు ఉండేది. ప్రత్యేక శ్రేణి మార్కెట్ కమిటీ చైర్మన్ వేతనాన్ని రూ.20 వేలకు పెంచారు. గతంలో వీరికి రూ.1,500 ఉండేది. గ్రేడ్–1 మార్కెట్ కమిటీ చైర్మన్‌కు రూ.వెయ్యిగా ఉన్న గౌరవ వేతనాన్ని తాజాగా రూ.15 వేలకు పెంచారు. గ్రేడ్–2, గ్రేడ్–3 మార్కెట్ కమిటీలకు గతంలో రూ.500 గౌరవ వేతనం ఉండగా దానిని రూ.15 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు మార్కెట్ పాలకవర్గం సభ్యులు సమావేశాలకు వచ్చినప్పుడు ఇచ్చే ఖర్చులు కూడా తక్కువగా ఉండేవి. చైర్మన్‌తో సహా పాలకవర్గంలోని సభ్యులకు రూ.150 చొప్పున ఇచ్చేవారు. సమావేశాలకు వచ్చినప్పుడు ఇచ్చే భత్యాన్ని ప్రభుత్వం రూ.వెయ్యికి పెంచింది. రూ.4 కోట్ల పైబడి ఆదాయం ఉన్న మార్కెట్ కమిటీలను ఉన్నత శ్రేణి, రూ.4 కోట్లలోపు ఆదాయం ఉన్న వాటిని ప్రత్యేక శ్రేణి, రూ.కోటి ఆదాయం ఉన్న మార్కెట్లను గ్రేడ్–1, రూ.కోటి కంటే తక్కువ ఆదాయం ఉన్న మార్కెట్లను గ్రేడ్–2, గ్రేడ్–3లుగా పరిగణిస్తారు. తమకు వేతనాలు పెంచినందుకు మార్కెట్ కమిటీ చైర్మన్లు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్‌భవన్‌కు ఐదెకరాల స్థలం, 5 కోట్లు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ముదిరాజ్ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కోకాపేట్ దగ్గర ఐదెకరాల భూమి కేటాయిస్తున్నట్టు బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రావెంకటేశం సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దీనితోపాటు రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. ముదిరాజ్‌ల కోసం ప్రత్యేక భవన్ నిర్మాణానికి రూ.5 కోట్లు, ఐదెకరాల స్థలాన్ని కేటాయించడం పట్ల ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండప్రకాశ్ హర్షం వ్యక్తంచేశారు. ముదిరాజ్‌లకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహానికిగాను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

సాదాబైనామాల క్రమబద్ధీకరణపై మెమో

రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాదాబైనామాల క్రమబద్ధీకరణపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి సోమవారం జిల్లా కలెక్టర్లకు మెమో జారీ చేశారు. అనేక గ్రామాల్లో తెల్లకాగితాలపై భూముల క్రయవిక్రయాలు జరిగినట్లు భూరికార్డుల ప్రక్షాళనలో వెలుగులోకి వచ్చింది. దీంతో ఆర్ఓఆర్ చట్ట ప్రకారం గ్రామాల్లో విచారణ జరిపించి ఆ భూములను కొనుగోలుచేసిన రైతులకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పుడు ఆదేశాలు పంపించింది.

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు స్వగ్రామం విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగిలో సోమవారం కేంద్రవాణిజ్య పరిశ్రమలశాఖమంత్రి సురేశ్‌ప్రభు సతీసమేతంగా పర్యటించారు. సీఐఐ సదస్సులో పాల్గొనేందుకు సురేశ్‌ప్రభు విశాఖపట్నం వచ్చారు. రైల్వేమంత్రిగా ఉన్న సమయంలో అల్లూరి స్వగ్రామం పాండ్రంగిని దత్తత తీసుకుంటున్నట్లు సురేశ్‌ప్రభు ప్రకటించారు.

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ



పంజాబ్ ముఖ్యమంత్రి అల్లుడు రైతుల సొమ్మును కాజేశాడు. రైతులు తమ కష్టార్జితాన్ని బ్యాంకులో దాచుకుంటే దాన్ని కొట్టేశాడు. కాంగ్రెస్ రైతులను దోపిడీచేసి బతుకుతున్నది. కుంభకోణాలన్నీ కాంగ్రెస్ పుణ్యమే.

అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు

జనవరి 24న ముజఫర్‌పూర్‌లో రోడ్డు దాటుతున్న స్కూల్ పిల్లలను వాహనం ఢీకొట్టడంతో తొమ్మిదిమంది చనిపోయారు. ఈ వాహనం బీజేపీ నేత మనోజ్ భాటియాది అనే ఆరోపణలు ఉన్నాయి. అయినా ఈ సంఘటనపై ఇప్పటి వరకు అరెస్టులు లేవు. బీహార్‌లో మద్య నిషేధం ఉన్నా మద్యం సేవించి వాహనం నడిపి పిల్లలను బలిగొన్న బీజేపీ నేతను రాష్ట్ర ప్రభుత్వం రక్షిస్తున్నది.



తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత

చరిత్రలో నేడు




1869

అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన మొదటి ఆఫ్రో అమెరికన్ జాన్ మెనార్డ్.

1874

ఇంగ్లండ్‌లో 'బేస్‌బాల్' క్రీడ ప్రారంభం.





1933

జర్మనీ పార్లమెంట్ 'రిచ్‌స్టాగ్'ను దహనం చేసిన నాజీమూకలు. కమ్యూనిస్టులపై ఆరోపణ.

త్రిపురలో ఎన్నికలు జరిగిన తొమ్మిదిరోజుల తర్వాత నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో ఈరోజు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈసారి బీజేపీ ఈశాన్యరాష్ట్రాలపై కన్నేసి అధికారం కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. త్రిపురలో అధికార వామపక్ష కూటమికి సవాలుగా బీజేపీ బలమైన శక్తిగా ఎదిగి అధికార పక్షంలో గుబులు పుట్టిస్తున్నది. అలాగే నాగాలాండ్, మేఘాలయలో కూడా ప్రాంతీయ పార్టీలతో జతకట్టి బీజేపి అధికారం చేజిక్కించుకునే దిశగా పావులు కదుపుతూ సర్వశక్తులు ఒడ్డుతున్నది.

ది హిందూ

విద్యాప్రమాణాలు, విద్యార్థుల స్థితిగతులపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) జిల్లా వారీగా చేసిన అధ్యయనం కనువిప్పు కలిగించేదిగా ఉన్నది. ప్రభుత్వ పాఠశాలల్లో వర్గాల వారీగా విద్యార్థుల స్థితి, వారి విద్యాప్రమాణాలను ఈ అధ్యయనం తేటతెల్లం చేసింది. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో ఓబీసీ, దళిత, ఆదివాసీ విద్యార్థులే ఉన్నారు. అయితే పట్టణ పాఠశాలల్లో కంటే గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోనే సామర్థ్యాలు మెరుగ్గా ఉన్నాయి. అందులో దళిత విద్యార్థుల్లోనే విద్యా, గ్రహణా సమర్థ్యాలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ సర్వే నివేదికకు అనుగుణంగా ఇప్పటికైనా విద్యాప్రమాణాల మెరుగుపరిచే చర్యలు చేపట్టాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

కార్యోన్ముఖ సదస్సులు

వ్యవసాయరంగంలో సంక్షోభాన్ని శాశ్వతంగా రూపుమాపే క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం హైదరాబాద్ శివారులో, సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన రైతు సదస్సులు కీలకమైనవి. ముఖ్యమంత్రి తలపెట్టిన విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా రైతులను కార్యోన్ముఖులను చేసే దిశగా ఈ సదస్సులు శుభారంభంగా చెప్పవచ్చు. రాష్ట్రస్థాయిలో తీసుకునే విధాన నిర్ణయాలకు, క్షేత్రస్థాయి రైతులకు మధ్య వారధిగా ఉండే మండలస్థాయి సమన్వయ సమితి సభ్యులను లక్ష్యంగా చేసుకొని ఈ రెండు సభలను నిర్వహించారు. ముఖ్యమంత్రి ఈ రెండు వేదికలపై రైతులకు గత విధానాలకు భిన్నంగా కొత్త నిర్మాణాలను తనదైన సులభశైలిలో వివరించారు. పంటల ఎంపిక మొదలుకొని, మార్కెట్ అనుకూలంగా లేకపోతే స్వయంగా కొనడం వరకు రైతు సమన్వయ సమితులు నిర్వహించే కీలకపాత్రను వివరించారు. ఈ కమిటీలలో సగానికి పైగా బలహీనవర్గాలు, మహిళలు ఉండటం వల్ల విస్తృత భాగస్వామ్యం లభిస్తుంది. డెబ్బయి లక్షలమంది రైతులకు ఐదు లక్షల రూపాయల మేర ప్రమాద బీమా వర్తింపచేయ డం ద్వారా రైతుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంత పట్టింపుతో ఉన్నదో తెలుస్తున్నది. గ్రామస్థాయి నుంచి రైతు సమన్వయ సమితుల నిర్మాణం వేగంగా పూర్తవుతున్నది. రైతు సమన్వయ సమితి పేరిట కార్పొరేషన్ ఏర్పాటు కోసం గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుంచి బయట పడేయడం తక్షణ కర్తవ్యంగా ముఖ్యమంత్రి భావిస్తున్నారని దీన్నిబట్టి తెలుస్తున్నది.

ముఖ్యమంత్రి భూముల రికార్డుల ప్రక్షాళన మొదట చేపట్టారు. వ్యవసాయాధికారుల నియామకాలు చేపట్టారు. రైతుల సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుతాయా అనే సమస్యను ఎప్పుడో అధిగమించారు. విద్యుత్తు ఇప్పటికే అందుతున్నది. నీటి ప్రాజెక్టుల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నది. అయితే దీనికి ప్రభుత్వ ప్రయత్నాలు సరిపోవు. రైతుల అవగాహన కూడా కీలకం. రైతులు సమిష్టితత్వాన్ని అలవరచుకోవాలె. ప్రభుత్వం అందజేస్తున్న యంత్రాలను ఉపయోగించుకోవడం మొదలుకొని మార్కెట్‌కు తరలించే వరకు అనుక్షణం రైతు సమితులతో చర్చించి వ్యవహరించాలె.

భారతీయ రైతుల సంప్రదాయ వ్యవసాయ విధానానికి, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలలోని అధునాతన పద్ధతులకు మౌలిక తేడా ఉన్నది. ఈ తేడా యాంత్రీకరణకు మాత్రమే పరిమితమైంది కాదు. రైతుల ఆలోచనా సరళి, జీవన శైలిలోనే ఉన్న వైవిధ్యమిది. మన దేశంలోని గ్రామాలలో రైతులు ఎకరం ఉన్నా సరే, అందులో ఏమి పండినా, ఎంత పండినా, కలోగంజో తాగి బతుకుతం అనే ధోరణితో ఉంటారు. లాభనష్టాలతో లెక్కకట్టి ఆలోచించరు. వ్యవసాయం జీవన విధానమే తప్ప వ్యాపారం కాదు. కానీ అమెరికాలో అదొక లాభనష్టాలతో కూడిన వ్యాపారం. మన దేశంలో ఇటీవల చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. భవిష్యత్తులో కూలీలు దొరుకడం కూడా కష్టం. పశువుల పెంపకం కన్నా, కొన్ని గంటలకు ట్రాక్టరును కిరాయికి తెచ్చుకొని పబ్బం గడుపుకోవడం మేలనేది ఇప్పటికే రైతులకు అర్థమైంది. అయినప్పటికీ శాస్త్రీయ విధానాలు, మార్కెట్ దృక్కోణం ఇంకా రైతులకు అలవడలేదు. ఇప్పటి వరకు వచ్చిన పాలకులు అధికారంలో ఉంటే రైతుల కోసం పాటుపడుతున్నట్టు, ప్రతిపక్షంలో ఉంటే వారి కోసం పోరాడుతున్నట్టు నాటకాలాడారు తప్ప, వ్యవసాయరంగాన్ని ఆధునిక పోకడలకు అనుగుణంగా తీర్చిదిద్దలేదు. తెలంగాణపై తీవ్ర వివక్ష అమలు చేసిన నేపథ్యంలో రైతుల పరిస్థితి మరింత దుర్భరమైంది. అన్నదాత మరణిస్తే, సానుభూతి వచనాలు పలికి, పరిహారం ఇవ్వాలంటూ హడావుడి చేయడానికే రాజకీయాలు పరిమితం అయ్యాయి. ఈ దుస్థితి నుంచి వ్యవసాయ రంగంలో సమూల మార్పులను చేపట్టి, రైతులను సంక్షోభం నుంచి బయట పడేయడం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక పద్ధతి ప్రకారం చర్యలను చేపడుతున్నారు.

కొత్త వ్యవసాయ వ్యవస్థను నెలకొల్పుతున్న తరుణంలో ప్రభుత్వానికి రెండు రకాల సవాళ్ళు ఎదురవుతున్నాయి. వీటిలో మొదటిది– వ్యవస్థాగతంగా మౌలిక మార్పులు తీసుకురావడం. రెండవది– రైతుల ఆలోచనా సరళి మార్చడం. ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా కొత్త వ్యవస్థను పాదుకొల్పడం పెద్ద సవాలు. కొత్త పంట వేయడానికి ముందు గుంటు కొట్టి చదును చేసి, నేలను సిద్ధం చేసినట్టు ప్రభుత్వం అట్టడుగు మార్పులను చేపట్టింది. మొన్నటి వరకు ఎంత భూమి ఎవరి పేరన ఉన్నదో తెలువకపోయేది. నేల స్వభావమేమిటో, మార్కెట్ అవసరాలేమిటో పండించే వారికి తెలువదు. వ్యవసాయ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండేవి. అందుకే ముఖ్యమంత్రి భూముల రికార్డుల ప్రక్షాళన మొదట చేపట్టారు. వ్యవసాయాధికారుల నియామకాలు చేపట్టారు. రైతుల సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుతాయా అనే సమస్యను ఎప్పుడో అధిగమించారు. విద్యుత్తు ఇప్పటికే అందుతున్నది. నీటి ప్రాజెక్టుల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నది. అయితే దీనికి ప్రభుత్వ ప్రయత్నాలు సరిపోవు. రైతుల అవగాహన కూడా కీలకం. రైతులు సమిష్టితత్వాన్ని అలవరచుకోవాలె. ప్రభుత్వం అందజేస్తున్న యంత్రాలను ఉపయోగించుకోవడం మొదలుకొని మార్కెట్‌కు తరలించే వరకు అనుక్షణం రైతు సమితులతో చర్చించి వ్యవహరించాలె. అందుకే రైతులు అవగాహన పెంచుకోవడానికి, అనుభవాలను పంచుకోవడానికి వీలుగా ముఖ్యమంత్రి 2,630 రైతు వేదికలను ఏర్పాటు చేయ తలపెట్టారు. గ్రామస్థాయిలోని రైతాంగమంతా చైతన్యవంతమై, రాజకీయాలకు అతీతంగా సమిష్టి కృషి చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయి. తెలంగాణ భూముల్లో పసిడి పంటలు పండుతాయి.

నివాళి

అందం నిన్ను అందుకోవాలని



శ్రీదేవి
నీ కండ్లు మా వూరి చెరువులో
కలువపూవులై వికసించుకున్నవి
మా వూరి మల్లెమొగ్గలు నీ జడలో
పూవులై పరిమళించినవి
వయసు గర్భగుడిలోని బొట్టు
నీవు నుదుటన అద్ది
యవ్వనం గదిలోని కాటుక నీవు దిద్దుకున్నాక
వెన్నెల నీ చూపుకై ఎదురు చూసింది
అందం నిన్ను అందుకోవాలని
నీ అడుగుల వెంట పరుగు తీసింది
మా వూరి గిలక బావులు
నిన్ను కలవరిస్తున్నప్పుడు
మోదుగపూలు నిన్ను మోహించినప్పుడు
ఏ పూవు నీకు సరితూగలేదని
సౌందర్యం నీ ముందు మోకరిల్లింది
నీ కనురెప్పల కదలికలకు కాలం నిలిచిపోతే
యవ్వనం నీ దోసిట్లో అమృతపు నవ్వయ్యింది
వసంతం వాకిట్లో నీవు రాలిపోయి
రంగుల లోకం నుండి నిష్క్రమించాక
పువ్వులు నీ వియోగాన్ని తట్టుకోలేక
కన్నీటి ధారలై కరిగిపోతున్నవి.

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, 9849082693

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

సందర్భం

కోల అరుణ్‌కుమార్

నల్ల నేల నవ్వుతున్న వేళ

సింగరేణి తెలంగాణ సిరులవేణి. ఎదనిండా నల్ల బంగారం నింపుకున్న సింగరేణి లక్షలాదిమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సంస్థ. 3953 భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు ప్రధాన ఇంధన వనరు. దక్షిణ భారతదేశంలో పారిశ్రామిక అభివృద్ధికి, విద్యుత్ వెలుగులు అందించడానికి సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గే ప్రధానం. తెలంగాణ రాష్ట్ర సిరి సంపద అయిన సింగరేణి గనులు తెలంగాణ రాష్ట్రానికే తలమానికం. బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషిస్తూ అభివృద్ధే పరమావధిగా, నూతన ఒరవడితో లక్ష్యాలను సాధిస్తూ ముందుకు సాగుతున్నది.

సింగరేణి సీమాంధ్ర పాలనలో విధ్వంసానికి గురైంది. ఇప్పుడు తెలంగాణ ఉద్యమ నేత మన ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు, వరాలతో ప్రస్తుతం సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. చీకటిరోజుల నుంచి వెలుగుల దిశగా సింగరేణి ప్రస్థానం..

19వ దశాబ్దపు పూర్వసమయంలో గోదావరి తీరంలో భద్రాచలరాముని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులు కొన్ని బండలను తీసుకుని పొయ్యి కోసం ఏర్పాటు చేశారు. ఆ బండలు కూడా ఎర్రని మంటతో మండటం చూసి భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. అప్పటి బ్రిటిష్ జియలాజికల్ అధికారి డాక్టర్ విలియం కింగ్ చేసిన సర్వే ఫలితంగా గోదావరి తీరమంతా అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని తేలింది. 1886లో మొదటిసారి హైదరాబాద్ దక్కన్ కంపెనీ ఏర్పాటయ్యింది. 1889లో ఈ సంస్థ మొదటిసారిగా ఖమ్మం జిల్లా ఇల్లందు వద్ద స్టంట్ ఫిట్ బొగ్గు గని ఏర్పాటు చేసి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించింది. 1920లో ఈ సంస్థ పేరు 'ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్'గా మార్చారు. దేశంలో మొట్టమొదటి ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా సింగరేణి కాలరీస్ ఘనత వహించింది. 1949లో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి సింగరేణి కాలరీస్ కంపెనీ వచ్చింది. 1956లో భారత ప్రభుత్వం సింగరేణి కంపెనీలో భాగస్వామ్యం తీసుకోగా అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో కొనసాగుతున్నది. 1989–97 మధ్య కాలంలో కంపెనీ ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. ముఖ్యంగా కార్మికుల వేతనాల కోసం కూడా తడుముకోవాల్సిన దుస్థితి. 1996–97 సంవత్సరానికి కంపెనీ నష్టాలు రూ.1,219 కోట్లకు చేరుకున్నాయి. బీఐఎఫ్ ఆర్ఐ దశలోకి వెళ్లి పారిశ్రామిక పునర్నిర్మాణ మండలి పరిశీలనకు అదేశించే స్థాయికి దిగజారింది. ఉత్పత్తి ఖర్చు పెరిగిపోవడం, కార్మికుల్లో తక్కువస్థాయి పని నైపుణ్యం, యంత్రాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడం, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై నిర్లక్ష్యం ఇలా చాలా కారణాల వల్ల సంస్థ నష్టాల్లోకి వెళ్లింది. 1998 నుంచి సంస్థ లాభాల వైపు మళ్లింది. 37 సంవత్సరాల తర్వాత మొట్ట మొదటిసారిగా 2002–03 లో సంస్థ లాభాలను ఆర్జించి ఐదు శాతం డివిడెంట్‌ను ప్రకటించింది. మొదటిసారిగా రికార్డుస్థాయిలో అత్యధికంగా 417 కోట్ల లాభాలను ఆర్జించింది. తమ సంస్థను కాపాడుకోవడానికి రక్తాన్ని చెమటచుక్కల రూపంలోకి మార్చి శ్రమించారు. ప్రస్తుతం సింగరేణి 64 మిలియన్ టన్నుల పై చిలుకు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేస్థాయికి ఎదిగి పారిశ్రామిక రంగాన్ని శాసించేస్థాయికి చేరుకుంది.

ఎంతోమందికి ఉపాధి కల్పించిన సింగరేణిపై సీమాంధ్ర పాలకుల కన్ను పడింది. దీనిని విధ్వంసం చేసే దిశగా ముందుకు సాగారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న హయాంలో ఈ సంస్థలో కార్మికులు మనుగడ సాగించలేని పరిస్థితి. పారిశ్రామిక విధానంలో భాగంగా ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయి. దానిలో భాగంగానే సింగరేణి సైతం మూసివేత దిశగా ముందుకు సాగింది. పెద్ద ఎత్తున కార్మికులను బయటకు పంపించారు. గోల్డెన్ షేక్‌హాండ్ పేరుతో ముప్పై వేల మంది కార్మికులను బయటకు పంపారు. డిస్మిస్ పేరుతో అకారణంగా నాలుగు వేల మందికి పైగా తొలిగించారు. అనేక బావులను మూసివేయడానికి కారణం అయ్యారు. సంస్థకు అందించే బడ్జెట్ సప్పోర్ట్ కూడా లేకుండా చేశారు. ఫలితంగా సింగరేణి సంస్థ బీఐఎఫ్ఆర్ పరిధిలోకి రెండుసార్లు వెళ్లింది. మూసివేత దశకు చేరుకున్నది. మరోవైపు సీమాంధ్ర కార్మిక సంఘాలు కూడా తానతందాన అంటూ చంద్రబాబుకు మద్దతు పలికాయి. చంద్రబాబు పాదాల వద్ద మోకరిల్లి కార్మికుల హక్కులను తాకట్టు పెట్టారు. మరోవైపు కార్మికులను బెదిరిపులకు గురి చేస్తూ అసలు ఉద్యోగాలు సైతం భయం భయంగా చేసుకునే పరిస్థితి కల్పించారు. దీంతో చాలామంది కార్మికులు పనులు చేయకుండా వదిలేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నేతల ద్రోహం ఎలా ఉన్నా కార్మికులు పట్టుదలతో తమ సంస్థను కాపాడుకున్నారు. బీఐఎఫ్ఆర్‌కు ప్రతిపాదనకు వెళ్లి బయటకు వచ్చి లాభాల బట్టిన ఏకైక ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి మాత్రమే అంటే కార్మికులు చూపిన పనితీరు, త్యాగనిరతి అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ఉద్యమంలో కూడా వారు చూపిన తెగువ అనిర్వచనీయం. సకల జనుల సమ్మె నేపథ్యంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ వద్దకు వెళ్లిన తెలంగాణ నేతలతో ముందు సింగరేణిలో సమ్మె ఆపండి అని చెప్పారంటే ఇక్కడి కార్మికులు చేసిన ఉద్యమం ఎలాంటి ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు.



ముఖ్యమంత్రి తీసుకునే ప్రతి నిర్ణయం ఆయన కార్మికుల పక్షపాతి అనే విషయం స్పష్టం చేస్తున్నది. సింగరేణి తెలంగాణకు గుండెకాయ. ఈ సంస్థ అభివృద్ధి, విస్తరణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి తీసుకుంటున్న నిర్ణయాలతో సింగరేణి ఇవ్వాళ సిరులకు కేంద్రంగా మారింది. అలాగే దేశానికీ, ప్రాంతానికీ వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికుల జీవితాల్లోనూ వెలుగులు నింపుతున్నది.

కష్టపడి సాధించుకున్న తెలంగాణ, స్వయంపాలనలో సింగరేణి వెలుగులు విరజిమ్ముతూ ముందుకు సాగుతున్నది. ప్రతి ఏడాది వందల కోట్ల లాభాలతో ముందుకుపోతున్నది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చూపుతున్న చొరవ అభినందనీయం. కార్మిక పక్షపాతిగా ఆయన కార్మికుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు సింగరేణి వ్యాప్తంగా ఆనందాలను నింపుతున్నాయి. ఉద్యోగాల కల్పన, సింగరేణి విస్తరణ కోసం ముఖ్యమంత్రి తయారు చేసిన విజన్ నిజంగా చరిత్రలో నిలిచిపోతుంది. ఇప్పుడు సింగరేణి వ్యాప్తంగా ఉన్న యువతకు అది ఒక కల్పవృక్షంగా మారింది. రాష్ట్రం అవతరించిన తర్వాత 'మన కొలువులు మనకే' అనే విధానం ఆచరణలో సాధ్యమవుతున్నది. రాష్ట్రంలోనే తొలిసారిగా ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించి నిరుద్యోగులకు తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత తొలి ఉద్యోగ ఫలాలను అందించి కలలను సాకారం చేసిన ఘనత సింగరేణి సంస్థకే దక్కింది.

సింగరేణి ఇప్పటికే మూడు నోటిఫికేషన్లు ఇచ్చి దాదాపు 2,500 మందికి ఉద్యోగాలు కల్పించింది. ఇవిగాక ఇంటర్నల్ నోటిఫికేషన్‌లతో మరో 1,000 మంది యువకులకు, ఎంతోకాలంగా పెండింగ్‌లో నానుతున్న 3,000 మంది డిపెండెంట్లకు ఈ రెండేళ్ల కాలంలోనే ఉద్యోగాలు కల్పించింది. ఈ మొత్తం దాదాపు 7,200 మంది కార్మికులు. ఇక మెడికల్ అన్‌ఫిట్ కేసుల్లో ఉద్యోగం వద్దనుకునే వారికి ఏకమొత్తంగా 25 లక్షల రూపాయల సొమ్ము చెల్లింపు లేదా నెలకు 25,000 చెల్లించాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం కూడా ఎంతోమంది కార్మికులకు మేలు చేసింది. సింగరేణి ఉద్యోగుల తల్లిదండ్రులకు సైతం సూపర్‌స్పెషాలిటీ వైద్యం, ఏండ్ల తరబడి బదిలీ వర్కర్లు, బదిలీ ఫిల్లర్లుగా పనిచేస్తే కానీ జనరల్ మజ్దూర్లుగా రెగ్యులర్ కానీ 2,718 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజేషన్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో లక్ష రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. దానిని ఇప్పుడు 10 లక్షలకు పెంచారు. విధి నిర్వహణలో ఉండి సహజమరణం పాలైన కార్మికుడి కుటుంబానికి ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ గతంలో 75 వేల రూపాయలు ఉండగా, దీనిని కూడా 7 లక్షల 50 వేల రూపాయలు పెంచారు. ఇలా చెప్పుకుంటే పోతే తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కార్మికులకు ఎన్నో మంచి పరిణామాలు జరిగాయి. నేడు సింగరేణిలో ముఖ్యమంత్రి తెలంగాణ పర్యటన సందర్భంగా కారుణ్య నియామకాల ప్రకటన చేయనున్నారు. దీంతో దాదాపు ఇరువై వేల మంది కార్మికులకు న్యాయం జరుగనున్నది. ఇలా ముఖ్యమంత్రి తీసుకునే ప్రతి నిర్ణయం ఆయన కార్మికుల పక్షపాతి అనే విషయం స్పష్టం చేస్తున్నది. సింగరేణి తెలంగాణకు గుండెకాయ. ఈ సంస్థ అభివృద్ధి, విస్తరణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి తీసుకుంటున్న నిర్ణయాలతో సింగరేణి ఇవ్వాళ సిరులకు కేంద్రంగా మారింది. అలాగే దేశానికీ, ప్రాంతానికీ వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికుల జీవితాల్లోనూ వెలుగులు నింపుతున్నది. ఇది బంగారు తెలంగాణకు ప్రతీకగా నిలుస్తున్నది.

ముప్పై ఏండ్ల కల సాకారం

తెలంగాణం

డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్


తెలంగాణ వస్తే ఏమొస్తదన్న దానికి నిదర్శనం కండ్ల ముందు కనిపిస్తున్నది. అందుకు వనపర్తి జిల్లా ఖిల్లా గణపురంలోని గణ పసముద్రం ప్రబల తార్కాణం. సప్త సముద్రాలలో గణపసముద్రం ఒకటి. ముప్పై ఏండ్లుగా బీడుపడిన గణప సముద్రం నిండి అలుగు పారుతున్నది. ప్రతి చెరువు అలుగు పారాలన్న తెలంగాణ ప్రభు త్వ ఆకాంక్ష గణప సముద్రంతో తీరినట్లయింది. రైతు బతుకుదెరువుకు చెరువులే జీవనాడులు. దశాబ్దాలుగా ఎండిన చెరువులు మిషన్ కాకతీయతో నిండు కుండలైనవి. భూములన్నీ పచ్చబడుతున్నవి. కాలువలు, కుంటలు పారుతున్నవి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన మూడేండ్లకు చెరువులు ఆనందతాండవం చేస్తున్నాయి. దీంతో వలసపోయిన ప్రజలంతా దమ ఊళ్లకు తిరిగి వస్తున్నరు. మూడేండ్లలోనే వేలాది ఎకరాలకు నీరందిస్తున్న చెరువులిపుడు సముద్రాలను తలపిస్తున్నవి.

సప్త సముద్రాలలో ఒకటైన గణపసముద్రాన్ని ఆనాడు కాకతీయ సామంత పాలకుడు గోనగన్నారెడ్డి గణపతిదేవుడి పేరుమీద ఈ చెరువును తవ్వించిండు. ప్రజలందరి జీవనానికి జీవనాడిగా ఉండే చెరువులను ఆనాడు ప్రతి ఊరులో ఒక చెరువును తవ్వించిండ్రు. అయితే వలసాంధ్ర పాలకుల నిర్లక్ష్యం, వివక్ష కారణంగా కరువుకు కేంద్ర బిందువైన పాలమూరు జిల్లాలో చెరువులన్నీ ఎండిపోయినవి. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా చెరువులన్నీ మురికి తుమ్మల పాలయినవి.

తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక చెరువులన్నీ ఇప్పుడు నీళ్ళతో కళకళలాడుతున్నవి. మిషన్ కాకతీయను ఒక ఉద్యమంలా చేపట్టడం వల్లనే చెరువులీనాడు నీళ్ళతో నవ్వుతున్నవి. ఊహకందని విధంగా సాగునీరు పారుతున్నది. వాగులు వంకలు నిండుతున్నవి. ఇంక రావనుకున్న నీళ్ళు కండ్ల ముందరే నిండుతుంటే సంబురమేస్తున్నది.

పాలమూరు జిల్లాకు వరప్రదాయిని అయిన కృష్ణాజలాలు గతంలో పాలమూరు దాటిపోయేవి. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక మన నీళ్ళను మనమే ఒడిసిపట్టుకుంటున్నం. సమైక్యపాలనలో పోగొట్టుకున్నది మూడేండ్లలోనే తెచ్చుకున్నమంటే అది తెలంగాణ ప్రభుత్వ ఘనతే. మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం 29 ప్యాకేజీ ద్వారా ఖిల్లాగణపురం బ్రాంచ్ కెనాల్‌ను నిర్మించి గణప సముద్రానికి సాగునీరందించడం ఊహకందని విషయం. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు దీక్షా దక్షతలతో అసాధ్యమనుకున్నది సుసాధ్యం అయ్యింది. కెఎల్ఐ ఎత్తిపోతల పథకంలో మన వాటా 25 టీఎంసీలు ఉన్నదానిని 40 టీఎంసీలకు పెంచిన ఘనత ఈ ప్రాంత నేత నిరంజన్ రెడ్డిది. ఏడాదిగా ఖిల్లాగణపురానికి కెఎల్ఐ నుంచి సాగునీరు అందిస్తానని మాట ఇచ్చిన నిరంజన్‌రెడ్డి ఆ మేరకు తన మాటను నిలబెట్టుకున్నడు. దీంతో గణపురంలోని ప్రజలే గాక చుట్టుముట్టూ గ్రామాల ప్రజలు కూడా సంతోషంగా ఉన్నరు. కేవలం గణపురం ప్రజలే కాదు తెలంగాణలోని ప్రతి ఊరు ఇపుడు చెరువులతో కళకళలాడుతున్నది. సమైక్యపాలనలో ప్రాజెక్టులకు రూపకల్పన చేసి 3.67 లక్షల ఎకరాలకు నీరు తీసుకొచ్చేందుకు పాలనాపరమైన అనుమతి తీసుకున్నా దానికి సరైన కాల్వల డిజైన్ లేకపోడంతో పనులు చేపట్టలేదు. దాంతో ప్రాజెక్టులు ఆరంభ దశలోనే ఆగిపోయినవి.

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రాజెక్టుల మీద పడ్డది. ప్రాజెక్టులు నీటితో కళకళలాడితేనే రైతన్నలు, ప్రజలు పచ్చగుంటరని తెలంగాణ ప్రభుత్వం నిండుమనస్సుతో ఉన్నది. ఆ మేరకు ప్రాజెక్టులు, రిజర్వాయర్లు ఎత్తిపోతల పథకాలను సమన్వయం చేసి ప్రతి చెరువును నింపే ప్రయత్నం చేస్తున్నది. మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా వనపర్తి నియోజకవర్గమే కాకుండా నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాలకు కూడా లబ్ధి చేకూరనున్నది. మన నీటిని మనకు కాకుండా సమైక్య పాలకులు చేసిన ద్రోహం ఇపుడు జనాలకర్థమవుతున్నది. ఇన్నాళ్ళుగా సాగునీటికోసం చేసిన భగీరథ ప్రయత్నం ఫలించింది. దశాబ్దాలుగా నీటి ఆదరువులేని గుట్టల ప్రాంతానికి నేడు కృష్ణమ్మ గలగలా పరుగులు పెడుతుంటే తెలంగాణ రాష్ట్రం సాధించిన ఫలాలే నని చెప్పక తప్పదు.



ముప్పై ఏండ్ల తర్వాత గణప సముద్రం నిండిన సందర్భాన్ని పురస్కరించుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా తెలంగాణ రచయితల సంఘం కమిటీ, జిల్లా కవులు, రచయితలు సందర్శించింద్రు. రాష్ట్ర సాధన ఫలాలను కనులారా చూసి స్వీయ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో అడుగులు వేస్తున్న తీరుకు ఆనందం, సంతృప్తి వ్యక్తం చేశారు

ఎన్నేళ్ళో వేచిన ఉదయం అంటూ ఎదురుచూసిన క్షణాలు తెలంగాణ సాకారమై సాక్షాత్కారమైంది. తెలంగాణ అభివృద్ధికి ఎట్లా తిప్పలు పడుతున్నరో అర్థమవుతున్నది. పాలమూరు జిల్లాలో కరువు కాటకాలు, వలసలు ఎప్పుడు పోతాయోనంటూ ఎదురుచూసిన వాళ్ళకు నేడు నిండుతున్న చెరువులే జవాబు చెబుతున్నవి. నీళ్ళునిధులు అనే నినాదంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో చెరువులు నిండుతుంటే ఉద్యమంలో విన్నది నేడు సాకారమైతుంటే తెలంగాణ ఎందుకో అర్థమవుతున్నది. ఇన్నాళ్ళు అరిగోసపడిన వాళ్ళకు తెలంగాణ ప్రభుత్వం స్వాంతన చేకూర్చుతున్నది.

వచ్చే వానాకాలం నాటికి 25 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తున్నది. సీమాంధ్ర పాలనలో రైతుల ఆత్మహత్యలు, ఆకలిచావులు, ప్రజల కన్నీళ్ళే ఎక్కడ చూసినా దర్శనమిచ్చేవి. ఒకవైపు పాలమూరు జిల్లాలో కరువు కరాళనృత్యం చేస్తుండగా, మరోవైపు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా గత పాల కులు వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసిండ్రు. దీంతో పసిడి పంటలు పండాల్సిన భూములు బీళ్ళుగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీడు భూములన్నీ సాగులోకి వస్తున్నవి. గణప సముద్రం పూర్తిగా నిండంతో ఆ మండలమంతా సస్యశ్యామలమవుతున్నది. అరువై ఏండ్ల చరిత్రలో గణప సముద్రం అలుగు పారటం తెలంగాణ ప్రభుత్వం వచ్చినంకనే కావడం విశేషం. అలాగే మండలంలోని మామిడిమాడలోని నేరెడు చెరువుతోపాటు ఖిల్లా గణపురం తాండ సమీపంలో ఉన్న ఎర్రకుంటను రిజర్వాయరుగా మార్చితే ఖిల్లాగణపురం మండలానికి శాశ్వతంగా నీరు అందుతుంది. ఆ ప్రయత్నంలోనే భాగంగా ఆయా మండలాల్లోని చెరువులను, కుంటలను నీటితో నింపి ఆయకట్టు భూములకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయటం హర్షణీయం. అంతేకాదు గణప సముద్రం నిండిన తర్వాత మండలంలోని మామిడిమాడ, సల్కెలాపూర్, కమాలొద్దీన్‌పూర్, వెంకటాంపల్లి చెరువులను నింపుతూనే పక్కనున్న మూసాపేట మండలంలోని నిజాలాపూర్, కందూర్ వరకు కృష్ణమ్మ నీటిని తరలించేందుకు కూడా అవకాశం ఉంది. ఈ గణప సముద్రం పూర్తిగా నిండడానికి 109 కోట్ల రూపాయలతో ప్రభుత్వం నుంచి పరిపాలనా అనుమతులు కూడా తీసుకున్నరు.

ముప్పై ఏండ్ల తర్వాత గణప సముద్రం నిండిన సందర్భాన్ని పురస్కరించుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా తెలంగాణ రచయితల సంఘం కమిటీ, జిల్లా కవులు, రచయితలు సందర్శించింద్రు. రాష్ట్ర సాధన ఫలాలను కనులారా చూసి స్వీయ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో అడుగులు వేస్తున్న తీరుకు ఆనందం, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విధమైన పాలనతీరుతో రాష్ట్రం సస్యశ్యామల పైరు పచ్చల తెలంగాణగా మారుతుందనటంలో సందేహం లేదు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

దక్షిణాది గవర్నర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణ!

■ మహిళా ఉద్యోగి ఫిర్యాదుపై భద్రత సంస్థల పరిశీలన
■ తమకేమీ తెలియదన్న కేంద్ర హోంశాఖ



న్యూఢిల్లీ: దక్షిణాదిలో ఓ రాష్ర్టానికి చెందిన గవర్నర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే దీని గురించి తమకు ఏమీ తెలియదని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ) సోమవారం వెల్లడించింది. సదరు గవర్నర్‌కు వ్యతిరేకంగా మీడియాలో వచ్చిన కథనాల గురించి ప్రశ్నించగా.. ఎంహెచ్‌ఏ అధికార ప్రతినిధి స్పందిస్తూ 'అటువంటి పరిణామాలకు సంబంధించి మా వద్ద ఎలాంటి సమాచారం లేదు' అని పేర్కొన్నారు. మీడియా కథనాల ప్రకారం.. రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి గవర్నర్ తనను లైంగికంగా వేధిస్తున్నారని చేసిన ఫిర్యాదు మేరకు భద్రత సంస్థలు ఆ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తున్నది. కాగా మేఘాలయ గవర్నర్‌గా పనిచేసిన వీ షణ్ముఖనాథన్ ప్రవర్తన సరిగా లేదని ఫిర్యాదులు రావడంతో గత ఏడాది రాజీనామా చేశారు. రాజ్‌భవన్ 'యువతుల క్లబ్'గా మారిందని 100 మంది రాజ్‌భవన్ ఉద్యోగులు అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధాని మోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌కు షణ్ముఖనాథన్‌పై ఫిర్యాదు చేశారు.

17 లక్షలమంది విద్యార్థినులకు ఉచితంగా 'ప్యాడ్స్'

'ఖుషీ'ని ప్రారంభించిన ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్
గ్రామాల్లో మహిళలకు సబ్సిడీపై అందజేసేందుకు నిర్ణయం

భువనేశ్వర్: మహిళా సాధికారతలో భాగంగా ఉచిత శానిటరీ ప్యాడ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఒడిశా ప్రభుత్వం సోమవారం నాడు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17లక్షల మంది విద్యార్థినిలకు ఉచితంగా అందించాలని నిర్ణయించారు. 'ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఆరు నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినిలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్‌లను అందించేందుకు ఉద్దేశించిన 'ఖుషీ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నందుకు ఎంతగానో సంతోషిస్తున్నాను' అని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చెప్పారు. 'విద్యార్థినిలతో పాటు గ్రామీణప్రాంతాల్లోని మహిళలకు కూడా వీటిని సబ్సిడీపై అందించనున్నాం. కౌమార దశలోని అమ్మాయిలకు ఆరోగ్య సమస్యలు రాకుండా ఈ కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుందని, అలాగే అమ్మాయిలు చదువుల్ని వదిలిపెట్టకుండా కూడా ఈ కార్యక్రమం సహాయపడుతుందని భావిస్తున్నా' అని ఆయన తెలిపారు. మహిళా సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని, మిషన్ శక్తి, మమత వంటి కార్యక్రమాలు మహిళల అభ్యున్నతికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సీఎం నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.70 కోట్ల వ్యయంతో ఈ ఉచిత శానిటరీ ప్యాడ్స్ పంపిణీ ప్రాజెక్టు చేపడుతున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.



లైవ్‌లో అధికారిక సమావేశాలు!

■ అమలుపై యోచిస్తున్న ఢిల్లీ సర్కార్



న్యూఢిల్లీ: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు దాడిచేసినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారిక సమావేశాలను ఇకపై ప్రత్యక్ష ప్రసారంలో నిర్వహించాలని ఢిల్లీ సర్కార్ యోచిస్తున్నది. అధికారిక సమావేశాలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాల వీడియోను ప్రభుత్వ వైబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వ ఆలోచనకు ఆమోదం లభిస్తే వచ్చేబడ్జెట్‌లో ఇందుకు నిధులు కేటాయించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. 'అధికారిక సమావేశాలన్నీ ప్రత్యక్ష ప్రసారమైతే అక్కడ ఏం జరుగుతున్నదో, ప్రజాప్రతినిధులు, అధికారులు ఏం మాట్లాడుతున్నారో ప్రజలకు తెలిసిపోతుంది' అని ఆయన వెల్లడించారు. అలాగే ఫైళ్ల కదలిక ప్రక్రియను కూడా ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురానున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఫైల్ ఎక్కడున్నది? ఏ అధికారి ఫైళ్లను త్వరగా చూస్తున్నారు? ఏ అధికారి ఎక్కువకాలం అంటిపెట్టుకుంటున్నారు? ప్రభుత్వం ఏమైనా ఆపుతున్నదా? వంటి అంశాలు ప్రజలకు తెలుస్తాయని అధికారి వెల్లడించారు. మరోవైపు ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఆప్ ఎమ్మెల్యేల దాడి వివాదం సమసిపోలేదు. తమ పార్టీ ఎమ్మెల్యేలు సీఎస్‌పై దాడి చేసినందుకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లిఖిత పూర్వకంగా క్షమాపణలు చెప్పాలని ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది.

బాత్‌టబ్‌లో మరణం

స్పృహ కోల్పోయిన స్థితిలో మునిగిపోయారు ■ శ్రీదేవి మృతిపై ఫోరెన్సిక్ నివేదిక
గుండెపోటు వాస్తవం కాదని వెల్లడి ■ ఆమె మద్యం మత్తులో ఉన్నారన్న దుబాయ్ మీడియా
బాత్‌టబ్‌లో మునగడంపై పోలీసుల ఆరా ■ కేసు విచారణ పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ..
మూడుగంటల పాటు బోనీకపూర్ విచారణ.. దేశం విడిచి వెళ్లరాదని ఆదేశం!
మృతదేహం అప్పగింతపై కొనసాగుతున్న ఉత్కంఠ ■ అందాల నటి మృతిపై వెల్లువెత్తుతున్న సందేహాలు

దుబాయ్, ఫిబ్రవరి 26:

ప్రముఖ సినీ నటి శ్రీదేవి ప్రమాదవశాత్తు నీటిలో మునగడం వల్ల మరణించారని ఫోరెన్సిక్ నివేదిక వెల్లడించింది. ఫోరెన్సిక్ నివేదికను దుబాయ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ సోమవారం తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో విడుదల చేసింది. ఈ కేసు దర్యాప్తును దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ విభాగానికి బదిలీ చేస్తున్నట్టు పోలీసు విభాగం ప్రధాన కార్యాలయం తెలిపింది. శ్రీదేవి తన హోటల్ గదిలోని బాత్‌టబ్‌లో స్పృహ కోల్పోవడం వల్ల నీటిలో మునిగిపోయి మరణించినట్టు పోస్ట్‌మార్టం నివేదిక వెల్లడించిందని పోలీసులు పేర్కొన్నారు. దుబాయ్‌లోని ఓ హోటల్‌లో శనివారం రాత్రి శ్రీదేవి మృతి చెందిన సంగతి తెలిసిందే. శ్రీదేవి భౌతిక కాయం అప్పగింతపై ఉత్కంఠ కొనసాగుతున్నది. ఈ కేసులో మరింత విచారణ అవసరమని దుబాయ్ పోలీసులు తెలిపారు. కేసు విచారణ ఒక కొలిక్కి వచ్చేంత వరకు దుబాయ్ విడిచి వెళ్లరాదని శ్రీదేవి భర్త బోనీకపూర్‌ను ఆదేశించారు. ఫోరెన్సిక్ నివేదిక వెలువడిన అనంతరం పోలీసులు తమ దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. శ్రీదేవి బసచేసిన జుమేరా హోటల్ గదిని స్వాధీనం చేసుకొని అణువణువూ గాలిస్తున్నారు.

సందేహాలను లేవనెత్తిన ఫోరెన్సిక్ నివేదిక

శ్రీదేవి మృతిపై దుబాయ్ ఫోరెన్సిక్ విభాగం నివేదిక ఇచ్చిన నేపథ్యంలో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీదేవి గుండెపోటుతో మరణించినట్టు తొలుత వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. కానీ ఫోరెన్సిక్ నివేదికలో గుండెపోటు ప్రస్తావనే లేదు. ఆమె స్పృహ కోల్పోవడం వల్ల బాత్‌టబ్‌లోని నీటిలో మునిగి మరణించినట్టు ఫోరెన్సిక్ నివేదిక వెల్లడించింది. మరోవైపు శ్రీదేవి శవపరీక్ష జరుగుతుండగా దుబాయ్ పోలీసులు ఆమె భర్త బోనీకపూర్‌ను మూడుగంటలపాటు ప్రశ్నించారు. నలుగురు సీనియర్ అధికారులు ఆయనను ప్రశ్నించి, వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. బాత్‌టబ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న శ్రీదేవిని బోనీకపూర్ చూశారని ఒక వాదన వినిపిస్తుండగా, తొలుత హోటల్ సిబ్బంది ఆమెను ఆ స్థితిలో గుర్తించారని మరో వాదన వినిపిస్తున్నది. ఏది నిజమో నిర్ధారణ కాలేదు. స్పృహ కోల్పోవడం వల్లనే ఆమె నీటిలో మునిగారని ఫోరెన్సిక్ నివేదిక పేర్కొంది. అయితే ఆమె స్పృహ కోల్పోవడానికి కారణాలేమిటన్నది మాత్రం వెల్లడి కాలేదు. ఇదిలాఉండగా దుబాయ్ నుండి వెలువడే గల్ఫ్ న్యూస్ పత్రిక శ్రీదేవి మరణించిన సమయంలో మద్యం మత్తులో ఉన్నట్టు పేర్కొంది. ఆ మత్తు వల్లనే ఆమె బాత్‌టబ్‌లో పడిపోయారని, అనంతరం స్పృహ కోల్పోయి నీటిలో మునిగి మరణించారని తెలిపింది. శ్రీదేవి బాత్‌టబ్ నీటిలో మునగడానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతున్నదని ఓ అధికారిని ఉటంకిస్తూ గల్ఫ్ న్యూస్ పేర్కొంది. ఆదివారం వేకువజామున మూడు గంటల సమయంలో శ్రీదేవి మరణవార్త భారత్‌లో ఆమె అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె గుండెపోటుతో మరణించారన్న వార్త చాలామందికి మింగుడుపడలేదు. తాజాగా ఆమె ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించారన్న వార్తతో ఆమె మరణం చుట్టూ ఏదో రహస్యం దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె గుండెపోటుతో మరణించారని చెప్పిన కుటుంబ సభ్యులు ఆ తరువాత ఎటువంటి ప్రకటన చేయలేదు. తాము దుఃఖంలో ఉన్నందున తమను ఎటువంటి ప్రశ్నలూ అడుగవద్దని వారు మీడియాకు విజ్ఞప్తి చేశారు.



Monday, February 26, 2018

To whom it may concern

This is to inform that

Name: SREEDEVI BONEY KAPOOR AYYAPPAN
Gender: FEMALE
Nationality: INDIA
Passport No: IND- Z 4231524
Died on: 24/2/2018
Due to: ACCIDENTAL DRAWNING

Director of Preventive Medicine Dubai

దుబాయ్ ప్రభుత్వం విడుదల చేసిన ఫోరెన్సిక్ నివేదిక

శ్రీదేవికి చెప్పకుండా బోనీ దుబాయ్ మళ్లీ ఎందుకు వెళ్లారు?

తమ బంధువు మోహిత్ మార్వా వివాహ రిసెప్షన్ ముగిసిన తరువాత శుక్రవారం సాయంత్రం శ్రీదేవి హోటల్ గదికి వెళ్లారు. భర్త బోనీకపూర్, కుమార్తె ఖుషీ మరికొంతమంది కుటుంబ సభ్యులు మాత్రం అదేరోజు ముంబై తిరిగి వచ్చేశారు. శ్రీదేవి మాత్రం ఒంటరిగా ఉండిపోయారు. కానీ బోనీకపూర్ శనివారం దుబాయ్‌కి తిరిగి వెళ్లారు. తాను వస్తున్న సంగతిని శ్రీదేవికి చెప్పలేదు. జుమేరా హోటల్‌కు వెళ్లి ఆమెను ఆశ్చర్యపరుద్దామనుకున్న బోనీ.. ఆమెను సాయంత్రం 5.30 గంటలకు నిద్ర లేపారు. 15 నిమిషాలు ఆమెతో మాట్లాడారు. ఆ తరువాత వారిద్దరూ డిన్నర్‌కు వెళ్లాలనుకున్నారు. ఆమె తయారయ్యేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లి అక్కడే నీట మునిగి మరణించారు. బోనీకపూర్ నుండి సమాచారం అందుకున్న పోలీసులు, పారా మెడికల్ సిబ్బంది హోటల్‌కు వచ్చి శ్రీదేవి మరణించినట్టు ధ్రువీకరించారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఆమె మరణించినట్టు ప్రకటించారు. కానీ అంతకు చాలా సమయం ముందే (రాత్రి 9.30 గంటలకు) శ్రీదేవి మరణించినట్టు ఖలీజ్ టైమ్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. బోనీకపూర్ శ్రీదేవిని దుబాయ్‌లో ఒంటరిగా వదిలి ఎందుకు వచ్చారు? ఆమెకు చెప్పకుండా తిరిగి ఎందుకు దుబాయ్ వెళ్లారు? స్టార్ హోటల్‌లో ఎమర్జెన్సీ వైద్య సహాయం లభించే సదుపాయం ఉండగా, ఆయన ఆమెను రషీద్ దవాఖానకు ఎందుకు తీసుకెళ్లారు? అసలు హోటల్‌లో సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటలు లేదా 11.30 గంటల మధ్య ఏం జరిగింది? అన్న విషయాలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కుటుంబంలో వివాదాలు?

బోనీకపూర్‌తో శ్రీదేవి వివాహం అనంతరం వారి కుటుంబంలో వివాదాలు తలెత్తినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా బోనీ మొదటి భార్య కుమారుడు అర్జున్‌కపూర్ కారణంగా వివాదాలు చెలరేగినట్టు భావిస్తున్నారు. బోనీకపూర్ చిన్న తమ్ముడు సంజయ్‌కపూర్‌తోనే అర్జున్ కపూర్ ఎక్కువ సమయం గడుపుతున్నారు. తన సోదరులు బోనీకపూర్, అనిల్‌కపూర్, అన్న కుమారుడు అర్జున్‌కపూర్‌ల మధ్య సఖ్యత కోసం సంజయ్‌కపూర్ చాలారోజులుగా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. తమ కుటుంబం నిర్మిస్తున్న సినిమాలు, కోర్టు వ్యవహారాలను కూడా ఆయనే చూస్తున్నారు. అందువల్లనే సంజయ్ సినీ కెరియర్ దెబ్బతిన్నట్టు తెలుస్తున్నది. శ్రీదేవి గుండెపోటుతో మరణించారన్న వార్తలతో తొలుత విభేదించింది కూడా సంజయ్‌కపూర్ కావడం గమనార్హం. శ్రీదేవికి మునుపెన్నడూ గుండెకు సంబంధించిన సమస్యలు తలెత్తలేదని ఆయన స్పష్టం చేశారు. కానీ ఇప్పుడు ఆయన కూడా మౌనం వహించడంపై సందేహాలు తలెత్తుతున్నాయి.



శ్రీదేవి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గురుగ్రామ్‌లోని ఓ డ్రామాస్కూల్ విద్యార్థినులు

భర్తతో డిన్నర్‌కు వెళ్లేందుకు సిద్ధపడుతుండగా..

దుబాయ్/ముంబై: భర్త బోనీకపూర్‌తో డిన్నర్‌కు వెళ్లేందుకు సిద్ధపడుతుండగా శ్రీదేవి గుండెపోటుకు గురయ్యారని దుబాయ్‌కి చెందిన ఖలీజ్‌టైమ్స్ పత్రిక సోమవారం వెల్లడించింది. ఆ పత్రిక కథనం ప్రకారం.. బోనీకపూర్ మేనల్లుడు మోహిత్ మార్వా వివాహ వేడుకకు భర్త, చిన్న కుమార్తెతో కలిసి శ్రీదేవి దుబాయ్ వెళ్లారు. రిసెప్షన్ ముగిసిన తరువాత బోనీకపూర్, ఖుషీతోపాటు కుటుంబ సభ్యుల్లో చాలామంది భారత్‌కు తిరిగి వచ్చారు. శ్రీదేవి మాత్రం దుబాయ్‌లోనే ఉండిపోయారు. బోనీకపూర్ శనివారం సాయంత్రం తన భార్యకు సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు తిరిగి దుబాయ్ వెళ్లారు. ఆయన దుబాయ్ కాలమానం ప్రకారం సాయంత్రం 5.30 గంటలకు జుమేరా ఎమిరేట్స్ టవర్స్ హోటల్‌కు చేరుకొని శ్రీదేవిని నిద్రలేపారు. వారిద్దరూ 15 నిమిషాలపాటు మాట్లాడుకున్నారు. తరువాత డిన్నర్‌కు వెళ్లాలనుకున్నారు. అందుకు సిద్ధమయ్యేందుకు ఆమె బాత్‌రూమ్‌కు వెళ్లారు. 15 నిమిషాల వరకూ బయటకు రాకపోవడంతో బోనీ వెళ్లి తలుపు తట్టారు. లోపలి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో తలుపును బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించారు. బాత్‌టబ్ నీటిలో శ్రీదేవి అచేతనంగా పడి ఉండటం చూసి, ఆమెను బయటకు తీసేందుకు ప్రయత్నించారు. తనవల్ల కాకపోవడంతో ఓ స్నేహితుడి సాయం తీసుకున్నారు. రాత్రి 9.30 గంటల సమయంలో బోనీ పోలీసులకు సమాచారమిచ్చారని ఆ పత్రిక వివరించింది. వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారని, కానీ అప్పటికే ఆమె మరణించారని తెలిపింది.

మేజిస్ట్రేట్ అనుమతించాకే..

శ్రీదేవి మృతి కేసును విచారిస్తున్న ప్రాసిక్యూషన్ మేజిస్ట్రేట్ అనుమతిస్తేనే ఆమె భౌతికకాయాన్ని అప్పగిస్తామని దుబాయ్ పోలీసులు భారత రాయబార కార్యాలయానికి తెలిపారు. తాము మేజిస్ట్రేట్ అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని వారు పేర్కొన్నారు. శ్రీదేవి పార్థివదేహాన్ని సాధ్యమైనంత త్వరగా ముంబై తరలించేందుకు కృషి చేస్తున్నామని దుబాయ్‌లో భారత రాయబారి నవదీప్ సూరి చెప్పారు. దుబాయ్ అధికారులు వారి నిబంధనలను పాటిస్తున్నారని, భౌతిక కాయాన్ని ఎప్పుడు అప్పగిస్తారో చెప్పలేమని సూరి పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ఎలా మునుగుతారు?

సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారు బాత్‌టబ్ నీటిలో మునిగి మరణించే అవకాశాలు లేవని నిపుణులు అంటున్నారు. ప్రమాదవశాత్తు నీటిలో పడిన మనిషి సాధారణంగా తనను తాను రక్షించుకొనే ప్రయత్నం చేస్తాడు. తనను తాను రక్షించుకోలేని పరిస్థితిలో ఉంటేనే మరణిస్తాడు. లేదా స్పృహ కోల్పోయిన స్థితిలో నీటిలో పడినా మరణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇక స్పృహ కోల్పోయే పరిస్థితి తలకు బలమైన గాయమైతేనే ఏర్పడుతుంది. శ్రీదేవి విషయంలో ఏం జరిగి ఉంటుందో తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నామని పోలీసులు చెప్పారు.



అనిల్ కపూర్ నివాసం వద్ద సారిక, శృతి, అక్షర హాసన్

చివరి చూపు కోసం వేచి చూస్తున్న అభిమానులు

ముంబై : వెండితెర ఇలవేల్పు శ్రీదేవి చివరి చూపు కోసం వందల సంఖ్యలో అభిమానులు ముంబైలోని ఆమె నివాసం వద్ద ఎదురుచూస్తుండగా.. దుబాయ్‌లో జరుగుతున్న పరిణామాలు వారిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం వరకు శ్రీదేవి మృతదేహం ముంబై చేరుకోగలదని తొలుత వార్తలు వెలువడటంతో ఆమె సహచర నటులు, బాలీవుడ్ సినీ ప్రముఖులు బోనీకపూర్ సోదరుడు అనిల్‌కపూర్ ఇంటికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి శ్రీదేవి కుమార్తెలు జాహ్నవి, ఖుషీ అనిల్‌కపూర్ ఇంట్లోనే ఉంటున్నారు. సినీ దర్శక నిర్మాతలు, ఫరా ఖాన్, కరణ్ జోహర్, ఫర్హాన్ అఖ్తర్, రీతేశ్ సిద్వానీ, సరోజ్ ఖాన్ తదితరులు వచ్చి తమ సంతాపాన్ని తెలిపారు. దర్శకుడు శేఖర్‌కపూర్, రేఖ, రాణిముఖర్జీ, టాబు, రితేశ్, జెనీలియా, శృతిహాసన్, అమీషా పటేల్, దివ్యాదత్తా కూడా అనిల్‌కపూర్ కుటుంబాన్ని పలుకరించారు. ఇక తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్ నుంచి వచ్చిన అభిమానులు లోఖండ్‌వాలాలోని ఆమె ఇంటిముందు గుమిగూడారు.



అనిల్ కపూర్ నివాసం వద్ద శ్రీదేవి చిత్రపటాన్ని చూస్తున్న జనం



మేఘాలయలోని నాంగ్‌పోహ్‌లో ఎన్నికల విధులకు తరలివెళ్తున్న సిబ్బంది

ఈశాన్యంలో కీలక ఎన్నికలు నేడు

■ మేఘాలయ, నాగాలాండ్‌లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
■ రెండు రాష్ర్టాల్లోనూ చెరో 59 స్థానాలకు పోలింగ్

న్యూఢిల్లీ: ఈశాన్య భారతంలోని నాగాలాండ్, మేఘాలయ రాష్ర్టాల అసెంబ్లీలకు మంగళవారం ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగుగంటలవరకు పోలింగ్ జరుగుతుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో మాత్రం మధ్యాహ్నం 3గంటలకే పోలింగ్ ముగుస్తుంది. రెండురాష్ర్టాల్లోనూ 60 చొప్పున అసెంబ్లీ స్థానాల్లో 59 స్థానాలకే పోలింగ్ జరుగనుంది. మేఘాలయలోని విలియంనగర్‌లో ఎన్సీపీ అభ్యర్థి జోనాథన్ సంగ్మా హత్యతో ఎన్నిక వాయిదా పడింది. నాగాలాండ్‌లోని ఉత్తర అంగామి-2లో ఎన్డీపీపీ అధినేత నేఫ్యూరియో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవలే ఎన్నికలు జరిగిన త్రిపురతోపాటు ఈ రెండు రాష్ర్టాల ఎన్నికల ఫలితాలను మార్చి 3వ తేదీన ప్రకటించనున్నారు. 32 మంది మహిళలతో మొత్తం 370 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఖర్కోంగోర్ తెలిపారు. నాగాలాండ్‌లో 11.91లక్షలమంది ఓటర్లున్నారు. నాగా రాజకీయ సమస్యకు పరిష్కారం దొరికేవరకు ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు పలు అతివాద సంస్థలు ప్రకటించడంతో 281 కంపెనీల కేంద్ర బలగాలతో పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసినట్లు యంత్రాంగం ప్రకటించింది. కాగా, రెండు రాష్ర్టాల్లో రాజకీయపార్టీలు హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. త్రిపురలో ఆరు పోలింగ్ కేంద్రాల్లో సోమవారం రీ పోలింగ్‌లో 90.58% ఓటింగ్ నమోదైంది.

ఏప్రిల్ రెండో వారంలో కర్ణాటక ఎన్నికల షెడ్యూల్?

ఏప్రిల్ రెండో వారంలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేందుకు ఎన్నికల కమిషన్ సమాయత్తమవుతున్నది. విశ్వసనీయ సమాచారం మేరకు మార్చి చివరన గానీ ఏప్రిల్ మొదటి వారంలో గానీ కర్ణాటకలో ఎన్నికల కమిషన్ పర్యటించిన తర్వాతనే షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముంది. మే 28తో కర్ణాటక అసెంబ్లీ గడువు ముగియనుంది.

సరిహద్దుల్లో పొంచి ఉన్న ఉగ్రవాదులు

■ చొరబాట్ల కోసం యత్నాలు.. దీటుగా తిప్పికొడుతాం
■ లెఫ్టినెంట్ జనరల్ ఏకే భట్ వెల్లడి

శ్రీనగర్: పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు 30 నుంచి 40 మంది వరకు భారత్‌లో చొరబడేందుకు సరిహద్దుల్లో పొంచి ఉన్నారని భారత సైన్యాధికారి ఒకరు సోమవారం తెలిపారు. భారత సైన్యంపై కాల్పులు జరిపి సైనికుల దృష్టి మళ్లించి ఆ ఉగ్రవాదులు దేశంలోకి చొరబడేట్లు చేయాలని పాక్ చూస్తున్నదని లెఫ్టినెంట్ జనరల్ ఏకే భట్ తెలిపారు. సరిహద్దుల్లో మంచు తక్కువగా కురుస్తున్నందున త్వరలో చొరబాట్లు ప్రారంభం కావచ్చునన్నారు. పాక్ కాల్పులు జరిపినప్పుడల్లా ఉగ్రవాదుల చొరబాటు యత్నాలు జరుగుతున్నాయని, ఇటీవల కుప్వారా, తంగ్ధార్ ప్రాంతాల్లో ఇదేవిధంగా జరిగిందని ఆయన తెలిపారు. పాక్ కుట్రలను ఎదుర్కోవడానికి తాము తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన జమ్ముకశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ సెంటర్‌లో పాసింగ్ ఔట్ పరేడ్ జరిగిన సందర్భంగా విలేకరులకు వివరించారు.

'భారత్ మాతాకీ జై' అనని వారు పాకిస్థానీలు

యూపీ బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు



బల్లియా: ఉత్తర్‌ప్రదేశ్ భైరియా బీజేపీ ఎమ్మెల్యే సురేంద్ర సింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2024 నాటికి భారత్ హిందూ దేశంగా అవతరిస్తుందని ఆయన గతనెలలో వ్యాఖ్యానించారు. తాజాగా 'భారత్ మాతాకీ జై' అనని వారు పాకిస్థానీలని ఆదివారం రాస్రార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అన్నారు. దీంతోపాటు వందేమాతరం పలుకని వారిని కూడా రాజకీయాల్లోకి వచ్చేందుకు అనుమతించొద్దని సూచించారు. తన తల్లిని, మాతృభూమిని గౌరవించనివారి దేశభక్తిని అనుమానించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

జార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

■ ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు, ముగ్గురికి తీవ్రగాయాలు

కొత్తగూడెంక్రైం/రాంచీ: జార్ఖండ్‌లోని పాలము జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో రింకీ, రూబీ అనే ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు. లాలాఘటి నౌ దియ ప్రాంతంలో స్థానిక పోలీసులతో గాలిస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లకు, వారికి ఎదురైన మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో సబ్ జోనల్ కమాండర్ రాకేశ్ భుయాన్, సభ్యులు లల్లూయాదవ్, రింకీ, రూబీ అనే నలుగురు మృతిచెందారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో దంతెవాడ జిల్లా బర్సూర్ గ్రామ సమీపంలోని ముంగారీ అటవీప్రాంతంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎస్టీఎఫ్ జవాన్లతో కలిసి గాలిస్తున్న డీఆర్జీ పోలీసులకు ఎదురైన మావోయిస్టులతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు డీఆర్జీ, ఒక ఎస్టీఎఫ్ జవాన్‌కు తీవ్రగాయాలైనట్టు తెలిసింది. ముగ్గురికి ప్రాథమిక చికిత్స అందించి, దవాఖానకు తరలించారని సమాచారం.

ఆప్ ఎమ్మెల్యేల అనర్హతపై.. ఢిల్లీ హైకోర్టుకు ఈసీ రహస్యపత్రాలు

న్యూఢిల్లీ: అనర్హత వేటుకు గురైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలకు సంబంధించి పలు రహస్యపత్రాలను ఎన్నికల కమిషన్ (ఈసీ) సోమవారం ఢిల్లీ హైకోర్టుకు సమర్పించింది. వీటిని అనర్హత వేటుపడిన 20 మందికి అందించలేమని కూడా స్పష్టం చేసింది. తమపై ఈసీ అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆప్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చంద్రశేఖర్‌లతో కూడిన ఢిల్లీ హైకోర్టు బెంచ్ విచారించింది. 'ఈ రహస్యపత్రాలను మా ప్రత్యేక హక్కుగా భావిస్తున్నాం. వాటిని పిటిషనర్లుగా ఉన్న ఎమ్మెల్యేలకు అందివ్వలేం' అని ఈసీ తరపు న్యాయవాది అమిత్ శర్మ కోర్టుకు తెలిపారు.

ఆయుధాల కొనుగోళ్లలో అడుగడుగునా జాప్యమే!

బహుళనిర్ణయం, ప్రణాళిక రహిత పర్యవేక్షణ, లోపించిన పారదర్శకతే కారణం
పూర్తి సామర్థ్యాన్ని చాటడంలో 'మేకిన్ ఇండియా' విఫలమైంది
రక్షణశాఖ అంతర్గత నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: సాయుధ దళాల బలోపేతానికి ఆయుధాల కొనుగోలు చేయాలని ప్రభుత్వాలు నిర్ణయిస్తున్నా, ఆ ప్రక్రియ అన్నిస్థాయిల్లోనూ జాప్యమవుతున్నది. రక్షణశాఖ విభాగాల్లో నిర్లక్ష్యం, వేళ్లూనుకున్న మూస విధానాలతో ఆయుధాల కొనుగోలు ప్రక్రియ వేగవంతం కావడం లేదని ఆ శాఖ సహాయ మంత్రి సుభాష్ భమ్రే 27 అంశాలతో రూపొందించిన ఓ అంతర్గత నివేదిక తేటతెల్లం చేసింది. అన్నిస్థాయిల్లోనూ లోపించిన జవాబుదారీతనంతో ఆయుధాల కొనుగోలు తీవ్ర జాప్యమవుతుందని అని తెలిపింది. 2014లోనే రక్షణశాఖలో 'మేకిన్ ఇండియా'ను ప్రవేశపెట్టినా, పూర్తి సామర్థ్యాన్ని చాటడంలో విఫలమైందని నివేదిక తేల్చింది. గత ఏడాది చివరలో ఈ నివేదికను ప్రభుత్వ పెద్దలకు ఆయన అందజేయగా, దాని వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. గత మూడేండ్లలో ఆయుధ కొనుగోలుకు 144 రక్షణశాఖ ఒప్పందాలు జరుగగా, నిర్దిష్ట కాలపరిమితిలో ప్రక్రియ పూర్తి చేసుకున్నవి కేవలం 8 నుంచి 10శాతం మాత్రమే. ఆయుధ కొనుగోలు నిర్ణయాల అమలుపై 9 అంచెల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రతిపాదన దశలో ఫైళ్ల క్లియరెన్స్‌కు 20వారా ల గడువిస్తే, ఏకంగా 120 వారాలు పడుతున్నది. ఓ ఒప్పందం ప్రతిపాదనల రూపకల్పనకు 422 వారా లు పడుతున్నది. ధరల సంప్రదింపుల కమిటీ (సీఎన్‌సీ) 10రెట్లు అధిక టైం తీసుకుంటున్నది. రక్షణశాఖలోని అన్ని విభాగాలూ ఒకే వ్యవస్థగా పనిచేయ డం లేదన్నది. 'విచిత్రంగా, రక్షణశాఖ ప్రణాళిక లు, అవసరాలు ఆర్థికశాఖకుగానీ, రక్షణ శాఖ కేంద్ర క్యా బినెట్ సబ్ కమిటీకి కానీ తెలియడం లేదు. బ్యూరోక్రసీలో నిర్లక్ష్యం, కొరవడిన పర్యవేక్షణ మొత్తం వ్య వస్థ గమనాన్ని ప్రభావితం చేస్తున్నది' అని కేంద్రమంత్రి భమ్రే ఆ నివేదికలో పేర్కొన్నారు.



'లోక్‌పాల్' ఆలస్యమెందుకు?

■ సంపన్నులకు కొమ్ము కాస్తున్న మోదీ : రాహుల్‌గాంధీ

బెంగళూరు : అవినీతిపై పోరాటానికి లోక్‌పాల్ ఏర్పాటు చేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రధానిని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. కొమ్ముకాస్తున్న సంపన్నులను కాపాడుకునేందుకే మోదీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కర్ణాటకలోని రామదుర్గలో సోమవారం జరిగిన బహిరంగసభలో రాహుల్ ప్రసంగించారు. తనను తాను కాపలాదారుగా చెప్పుకున్న మోదీ, దేశంలో కుంభకోణాలు జరుగుతున్నా ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. కాగా, లింగాయత్‌ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఉత్తర కర్ణాటకలో పర్యటిస్తున్న రాహుల్ వరుసగా ఆలయాలను సందర్శిస్తున్నారు. బెల్గామ్‌లోని సౌందతిలో ఉన్న ఎల్లమ్మ ఆలయాన్ని, రామదుర్గలోని గోడ్చి వీరభద్ర ఆలయాన్ని దర్శించుకున్నారు. అక్కడి సాంప్రదాయ డప్పును మోగించారు. తన ప్రసంగాల్లో బసవేశ్వరుడి ప్రవచనాలను ప్రస్తావించడం ద్వారా రాహుల్ లింగాయత్‌లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.



గోడ్చి వీరభద్రుడికి రాహుల్ పూజలు



జలమండలి సమీక్షలో మాట్లాడుతున్న ఎండీ దానకిశోర్

వారంలో 16 గ్రామాలకు భగీరథుడు

వచ్చే నెల 5 నుంచి ఓఆర్‌ఆర్ లోపల అందనున్న తొలి ఫలాలు

190 గ్రామాల్లో మొదటగా 16 ఊళ్లకు సమృద్ధిగా నీరు

రూ.628 కోట్ల ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు సమీక్షలో ఎండీ దానకిశోర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఔటర్ రింగ్ రోడ్ లోపలి గ్రామ ప్రజలకు శుభవార్త. 190 గ్రామాలకు సమృద్ధిగా నీరందించేందుకు రూ.628 కోట్ల ఓఆర్‌ఆర్ తాగునీటి ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసిన జలమండలి ఆయా ప్రాంతాలకు పట్టణ భగీరథ ఫలాలు అందించేందుకు మార్గం సుగమం చేసింది. వచ్చే నెల 5వ తేదీ నుంచి తొలి విడత 16 గ్రామాలకు మంచినీటి సరఫరా చేయనున్నట్లు జలమండలి ఎండీ దానకిశోర్ సోమవారం ప్రకటించారు. సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఖైరతాబాద్‌లోని సంస్థ కేంద్ర కార్యాలయంలో ప్రాజెక్టు విభాగం అధికారులు, నిర్వహణ సంస్థల ప్రతినిధులతో ఎండీ దానకిశోర్ సమీక్ష నిర్వహించారు. ఓఆర్‌ఆర్ లోపలి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో రూ.628 కోట్లతో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మొదటి విడతలో 16 గ్రామాలకు నల్లాల ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ పథకం పనులను వచ్చే అక్టోబర్‌నాటికి పూర్తి చేసి నిర్ణీత గ్రామాలన్నింటికీ తాగునీరు సరఫరా చేస్తామని వివరించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, నిర్వహణ సంస్థలు పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పనులు నిర్వహించేటప్పుడు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎం సత్యనారాయణ, డీ శ్రీధర్‌బాబు, పీ రవి, ప్రాజెక్టు విభాగం సీజీఎం, జీఎం, నిర్వహణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలివిడుతలో తాగునీరు అందే గ్రామాలు

మండలం	గ్రామం
ఇబ్రహీంపట్నం	మమ్మరాజుగూడ, మరియపురం
సరూర్‌నగర్	సన్‌రైజ్‌కాలనీ, వాడిగూడ
శామీర్‌పేట	హకీంపేట, అంతాయిపల్లి, సింగాయిపల్లి, ఉప్పర్‌పల్లి
కుత్బుల్లాపూర్	ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్, బాచుపల్లి
ఘట్‌కేసర్	పోచారం, అన్నోజిగూడ
రాజేంద్రనగర్	నెక్నాంపూర్, అలిజాపూర్
కీసర	గోధుమకుంట



టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణికి సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలుగు యూనివర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ, బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ తదితరులు

తెలంగాణపై రచనలు కొనసాగిస్తున్నా

- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి
- తెలుగు యూనివర్సిటీలో సాహిత్య పురస్కారం అందజేత

తెలుగుయూనివర్సిటీ: తెలంగాణ అభివృద్ధి, రాజకీయాలపై వ్యాసాలు రాయడం కొనసాగిస్తున్నానని, కానీ రాజ్యాంగపరమైన సంస్థలో కొనసాగుతున్నందున ప్రచురణలకు పంపడంలేదని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. తెలుగు యూనివర్సిటీ ఆయనకు ప్రకటించిన సాహిత్య పురస్కారాన్ని సోమవారం వర్సిటీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అందజేశారు. పురస్కార స్వీకరణ అనంతరం చక్రపాణి మాట్లాడుతూ నమస్తే తెలంగాణ పత్రిక ప్రారంభం నుంచి తాను రాసిన 'ఘంటాపథం' కాలమ్ పాఠకులను విశేషంగా ప్రభావితం చేయడంతోపాటు తనను ఉత్తేజపరిచిందని గుర్తుచేశారు. ఆ వ్యాసాలు తెలంగాణ జైత్రయాత్ర పేరిట పుస్తకరూపంలో రావడం, దానికి తెలుగు వర్సిటీ నుంచి సాహిత్య పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. తెలంగాణ ఉద్యమకాలంలో పత్రికల పాత్ర అమోఘమైనదని, ప్రధాన వార్తలను కాకుండా సంపాదకీయాలను చదివే స్థితి రావడం ఉద్యమ పరిపక్వతకు గొప్ప నిదర్శనమని కొనియాడారు. రాజ్యాంగపరమైన సంస్థలో ఉంటూ రాజకీయ అభిప్రాయాలను వెలిబుచ్చకూడదనే ఉద్దేశంతో వ్యాసాలను ప్రచురణకు పంపడం లేదన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో ఘంటాపథం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నదన్నారు. లోతైన ఆలోచనలతో, సమాజానికి వాస్తవాలను చూపేలా కార్యకారక సంబంధాలను విశ్లేషిస్తూ, అప్పుడున్న పరిస్థితుల నేపథ్యాన్ని వివరించారన్నారు. కాలమిస్టుగా తెలంగాణ ఉద్యమానికి ఆయన చేసిన సాహిత్య కృషి మరువలేనిదన్నారు. స్ఫూర్తిని నింపే వ్యాసాలను రాయడమే కర్తవ్యంగా భావించారని ప్రశంసించారు. బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ తెలంగాణ జైత్రయాత్ర పుస్తకాన్ని సివిల్స్ అభ్యర్థులు చదివితే చరిత్రతోపాటు తెలంగాణ సమగ్ర స్వరూపాన్ని తెలుసుకోవచ్చన్నారు. వీసీ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమ కాలంలో తెలంగాణ వాణిని బలంగా వినిపిస్తూ, ఉద్యమ భావవ్యాప్తికి తోడ్పడిన వారిలో ఘంటా చక్రపాణిది ప్రముఖ స్థానమన్నారు. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో క్రియాశీల పాత్రను పోషించి, తెలంగాణ నవలల్లో స్త్రీ పాత్రల చిత్రణలపై ప్రామాణికమైన పరిశోధనలు చేసిన తిరునగరి దేవకిదేవికి కీర్తి పురస్కారం అందించడం గర్వంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అలేఖ్య, రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో యువతి కిడ్నాప్!

వాట్సప్‌లో తల్లికి అర్ధనగ్న వీడియోలు.. రూ.లక్ష డిమాండ్

చాంద్రాయణగుట్ట, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ పాతబస్తీలో నలుగురు యువకులు ఓ యువతిని కిడ్నాప్ చేశారు. బంధీగా ఉన్న యువతి దృశ్యాలను ఆమె తల్లికి వాట్సప్‌లో పంపి రూ.లక్ష డిమాండ్ చేశారు. చంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు.. బండ్లగూడ పటేల్‌నగర్ బస్తీలో నివసించే ఆస్మాబేగం కుమార్తె తబుసుమ్ బేగం(21) ఈ నెల 23వ తేదీన సబ్జీమండికి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన ఆస్మాబేగం బంధువులు, స్నేహితులను ఆరా తీసినా కూతురు జాడ తెలువకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆస్మాబేగం పోలీసుల వద్దకు వచ్చి తన కూతురు ఫోన్ నుంచి తన ఫోన్‌కు వాట్సప్‌లో వీడియోలు వచ్చాయని, నలుగురు కలిసి తబుసుమ్ బేగం నోట్లో గుడ్డలు కుక్కి అర్ధనగ్నంగా బంధించి ఉంచారని తెలిపారు. ఆమెను విడుదల చేయాలంటే రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొంటూ వీడియోలను పోలీసులకు అందజేశారు. దీంతో పోలీసులు ఈ ఘటనను కిడ్నాప్ కేసుగా మార్చారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, వీడియోలను పరిశీలిస్తే తెలిసినవారి పనేనని అనిపిస్తున్నదని ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. యువతి కాల్‌డేటా ఆధారంగా ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

అన్నీ అనుమానాలే..

ఈ కిడ్నాప్ ఘటన వెనుక ప్రేమ వ్యవహారం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. బాధితురాలు తబుసుమ్ ప్రేమలో పడిందని తెలుసుకొని కుటుంబసభ్యులు వేరే పెండ్లి నిశ్చయించినట్టు తెలుస్తున్నది. దీంతో వారిని ఇబ్బంది పెట్టేందుకు ఆ యువతే కిడ్నాప్ డ్రామాకు తెరలేపిందని భావిస్తున్నారు. చాంద్రాయణగుట్ట మహిళా పోలీసులు ఫోన్‌లో బాధితురాలితో మాట్లాడగా.. క్షేమంగా ఉన్నానని, తల్లిని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లొద్దని సూచించినట్టు తెలిసింది.

హైదరాబాద్‌కు చేరుకున్న ప్రిన్స్ ఆగాఖాన్

- బేగంపేటలో స్వాగతం పలికిన డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మూడురోజుల పర్యటన నిమిత్తం ప్రిన్స్ కరీం ఆగాఖాన్ సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో బేగంపేటకు వచ్చిన ఆయనకు డిప్యూటీ సీఎం మహమూద్ అలీ ఘనస్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి, జీఏడీ ముఖ్య కార్యదర్శి(ప్రొటోకాల్) అధర్ సిన్హా, హైదరాబాద్‌లోని ఆగాఖాన్ అకాడమీ ప్రతినిధులు ఆగాఖాన్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ముస్లింల్లోని షియా ఇస్మాయిలీ తెగకు చెందిన ఆధ్యాత్మిక నేత, ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్(ఏకేడీఎన్) వ్యవస్థాపకుడు, చైర్మన్ ప్రిన్స్ కరీం ఆగాఖాన్ భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు పది రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మన దేశానికి వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 20న ఢిల్లీకి వచ్చిన ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. న్యూఢిల్లీలో 90 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సుందర్ నర్సరి, సిటీ పార్క్‌ను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో కలిసి ప్రారంభించారు. అనంతరం గుజరాత్‌లో పర్యటించారు. హైదరాబాద్ పర్యటనలో గవర్నర్ నరసింహన్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీతో భేటీ కానున్నారు. షియా ఇస్మాయిలీ ముస్లిం కమ్యూనిటీ ఆధ్యాత్మిక నేతగా 60 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగాఖాన్ డైమండ్ జూబ్లీ నిర్వహించే ఉత్సవాల్లో కరీం ఆగాఖాన్ పాల్గొంటారు.



ఆగాఖాన్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, సీఎస్ ఎస్‌కే జోషి

సెవెన్‌టూంబ్స్‌ను సందర్శించిన ప్రిన్స్ ఆగాఖాన్

మెహిదీపట్నం: గోల్కొండ సెవెన్‌టూంబ్స్‌ను సోమవారం సాయంత్రం ప్రిన్స్ ఆగాఖాన్ సందర్శించారు. ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ఆధ్వర్యంలో సెవెన్‌టూంబ్స్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.

హైదరాబాద్ జిల్లాకు బేటీ బచావో-బేటీ పఢావో అవార్డు

8న ప్రధాని చేతుల మీదుగా అందుకోనున్న కలెక్టర్ యోగితారాణా



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బాలికల నిష్పత్తిని గణనీయంగా పెంచడం, బాలికల విద్యను ప్రోత్సహించడంలో చొరవ చూపినందుకు కేంద్ర ప్రభుత్వం అందించే 'బేటీ బచావో-బేటీ పఢావో' అవార్డుకు హైదరాబాద్ జిల్లా ఎంపికైంది. పథకాన్ని ప్రవేశపెట్టి మూడేండ్లయిన సందర్భంగా దేశవ్యాప్తంగా 150 జిల్లాలను పరిగణలోకి తీసుకొని ఉత్తమంగా కృషి చేసిన 10 జిల్లాలను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. మన రాష్ట్రం నుంచి హైదరాబాద్ జిల్లా ఎంపికైంది. వచ్చే నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజస్థాన్‌లోని జుంజునులో నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతులమీదుగా కలెక్టర్ యోగితారాణా ఈ అవార్డును అందుకోనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలోని బాలబాలికల నిష్పత్తి 918 మాత్రమే ఉండగా, దేశవ్యాప్తంగా బాలబాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న 100 జిల్లాల్లో ఒకటిగా నిలిచింది. అధికారుల కృషి ఫలితంగా బాలికల నిష్పత్తి 973కు పెరిగింది.

గండిపేటకు కొత్త రూపు

రూ.100 కోట్లతో సుందరీకరణ

- పర్యాటకుల మదిని దోచేలా వినోద కార్యక్రమాలు
- 60 మీటర్ల ఎత్తులో స్కై టవర్ రెస్టారెంట్
- ప్రధాన ఆకర్షణగా కేబుల్ కార్, హౌస్‌బోట్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగర ప్రజల దాహార్తిని తీర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్న చారిత్రాత్మక ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయానికి నయా లుక్ రాబోతున్నది. 1920 నుంచి పాలనురుగుల్లాంటి నీళ్లు అందిస్తూ భాగ్యనగరవాసుల మనసులో చెరుగని ముద్ర వేసుకున్న ఈ జలాశయం 2020నాటికి వందేండ్లు పూర్తి చేసుకోబోతున్నది. ఈ నేపథ్యంలో గండిపేటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, నగర పర్యాటకంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, టూరిజం, జలమండలి, హెచ్‌ఎండీఏ, పీసీబీ, రెవెన్యూ శాఖలు భాగస్వాములు కానున్నాయి. ఈ మేరకు జలాశయ పరిసర ప్రాంతాల రూపురేఖలను మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఆయా శాఖల ప్రతిపాదనలను ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు ఇటీవలే సమీక్షించారు. రూ.100 కోట్లతో సుందరీకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

వీకెండ్ స్పాట్

ఉరుకుల పరుగుల జీవితంతో అలిసిన నగర ప్రజలకు గండిపేట రిజర్వాయర్ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచే కేంద్రంగా మార్చనున్నారు. ఈ అభివృద్ధి పనుల్లో హెచ్‌ఎండీఏ కీలక పాత్ర పోషిస్తున్నది. ముందుగా గండిపేట జలాశయం పరీవాహక ప్రాంతం చుట్టూ డ్రోన్ కెమెరాలతో సర్వే చేయనున్నారు. సమీప ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల గుర్తింపుతో పాటు అవసరమైతే ప్రైవేట్ భూములను సేకరించనున్నారు. ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పక్కన బఫర్ జోన్ నుంచి వినోదం, ఆరోగ్యకర వాతావరణం కల్పించేలా ఏర్పాట్లు చేయనున్నారు. తొలుత జలాశయం చుట్టూ ఫెన్సింగ్ వేస్తారు. లోపల దానికి అనుబంధంగా దాదాపు 36 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తారు. ప్రతి రెండు నుంచి ఐదు కిలోమీటర్ల చొప్పున వినోద కేంద్రాలు, అడ్వెంచర్స్ పార్కులు, హోటళ్లు, రెస్టారెంట్లు కొలువుదీరనున్నాయి. మధ్యలో చిన్న చిన్న పార్కులు, కనువిందు చేసేలా ల్యాండ్ స్కేపింగ్ (పచ్చందాలు)లతో శోభాయమానంగా తీర్చిదిద్దనున్నారు. అక్కడక్కడ కాటేజీలు ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వంతోపాటు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తెలిపారు.

■ పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచేలా కేరళ తరహాలో హౌస్‌బోట్లు ఏర్పాటు చేస్తారు. పర్యాటకులు రాత్రంతా జలాశయంలోనే హాయిగా బస చేయొచ్చు.

■ వినోదంతోపాటు గండిపేట అందాలను ఆకాశం నుంచి వీక్షించేలా దాదాపు 10 కిలోమీటర్ల మేర కేబుల్ కార్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

■ 60 మీటర్ల ఎత్తు నుంచి రిజర్వాయర్ అందాలను ఆస్వాదిస్తూ భోజనం చేసేలా సరికొత్తగా స్కై టవర్ రెస్టారెంట్‌ను పరిచయం చేయబోతున్నారు. ప్రస్తుతం గోల్కొండ రిసార్ట్‌లో 30 మీటర్ల ఎత్తులో రెస్టారెంట్ ఉన్నది. దీనికి ప్రజల నుంచి విపరీత స్పందన వస్తున్నది. ఈ రెస్టారెంట్‌కు వెళ్లాలంటే వారంరోజుల ముందు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. అహ్మదాబాద్, కోల్‌కతాలో ఉన్న స్కై టవర్ తరహాలో గండిపేటలో ఏర్పాటు చేయనున్నారు.

జలాశయం ఎప్పుడూ నిండుకుండలా..

నగరానికి ప్రధాన తాగునీటి వనరు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలే. ఉస్మాన్‌సాగర్‌కు 117 గ్రామాల పరిధిలో 738 చదరపు కిలోమీటర్లు, హిమాయత్‌సాగర్‌కు 208 గ్రామాల పరిధిలో 1,308 చదరపు కిలోమీటర్ల పరీవాహక ప్రాంతం ఉన్నది. ఎగువన పడిన వర్షపు నీరు ఇన్‌ఫ్లో చానల్స్ ద్వారా జలాశయాల్లోకి చేరుతుంది. గతంలో వర్షంపైనే ఆధారపడటంతో వర్షాకాలంలో మాత్రమే నిండేవి. ఈ నేపథ్యంలో ఈ జలాశయాల నీటిని వినియోగించకుండా స్టోరేజీకి పరిమితం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వినియోగించాలని నిర్ణయించారు. దీంతో రెండేండ్లుగా సమీప ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగాయి. ఇప్పుడు ఏడాది మొత్తం జంట జలాశయాలు నిండుకుండలా తొణికిసలాడే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జలాశయాల్లో నీరు తగ్గుతున్న కొద్దీ పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద లక్ష్మీదేవిపల్లి నుంచి కృష్ణా నీటికి మళ్లించేందుకు పైపులైన్ నిర్మాణపనులు చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. మరోవైపు ఈ జలాశయాలకు ఎగువ నుంచి వర్షపు నీటిని మోసుకొచ్చే ఇన్‌ఫ్లో చానల్స్‌ను పునరుద్ధరించి భారీస్థాయిలో వరదనీరు వచ్చిచేరేలా ప్రణాళికలు రూపొందించింది.



గండిపేట ఊహాచిత్రం

పరివాహక ప్రాంతం	637 చ.కి.మీలు
వాస్తవ సామర్థ్యం	5.541 టీఎంసీలు
ప్రస్తుత సామర్థ్యం	3.9 టీఎంసీలు
గరిష్ఠ నీటిమట్టం	1,790 అడుగులు
రెయిన్‌ఫాల్ గేజ్	బుల్కాపూర్, జువ్వాడ, ఉస్మాన్‌సాగర్

బల్దియా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

- డబుల్ ఇండ్లకు 6,317.64 కోట్లు
- రోడ్లు, ఫుట్‌పాత్‌లకు 1,829.85 కోట్లు
- బ్రిడ్జీలు, ఫ్లైఓవర్లకు 136.95 కోట్లు
- రూ.13,150 కోట్లతో జీహెచ్‌ఎంసీ వార్షిక బడ్జెట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జీహెచ్‌ఎంసీ 2018-19 వార్షిక బడ్జెట్‌లో రోడ్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధికి అత్యధికంగా రూ. 1,829.85 కోట్లు కేటాయించారు. వరదనీటి కాలువల అభివృద్ధికి రూ. 361.45 కోట్లు, మంచినీటి సరఫరా-మురుగునీటి పారుదలకు రూ.246.43 కోట్లు, మరో పద్దులో గృహనిర్మాణానికి రూ.6,317.64 కోట్లు కేటాయించారు. ఈ మేరకు రెండు విడివిడి పద్దులతోకూడిన బడ్జెట్‌కు బల్దియా పాలకమండలి ప్రత్యేక సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. జీహెచ్‌ఎంసీ అంచనాలు రూ.6,076.86 కోట్లు, మిగిలిన మూడు కార్పొరేషన్ల అంచనాలు రూ.7,073.14 కోట్లు కలిపి రూ.13,150 కోట్లతో బడ్జెట్ రూపొందించారు.

బడ్జెట్ ఆమోదానికి ప్రత్యేక సమావేశం

వార్షిక బడ్జెట్‌పై చర్చించి ఆమోదించేందుకు సోమవారం మేయర్ బొంతు రామ్మోహన్ అధ్యక్షతన పాలక మండలి ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈసారి బడ్జెట్‌ను రెండు పద్దులుగా రూపొందించిన అధికారులు ఒక పద్దులో జీహెచ్‌ఎంసీ ఆదాయ-వ్యయాలను, మరో పద్దులో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన హౌసింగ్ కార్పొరేషన్, రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లకు ప్రభుత్వం కేటాయించే గ్రాంట్లను పేర్కొన్నారు. బల్దియాకు బడ్జెట్‌ను రూ.6,076.86 కోట్లుగా పేర్కొనగా, ఇందులో రెవెన్యూ రిసిప్ట్స్ ద్వారా రూ.3,325 కోట్ల ఆదాయం రానుండగా, వ్యయం రూ.2,675 కోట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. క్యాపిటల్ రాబడిని రూ.3,401.86 కోట్లుగా పేర్కొంటూ, వ్యయం కూడా అంతే మొత్తం అవుతుందని తెలిపారు. ఇందులో ప్రధానంగా అర్బన్ ఫారెస్ట్రీ-హార్టికల్చర్‌కు రూ.100.22 కోట్లు, భూముల అభివృద్ధికి రూ.314.34 కోట్లు, భవనాలకు రూ.183.53 కోట్లు, బ్రిడ్జీలు- ఫ్లైఓవర్లకు రూ. 136.95 కోట్లు, వీధిలైట్లకు రూ. 144.82 కోట్లు, రోడ్లు, భవనాలకు రూ.1829.29 కోట్లు, వరదనీటి పారుదల కాలువలకు రూ.361.45 కోట్లు కేటాయించారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు రూ. 1,043.90 కోట్లు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులకు రూ. 1,488.79 కోట్లు కేటాయించారు. ప్లాన్ గ్రాంట్ల కింద రూ.927.51 కోట్లు, రెగ్యులరైజేషన్ ఫీజుల ద్వారా రూ.181.81 కోట్ల ఆదాయం వస్తుందని అంచనాలు రూపొందించారు. రూ.1,802.19 కోట్లు రుణం ద్వారా సేకరించనున్నట్టు పేర్కొన్నారు. మిగిలిన మూడు కార్పొరేషన్ల బడ్జెట్‌ను రూ.7,073.14 కోట్లని, ఈ మొత్తం ప్రభుత్వం నుంచి గ్రాంటుగా వస్తుందని తెలిపారు. ఇందులో గృహనిర్మాణానికి రూ. 6,317.64 కోట్లు, రోడ్లు, ఫుట్‌పాత్‌లకు రూ. 377.75 కోట్లు, మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదలకు రూ.246.43 కోట్లు కేటాయించారు. మొత్తం రూ.13,150 కోట్లతో రూపొందించిన అంచనాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

రాష్ట్రంలో రెండు రేడియేషన్ కేంద్రాలు

- తొమ్మిది పాత జిల్లా కేంద్రాల్లో వైజ్ఞానిక కేంద్రాలు
- రాష్ట్ర సాంకేతిక మండలి ప్రతిపాదనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముంబైలోని భాభా అణు పరిశోధన కేంద్రం (బార్క్) సహకారంతో రాష్ట్రంలో రెండు రేడియో ధార్మిక కేంద్రాలు, తొమ్మిది వైజ్ఞానిక కేంద్రాలు ఏర్పాటుచేయాలని తెలంగాణ సాంకేతిక మండలి ప్రతిపాదించింది. వీటిని ఇటీవల రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి జోగు రామన్న ఆమోదించారు. ఈ మేరకు ఆయా జిల్లా కలెక్టర్లకు సాంకేతిక మండలి నివేదికలను పంపింది. వరంగల్ జిల్లా మినహా తొమ్మిది పాత జిల్లా కేంద్రాల్లో వైజ్ఞానిక కేంద్రాలు (సైన్స్‌సెంటర్) ఏర్పాటుచేయాలని సాంకేతిక మండలి నిర్ణయించింది. ఇందుకోసం మొత్తం రూ.166 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసిన అధికారులు.. ఇందులో 71.65 కోట్లు కేంద్రం, రూ.94 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వెల్లడించారు. గ్రామీణ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వైజ్ఞానిక కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు.

భాభా అటామిక్ సహకారంతో..

స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌లో ఎంపికైన వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో రేడియేషన్ సెంటర్లను నెలకొల్పాలనే రాష్ట్ర సాంకేతిక మండలి నిర్ణయానికి సహకారం అందించడానికి బార్క్ సమ్మతించింది. కరీంనగర్ రైతుబజార్‌లో ఆహార ధాన్యాలను ఎక్కువకాలం నిల్వ ఉంచడానికి రేడియేషన్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను నెలకొల్పాలని, రేడియో ధార్మికశక్తిని ఉపయోగించడం వల్ల ఆహారధాన్యాలు చెడిపోకుండా ఎక్కువ కాలం నిల్వఉంటాయని, ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు ప్రతిపాదించారు. దీనికి రూ.15 కోట్ల వరకు ఖర్చవుతుందని, రూ.10 కోట్లను కేంద్రం అందించాలని కోరారు. కరీంనగర్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం రేడియేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. రేడియో ధార్మికశక్తిని ఉపయోగించి వ్యర్థపదార్థాల్లో వైరస్‌ను తొలిగించి ఇతర అవసరాలకు వాడవచ్చన్నారు. బీసీ గురుకుల విద్యాలయాల్లో 20 కిచెన్ వేస్ట్ బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు అధికారులు వెల్లడించారు.

శుభకార్యానికి వెళ్లివస్తూ కానరాని లోకాలకు..

- రంగారెడ్డి జిల్లాలో కారును ఢీకొట్టిన లారీ.. ముగ్గురి దుర్మరణం
- రామంతాపూర్ ప్రమాదంలో మరో ముగ్గురి మృతి

హైదరాబాద్ సిటీబ్యూరో/ఉప్పల్, నమస్తే తెలంగాణ: శుభకార్యానికి వెళ్లివస్తుండగా కారును లారీ ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం చౌరస్తాలో ఆదివారం రాత్రి జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామానికి చెందిన నోముల సతీశ్ తన కుమారులకు ఆదివారం వస్త్రాలకంరణ చేయించారు. ఈ శుభకార్యానికి హైదరాబాద్ గోల్నాక సంజీవనగర్‌కు చెందిన పసుమాముల హరికృష్ణ తన కుటుంబసభ్యులతో కలిసి కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 11 గంటలకు 65వ జాతీయ రహదారి కొత్తగూడెం చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, విజయవాడ వైపునుంచి కట్టెల లోడుతో అతివేగంగా వచ్చిన లారీ వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టి దానిపై పల్టీకొట్టింది. దీంతో కారులో ఉన్న హరికృష్ణ తల్లి పద్మ(48), భార్య స్వప్న(35), కుమారుడు నిత్యఅభిరాం(8) అక్కడికక్కడే ప్రాణాలువిడిచారు. పద్మ చెల్లెలు కుమార్తెలు సాహితి, రిత్వికకు స్వల్ప గాయాలవగా, కారు నడుపుతున్న హరికృష్ణ క్షేమంగా బయటపడ్డారు.



అబ్దుల్లాపూర్‌మెట్ ప్రమాదంలో మరణించిన పద్మ, స్వప్న, నిత్యఅభిరాం (ఫైల్)

రామంతాపూర్‌లో మరో ముగ్గురు..

హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతిచెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఉప్పల్ సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం. బీహార్‌కు చెందిన లక్ష్మణ్(25), నేతేశ్(27), హోరిల్(18) ఉప్పల్‌లోని లక్ష్మీనారాయణకాలనీలో ఉంటూ స్థానిక బజరంగి ప్యాకేజీ కంపెనీలో హెల్పర్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో అంబర్‌పేట నుంచి ఉప్పల్‌లోని ఇంటివైపు బైక్‌పై వెళ్తుండగా రామంతాపూర్ మాడ్రన్ బేకరి వద్ద గుర్తుతెలియని వాహనం ఢికొట్టింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు.



నిందితులు విజితారెడ్డి, అమృత, రవిచంద్ర, అనిత

మెట్రోలో ఉద్యోగాలంటూ 1.27 కోట్లు వసూలు

మెట్రోరైలు సంస్థ పేరుతో నకిలీ నియామక పత్రాలు

నలుగురి అరెస్ట్.. రూ.14.5 లక్షలు స్వాధీనం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మెట్రోరైలు సంస్థలో మాకు మంచి పరిచయాలు ఉన్నాయి.. బ్యాక్‌డోర్‌లో మీకు ఉద్యోగాలు ఇప్పిస్తాం.. అంటూ నమ్మబలికి నిరుద్యోగుల నుంచి ఏకంగా రూ.1.27 కోట్లు కొల్లగొట్టిన నలుగురిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.14.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ముగ్గురు మహిళలే కావడం గమనార్హం. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌కు చెందిన టీ అనిత 15 ఏండ్ల కిందట కుటుంబంతో సహా ఉప్పల్ సమీపంలోని చిలుకానగర్‌లో స్థిరపడింది. ఆమె భర్త ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన విజితారెడ్డి ఏడేండ్ల కిందట బోడుప్పల్‌లో స్థిరపడింది. ఆమె 'కీర్తిరెడ్డి హాస్టల్స్' పేరుతో ప్రైవేట్ హాస్టల్స్ నిర్వహిస్తూ, ఘట్‌కేసర్‌లోని మెగా ఇంజినీరింగ్ కాలేజీలో అడ్మిన్ విభాగంలో పనిచేసేది. అనిత, విజితారెడ్డి స్నేహితులు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పీ రవిచంద్ర, అమృత అలియాస్ ఆశలత దంపతులు అమీర్‌పేటలో ఏషియన్ బ్రైట్ క్యారియర్స్ కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నారు. ముందుగా అనిత, విజితారెడ్డి కలిసి మెట్రో రైలులో ఉద్యోగాలిప్పిస్తామని అమాయకులను మోసం చేసేందుకు ప్లాన్ వేశారు. విజితారెడ్డి కాలేజీలో పనిచేస్తుండగా రవిచంద్ర దంపతులు పరిచయమయ్యారు. దీంతో వారిని సంప్రదించి మెట్రో రైలులో టికెట్ల జారీ, ట్రాక్ ఇంజినీర్, ఇంటిగ్రేటెడ్ అసిస్టెంట్ మేనేజర్, అసోసియేట్ మేనేజర్ వంటి ఉద్యోగాలు ఉన్నాయని చెప్పారు. మెట్రో సంస్థలోని ఉన్నతాధికారులతో తమకు మంచి పరిచయాలున్నాయని, బ్యాక్ డోర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. అభ్యర్థులను పంపిస్తే వారు ఇచ్చే మొత్తంలో సగం అనిత, విజితారెడ్డి, మిగతా సగం రవిచంద్ర దంపతులు తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో రవిచంద్ర తన కన్సల్టెన్సీకి వచ్చేవారికి, వారి స్నేహితులకు మెట్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించారు. ఉద్యోగాన్ని బట్టి రేటు నిర్ణయించారు. వీరి మాటలు నమ్మి వచ్చిన వారి వద్ద రూ.50 వేల నుంచి రూ.3.5 లక్షల వరకు తీసుకున్నారు. డబ్బు ఇచ్చిన వారికి హెచ్‌ఆర్ మేనేజర్, ఎల్ అండ్ టీ మెట్రో రైల్వే పేరుతో నకిలీ నియామక పత్రాలు తయారుచేసి రవిచంద్ర ద్వారా పంపిణీ చేశారు. ఈ లేఖలు అభ్యర్థులు మెట్రో రైలు విభాగంలో సంప్రదించగా అధికారులు అవన్నీ నకిలీవని తేల్చారు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వాహిదుద్దీన్, వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లు బృందాలు సంయుక్తంగా గాలింపు చేపట్టి నలుగురిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి నగదుతోపాటు 70 నకిలీ నియామక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

కోర్టు ఉత్తర్వులను విస్మరించి అక్రమనిర్మాణాలు

హైకోర్టులో జీహెచ్‌ఎంసీ కమిషనర్ వ్యాజ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోర్టు ఉత్తర్వులను విస్మరించి నగరంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలంటూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. నగరంలోని కొన్ని స్థలాల్లో నిర్మాణాలు చేపట్టొద్దంటూ న్యాయస్థానాలు ఉత్తర్వులు జారీచేసినప్పటికీ.. కొంతమంది నిర్మాణాలను కొనసాగిస్తున్నారని జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. తమ సిబ్బంది వెళ్లి అడ్డుకోబోతే ఇష్టానుసారంగా దూషిస్తున్నారంటూ ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. అక్రమనిర్మాణాలపై నోటీసులు ఇవ్వగానే.. కోర్టులను ఆశ్రయిస్తున్నారని తెలియజేశారు. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న జూబ్లీహిల్స్ రోడ్ నంబర్9లోని ఒక భవనం విషయంపై వివరాలను తెలియజేశారు. ఇటువంటివారిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.



అహో.. ఆపిల్ ఉద్యోగి!

పదహారేళ్ల వయసులోనే ఆపిల్ కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. డిజిటల్ మనీ యాప్ కనిపెట్టి 'ఔరా' అనిపించుకుంటున్నది. మరి ఇంతకీ ఈ అమ్మాయి ఎవరు? ఆ యాప్ ఎలా పనిచేస్తుందో తెలుసా?

ఉత్తరప్రదేశ్‌లోని శహరాన్‌పూర్‌లో హర్షితా అరోరా జన్మించింది. తండ్రి ఫైనాన్షియర్, తల్లి గృహిణి. ఎనిమిదవ తరగతిలో ఉండగా పాఠ్య పుస్తకాలే పరిమితం కాకూడదని స్కూలుకు వెళ్లడం మానేసింది. తల్లిదండ్రులు కూడా ఆమెను అడ్డుకోలేదు. కంప్యూటర్ కోర్సులో చేరుతానంటే సరేనన్నారు. కంప్యూటర్ టీచర్ ఆమెకి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాడు. కొత్త టెక్నాలజీల గురించి చదువడమే కాదు, కంప్యూటర్ మాస్టర్‌ని అడిగి ఆ టెక్నాలజీలని నేర్చుకునేది. 2016లో క్రిప్టో కరెన్సీ గురించి విన్నది. అంటే డిజిటల్ మనీ అన్నమాట. అది ఒక్కో దేశంలో ఒక్కోలా మారుతుంటుంది. దాన్ని అంతా ఒక తాటిపైకి తేవాలనుకుంది. దానికోసం ఆపిల్‌లో ఉద్యోగం సంపాదించింది. జనవరిలో 'క్రిప్టో ప్రైజ్ ట్రాకర్' పేరుతో డిజిటల్ మనీ యాప్‌ని కనిపెట్టింది. దీనిద్వారా 32 దేశాల్లో డిజిటల్ మనీలో ఎలాంటి మార్పులు సంభవిస్తున్నాయనేది తెలుసుకోవచ్చు.

వైన్‌తో వయ్యారంగా..

ఆగండగండీ.. మీరు తాగే వైన్ అనుకుంటున్నారా? కాదు.. జుట్టుకు వేసే వైన్ రంగు గురించి మేం మాట్లాడేది. ఇప్పుడీ రంగు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలుతున్నది.

తెల్లబడిన జుట్టుకే కాదు.. నల్లగా నిగనిగలాడే జుట్టుకు రంగు వేయడం అమ్మాయిలకు ఫ్యాషన్ అయిపోయింది. అయితే ఒక్కొక్కరూ ఒక్కో రంగు ఎంచుకోవడానికి ఇష్టపడుతుంటారు. కానీ అందరూ మెచ్చే రంగుగా ఎన్నికైంది మాత్రం వైన్ కలరేనట. 21వ శతాబ్దంలోని అమ్మాయిలు ఈ రంగును జుట్టుకు వేసుకోవడానికి తెగ ఉవిళ్లూరుతున్నారట. అలా జుట్టుకు రంగు వేయించుకొని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం కూడా ట్రెండ్‌గా మారిపోయిందంటున్నారు ఫ్యాషనిస్టులు. పొట్టి, పొడుగు, రింగులు, స్ట్రెయిట్.. ఎలాంటి జుట్టుకైనా ఈ రంగు నప్పుతుందట. ఫ్యాషన్ షోల టాపర్స్ కూడా ఈ రంగుకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్లు చెబుతున్నారు. పైగా లైట్ల జిలుగుల్లో, సూర్యుడి వెలుతురులో ఈ రంగు మరింత అందంగా మెరిసిపోతుంది కాబట్టే ఈ రంగును వేసుకోవడానికి అమ్మాయిలు ఇష్టపడుతున్నారట.



జిందగీ పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
మంగళవారం 27 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM



ఆమెకు చూపు లేదు.. అయితేనేం ముందు చూపు ఉన్నది. జీవితంలో సర్వస్వం కోల్పోయినా ఒకటి మాత్రం మిగిలే ఉంటుంది. అదే భవిష్యత్తు. ఆమె అదే నమ్మింది. అప్పుడు కోల్పోయింది.. కేవలం చూపు మాత్రమే. అయినా భవిష్యత్తు పై ఆశతో అవమానాల్ని భరించింది. ముందుచూపుతో అడుగు వేసింది. ఆ మొండి ధైర్యమే ఆమెను గెలిపించింది. చూపున్నా అందరూ నిలదొక్కుకోలేని న్యాయవాద వృత్తిలో దిగ్విజయంగా నలుగురితోపాటు రాణిస్తున్నది. ఆమే హైకోర్టు న్యాయవాది చంద్ర సుప్రియ. తనలాంటి కష్టం ఎవ్వరికీ రాకూడదని ఒక స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి తన వంతు సహాయం చేస్తున్న ఆమె కథ కొందరిలోనైనా స్ఫూర్తి నింపాలని ఆశిస్తూ..

ముందుచూపున్న న్యాయవాది

అంధత్వాన్ని జయించి కోటి వెలుగుల కాంతిని చూసింది.. చూస్తున్నది.. ఆ వెలుగును ఎంతోమందికి పంచుతున్నది చంద్ర సుప్రియ. 'నువ్వేం చేస్తావ్..?' అంటూ గేలిచేసిన వారికి తన గెలుపును పరిచయం చేసి తనేంటో నిరూపించుకున్నది. ఓపికతో సాధన చేస్తే ఏదైనా సాధించొచ్చన్న నిజాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రపంచానికి చూపించింది. ఇప్పటివరకు తను వాదించిన కేసులన్నింటిలో గెలుపు తలుపు తట్టి.. విజయాన్ని తన పందిరి గుంజకు కట్టేసుకున్నది చంద్ర సుప్రియ.

ఎగతాళిని గెలిచింది : ఎల్ఎల్‌బీ పూర్తిచేసి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సెల్‌లో తన పేరు నమోదు చేసుకోవడానికి వెళ్లినప్పుడు అక్కడ చాలా మంది సీనియర్ లాయర్లు సుప్రియను చూసి నవ్వుతూ హేళన చేశారు. తన తొలి అడుగునే ఎగతాళిగా గేలి చేయడంతో ఆమెకు గుండెల్ని పిండేసినట్టయింది. అయినా ఆ దుఃఖాన్ని దిగమింగి ముందుకు సాగింది. సుప్రియను జూనియర్ అడ్వకేట్‌గా చేర్చుకోవడానికి చాలామంది సీనియర్ లాయర్లు నిరాకరించి తమ మనసులోని వైకల్యాన్ని ప్రదర్శించారు. కానీ దివ్యాంగుడైన అడ్వకేట్ నరహరి ఆమెను జూనియర్ లాయర్‌గా చేర్చుకొని గొప్పతనాన్ని చాటుకున్నాడు. వైకల్యం తన శరీరానికే కానీ.. మనసుకు కాదని.. శరీర సౌందర్యం కాదు.. మానసిక సౌందర్యం మనిషికి అవసరమని చెప్పకనే చెప్పాడు. అలా 2002 మార్చిలో నరహరి దగ్గర జూనియర్ లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టింది సుప్రియ. సికింద్రాబాద్ కోర్టులో నరహరి కేసులు వాదించేటప్పుడు సుప్రియ దగ్గరుండి వింటూ ఒక కేసుకు సంబంధించిన కీలక అంశాలు ఎలా రాబట్టాలో తెలుసుకున్నది. నరహరితో హైకోర్టుకు వెళ్లి వీల్‌చైర్‌లో ఆయనను తోసుకుంటూ కేసు వాదన జరుగుతున్న బెంచ్ దగ్గరికి తీసుకెళ్లేది. అక్కడ జరుగుతున్న వాదనలు, ఇరు పక్షాల లాయర్ల వాదోపవాదాలు, జడ్జి తీర్పులు నిశితంగా గమనించేది. కొన్ని నెలల తర్వాత అనారోగ్య కారణాల వల్ల నరహరి చనిపోయాడు. సుప్రియ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తన ప్రాక్టీస్ కొనసాగించడం కోసం తనకు తెలిసిన, తెలియని సీనియర్ లాయర్ల అందరి దగ్గరకు పరుగెత్తింది. తన అదృష్టవశాత్తు 2002 నవంబర్‌లో సి. బాలగోపాల్ దగ్గర జూనియర్ లాయర్‌గా చేరింది. ఆయన అప్పజెప్పిన అసైన్‌మెంట్లను ఆసక్తిగా, శ్రద్ధగా పూర్తి చేసేది. సివిల్ కేసులను పరిశీలించేది.

ఆమె గెలిచిన రోజు: ఒకరోజు బాలగోపాల్ వేరే కేసు విషయమై వెళ్తూ.. సికింద్రాబాద్ కోర్టులో ఒక సివిల్ కేసును క్రాస్ ఎగ్జామిన్ చేయమని సుప్రియకు బాధ్యత అప్పగించాడు.ఆమె ప్రశ్నలన్నింటినీ క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుంది. కోర్టుకు చేరుకుంది. సుప్రియతో పాటు మరో అడ్వకేట్ ప్రశ్నలకు సంబంధించిన పత్రాలన్నీ పట్టుకొని కూర్చున్నాడు. అందరూ చూస్తుండగానే సుప్రియ క్రాస్ ఎగ్జామినేషన్ ఘట్టాన్ని అవలీలగా పూర్తి చేసింది. అక్కడున్న సీనియర్ లాయర్లంతా ఆమె ప్రతిభను మెచ్చుకున్నారు. ఫలితం.. సుప్రియ క్రాస్ ఎగ్జామిన్ చేసిన కేసు వీరి వైపే వచ్చింది. సుప్రియ కేసు గెలిచింది. ఆ గెలుపు ఆమెకు మరో కేసు గెలిపించే బాధ్యతలప్పగించే దిశగా తీసుకెళ్లింది. 2003లో హైకోర్టులో రూ.2 కోట్ల విలువైన భూమికి సంబంధించిన కేసు నడుస్తున్నది. ఆ కేసు బాలగోపాల్ వాదిస్తున్నాడు. అనారోగ్య కారణాల వల్ల వరుసగా రెండు రోజులు ఆయన కోర్టుకు రాలేకపోయాడు. ఆ కేసు వాదించమని సుప్రియను పంపించాడు. తన వాగ్ధాటితో సుప్రియ ఆ కేసులో కూడా సులభంగా విజయం సాధించి తనను ఎగతాళి చేసిన సీనియర్ లాయర్ల చేతే.. చప్పట్లు కొట్టించుకుంది. ప్రస్తుతం అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, సివిల్, క్రిమినల్ కేసులు వాదిస్తూ వరుస విజయాలతో దూసుకుపోతున్నది.

సుప్రియ గురించి: నేరేడ్‌మెట్ సైనిక్‌పురికి చెందిన సుందర్‌రాజ్ నాయుడు, స్వరూపరాణిల కూతురు చంద్ర సుప్రియ. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు సికింద్రాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్‌లో చదువుకుంది. చిన్నప్పటి నుంచే సుప్రియ కంటి సమస్యలతో బాధపడుతున్నది. రెండవ తరగతి చదువుతున్నప్పుడు కంటి సమస్య తీవ్రమైంది. మెహిదీపట్నంలోని సరోజిని కంటి దవాఖానా, సికింద్రాబాద్‌లోని లయన్స్ కంటి దవాఖాన వంటి చాలా దవాఖానల్లో చూపించారు. రేచీకటి ఉంది.. మందులు వాడితే తగ్గిపోతుందని కొన్ని మందులు ఇచ్చారు. కానీ సుప్రియ తల్లిదండ్రులు అంత ఈజీగా తీసుకోలేదు. ఎల్‌వీ ప్రసాద్ కంటి దవాఖానలో పరీక్షలు చేయించారు. పరీక్షలన్నీ పూర్తయ్యాక 'రెటినైటస్ పిగ్‌మెంట్‌జా' అనే కంటి వ్యాధిగా గుర్తించారు. రానురాను కంటి చూపు పోతుందని చెప్పారు డాక్టర్లు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, సుప్రియకు మనోధైర్యాన్ని నూరిపోసి పంపించారు. బాగా చదివి డాక్టర్ అయి కంటి సమస్యలపై పరిశోధనలు చేయాలనే తపనతో అక్కడి నుంచి బయటకొచ్చింది సుప్రియ. మారేడ్‌పల్లిలోని ఇందిరాగాంధీ జూనియర్ కాలేజీలో బైపీసీ గ్రూప్ తీసుకుంది. ఇంటర్‌లో చేరిన తర్వాత సుప్రియకు కంటి సమస్యలు మరీ ఎక్కువయ్యాయి. హైపవర్ అద్దాలు పెట్టుకొని పరీక్షలు రాసింది. మంచి మార్కులతో సుప్రియ పాసయింది. చదువులో సుప్రియ కనబరుస్తున్న ఆసక్తిని గమనించిన తండ్రి సుప్రియను లాయర్ చేద్దామని ఎల్ఎల్‌బీ ఎంట్రెన్స్ రాయించాడు. అందులోనూ మంచి ర్యాంకు సాధించింది. 1995 నుంచి 2000 వరకు అమీర్‌పేటలోని పడాల రాంరెడ్డి లా కాలేజీ లా పూర్తిచేసింది. పరీక్షల్లో ఎవరి సహాయం తీసుకోకుండా సమాధానాలు రాసింది. పరీక్షల్లో పాసై ఉత్తమ విద్యార్థిగా రూ.1000 నగదు బహుమతి కూడా అందుకుంది. ఆ డబ్బులతో 2001లో బార్ కౌన్సెల్‌లో అడ్వకేట్‌గా, రాష్ట్రంలో మొదటి అంధురాలైన చంద్ర సుప్రియ అడ్వకేట్‌గా పేరును నమోదుచేసుకుంది. బషీర్‌బాగ్‌లోని ఉస్మానియా లా కాలేజీలో 2004లో ఎల్ఎల్‌ఎం పూర్తిచేసింది. అంతర్జాతీయ చట్టాలపై పరిశోధన చేసింది. ఎల్ఎల్ఎం చదువుతున్న సమయంలో సుప్రియకు పూర్తిగా కంటిచూపు పోయింది. దీంతో ఎల్ఎల్ఎం పరీక్షలు స్క్రైబ్ (సహాయకుడు)తో రాసి పాసైయింది. ఎల్వీ ప్రసాద్ దవాఖానాలోని లైబ్రెరీ అధికారుల సహాయంతో క్యాసెట్ల ద్వారా పాఠాలు విన్నది. సహాయకుడి ద్వారా పరీక్షలు రాసి ఉన్నత చదువులను పూర్తి చేసింది సుప్రియ.







రోల్ మోడల్ ఆఫ్ ఇండియా : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2008 ఫిబ్రవరి నుంచి 2014 ఏప్రిల్ వరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా హైకోర్టులో సేవలందించింది సుప్రియ. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ కేసులను ప్రతిరోజూ బెంచ్ వద్ద తన వాదనలు వినిపించింది. వేలాది కేసులను గెలిచింది. లాయర్స్ డే రోజు ఉత్తమ అడ్వకేట్‌గా బార్ కౌన్సిల్ వారు సుప్రియను సన్మానించారు. లూయిబ్రెయిలీ అవార్డు, హెలెన్ కిల్లర్ అవార్డు, బెస్ట్ అడ్వకేట్ అవార్డు, విశిష్ట మహిళ అవార్డు ఇలా ఎన్నో అవార్డులు పొందింది సుప్రియ. ఇలా విజయాలతో, ఎంతోమందికి స్ఫూర్తి అవుతున్న అడ్వకేట్ చంద్ర సుప్రియ '2006 రోల్ మోడల్ ఆఫ్ ఇండియా'గా భారత రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైంది. అంధత్వాన్ని జయించి పోటీ ప్రపంచంలో రాణిస్తున్న అడ్వకేట్ సుప్రియ అంతర్జాతీయ చట్టాలపై పట్టు సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని హై కోర్టుతో పాటు వివిధ కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నది. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సం సందర్భంగా 2006డిసెంబర్ 3న భారత రాష్ట్రపతి అబ్దుల్‌కాలం చేతుల మీదుగా అవార్డు అందుకున్నది. 2007 నవంబర్‌లో 'తపన చారిటబుల్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసింది. ట్రస్ట్ ద్వారా అంధత్వ నివారణ కోసం ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నది. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేస్తున్నది. మేనరికం వివాహాలను చేసుకోవడం వల్ల పిల్లలకు కలిగే నష్టాన్ని వివరిస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. కాలేజీల్లో పలు అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నది. చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లలో ఉన్న ఖైదీలకు లీగల్ ఎయిడ్ సర్వీసులు అందిస్తున్నది. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నది. తనలా ఆలోచించి, తనలాంటి వారి కోసం తపన పడే మరో అంధుడైన కిరణ్‌ని వివాహమాడింది.

బండారి జార్జ్ విల్సన్
నమస్తే తెలంగాణ విలేకరి, వినాయక నగర్

బిట్స్ కార్నర్

క్యాన్సర్‌కు కీమోథెరపీ తప్పదా?



మా అమ్మ వయసు 48 సంవత్సరాలు. ఆమెకు థైరాయిడ్ క్యాన్సర్ ఉన్నట్టుగా నిర్ధారించారు. కాన్సర్ ఇప్పుడిప్పుడే రెండో దశకలోకి ప్రవేశిస్తున్నందున కీమోథెరపీ సిఫారసు చేశారు. అయితే కీమోథెరపీ వల్ల అనేక సమస్యలు వస్తాయని, క్యాన్సర్‌ను అదుపుచెయ్యడంలో ఇది అంత శక్తివంతమైన చికిత్స కాదని బంధుమిత్రులు కొందరు అంటున్నారు. దీంతో కీమోథెరపీకి వెళ్లాలా? వద్దా? అనే సందేహం కలుగుతున్నది. కీమోథెరపీ చికిత్సను గూర్చి దయచేసి పూర్తి విరాలు తెలియజేయగలరు.

అరవింద్ కుమార్, సిద్దిపేట

డాక్టర్లు కీమోథెరపీని సిఫారసు చేయగానే చాలామందికి ఇలాగే రకరకాల అనుమానాలు వస్తుంటాయి. ఆందోళన పడుతుంటారు. వీటిలో చాలా వరకు అపోహలే. కీమోథెరపీలో ఇప్పుడు చాలా రకాల మార్పులు వచ్చాయి. కీమోథెరపీ ఇదివరకు ఎన్నడూ లేనంత శక్తివంతం, సురక్షితంగా తయారయిన విషయం ఇప్పటికీ చాలా మంది అవగాహనలో లేదు. క్యాన్సర్ కణాల్లో కలిగే కణ విభజనను అరికట్టేందుకు కీమోథెరపీని సిఫారసు చేస్తారు. ఈ మధ్య ఇమ్యూనో థెరపీ వంటి కొత్త చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. అయితే దీని ప్రభావం అన్ని రకాల క్యాన్సర్ల మీద ఉండకపోవచ్చు. కానీ కీమోథెరపీతో కచ్చితమైన ఫలితాలను సాధించడం సాధ్యపడుతుంది. కీమోథెరపీతో జుట్టు రాలిపోతుందని అందరూ అనుకుంటారు. కానీ అన్ని రకాల మందులతో జుట్టు రాలిపోవడం జరగదు. జుట్టు రాలిపోయినప్పటికీ చికిత్స పూర్తయిన నెల రోజుల్లోపు తిరిగి జుట్టురావడం ప్రారంభం అవుతుంది. ప్రస్తుతం కీమోథెరపీ చేయించుకుంటున్న పేషెంట్లతో మాట్లాడితే తాము తీసుకుంటున్న చికిత్స గురించి విన్నంతగా, ఊహించినంత బాధగా, అసౌకర్యంగా ఏమీ లేదనే అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తున్నారు. కీమోథెరపీకి సంబంధించిన పరిశోధనలు రోజురోజుకు మెరుగైన ఫలితాలను ఇచ్చే మందులను మార్కెట్లోకి తెచ్చే దిశగా సాగుతున్నాయి. కీమోథెరపీ సమయంలో, చికిత్స పూర్తయిన తర్వాత ఇతర ఇన్ఫెక్షన్లు సోకినా, జ్వరం వచ్చినా వెంటనే డాక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచిస్తున్నాం. అందువల్ల వాటిని ప్రాథమిక దశలోనే అదుపు చెయ్యడానికి వీలు కలుగుతుంది.

డాక్టర్
నిఖిల్ గద్యాల్ పాటిల్
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

చవకైన అందం!

అందాల ప్రొడక్ట్స్ కోసం చాలా ఖర్చు చేయాల్సిందే! అలా కాకుండా చర్మ సౌందర్యాన్ని కాపాడేందుకు కొన్ని ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. వాటితో చవకైన అందాన్ని సొంతం చేసుకోవచ్చు.




కాలామైన్ లోషన్‌లో జింక్ ఆక్సైడ్, ఫెర్రిక్ ఆక్సైడ్‌లు ఉంటాయి. మొటిమలు, దద్దుర్ల వంటి అనేక చర్మ సమస్యలకు దీనిని వాడవచ్చు. ఈ లోషన్‌ని సమస్యాత్మక ప్రాంతాల్లో రాసి మూడు గంటల పాటు వదిలేయాలి. ఆ తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి.

పొడి చర్మాన్ని రిపేర్ చేసేందుకు, సూర్యరశ్మి కారణంగా కమిలిపోయిన చర్మాన్ని తిరిగి సాధారణ స్థితికి తెచ్చేందుకు అలోవెరా జెల్‌ని వాడొచ్చు. మొటిమల కారణంగా వచ్చే వాపులకు కూడా ఇది చక్కని మందులా పనిచేస్తుంది.

బేబీ ఆయిల్ వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. పొడిచర్మాన్ని తేమగా ఉండేలా చేయడంలో ఇది ప్రముఖ పాత్ర పోషిస్తుంది. వాటర్ ప్రూఫ్ మేకప్‌ని తొలిగించడానికి కొన్ని చుక్కల బేబీ ఆయిల్‌ని దూది మీద వేసి తుడిచేస్తే సరిపోతుంది.

పగిలిన పెదాల కోసం పెట్రోలియం జెల్లీని వాడవచ్చు. అలాగే పగిలిన మడమలకు కూడా ఇది చక్కని మందు.

నూనెల్లో కొబ్బరి నూనె సౌందర్య సాధనంగా బాగా పనిచేస్తుంది. పొడిగా ఉన్న చర్మంపై లోతైన స్థాయి నుంచి తేమను అందించగలదు కొబ్బరి నూనె. ముఖానికి వేసుకున్న మేకప్ తొలిగించగలదు. జుట్టుకు కండీషనర్‌గానూ కొబ్బరి నూనె ఉపయోగపడుతుంది.



నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[హైదరాబాద్]
మంగళవారం 27 ఫిబ్రవరి 2018



ఆమె గుండె గట్టిదే.. కానీ..!!

జబ్బులకి స్త్రీ, పురుష, చిన్నా పెద్దా భేదాల్లేవు. సామాన్యులూ, సెలబ్రిటీలన్న తేడాలసలుండవ్. అతి సామాన్య స్త్రీ అయినా, అతిలోక సుందరి అయినా వాటికి ఒకటే. ఎవరి గుండెలో అయినా ఏర్పడే అడ్డంకు గుండెపోటుకే దారి తీస్తుంది. అందుకే వ్యక్తి ఎవరైనా సరే.. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం ఒక్కటే మార్గం. అయిదుపదుల్లోనే అర్ధంతరంగా నింగికెగసిన మేటి తార శ్రీదేవి విషయంలో ఇలా గుండెపోటే కారణమా, టబ్‌లో పడడమా అనేది పక్కన పెడితే గుండెకు ప్రమాదం ఉండే అవకాశం మాత్రం లేకపోలేదంటున్నారు హృద్రోగ నిపుణులు. శ్రీదేవి గుండె పోటు మాటల నేపథ్యంలో మెనోపాజ్‌లో వచ్చే కార్డియాక్ డెత్ గురించి అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

ఎవరన్నారు గుండెజబ్బులంటే పురుషులకు మాత్రమే వచ్చేవని! స్త్రీలకు భావోద్వేగాలను భరించే శక్తి ఎక్కువ కాబట్టి ఆమె గుండె గట్టిది అంటుంటారు మనవాళ్లు. అందుకే ఆడవాళ్లకు గుండెజబ్బు వచ్చే అవకాశాలుండవనీ, ఉన్నా అతి తక్కువనీ భావిస్తుంటారు. ఇది చాలా తప్పుడు అభిప్రాయం. నిజానికి స్త్రీలలో వచ్చే క్యాన్సర్ల కన్నా 6 వంతులు ఎక్కువ అవకాశం గుండెపోటుకే ఉంది. 30 ఏళ్లు దాటగానే క్యాన్సర్ అవకాశాలున్నాయేమోననీ క్యాన్సర్ స్క్రీనింగ్‌ల కోసం వెళ్లే మహిళలు గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడంలో మాత్రం ఎందుకో తాత్సారం చేస్తుంటారు. తమ గుండె గట్టిదన్న ధీమాతో ఉంటారు. విద్యాధికులైన మహిళలు కూడా చాలావరకు ఇలానే ఆలోచిస్తుంటారు. అందుకు సినీనటి శ్రీదేవే ఒక ఉదాహరణ.

ఈస్ట్రోజన్ రక్షణ

ఒక రకంగా చెప్పాలంటే స్త్రీ.. జన్మతః ఆరోగ్యవరాలను పొందిందనుకోవచ్చు. కౌమారదశ నుంచి ఆమెలో విడుదలయ్యే ఈస్ట్రోజన్ హార్మోన్ గుండెకు రక్షణ కవచంగా నిలబడుతుంది. అయితే ఈ హార్మోన్ ఉన్నంతవరకే సున్నితమైన ఆమె గుండెకు భరోసా. లేకుంటే మాత్రం మగవారిలో మాదిరిగానే అన్ని రకాల గుండెజబ్బుల రిస్కులూ ఆమెనూ వెంటాడుతాయి. ఫ్యామిలీ హిస్టరీ, ఆహారపు అలవాట్లు, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ లాంటి రిస్కు కారకాలు ఆమెకూ వర్తిస్తాయి.

మెనోపాజ్‌తో పోతుంది భరోసా

స్త్రీల గుండెకు ఈస్ట్రోజన్ రక్షణ కొంతవరకే. ఒకసారి మెనోపాజ్ దశ వచ్చిందంటే ఈ హార్మోన్ స్థాయి తగ్గిపోతుంది. సాధారణంగా 45 ఏళ్ల వయసు దాటిన తరువాత 50 ఏళ్ల వయసులో మెనోపాజ్ వచ్చే అవకాశాలుంటాయి. ఈ దశలో స్త్రీల హార్మోన్ అయిన ఈస్ట్రోజన్ తగ్గుముఖం పడుతుంది. దాంతో గుండె రక్షణ కవచం కరిగిపోతుంది. ఫలితంగా గుండెపోటు అవకాశాలు పెరుగుతాయి. ఇంకా చెప్పాలంటే పురుషుల కన్నా స్త్రీలలో ఒకవిధంగా గుండెపోటు రిస్కు ఎక్కువే ఉంటుంది. ఎందుకంటే వారి రక్తనాళాలు పురుషుల్లో కన్నా సన్నగా ఉంటాయి. కాబట్టి అడ్డంకులు చాలా సులువుగా ఏర్పడుతాయి. దాంతో మహిళల రక్తనాళాల్లో రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడి గుండెపోటు వచ్చే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుంది.



గుర్తించడం కష్టమే!

మెనోపాజ్ తర్వాత మరణిస్తున్న మహిళల్లో ఇందుకు ప్రధాన కారణం గుండెపోటే ఉంటోంది. సాధారణంగా మెనోపాజ్ దశలో ఊపిరాడనట్టుండడం, బలహీనంగా ఉండడం, గుండెదడ, నీరసం లాంటివి ఎక్కువగా ఉంటాయి. స్త్రీలలో గుండె సమస్య ఉన్నప్పుడు కూడా ఇలాంటి లక్షణాలే ఉంటాయి. కాబట్టి చాలామంది వీటిని గుర్తించలేరు. మెనోపాజ్‌లో ఉండే సమస్యలే కదా అనుకుంటారు. అందువల్ల చాలా సందర్భాల్లో తమకు గుండెజబ్బు ఉందన్న విషయాన్నే గుర్తించలేకపోతారు. ఇలాంటప్పుడు చిన్న బ్లాక్ ఉన్నా అది హఠాత్తుగా విచ్ఛిన్నం చెందవచ్చు. దాంతో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి కార్డియాక్ అరెస్ట్ అవుతుంది. ఫలితంగా చనిపోతారు.

అలా కాకుండా క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకుంటే ఇలా అకస్మాత్తుగా గుండెపోట్లకు గురయ్యే అవకాశాలుండవు. అందుకే మెనోపాజ్ దశలోని లక్షణాలను అశ్రద్ధ చేయకూడదు. 40 ఏళ్లు దాటగానే గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలి. అవగాహన ఉన్నవాళ్లు కూడా క్యాన్సర్ల కోసం పాప్ స్మియర్లు, మమ్మోగ్రఫీలు చేయించుకుంటున్నారే గానీ గుండెకు సంబంధించిన టెస్టులు క్రమం తప్పకుండా చేయించుకోవడం లేదు. చాలామందికి మొదటిసారి గుండెపోటు రావడమే ప్రాణాపాయానికి దారి తీస్తున్నది.



డాక్టర్ ఎ. శ్రీనివాస్ కుమార్
చీఫ్ కార్డియాలజిస్ట్
సిటిజన్స్ హాస్పిటల్
హైదరాబాద్

సహజంగా శ్రీదేవి ఆరోగ్యం పట్ల చాలా జాగరూకతతో ఉన్న వ్యక్తి. అయినా ఇలాంటిది జరిగిందంటే లక్షణాలేవీ లేకపోవడం చేత పరీక్షలు చేయించుకుని ఉండదు. ఒక వేళ చేయించుకుని ఉన్నా అప్పుడు బయటపడకపోవచ్చు. శ్రీదేవి బాత్‌టబ్‌లో పడిపోవడం వల్ల మరణం సంభవించిందని కూడా అంటున్నారు. గుండెపోటు వచ్చినప్పుడే టబ్‌లో కూడా పడిపోవడంతో రెండు రకాలుగా ఉక్కిరిబిక్కిరై చనిపోయిందన్నది శ్రీదేవికి దగ్గరగా ఉన్న వ్యక్తుల మాట. ఆమెకు బాత్‌టబ్‌లో పడిపోయాక గుండెపోటు వచ్చిందా, గుండెపోటు వచ్చాక టబ్‌లో పడిందా, అసలు మాసివ్ కార్డియాక్ అరెస్ట్ అవునా కాదా అన్న మీమాంస పక్కన పెడితే మెనోపాజ్ మహిళలకు అవకాశం ఎక్కువగా ఉన్న ఈ గుండెపోటు విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలి. అసలు ఇలాంటివి ఎక్కువగా అర్ధరాత్రి పూటే జరుగుతుంటాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము సమయంలో శరీరంలో హార్మోన్లలో మార్పులు ఉంటాయి. గుండె సమస్య ఉన్నవాళ్లలో అది కొంత పెరుగుతుంది. అడ్రినల్ హార్మోన్ స్థాయిలు పెరుగుతాయి. అందుకే ఆ సమయంలో గుండెపోట్లు ఎక్కువగా ఉంటాయి. మాసివ్ హార్ట్ ఎటాక్‌లు ఎక్కువ.

శ్రీదేవి అనేక సార్లు కాస్మొటిక్ సర్జరీలు చేయించుకుని, వాటికి సంబంధించిన మందులు వాడుతుండడం వల్లనే ఇలా కార్డియాక్ అరెస్ట్ సంభవించిందనే మాట వినిపిస్తోంది. కానీ కేవలం ఆ మందుల వల్ల ఇలా జరగదు. అప్పటికే అథెరోస్క్లోరోటిక్ సమస్య ఉంటేనే గుండె ఇబ్బందిలో పడుతుంది. అంతేగానీ మందుల వల్ల కాదు. సర్జరీ అయిన తరువాత ఎక్కువ రోజులు మంచంలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఉన్నవాళ్లకు అలాంటి అవకాశాలుంటాయి. శ్రీదేవి విషయంలో అలాంటి ఇబ్బందులేవీ లేవు. తను చాలా ఆరోగ్యంగా ఉన్నది. కాబట్టి కాస్మొటిక్ సర్జరీలకు, శ్రీదేవి గుండెపోటుకీ సంబంధం లేదు. కొంతమందికి ఏ లక్షణాలూ లేకుండా సైలెంట్‌గా హార్ట్ అటాక్ అవుతుంది. శ్రీదేవి విషయంలో వీటిలో ఏవైనా కారణం కావొచ్చు.

తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న ఆమెకు ఎంఆర్ఐ తీశారు. మెదడులో గడ్డ ఉందని తేలింది. చకచకా ఆపరేషన్ చేసి, గడ్డ తీసేశారు. ఓ ఏడెనిమిది నెలల వరకు బాగానే ఉంది. మళ్లీ తలనొప్పి మొదలైంది. ఎంఆర్ఐ చేస్తే మళ్లీ గడ్డ కనిపించింది. అలా మళ్లీ ఆపరేషన్ చేశారు... ఇలా ఎన్నిసార్లు ఆపరేషన్ చేస్తారో అని భయం పట్టుకుందామెకు!

మెదడులో ఆపరేషన్ అంటే చాలా సున్నితమైన విషయమే కాదు.. సంక్లిష్టమైంది కూడా. అతి సున్నితమైన మెదడులో గడ్డ ఏర్పడితే దాన్ని పూర్తిగా తొలగించాలంటే కత్తి మీద సామే. గడ్డకు దగ్గర్లో ఉన్న ఏ కీలకమైన నరమో దెబ్బతింటే ఇక అంతే సంగతులు. కంటిచూపు దెబ్బతినడమో, పక్షవాతమో... ఏదైనా రావొచ్చు. అందుకే చాలా సందర్భాల్లో గడ్డ మొత్తం తీయడం సాధ్యం కాదు. అయితే ఇది మొన్నటివరకే. ఇప్పుడా సమస్య లేదు. సర్జరీకి సహకరించే కొత్త ఎంఆర్ఐలు వచ్చేశాయి.



ఆపరేషన్ మధ్యలో స్కాన్

ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ

ఆపరేషన్ థియేటర్‌కీ, ఎంఆర్ఐ స్కానింగ్ గదికీ మధ్యలో ఓ అడ్డుగోడ ఉందంతే! ఆపరేషన్ చేసిన తర్వాత పక్కగదిలోకి కదిలింది పేషెంటు ఉన్న ఆపరేషన్ బల్ల. ఎంఆర్ఐ స్కానర్ కిందకి చేరింది. చకచకా ఎంఆర్ఐ పూర్తయింది. మళ్లీ ఆపరేషన్ థియేటర్‌కి వచ్చింది. మిగిలివున్న గడ్డను కూడా మొదటిసారి ఆపరేషన్ చేస్తున్నప్పుడే విజయవంతంగా తొలగించగలిగారు. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ వల్ల ఇది సాధ్యపడింది.

ఎంఆర్ఐ అంటే..?

మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్‌గా వ్యవహరించే ఎంఆర్ఐ స్కాన్ ద్వారా మెదడులో గడ్డలున్నాయా, మరేమైనా సమస్యలున్నాయా అనే అంశాలను తెలుసుకోవచ్చు. మెదడులోపలి భాగాన్నంతా స్కాన్ చేసి, ఎక్స్‌రే చిత్రాలుగా చూపిస్తుందీ యంత్రం. అయితే దీనిలో అయస్కాంత శక్తిని వాడుతారు కాబట్టి లోహపు వస్తువులేవీ ఎంఆర్ఐ స్కానర్ ఉన్నచోటికి తీసుకెళ్లకూడదు. అందుకే స్కాన్ చేయించుకునేముందు ఒంటి మీద ధరించిన ఆభరణాలను కూడా తీసేయమని చెప్తారు. ఎంఆర్ఐ స్కానర్ ఉన్నచోట ఆపరేషన్‌కి సంబంధించిన పరికరాలు కూడా ఎంఆర్ఐ స్కానర్‌కి కంపాటబుల్‌గా అంటే అయస్కాంతానికి ఆకర్షించని విధంగా ఉండాలి. మెదడు లాంటి సంక్లిష్టమైన శరీర భాగాల లోపలి నిర్మాణాలను ఎంఆర్ఐ చాలా స్పష్టంగా చూపిస్తుంది. మెదడు మాత్రమే కాకుండా వెన్నుపాము సంబంధితమైనవి, క్యాన్సర్ లాంటి వాటికి కూడా ఎంఆర్ఐ స్కాన్ అవసరం అవుతుంది.

వేటికి అవసరం?

- బ్రెయిన్ ట్యూమర్లు
- పిట్యుటరీ సర్జరీలు
- పార్కిన్‌సన్స్ వ్యాధి
- ఎపిలెప్సీ సర్జరీలు
- రక్తనాళ సంబంధిత సర్జరీలు
- పీడియాట్రిక్ బ్రెయిన్ ట్యూమర్లు

ఆపరేషన్ ఇలా...

మెదడులో గడ్డ ఏర్పడి ఏ తలనొప్పితోనో హాస్పిటల్‌కి వచ్చినప్పుడు మెదడుకు ఎంఆర్ఐ చేస్తారు. స్కాన్‌లో గడ్డ ఉందని తెలిసిన తర్వాత ఆపరేషన్ ద్వారా గడ్డను తొలగిస్తారు. అయితే ఈ ఆపరేషన్ ద్వారా గడ్డ ఉన్న చోటికి వెళ్లి, కచ్చితంగా గడ్డ ఏర్పడిన భాగాన్ని తొలగించేందుకు నావిగేషన్ వ్యవస్థ సహకరిస్తుంది. కంప్యూటర్ నావిగేషన్ సహకారంతో గడ్డ ఎక్కడుందో కంప్యూటర్‌లో చూస్తూ ఆపరేషన్‌ను నిర్వహిస్తారు. మెదడులో ట్యూమర్ తీసేసేటప్పుడు సహకరించే ఈ మానిటరింగ్ సిస్టమ్‌ని న్యూరో నావిగేషన్ అంటారు. ఇది జిపిఎస్ లాగా పనిచేస్తుంది. దీనికి ఎన్ఐఎం ఎక్లిప్స్ మానిటర్ అనే వ్యవస్థ కూడా సహకరిస్తుంది. న్యూరోనావిగేషన్ ద్వారా మెదడు లోపల ఉండే భాగాలను స్పష్టంగా చూస్తూ, దాని మార్గదర్శకంలో గడ్డను చేరుకోవచ్చు. అయితే ఇది మెదడులోని క్రియాత్మక నిర్మాణాలను చూపించలేదు. ఎన్ఐఎం ఎక్లిప్స్ మానిటర్ ఈ క్రియాత్మక నిర్మాణాలు అంటే చూపు, కదలికలు, వినికిడి, గుండె స్పందన లాంటి ముఖ్యమైన క్రియలను నియంత్రించే మెదడు భాగాలను కూడా చూపించగలుగుతుంది. కాబట్టి ఆపరేషన్ చేసేటప్పుడు న్యూరోనావిగేషన్, ఎన్ఐఎం ఎక్లిప్స్ మానిటర్‌ల సహాయంతో కీలక నిర్మాణాలు దెబ్బతినకుండా కచ్చితత్వంతో గడ్డను తీసివేయడం సాధ్యమవుతుంది.

ఖరీదు ఎక్కువైనా...

ఆపరేషన్ మధ్యలో ఎంఆర్ఐ చేయాలంటే అనేక అడ్డంకులుంటాయి. ఇలాంటప్పుడు ఆపరేషన్ మధ్యలో కాబట్టి పేషెంటు అనెస్తీషియాలో ఉంటాడు. అనెస్తీషియా యంత్రాన్ని ఎంఆర్ఐ దగ్గరికి తీసుకెళ్లలేం. ఎంఆర్ఐతో కంపాటబుల్‌గా ఉన్న అనెస్తీషియా యంత్రాన్ని ఇంకోటి పెట్టుకోవాలి. సర్జరీ గది నుంచి ఎంఆర్ఐ గదిలోకి మార్చేటప్పుడు సర్జరీ జరిగిన చోట అటూ ఇటూ కదలకుండా ఉండేందుకు బ్రెయిన్ క్లాంప్స్ పెడతారు. లోహపు వాటిని ఎంఆర్ఐ లాగేస్తుంది కాబట్టి నార్మల్‌వి కాకుండా ఈ క్లాంప్స్ బంగారంవి పెట్టాలి. అందువల్ల ఈ బ్రెయిన్ క్లాంప్స్ ఖరీదు కూడా ఎక్కువ. 3 టి ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ ఇలాంటి చాలా సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. మరోవైపు పేషెంట్లకు రెండోసారి ఆపరేషన్ లేకుండా చేస్తుంది. అందుకే ఖరీదు ఎక్కువైనా ఈ యంత్రాన్ని తీసుకువచ్చాం.



- డాక్టర్ జి.యస్. రావు, మేనేజింగ్ డైరెక్టర్, యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్

ఎంఆర్ఐల ప్రస్థానం...

- 1980లలో అమెరికాలో ఎంఆర్ఐ ప్రారంభమైంది. అప్పట్లో ఎంఆర్ఐ స్కానర్ లోపలే ఆపరేషన్ నిర్వహించేందుకు అనుకూలంగా ఉండేది. అయితే ఆపరేషన్‌కి సంబంధించిన పరికరాలన్నీ ఎంఆర్ఐతో మ్యాచ్ అయ్యేవి (కంపాటబుల్)గా ఉండాలి. సర్జన్‌కి ఇరుగ్గా కూడా ఉంటుంది.
- తక్కువ మ్యాగ్నెటిక్ ఫీల్డ్ ఎంఆర్ఐ. ఇది బలహీనమైన మ్యాగ్నెట్. గడ్డ ఏది, కణజాలం ఏది అనేది కనుక్కోవడంలో దీనికి అంతగా స్పష్టత ఉండదు. ఖర్చు మాత్రం ఎక్కువ.
- ఎక్కువ మ్యాగ్నెటిక్ ఫీల్డ్ ఉన్న ఎంఆర్ఐ. ఆపరేషన్ థియేటర్ లోపలే ఎంఆర్ఐ స్కానర్ ఉంటుంది. ఖర్చు ఎక్కువ. అన్నీ ఎంఆర్ఐ కంపాటబుల్‌గా ఉండాలి.
- ఆపరేషన్ అయ్యాక టేబుల్ గుండ్రంగా కదిలి ఎంఆర్ఐలోకి వెళ్తుంది. స్కాన్ అయ్యాక ఎంఆర్ఐ స్కానర్ నుంచి టేబుల్ గుండ్రంగా కదిలి థియేటర్‌లోకి తిరుగుతుంది. మెయింటనెన్స్, ఖర్చూ ఎక్కువ.
- మూవింగ్ మ్యాగ్నెట్. స్కాన్ చేయాల్సిన సమయానికి థియేటర్‌కి వచ్చి ఇమేజ్ తీసి మళ్లీ వెళ్లిపోతుంది. ఇలాంటప్పుడు రెండు గదులు మాగ్నెటిక్ షీల్డ్ చేయాలి. దీనికి మెయింటనెన్స్ ఎక్కువ, ఖర్చూ ఎక్కువ. ఇది అంత ప్రాచుర్యంలోకి రాలేదు.
- మూవింగ్ పేషెంట్ మాడల్. పక్క గదిలో ఎంఆర్ఐ స్కానర్ ఉంటుంది. ఆపరేషన్ అయిన తరువాత పేషెంటు పడుకుని ఉన్న టేబుల్ పై భాగం మాత్రం పక్కకు జరిగి ఎంఆర్ఐ లోపలికి వెళ్తుంది. బయటికి వచ్చాక ఆపరేషన్ కొనసాగుతుంది. ఇది అన్నింటికన్నా ఉత్తమమైన ఎంఆర్ఐగా ఉంది. ఇదీ 1.5 టెస్లా యంత్రం.
- ఇప్పుడు వచ్చింది 3 టెస్లా ఎంఆర్ఐ యంత్రం. ఇది కూడా మూవింగ్ పేషెంట్ మాడల్. అయితే 1.5 టెస్లా యంత్రానికి స్కాన్ కోసం అయిదారు నిమిషాలు పడితే, దీనికి మూడు నాలుగు నిమిషాలు చాలు. దీని స్కాన్‌కి స్పష్టత మరింత ఎక్కువ.



ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ

ఆపరేషన్ చేయడానికి ముందు మెదడులో గడ్డ ఎక్కడుందో కనిపెట్టడానికి ఎంఆర్ఐ చేసినట్టుగానే సర్జరీ అయిపోయిన తర్వాత కూడా మళ్లీ ఒకసారి ఎంఆర్ఐ తీసి, గడ్డ పూర్తిగా పోయిందో లేదో నిర్ధారణ చేసుకుంటారు. ఇలాంటప్పుడు చాలా సందర్భాల్లో గడ్డకు సంబంధించిన అతి కొద్ది భాగం మిగిలివున్నట్టు కనిపిస్తుంది. కాని ఆపరేషన్ అయిపోయింది కాబట్టి అప్పుడేమీ చేయలేం. కొన్నాళ్లకు ఆ గడ్డ పెరిగిన తర్వాత మళ్లీ ఆపరేషన్ చేయాల్సి వచ్చేది.

ఇలాంటి సమస్యలను అధిగమించడానికి వచ్చిందే ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ. దీనిద్వారా ఆపరేషన్ సమయంలోనే మధ్యలో ఎంఆర్ఐ చేసి, గడ్డ మిగిలివుంటే ఆ తరువాతి ఆపరేషన్‌ను కొనసాగించడం సాధ్యమవుతుంది. దీనిద్వారా రెండోసారి ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఏర్పడదు. ఇలా ఆపరేషన్ మధ్యలోనే స్కాన్ చేయగల ఎంఆర్ఐ యంత్రాన్ని ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ అంటారు. ఇప్పటివరకు మన దేశంలో కేవలం 1.5 టెస్లా ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ మాత్రమే అందుబాటులో ఉంది. మొదటిసారిగా ఇప్పుడు యశోదలో 3 టెస్లా ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ వచ్చింది. ఆపరేషన్ గది పక్కనే ఎంఆర్ఐ యంత్రం ఉంటుంది. ఆపరేషన్ థియేటర్‌లో పేషెంటు పడుకున్న బల్లను మాత్రమే ఎంఆర్ఐ యంత్రం దగ్గరికి తీసుకెళ్తారు. వెంటనే అది స్కాన్ చేసేస్తుంది. దాని ఫలితాన్ని బట్టి వెంటనే అదే ఆపరేషన్‌లో భాగంగా గడ్డ ఏదైనా మిగిలివుంటే పూర్తిగా తొలగిస్తారు. లేకపోతే ఇక ఆపరేషన్ పూర్తయినట్టే. ఆపరేషన్ అయిన తరువాత మెదడు మార్పు అవుతుంది. నావిగేషన్ ద్వారా కూడా తప్పు చెప్పొచ్చు. మెదడు షిఫ్ట్ అయిన విషయం నావిగేషన్‌లో అప్‌డేట్ కాకపోవచ్చు. కాని 3టి ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ చేయడం వల్ల ఇలా షిఫ్ట్ అయిన మెదడు భాగాన్ని కూడా సరిగ్గా తెలుసుకోవడం వీలవుతుంది.



డాక్టర్ ఆనంద్ బాలసుబ్రహ్మణ్యం
సీనియర్ న్యూరోసర్జన్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్

శుక్లం ఉంటే ....?!

కంటిలోని లెన్సుల్లో ఉండే ప్రొటీన్ బ్రేక్ డౌన్ కావడం వల్ల లెన్స్‌ల మీద పసుపు లేదా జేగురు రంగు మచ్చలు ఏర్పడుతాయి. అందువల్ల కంటి చూపు సామర్థ్యంలో తేడా వస్తుంది. ఇలాంటి సమస్యనే కంటిలో శుక్లాలు అంటారు. ఇలా శుక్లం ఏర్పడుతున్నపుడు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గమనిస్తే శుక్లాన్ని త్వరగా గుర్తించడానికి వీలవుతుంది.

- కంటి చూపు మసకబారడం
- బల్బులు, ట్యూబ్‌లైట్ల నుంచి వెలువడే కాంతి మరింత కాంతి వంతంగా అనిపించి చూడడానికి ఇబ్బంది కలగడం
- రాత్రి పూట కంటి చూపు స్పష్టంగా లేకపోవడం
- రంగులను స్పష్టంగా గుర్తించలేకపోవడం
- దగ్గరి చూపు బాగా తగ్గిపోవడం

ఈ లక్షణాలు ఇతర కంటి సమస్యల్లో కూడా ఉండొచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.



మధుమేహం.. తెలిసిందెంత?


1 **మీరు అధిక బరువు ఉన్నట్టయితే బరువు ఎంత తగ్గితే మధుమేహం కంట్రోలవుతుంది?**
ఎ. కనీసం 5 నుంచి 10 శాతం
బి. కనీసం 20 శాతం
సి. అదనంగా పెరిగిన బరువు అంతా

2 **వారానికి మూడు సార్లు 30 నిమిషాల నడక సరిపోతుంది.**
ఎ. అవును
బి. కాదు

3 **హెచ్‌బీఏ1సి ఎంతవరకు తగ్గాలన్నది మీ లక్ష్యంగా ఉండాలి?**
ఎ. 20 శాతం కన్నా ఎక్కువ
బి. 15 శాతం కన్నా తక్కువ
సి. 7 శాతం కన్నా తక్కువ

4 **నోటిలో వచ్చే సమస్యలు మధుమేహ సమస్యను తీవ్రం చేస్తాయి.**
ఎ. అవును
బి. కాదు

5 **రక్తంలో చక్కెర పడిపోవడానికి కింది లక్షణాల్లో ఏది సంకేతం కాదు?**
ఎ. వణుకు, కళ్లు తిరగడం
బి. హఠాత్తుగా మూడ్స్‌లో మార్పు
సి. నడుము నొప్పి



జవాబులు

1 ఎ **కనీసం 5 నుంచి 10 శాతం**
రక్తంలో చక్కెరలు తగ్గడానికి బరువు కొంచెం తగ్గినా ఉపయోగకరమే. మీ బరువును బట్టి మీరెంత బరువు తగ్గాలో డాక్టర్‌ని అడిగి ఒక ప్రణాళిక ఏర్పరుచుకోండి. డైటీషియన్ సలహాలు పాటించండి.

2 బి **కాదు**
వారానికి 150 నిమిషాల ఏరోబిక్ వ్యాయామం అవసరం అవుతుంది. వారంలో కనీసం అయిదురోజులు 30 నిమిషాల పాటు ఏరోబిక్స్ చేయాలి. మీ జీవనశైలి చురుగ్గా ఉన్నప్పుడు వాకింగ్ కూడా సహాయకరంగా ఉంటుంది.

3 సి **7 శాతం కన్నా తక్కువ**
గత కొన్ని నెలలుగా మీ రక్తప్రసరణలో గ్లూకోజ్ ఏ మేరకు ఉందో తెలిపేదే హెచ్‌బీఏ1సీ పరీక్ష. ఇది 7 శాతం కన్నా తక్కువ ఉండాలి. ఇది ఎక్కువైన కొద్దీ సమస్యలు పెరుగుతాయి.

4 ఎ **అవును**
టైప్ 2 డయాబెటిస్ ఉన్నప్పుడు అది నియంత్రణలో లేకపోతే చిగుళ్ల వ్యాధులు వస్తాయి. అదేవిధంగా చిగుళ్ల వ్యాధుల వల్ల రక్తంలో చక్కెర పెరుగుతుంది. పైగా అది కంట్రోల్ కావడం కూడా కష్టమే అవుతుంది. అందుకే ప్రతిరోజూ బ్రష్ చేయడంతో పాటు ఫ్లాసింగ్, యాంటిసెప్టిక్ మౌత్ వాష్‌తో పుక్కిళించడం చేయాలి. రెగ్యులర్‌గా దంత పరీక్షలు చేయించుకోవాలి.

5 సి **నడుము నొప్పి**
నడుము నొప్పికి మధుమేహంతో సంబంధం లేదు. మిగిలిన రెండు రక్తంలో చక్కెర తగ్గినప్పుడు కనిపించే లక్షణాలే. ఈ లక్షణాలను బట్టి షుగర్ లెవల్ పూర్తిగా పడిపోకుండా చక్కెర నోట్లో వేసుకోవడమో, తేనె తినడమో, మరేదైనా స్వీటు తినడమో చేయాలి.

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[హైదరాబాద్]
మంగళవారం 27 ఫిబ్రవరి 2018



ఆ పాద ముద్రలు డైనోసార్లవే!

అంతరిక్ష ప్రయోగాల్లో స్వతంత్రంగా వ్యవహరించే అతిపెద్ద పరిశోధనాసంస్థ నాసా (ది నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్). అమెరికా కేంద్రంగా పనిచేసే ఈ అంతరిక్ష పరిశోధనా సంస్థ సాధారణంగా సువిశాలమైన ఆకాశంపైనే దృష్టి కేంద్రీకరించి ఉంటుంది. ప్రత్యేకంగా కొన్ని స్పేస్ ఫ్లైట్ సెంటర్లనూ కలిగి ఉంది. ఎప్పటికప్పుడు అంతరిక్షంలో జరిగే మార్పులపై ఒక కన్నేసి ఉంచుతుంది. తాజాగా నాసా పరిశీలనలో ఆశ్చర్యం గొలిపే విషయాలు బయటపడ్డాయి. డైనోసార్లు, క్షీరదాలకు సంబంధించి ఆసక్తికరమైన విషయాలు గుర్తించింది నాసా. 2012లో నాసాకు చెందిన గోడార్డ్ ఫ్లైట్ స్పేస్ సెంటర్‌లో ఒక శాస్త్రవేత్త పురాతన పాదముద్రికలను కలిగి ఉండి, రాతి పొరతో కప్పబడిన ఒక శ్లాబ్‌ను కనుగొన్నాడు. ఈ రాతిపొరపై అధ్యయనం చేసిన పరిశోధకులు 110 మిలియన్ సంవత్సరాలకు పూర్వమే ఏర్పడిందని గుర్తించారు. ఈ రాతిపొరపై మొత్తం 70 రకాల క్షీరదాలు ఉన్నట్టు నిర్ధారించారు. వీటిలో కొన్ని డైనోసార్లు, సారోపాడ్స్, టిరోసార్స్, థ్రోపోడ్స్‌కు సంబంధించినవిగా, ఇతర చిన్న చిన్న క్షీరదాలు డైనోసార్ యుగానికి చెందినవిగా గుర్తించారు. ఈ పరిశోధన సారాంశం ఎంతో ముఖ్యమైనదిగా నాసా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎందుకంటే వాటిలో కొన్ని క్షీరదాలు నేటికీ ఉనికిలో ఉన్నాయి.

అదొక్కటే ప్రాణాధారం కాదు!



ఆక్సిజన్ అంటే ప్రాణవాయువు. ఈ సృష్టిలో ప్రాణ మున్న ప్రతిజీవికీ ఇదే ప్రాణాధారం. కానీ నాసా శాస్త్రవేత్తలు కొత్త విషయాన్ని గుర్తించారు. అదేమిటంటే?

వేరే గ్రహాల మీద జీవం ఉనికి ఉన్నదా? లేదా? అని తెలుసుకోవడానికి పరిశోధనలు చేసే శాస్త్రవేత్తలకోసం నాసా పరిశోధకులు వెలువరించిన కొత్త పరిశోధన ఆసక్తి విషయాలను తెలియపరిచింది. ఇతర గ్రహాల మీద ప్రాణవాయువు ఉనికి కోసం అన్వేషించడం, దాని వల్లే జీవి మనుగడ సాగుతుందని అనుకోవడం మంచి వ్యూహమే, కానీ ఏదైనా గ్రహం మీద ప్రాణవాయువు ఉంటేనే.. ప్రాణి ఉంటుందనుకోవడం కరెక్ట్ కాదంటున్నదీ పరిశోధన. ఎందుకంటే ఏదైనా గ్రహంపై జీవి మనుగడ సాగించాలంటే ఆక్సిజన్ ఒక్కటే ప్రాణాధారం కాకపోవచ్చన్నది ఈ పరిశోధన సారాంశం. దానికి మరెన్నో జీవరసాయన క్రియలు కూడా కారణం కావొచ్చని చెబుతున్నదీ పరిశోధన. నిజానికి ప్రాణి ఉంటే తప్ప అక్కడ ప్రాణవాయువు ఉండేందుకు ఆస్కారం లేదన్నది నాసా పరిశోధకల బృందం మాట. అయితే అన్ని గ్రహాల్లోనూ అలాంటి పరిస్థితి ఉంటుందని చెప్పలేమంటున్నారు శాస్త్రవేత్తల బృందంలో ఒకరైన జోషువా క్రిస్సన్‌సేన్ టోట్టన్. ఈ విశ్వాంతరాలంలో జీవి సర్వసాధారణమే అయినా, అది ఆక్సిజన్‌ను తయారు చేస్తుందని చెప్పలేమంటున్నారు. ఎందుకంటే ఆక్సిజన్‌కు సంబంధించిన జీవరసాయన క్రియలు చాలా సంక్లిష్టంగానూ, అరుదైనవిగానూ ఉంటాయని చెబుతున్నారు. వివిధ వాయువుల కలయికను గుర్తించేందుకు భూమి చరిత్రను అధ్యయనం చేశారు పరిశోధకులు. ఈ పరిశోధనలో మిథేన్, కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మొనాక్సైడ్‌లను పరిశోధకులు.. వీటి ద్వారా ఆక్సిజన్ ఏర్పడే అవకాశం ఉందని తేల్చారు. అయితే ఈ సృష్టిలోని వాయువులోని పదార్థాలు వివిధ కారణాల వల్ల జీవికి వ్యతిరేకంగానే కనిపిస్తున్నాయని ఈ పరిశోధనలో తేల్చారు. అందుకే ఇతర గ్రహాల్లోనూ ఆక్సిజన్ ఒక్కటే జీవి మనుగడకు సంకేతం కాకపోవచ్చని చెబుతున్నారు. మిథేన్, ఆక్సిజన్‌ల కలయికే అక్కడ జీవి మనుగడకు సంకేతంగా చెప్పవచ్చంటున్నారు. ఆక్సిజన్ వెనుక ఉన్న అసలు వాస్తవాలపై ఈ కొత్త పరిశోధన మరి కొన్ని విషయాలను వెలువరించింది. భూమిపై 2.5 బిలియన్ సంవత్సరాల క్రితం ఈ వాయువు గుర్తించబడనేలేదట. అందుకే ఇతర గ్రహాలపై జీవం ఉనికి కోసం వేట కొనసాగిస్తున్న శాస్త్రవేత్తలు ఆక్సిజన్‌ను కనిపెట్టడంపైనే దృష్టిపెట్టకుండా ఇతర జీవరసాయన క్రియలనూ పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు శాస్త్రవేత్తలు.

భవిష్యత్తులో కాలుష్యం కలిగించని కార్లు, ఇతర వాహనాలు, యంత్రాలు రానున్నాయి. గాలి, వాతావరణ కాలుష్యాల నుంచి రక్షించే దిశగా ఇటీవలే సిఎస్ఐఆర్ – ఎన్ఐసి ఒక పరిశోధన మొదలుపెట్టింది. అది విజయవంతమై మొక్కల్లోని ఆకులలాగా పనిచేసే కృత్రిమ పత్రాన్ని తయారుచేయగలిగింది. ఈ ఆకు సూర్యరశ్మిని వినియోగించుకుని నీటి నుంచి హైడ్రోజన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేయగలదు. తద్వారా పర్యావరణానికి చేటు చేయని ఇంధనం రాబోతున్నది.




పర్యావరణానికి మేలు చేసే

కృత్రిమ ఆకు!



హైడ్రోజన్ సాధారణంగా శిలాజ ఇంధనాల నుంచి స్టీమ్ రిఫార్మింగ్ ద్వారా ఉత్పత్తవుతుంది. ఈ ప్రక్రియలో శక్తి వనరులు మాత్రమే కాకుండా గ్లోబల్ వార్మింగ్‌కి కారణమయ్యే అధిక మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ కూడా వెలువడుతుంది. ఇలాంటి పర్యావరణ సమస్యల దృష్ట్యా హైడ్రోజన్‌ను సహజమైన వనరుల నుంచి ఉత్పత్తి చేయడం అవసరం.

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్– నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ సంయుక్తంగా ఒక కృత్రిమమైన ఆకును తయారుచేశారు. ఇది మొక్కలలోని పత్రాల లాగానే సూర్యరశ్మిని గ్రహించుకుంటుంది. కాని నీటి నుంచి హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పర్యావరణ హితమైన ఇంధనం తయారవగలుగుతుంది. భవిష్యత్తులో కార్లు, ఇతర యంత్రాల కోసం స్వచ్ఛమైన, పర్యావరణానికి హాని చేయని ఇంధనాన్ని అందివ్వవచ్చు. శక్తి,



పర్యావరణ సమస్యలు రెండింటికీ ఇది పరిష్కార మార్గాన్ని చూపిస్తుంది.

ఈ ఆకులోని అతి సన్నని వైర్‌లెస్ ఉపకరణం మొక్కల్లోని సహజమైన ఆకులను అనుకరిస్తుంది. నీరు, సూర్యరశ్మిని ఉపయోగించుకుని శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఈ పరికరంలో సెమికండక్టర్లు సహజమైన పత్ర వ్యవస్థను ప్రేరేపించేలా ఉంటాయి. ఇది మొత్తం 23 చదరపు సెంటీమీటర్ల పరిమాణంలో ఉంటుంది. కాంతి సెమీ కండక్టర్ల మీద పడినప్పుడు ఎలక్ట్రాన్లు ఒక మార్గంలో పయనించి విద్యుత్ ప్రవాహాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఈ విద్యుత్ ప్రవాహం వెంటనే నీటిని వియోగించి హైడ్రోజన్‌ను ఏర్పరుస్తుంది. ఇది స్వచ్ఛమైన ఇంధన రూపం. ఈ ప్రక్రియలో ఒక గంటకి 6 లీటర్ల హైడ్రోజన్ ఉత్పత్తవుతుంది.

కృత్రిమ ఆకు కాంతి గ్రహణ శక్తిని పెంచడానికి గోల్డ్ నానో పార్టికిల్స్, టైటానియమ్ డయాక్సైడ్, క్వాంటమ్ డాట్స్‌ను ఉపయోగించారు. ఈ క్వాంటమ్ డాట్స్ నానోమీటర్ డైమెన్షన్‌లలో సెమీ కండక్టర్ క్రిస్టల్స్‌గా పనిచేస్తాయి. 25 గంటల పాటు సూర్యరశ్మికి ప్రభావితం అయితే చాలు. దీనికి బాహ్యంగా ఎటువంటి వోల్టేజి విద్యుత్తు ఇవ్వనవసరం లేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సోలార్ సెల్స్ కన్నా ఇది మరింత మెరుగైనదిగా భావించవచ్చు.

ఈ పరిశోధన ఫలితాలు ఆన్‌లైన్ జర్నల్ అయిన సైంటిఫిక్ రిపోర్ట్స్‌లో ప్రచురితం అయింది.



చచ్చినా బతికే ఉంటాయ్!

మనిషి చనిపోగానే అంతా అయిపోయిందనుకుంటారు. కానీ ఇది కరెంటు స్విచ్ నొక్కినంత చిన్న విషయమేం కాదంటున్నారు పరిశోధకులు. డెడ్‌బాడీలోని జన్యువులు మాత్రం అంత త్వరగా అంతరించవని చెబుతున్నారు.




మనిషి చనిపోయిన తర్వాత, శరీరంలోని కణాలు ఏం చేస్తాయి? అనే అంశంపై పరిశోధన చేసిన శాస్త్రవేత్తలు ఆసక్తికరమైన విషయాలను కనుగొన్నారు. మరణం తర్వాత కూడా శరీరంలోని జన్యువులు బ్రతికే ఉంటాయని తేల్చారు. జంతువుల్లో మరణం తర్వాత జన్యువులు కొన్ని రోజుల పాటు క్రియాశీలకంగా ఉంటాయని ఇంతకు ముందు పరిశోధనలో కనుగొన్న శాస్త్రవేత్తలు.. తాజాగా మానవ మృతదేహంలోని జన్యువుల క్రియాశీలతపై పరిశోధన చేశారు. సాధారణంగా మనిషి చనిపోయిన తర్వాత శరీరంలోని డీఎన్ఏ బతికి ఉండొచ్చని, ఆర్ఎన్ఏ నశించిపోయి ఉంటుందని అనుకొంటారు. కానీ కొత్త పరిశోధన ద్వారా మృతశరీరంలో ఆర్ఎన్ఏ కూడా స్థిరంగా ఉంటుందనే ఆశ్చర్యపూరితమైన విషయాన్ని వెలువరించారు శాస్త్రవేత్తలు. డెడ్‌బాడీలో బతికి ఉండే ఈ జీన్స్ ద్వారా.. ఇంతకుముందైతే ఆ మనిషికి సంబంధించిన కుటుంబీకులు, తల్లిదండ్రుల వివరాలు తెలుసుకోగలిగేవారు. కానీ మృత శరీరంలోని జన్యువుల ఆధారంగా.. మనిషి చనిపోయిన సమయాన్ని కూడా కచ్చితంగా చెప్పవచ్చని ఈ కొత్త పరిశోధన ద్వారా గుర్తించారు. 500 మృతశరీరాలకు సంబంధించిన దాదాపు 36 అవయాల నుంచి కణజాలాలను సేకరించిన శాస్త్రవేత్తల బృందం .. వారు మరణించిన సమయాన్ని కచ్చితంగా కనిపెట్టగలిగారు. కేవలం తొమ్మిది నిమిషాల వ్యవధిలోనే ఈ విషయాన్ని గుర్తించగలిగారు. సంప్రదాయ పద్ధతిలో అయితే వైద్యపరిశోధకులు.. శరీర ఉష్ణోగ్రతను, శారీరక పరిస్థితిని బట్టి మనిషి చనిపోయిన సమయాన్ని గుర్తిస్తారు. కానీ తాజా పరిశోధనలో శాస్త్రవేత్తలు కుళ్లిపోయిన శరీరంలోని సూక్ష్మజీవుల సముదాయంలో వచ్చే మార్పులను అనుసరించి మనిషి చనిపోయిన సమయాన్ని గుర్తించగలగడం విశేషం. దీని వల్ల మనిషి మరణం తర్వాత కూడా జన్యువులు బతికే ఉంటాయని, క్రియాశీలకంగా పని చేస్తాయని.. వీటి ద్వారా మనిషి ఎన్నేళ్ల క్రితం చనిపోయి ఉంటాడో తెలుసుకోవచ్చని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. అయితే దీనిపై మరిన్ని పరిశోధనలు జరుగాల్సి ఉందని చెబుతున్నారు.

మనుషులకన్నా అవే నయం

మనిషి గొప్పవాడా, మనుషులు సృష్టించిన టెక్నాలజీ గొప్పదా? ఇది చాలా కష్టతరమైన ప్రశ్నే. దీనికి ఆస్ట్రేలియాకు చెందిన శాస్త్రవేత్తల బృందం ఏం చెబుతున్నదో తెలుసా?



సముద్ర తీర ప్రాంతాల్లో రకరకాల పక్షులు జీవిస్తుంటాయి. అక్కడికొచ్చే సందర్శకులను అలరిస్తుంటాయి. ఆస్ట్రేలియాలోని పలు బీచ్‌లలో పక్షులను లెక్కగట్టేందుకు బర్డ్‌వాచర్స్‌ను (పక్షుల పరిశీలకులను) నియమించింది అక్కడి ప్రభుత్వం. సముద్ర పరిసరాల్లో ఉన్న పక్షుల వివరాలను సేకరించే పని అప్పగించింది. అదే సమయంలో కొన్ని డ్రోన్లను కూడా పంపించారు పరిశోధకులు. ఆ పక్షుల ఫోటోలను తీసుకువ్చే ప్రయ త్నం చేశారు. అయితే మనుషులు తీసే ఫోటోల కన్నా డ్రోన్లు తీసిన పక్షుల ఫోటోలే అద్భుతంగా ఉన్నట్టు గుర్తించారు. కొన్ని క్లిష్టపరిస్థితుల్లో బర్డ్‌వాచర్స్ వెనకడుగు వేసినా, డ్రోన్లు ఎంతో స్పష్టమైన ఫోటోలను తీసుకురావడం గమనించారు. అంతేకాదు పక్షులను గుర్తించేలా డ్రోన్లకు ఒక అల్గారిథమ్ కూడా నేర్పించారు. ఆటవిక జంతువుల సంతానోత్పత్తి ప్రదేశాలకు ఏమాత్రం అంతరాయం ఏర్పడకుండా ఆటవిక జీవా ల గణనను తెలియజేస్తున్నదీ డ్రోన్. కొందరు బర్డ్‌వాచర్స్ తీసిన ఫోటోలను, డ్రోన్ కెమెరాతో తీసిన ఫోటోలను వేర్వేరుగా పరీక్షించారు. బర్డ్‌వాచింగ్‌లో మనుషుల కంటే డ్రోన్ కెమెరాలే అద్భుతంగా పనిచేస్తున్నాయని తేల్చారు.



ఈ విశ్వంలో భూమి తప్ప ఇతర ఏ గ్రహంలోనూ జీవి మనుగడ సాగించే పరిస్థితులు లేవు. ఇది ఒకప్పటి మాట. శాస్త్రవేత్తల తాజా పరిశోధనలను అనుసరించి ఓ కొత్త మాట షికారు చేస్తున్నది. అదేమిటంటే..

లగేజీ సర్దుకోవచ్చు!

భూగ్రహం బోర్‌కొడితే మరోగ్రహానికి వెళ్లేందుకు లగేజి సర్దుకోవచ్చట. తాజాగా జరిగిన రెండు పరిశోధనల సారాంశాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. భూమి సైజులో ఉండే మరో ఏడు గ్రహాలు.. జీవి మనుగడ సాగించేందుకు అనువైన వాతావరణాన్ని కలిగి ఉన్నాయట. కొత్త ద్రవ్యరాశి కొలతలను అనుసరించి ఆయా గ్రహాల్లో రాతి ఉపరితలాలు, సున్నితమైన వాతావరణ పరిస్థితులను కలిగి ఉండొచ్చని తెలుస్తున్నది. పరిశోధకులు పరిశీలించిన దాని ప్రకారం ట్రాపిస్ట్–1లోని ఏడు గ్రహాల్లో మూడింటిలో జీవికి ప్రమాదకరమైన వేడి ఉన్నట్టుగా అనిపించడం లేదు. భూమి నుంచి నలభై కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ట్రాపిస్ట్–1లో నాలుగు గ్రహాల్లో కనిపించే సానుకూల పరిస్థితులు మనిషిని భూలోకేతర జీవితం గురించి ఆలోచించేలా చేస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. సాధారణంగా ఒక గ్రహం ద్రవ్యరాశి దాని సాంద్రతను తెలియజేస్తుంది. ఎక్కువ సాంద్రత కలిగి ఉండడమనేది గ్రహం వాతావరణాన్ని కలిగిలేదనడానికి సంకేతం. తక్కువ సాంద్రత కలిగి ఉండడం వల్ల దానిపై హైడ్రోజన్ ప్రభావం ఎక్కువగా ఉన్నదనే సంకేతం కనిపిస్తుంది. సరికొత్త కంప్యూటర్ టెక్నాలజీ ద్వారా ఈ గ్రహాల గురుత్వాకర్షణ బలాల ప్రభావాన్ని లెక్కించిన శాస్త్రవేత్తలు.. ఏడు గ్రహాల ద్రవ్యరాశిలో ముందుకంటే ఎక్కువ కచ్చితత్వాన్ని గుర్తించారు. అందులో ఒకటి శుక్రగ్రహం మాదిరిగా దట్టమైన, మందపాటి వాతావరణం కలిగి ఉన్నట్టు గుర్తించారు. మిగతా ఆరు గ్రహాలు మంచు లేదా మహాసముద్రాలతో జీవి మనుగడకు అనుకూల వాతావరణం కలిగిఉన్నట్టు ఖగోళ శాస్త్రవేత్త సిమన్ గ్రిమ్ చెబుతున్నారు. భూమితో సరిపడే వాతావరణం కలిగి ఉండే గ్రహాల గురించి తెలియడం మంచి అనుభూతిని కలిగిస్తున్నదంటున్నారు.

సుడోకు

డైలీ సుడోకు 139 సమాధానం

6	8	3	1	9	2	4	5	7
9	5	7	8	6	4	1	2	3
4	2	1	7	3	5	6	9	8
5	9	8	4	1	6	7	3	2
7	1	2	9	5	3	8	4	6
3	4	6	2	8	7	9	1	5
1	7	9	5	2	8	3	6	4
8	6	5	3	4	1	2	7	9
2	3	4	6	7	9	5	8	1

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -140

3	9		8			6		
								5
4	5	8		9				
	8		3					
2		9		5		1		4
					4		2	
				2		7	5	8
7								
		5			9		3	6

ట్వీట్

రంగనాథన్ మాధవన్
@ActorMadhavan



భుజానికి సర్జరీ పూర్తయింది. యుద్ధానికి తిరిగి సిద్ధమవుతాను. నాది కుడి చేతివాటం అని అనుకోకండి.



మాధవన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
2,453,136

కామన్‌మ్యాన్ వాయిస్

రైతు సమన్వయ సమితిలు, రైతు సంఘటితం గురించి దేశవ్యాప్తంగా రైతులకు వివరించి దానికి కేసీఆర్ గారు నాయకత్వం వహించి పోరాడితే దేశంలో వ్యవసాయ రంగానికి విప్లవాత్మక మార్పులు వస్తాయి. రైతు తన పంట ధరను తానే నిర్ణయించుకోగలడు. ఇది జరుగాలని ఒక రైతు బిడ్డగా నా ఆకాంక్ష.
–Vijay Thadeboina

చీమలకు చక్కెర, పాములకు పాలు, ఆవులకు మేత, రాతి బొమ్మలకు సైతం నైవేద్యాలనిపెట్టే దేశం మనది. అంతేకాదు ఆకలితో అల్లాడే సాటి మనిషిని కొట్టి చంపే దేశం మనది.
–Sonnaila Krishnaveni Anamika

వెన్నదొంగ, చీరల దొంగ తరాల వెంబడి దేవుడవుతాడు. గుప్పెడు మెతుకుల దొంగ ప్రజాకోర్టులో ఓడి, క్షణాల్లో శవమవుతాడు.
–Aruna Gogulamanda

వైరల్ వీడియో



బోర్డు ఎగ్జామ్స్‌కి ముందు.. ఆ తర్వాత ఈ అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని చేసిన ఈ వీడియో నవ్విస్తుంది. యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతున్న వీడియోను మీరూ చూడండి.

Funny Board Exam Scenes | Hyderabadi Comedy | Warangal Diaries
Total views : 76,062+
Published on Feb 25, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
మంగళవారం 27 ఫిబ్రవరి 2018


ప్రభాస్‌కు జోడీగా..?



అమీజాక్సన్

శ్వేతసుందరి అమీజాక్సన్‌కు తెలుగులో కూడా మంచి ఫాలోయింగ్ వుంది. 'ఎవడు' తర్వాత ఈ అమ్మడు తెలుగు చిత్రంలో నటించలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సుందరి ఓ బంపర్ ఆఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. ప్రభాస్ తాజా చిత్రం 'సాహో'లో అమీజాక్సన్ ఓ కీలక పాత్రలో నటించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. కథానుగుణంగా ఎంతో ముఖ్యమైన ఈ పాత్రలో నటించడానికి అమీజాక్సన్ సుముఖత వ్యక్తం చేసిందని అంటున్నారు. ప్రస్తుతం 'సాహో' చిత్రీకరణ జరుగుతోంది. 'బాహుబలి-2' అఖండ విజయం తర్వాత ప్రభాస్ నటిస్తున్న ఈ సినిమాకోసం అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. శంకర్-ఎహసాన్-లాయ్ సంగీతాన్నందిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కథానాయికగా నటిస్తున్నది. స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉన్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో ప్రభాస్ పాత్ర చిత్రణ మునుపెన్నడూ లేనివిధంగా నవ్యపంథాలో వుంటుందని చిత్ర బృందం చెబుతున్నది. దాదాపు 150కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. త్వరలో దుబాయ్, అబుదాబి, రొమేనియాలో పోరాట ఘట్టాల్ని చిత్రీకరించబోతున్నారు. తాజాగా ఈ సినిమాలో అమీజాక్సన్ నటించబోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సీటీమార్‌లో రవితేజ?



రవితేజ

హరీష్‌శంకర్ దర్శకత్వంలో 'సీటీమార్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కొమ్మలపాటి కృష్ణ నిర్మించబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఇందులో రవితేజ కథానాయకుడిగా నటించబోతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్‌వర్క్ జరుగుతున్నది. ఈ వేసవిలో సెట్స్‌మీదకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గతంలో హరీష్‌శంకర్-రవితేజ కాంబినేషన్‌లో షాక్, మిరపకాయ్ సినిమాలొచ్చిన విషయం తెలిసిందే. హరీష్‌శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు త్వరలో 'దాగుడుమూతలు' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈ సినిమా పూర్తయిన తర్వాతే 'సీటీమార్' సెట్స్‌పైకి వెళ్తుందని తెలిసింది.



'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రంలో అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్

సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఏ ఒక్కరోజు బోర్‌గా ఫీలయిన సందర్భాలు లేవు. వెనక్కి తిరిగి చూసుకుంటే చిత్రసీమలో అప్పడే పదమూడేళ్లు గడిచాయా? అని అశ్చర్యం కలుగుతున్నది. రోజు ఎనిమిది గంటలు పనిచేసే రొటీన్ ఉద్యోగాలతో పోలిస్తే నటనే నా దృష్టిలో బెస్ట్ జాబ్. భిన్నమైన పాత్రలు, కొత్త ప్రదేశాలు, ప్రతిభావంతులైన వ్యక్తులతో పనిచేసే అవకాశం లభిస్తుంది' అని అన్నారు అనుష్క. తెలుగు చిత్రసీమలో వైవిధ్యతకు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చే కథానాయికల్లో అనుష్క ఒకరు. పాత్ర ఏదైనా దానికి వందశాతం న్యాయం చేయడానికే తపిస్తుంటుంది. అదే ఆమెకు అగ్రకథానాయకులతో సమానమైన స్టార్‌ఇమేజ్‌ను తెచ్చిపెట్టింది. బాక్సాఫీస్ సక్సెస్‌లకు చిరునామాగా నిలుస్తూ దక్షిణాదిలో ఓ ప్రత్యేకతను సృష్టించుకున్నది. తన సినీ ప్రయాణం, వ్యక్తిగత జీవిత విశేషాల్ని గురించి 'నమస్తే తెలంగాణ'తో అనుష్క ప్రత్యేకంగా పంచుకున్న ముచ్చట్లివి....

కలలో కూడా ఆ ఆలోచన చేయను!



అనుష్క

తొలి సినిమాను అంగీకరించే సమయానికి నటన పట్ల నాకున్న పరిజ్ఞానం శూన్యం. కథ అంటే ఏమిటో, ఎలా వినాలో కూడా తెలిసేది కాదు. మూడేళ్ల పాటు నాకు తోచినట్లు నటించాను. కొన్నిసార్లు ఏం చేస్తున్నానో? ఎలా నటిస్తున్నానో అర్థమయ్యేది కాదు. నటిగా నాపై ఓ బాధ్యత ఉందని, నన్ను నమ్మి చాలా మంది ఆధారపడ్డారని తెలిసిన తర్వాత నటనలో మెళకువలను నేర్చుకోవడం మొదలుపెట్టాను. నటనలో ఓనమాలు నేర్చుకునే స్థాయి నుంచి నవతరం తారలకు స్ఫూర్తిగా నిలిచే స్థాయికి ఎదుగుతానని కలలో కూడా అనుకోలేదు. మంచి కథలు దొరకడం వల్లే ఈ రోజు మంచి స్థానంలో ఉన్నాను.

ఆ ఆనందమైనా దక్కాలి..

ఓ ప్రేక్షకురాలిగా నా దగ్గరకు వచ్చే కథలను వింటాను. సినిమా చూస్తూ ఎలా ఎంజాయ్ చేస్తామో కథలు వింటున్నప్పుడు అదే అనుభూతి కలగాలని కోరుకుంటాను. ఆ ఆసక్తి లేకపోతే సినిమా చేయను. కొన్ని సార్లు కథ, పాత్రలు నా మనసుకు నచ్చకపోయినా మంచి దర్శకుడు, హీరోతో పనిచేస్తున్నామనే ఆనందమైన దక్కాలి. ఆరెండు లేకుండా నేనెప్పుడు సినిమాల్లో నటించను.

నిత్యవిద్యార్థినే...

నిత్యవిద్యార్థిగా ఉండటం నాకు ఇష్టం. అన్నీ తెలుసుననే అహంతో ఆలోచించను. ఇప్పటికీ మిత్రుల ద్వారానో, ఇతర మార్గాలద్వారానో ప్రతి రోజు కొత్త విషయాలపై అవగాహన పెంచుకుంటుంటాను. ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో అభినయానికి ప్రాధాన్యమున్న ఎన్నో భిన్న తరహా పాత్రల్లో నటించాను. అవే నటిగా నాలో పరిణితిని తీసుకొచ్చాయి. అరుంధతి, వేదం, రుద్రమదేవి, సైజ్‌జీరో ప్రతి సినిమాలో నా పాత్ర కొత్త పంథాలో సాగుతుంది. సమకాలీన తారలతో పోలిస్తే నాకు మాత్రమే విలక్షమైన కథల్లో ఒదిగిపోయే అవకాశం దొరికింది. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని అనుకుంటున్నాను.

> **వంటలో పెద్దగా ప్రావీణ్యం లేదు. మా ఇంట్లో కైలాష్ అనే కుక్ ఉన్నాడు. అతడు బాగా వండుతాడు. అప్పడప్పుడు నేను ప్రయోగాలు చేస్తుంటాను. కానీ అవి నేనే తినాలి. మిగతా వారు తినే సాహసం చేయరు(నవ్వుతూ).**

అదే నా కోరిక..

నటనతో పాటు ఏ పని మొదలుపెట్టినా దాని వల్ల భవిష్యత్తులో నాకు ఏదో ఒక ఉపయోగం ఉండాలని ఎప్పుడూ కోరుకోను. బాధ్యతగా భావించి నాకు అప్పగించిన పాత్రలకు న్యాయం చేయడానికి కష్టపడతాను. 'సినిమాకు నా వల్ల చెడ్డపేరు రాకూడదు. నిర్మాతలు నష్టపోయారు' అనే మాటలు వినకూడదని ఆలోచిస్తాను. నిజాయితీగా శ్రమిస్తాను. అయితే కష్టపడటం వరకే నా బాధ్యత. ఫలితం ఏదైనా సమానంగానే స్వీకరిస్తాను.

సినిమానే సర్వస్వం

ప్రస్తుతం నటన, కొత్త సినిమాలపై నా దృష్టంతా ఉంది. కలలో కూడా దర్శకత్వ బాధ్యతల్ని చేపట్టాలనే ఆలోచన లేదు. అది చాలా కష్టమైన పని. అయితే సెట్స్‌లో దర్శకుడి చర్యల్ని, వారు పనిచేసే విధానాన్ని, పాత్రధారుల నుంచి ఏ విధంగా నటనను రాబట్టుకుంటారనే అంశాల్ని గమనిస్తుంటాను. ఒకేసారి రెండు మూడు పనుల్ని చేయలేను. మల్టీటాస్కింగ్ అంటే తికమకపడతాను. ప్రస్తుతం చేస్తున్న పనిని గురించే ఎక్కువగా ఆలోచిస్తుంటాను. యోగా చేసే సమయంలో నటన గురించి ఆలోచించలేదు. సినిమాల్లో అవకాశాలు వచ్చిన తర్వాత యోగాను పక్కనపెట్టాను. ప్రస్తుతం సినిమానే నాకు సర్వస్వం.

స్వీటీనే..

బయటి ప్రపంచానికే నేను అనుష్కను. ఇంట్లో వారికి మాత్రం స్వీటీనే. ఇంట్లో అడుగు పెడితే స్టార్‌డమ్, ఫ్యాన్‌ఫాలోయింగ్‌లాంటివేవీ గుర్తుకురావు. ఇంటికి సంబంధించిన పనులన్నీ నేనే స్వయంగా చేసుకుంటాను. జనరల్ స్టోర్స్ వెళ్లి నాకు కావాల్సిన వస్తువుల్ని తీసుకుంటాను. సాధారణ జీవితాన్ని గడపటమేనాకు ఇష్టం. హైదరాబాద్ వచ్చినపుడు కొత్తలో ఎలా ఉండేదానినో ఇప్పుడూ అలాగే ఉన్నాను. నాలో ఎలాంటి మార్పు రాలేదు. షూటింగ్‌లు లేకపోతే కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడుపుతుంటాను.

వారే నా సినిమాలకు విమర్శకులు..

నా సినిమాలకు సంబంధించి అమ్మానాన్నలు ఎలాంటి సలహాలు, సూచనలు ఇవ్వరు. ఏ రోజు ఫలానా పాత్ర చేయమని, ఫలాన పాత్ర వద్దని చెప్పలేదు మనసుకు ఏది నచ్చితే అదే చేయమని చెబుతుంటారు. వారే నా సినిమాలకు బిగ్గెస్ట్ క్రిటిక్స్. నా ప్రతి సినిమాను చూసి వారే తప్పొప్పుల్ని విశ్లేషిస్తుంటారు.

మాతృభాషలో నటించాలనుంది.

తెలుగు, తమిళం, మలయాళ చిత్రసీమ ధోరణుల్లో చాలా మార్పులు వస్తున్నాయి. కథలు, సాంకేతికతతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. ఇదొక శుభపరిణామంగా చెప్పవచ్చు. అలాగే నా దృష్టిలో సినిమాకు భాషాభేదాలతో సంబంధం లేదు. ఓ కథను ఎంత అందంగా తెరపై చెబుతున్నామన్నదే ముఖ్యం. అంతేకానీ దానిని ఏ భాషలో చెబుతున్నామన్నది అనవసరం. మాతృభాష తుళులో ఒక్క సినిమానైనా చేయాలన్నది నా కల. ఆ అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను. వ్యక్తిగతంగా డ్రామా, రొమాన్స్, ఫాంటసీ, కార్టూన్ సినిమాలు ఎక్కువగా చూస్తాను.

నిన్ను చూసి వెన్నెలంత అలిగెల్లి పోదా



నాగశౌర్య, సాయిపల్లవి


నాగశౌర్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'కణం'. విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్.వి.ఆర్ సినిమా సమర్పణలో లైకా సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. ఈ చిత్రంలోని 'నిన్ను చూసి ఎన్నెలంత అలిగెల్లి పోదా' అనే గీతాన్ని చిత్రబృందం ఆదివారం విడుదలచేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నాటకీయతకు హారర్ థ్రిల్లర్ అంశాలు మిళితం చేసి రూపొందిస్తున్న చిత్రమిది. ఓ యువజంటతో చిన్నారికి ఉన్న అనుబంధమేమిటి? ఆ చిన్నారి కారణంగా వారు ఎలాంటి సమస్యల్ని ఎదుర్కొన్నారన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో సాగుతుంది. తల్లి పాత్రలో సాయిపల్లవి నటన నవ్యరీతిలో సాగుతూ ప్రేక్షకుల్ని అలరిస్తుంది. శ్యామ్. సి.ఎస్ అద్భుతమైన బాణీలనిచ్చారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిరవ్‌షా, సంగీతం: సామ్ సి.ఎస్, ఎడిటింగ్: ఆంథోని.

చీకటి కోణాలతో...



వెంకటేశ్వరరావు, సాయికృష్ణ, ఆనంద్, పూజాగాంధీ, శ్రీనివాస్‌రాజు

బొమ్మాళి రవిశంకర్, పూజా గాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దండుపాళ్యం-3'. శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణ పెండ్యాల నిర్మిస్తున్నారు. శ్రీనివాస రాజు దర్శకుడు. అర్జున్ జన్యా స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు ఆదివారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, నిర్మాత మల్కాపురం శివకుమార్ సంయుక్తంగా పాటల్ని ఆవిష్కరించారు. పూజా గాంధీ మాట్లాడుతూ 'గత రెండు భాగాలకు భిన్నంగా నా పాత్ర ఛాలెంజింగ్‌గా సాగుతుంది. నా బాడీలాంగ్వేజ్, సంభాషణలు చెప్పే తీరు అన్నీ మార్చుకొని నటించాను' అని తెలిపింది. దండుపాళ్యం గ్యాంగ్ అందరం మరోసారి కలిసి నటిస్తున్న చిత్రమిదని మకరంద్‌దేశ్‌పాండే చెప్పారు. దండుపాళ్యం, దండుపాళ్యం-2 తరహాలోనే ఈ చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముందని, మూసధోరణికి భిన్నమైన ఇలాంటి కథాంశంతో సినిమాలు చేయాలంటే చాలా ధైర్యం కావాలని వి.ఐ.ఆనంద్ చెప్పారు. 'నిర్మాతగా తమ తొలి చిత్రమిది. క్రైమ్ అంశాలతో ఆద్యంతం సహజంగా సాగుతూ థ్రిల్‌ను కలిగిస్తుంది. మార్చి 3న సినిమాను విడుదలచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాతలు పేర్కొన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'యదార్థ సంఘటనల సమాహారంగా ఈ సినిమా సాగుతుందని, ప్రపంచానికి తెలియని ఎన్నో చీకటి కోణాలను ఈ సినిమాలో చూపించబోతున్నాం' అని అన్నారు ఈ కార్యక్రమంలో రవికాలేతో పాటు చిత్రబృందం పాల్గొన్నారు.



రామ్

రామ్‌తో వన్స్‌మోర్

'ఉన్నది ఒకటే జిందగీ' కోసం తొలిసారి రామ్‌తో జోడీకట్టింది అనుపమ పరమేశ్వరన్. ఈ సినిమాలో వీరిద్దరి జంట ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నది. తాజాగా రామ్, అనుపమ పరమేశ్వరన్ కలయికలో మరో సినిమా రాబోతున్నట్లు తెలిసింది. రామ్ కథానాయకుడిగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కనున్నది. దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. త్రినాథరావు నక్కిన దర్శకుడు. మార్చి 8 నుంచి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సోమవారం ట్విట్టర్ ద్వారా రామ్ ప్రకటించారు. ఆయన నటిస్తున్న 16వ చిత్రమిది. రామ్ శైలి మాస్ హంగులతో పాటు కుటుంబబంధాలు, వినోదం, ప్రేమ అంశాల మేళవింపుతో ఈ సినిమా రూపొందనున్నట్లు తెలిసింది. ఈ సినిమాలో రామ్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించనున్నట్లు సమాచారం. అభినయానికి ఆస్కారమున్న పాత్ర కావడంతో చిత్రబృందం ఆమెవైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. ప్రకాష్‌రాజ్ ఈ చిత్రంలో కీలక పాత్రను పోషిస్తున్నారు. ప్రసన్నకుమార్ బెజవాడ కథను అందిస్తున్నారు. ప్రస్తుతం కరుణాకరణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంతో పాటు 'కృష్ణార్జున యుద్ధం' సినిమాలో కథానాయికగా నటిస్తున్నది అనుపమ పరమేశ్వరన్.



అనుపమ పరమేశ్వరన్

47 రోజుల కథ



సత్యదేవ్, పూజాఝవేరి

సత్యదేవ్, పూజా ఝవేరీ, రోషిణిప్రకాష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '47 డేస్'. 'ది మిస్టరీ అన్ ఫోల్డ్స్' ఉపశీర్షిక. ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. దబ్బార శశిభూషణ్‌నాయుడు, రఘుకుంచె, శ్రీధర్ మక్కువ, విజయ్ శంకర్ నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాతలు మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో ముడిపడిన చిత్రమిది. 47 రోజుల్లో ఓ వ్యక్తి జీవితంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి? తనకు ఎదురైన సవాళ్లను అతడు ఎలా అధిగమించాడన్నది ఆసక్తిని పంచుతుంది. ఇటీవలే పూరి జగన్నాథ్ విడుదల చేసిన 'క్యా కరో' గీతానికి చక్కటి స్పందన లభిస్తున్నది. రఘు కుంచె బాణీలు, సత్యదేవ్ నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. త్వరలో ప్రచార చిత్రాన్ని, వేసవిలో సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. రవివర్మ, హరితేజ, ఇర్ఫాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జీకె.

రేపటినుంచి ఇంటర్ పరీక్షలు

- హాల్‌టికెట్లు ఇవ్వని ప్రైవేటు కాలేజీలపై చర్యలు
- హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదు
- ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. దీనికి సంబంధించి ఇంటర్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ట్యూషన్ ఫీజులు చెల్లించలేదన్న కారణంగా కొన్ని ప్రైవేటు జూనియర్ కాలేజీలు విద్యార్థులకు హాల్‌టికెట్లు నిలిపేస్తున్నట్టు తమకు అనేక ఫిర్యాదులు వచ్చాయని బోర్డు అధికారులు తెలిపారు. ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులు ఇబ్బందులకు గురిచేస్తున్న జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకుంటామని బోర్డు కార్యదర్శి ఏ అశోక్ తెలిపారు. విద్యార్థులు https://tsbie.cgg.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని.. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై కాలేజీ ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని, ఈ హాల్‌టికెట్లతో నేరుగా పరీక్షలకు హాజరుకావచ్చని చెప్పారు. ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 9,63,546 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బోర్డు కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూంను ఏర్పాటుచేశారు. అనుమానాల నివృత్తి కోసం విద్యార్థులు 040-24655027 నంబర్‌కు ఫోన్‌చేయవచ్చు.

అటవీ పరిశోధనా కేంద్రం డైరెక్టర్‌గా జీఆర్ రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బిడ్డ, ప్రముఖ అటవీ శాస్త్రవేత్త జీ రాజేశ్వర్‌రావు జబల్‌పూర్‌లోని ప్రతిష్ఠాత్మకమైన ఉష్ణమండల అటవీ పరిశోధనా కేంద్రం (టీఎఫ్ఆర్ఐ) డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టీఎఫ్ఐఆర్‌లో ఏర్పాటైన స్వాగత సభలో ఆయనకు మాజీ డైరెక్టర్, ప్రస్తుత అధిపతి చతుర్భుజ్ బెహెరా, సహచర శాస్త్రవేత్తలు స్వాగతం పలికారు. శాస్త్రవేత్తలు హితగ్రాహుల (స్టేక్‌హోల్డర్స్) ప్రయోజనాల కోసం, సమాజ శ్రేయస్సుకోసం పరిశోధనలు చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జీఆర్ రావు ఇటీవలి వరకు హైదరాబాద్‌లోని సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైలాండ్ అగ్రికల్చర్ (క్రీడా)లో ప్రిన్సిపల్ సైంటిస్టుగా పనిచేశారు. అవిభక్త కరీంనగర్ జిల్లా (నేటి జగిత్యాల జిల్లా)లోని వెల్గటూరు మండలం గుల్లకోట గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రావు తెలుగు మీడియంలో పాఠశాల విద్యను అభ్యసించి, అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. కరీంనగర్‌లోని సైన్స్ జూనియర్ కళాశాల 1977-79 బ్యాచ్‌లో ఇంటర్ చదివిన రాజేశ్వర్‌రావు ఆ తరువాత మహారాష్ట్రలోని అకోలా పీడీకేవీ కాలేజీలో చేరి వ్యవసాయ పట్టభద్రుడయ్యారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని సోలాన్‌లోని డాక్టర్ వైఎస్ పర్మార్ ఉద్యాన అటవీ విశ్వవిద్యాలయంలో పీజీ, అక్కడే పీహెచ్‌డీ చేశారు. 1986లో అగ్రికల్చర్ రీసెర్చ్ సర్వీస్‌లో చేరారు. యూపీలోని ఝూన్సీలోగల అగ్రో ఫారెస్ట్ జాతీయ పరిశోధనా కేంద్రంలో, హైదరాబాద్‌లోని క్రీడాలో వివిధ హోదాల్లో పనిచేశారు. న్యూజిలాండ్, కెన్యాల్లో అగ్రో ఫారెస్ట్రీ రంగంలో శిక్షణ పొందారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 48 పరిశోధనా పత్రాలు ప్రచురించారు. మానవ మనుగడకోసం అడవులను సంరక్షించుకోవాలని, అవసరాలకు బయట ఉన్న వృక్షాలను వాడుకోవాలని ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ సూచించారు.

సృజనాత్మక ఆలోచనల ఆవిష్కరణే జిజ్ఞాస లక్ష్యం

కళాశాలల విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిగ్రీ స్థాయిలోనే విద్యార్థులకు సృజనాత్మక ఆలోచనలతోపాటు పరిశోధనల పట్ల ఆసక్తి, నూతన విజ్ఞాన దృక్పథాల ఆవిష్కరణపై మక్కువ ఏర్పడుతుందని విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. దాని లక్ష్యమే జిజ్ఞాస అని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లోని వనిత మహావిద్యాలయంలో నిర్వహించిన జిజ్ఞాస స్థాయి బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం, సహ విద్యార్థులతో ఆలోచనలను పంచుకోవడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేలా అందరూ కృషిచేయాలని సూచించారు.

వీర్ సావర్కర్‌ను కీర్తిస్తూ చంద్రబాబు ట్వీట్.. వెంటనే తొలగింపు

- బీజేపీతో సంబంధాల్లో తేడా వల్లేనా?

న్యూఢిల్లీ: స్వతంత్ర సమరయోధుడు, హిందూ మహాసభ వ్యవస్థాపకుడు వీర్ సావర్కర్‌ను కీర్తిస్తూ ట్వీట్ చేసిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తర్వాత కొద్దిసేపటికి దాన్ని తొలిగించారు. సోమవారం ఉదయం ఏడుగంటలకు 'ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నాం' అని ట్వీట్ చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆ ట్వీట్ కనిపించకుండా పోయింది. చంద్రబాబు ఆ ట్వీట్‌ను తొలిగించడానికి కారణాలేమిటన్న విషయమై చర్చ జరుగుతున్నది. కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేలో టీడీపీ మిత్రపక్షంగా ఉన్నది. బీజేపీతో సంబంధాలు కటువుగా మారినందువల్లే చంద్రబాబు తన ట్వీట్‌ను తొలిగించి ఉంటారని భావిస్తున్నారు. వీర్ సావర్కర్ వాడుకలోకి తెచ్చిన 'హిందుత్వ' నినాదం.. బీజేపీని ఉన్నత స్థాయికి చేర్చింది. ఆయనను కమలనాథులు స్వాతంత్ర్య సమరయోధుడని కీర్తించినా.. విపక్షాలు విభేదిస్తాయి. సావర్కర్ ఏనాడూ జాతీయోద్యమానికి మద్దతు ఇవ్వలేదని పేర్కొంటాయి. ప్రత్యేకించి 1942లో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన 'క్విట్ ఇండియా' ఉద్యమానికి ఆయన మద్దతు ప్రకటించలేదని విపక్షాలు ఆరోపిస్తుంటాయి.

ఎస్సారెస్పీ వరద కాల్వపై సైఫాన్ నిర్మాణానికి అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాల్వపై వెల్ డ్రెయిన్ సైఫాన్ నిర్మాణానికి పాలనా అనుమతినిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండల పరిధిలోని జగ్గాసాగర్ దగ్గర వరద కాల్వ 43.230 కిలోమీటర్ వద్ద రూ.5.63 కోట్లతో ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. సాధారణంగా ప్రవాహంలో వేగం పెరిగేందుకుగాను కాల్వలో ఒక వంపును ఏర్పాటు చేయడంలో భాగంగా సైఫాన్ నిర్మాణం చేపడుతారు. తద్వారా ఒక్కసారిగా నీరు దిగువకు రావడంతో ప్రవాహంలో వేగం పెరుగుతుంది.

నేటి సర్పంచ్‌ల సమ్మేళనం వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్‌లో మంగళవారం నిర్వహించనున్న సర్పంచ్‌ల సమ్మేళనం వాయిదా వేసినట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నది. అనివార్య కారణాల నేపథ్యంలో సర్పంచ్‌ల సమ్మేళనాన్ని వాయిదా వేశామని, తిరిగి నిర్వహించే తేదీలను తర్వాత ప్రకటిస్తామని అందులో తెలిపారు. ఈ సమ్మేళనంతోపాటు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ములుగు పర్యటన కూడా వాయిదా పడినట్టు వివరించారు.

టీడీఎస్ ఎగవేతపై ఐటీ సీరియస్

- టీడీఎస్ డిఫాల్టర్లపై గురి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్ (టీడీఎస్)ను కేంద్రప్రభుత్వ ఖాతాలో జమచేయని సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదాయపు పన్నుశాఖ అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే 962 మంది డిఫాల్టర్లపై ఐటీ యాక్ట్ సెక్షన్ 276బీ ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్టు ఆదాయపు పన్నుశాఖ తెలంగాణ, ఏపీ చీఫ్ కమిషనర్ బీవీ వినోద్ తెలిపారు. డిఫాల్టర్లకు భారీ జరిమానాతోపాటు కఠిన కారాగారశిక్ష కూడా పడే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

ఎస్టీయూటీఎస్ అధ్యక్ష కార్యదర్శులుగా భుజంగరావు, సదానందంగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బీ భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా సదానందంగౌడ్‌లను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన 71వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడు భుజంగరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్ సాధన కోసం పనిచేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్.. బీజేపీ దొందూదొందే

- ఆది నుంచి అన్యాయం చేస్తున్నది కాంగ్రెస్సే
- రాష్ట్ర నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదు
- పెదవులకు తాళాలు ఎందుకేసుకున్నారు?
- నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఫైర్



సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి అల్లోల, ఎంపీలు గుత్తా, పొంగులేటి, బీబీ పాటిల్

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలంగాణకు మొదటి నుంచి అన్యాయం చేస్తున్నది కాంగ్రెస్సేనని.. కాంగ్రెస్, బీజేపీ రెండూ దొందూదొందేననీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి రాగానే, ఏపీకి ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తామన్న జైరాం రమేశ్ వ్యాఖ్యలు చూస్తే, కాంగ్రెస్ పంథాను మార్చుకున్నట్టు కనిపిస్తలేదన్నారు. తెలంగాణపై పూర్తి వ్యతిరేక వైఖరిని ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానాన్ని, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదు.. మీ పెదవులు ఎందుకు మూసుకున్నారని ప్రశ్నించారు. పార్టీ హైకమాండ్ పట్ల మీ వైఖరి ఏమిటి? స్పష్టత ఇచ్చాకే బస్సు యాత్ర చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనలో అత్యంత వెనుకబడ్డ ప్రాంతమైన తెలంగాణ గురించి మాట్లాడకుండా, ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విభజన హక్కు చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొని, తెలంగాణలోని కాళేశ్వరం(ప్రాణహిత) ప్రాజెక్టును ఎందుకు చేర్చలేదో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని నిలదీశారు. అప్పట్లో పోలవరంతోపాటు కాళేశ్వరానికి జాతీయహోదా కల్పిస్తే.. నేడు ఈ పరిస్థితి ఉండేదా? అని ప్రశ్నించారు. నేడు అప్పులు తీసుకొచ్చి, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని చెప్పారు. అన్నదాతల ఆత్మహత్యలు ఆగాలన్నదే టీఆర్‌ఎస్ ప్రభుత్వ తాపత్రయమని, అందుకే యుద్ధ ప్రాతిపదికన కాళేశ్వరం పనులు చేపడుతున్నామని చెప్పారు.

ప్రజలను ప్రధాని అవమానించారు

పార్లమెంట్ తలుపులు మూసేసి బిల్లు పాస్ చేశారని ప్రధాని మోదీ మాట్లాడటం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాళేశ్వరానికి జాతీయహోదా కల్పించాలని ప్రధానికి సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రులు ఉమాభారతి, నితిన్ గడ్కరీలను తాను కోరినా స్పందనలేదని చెప్పారు. సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్‌తో కలిసి పాల్గొన్నారు.

ఎన్ని యాత్రలు చేసినా కాంగ్రెస్‌ను నమ్మరు

- మంత్రి మహేందర్‌రెడ్డి



పరిగి, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నాయకులు ఎన్ని యాత్రలు చేసినా, ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా పరిగిలోని మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి నివాసంలో మంత్రి మహేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఏం సాధించారని బస్సుయాత్ర చేపడుతున్నారని కాంగ్రెస్ నాయకులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ మునిగిపోయే నావ అని, ఆ పార్టీలో నాయకత్వం లేదని, జిల్లాకో నాయకుడు తానే సీఎం అంటూ చెప్పుకోవడమే ఇందుకు నిదర్శనమని ఎద్దేవాచేశారు. పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి కూడా సీఎం అవుతానంటూ కలలు కంటున్నారని, ఆయన మరోసారి ఎమ్మెల్యే కూడా కారని స్పష్టంచేశారు. సమావేశంలో నాయకులు ఆర్ ఆంజనేయులు, కొప్పుల నాగారెడ్డి, బాబయ్య, సురేందర్‌కుమార్ పాల్గొన్నారు.



సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కే ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌కు ఇదే చివరియాత్ర

జైరాంరమేశ్ వ్యాఖ్యలపై ఉత్తమ్, జానా స్పందించాలి: విద్యుత్, ఎస్సీఅభివృద్ధిశాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలన్న అంశంపై.. బస్సుయాత్రలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ఆ పార్టీ అధిష్ఠానం తమ వైఖరేమిటో చెప్పాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే.. పోలవరానికి జాతీయహోదా ఇస్తామంటూ.. జైరాంరమేశ్ చేసిన ప్రకటనపై ఉత్తమ్‌కుమార్, జానారెడ్డి సమాధానం చెప్పాలని కోరారు. సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ బస్సుయాత్రలతో ప్రజలకు ఒరిగేదేమీలేదన్నారు. ఆ పార్టీకి ఇదే చివరియాత్ర అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్కసీటు కూడా రాదని.. టీఆర్‌ఎస్, మజ్లిస్ పార్టీలు మాత్రమే అసెంబ్లీలో ఉంటాయని చెప్పారు. కోదండరాం పార్టీ కాగితపు పడవలాంటిదని, అందులో చేరాలని ఎవరూ అనుకోరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవని.. అందులో ప్రయాణం చేయలేకనే కాంగ్రెస్ నేతలు పక్క పార్టీలోకి వస్తున్నారని మంత్రి ఎద్దేవాచేశారు. మంచి నావికుడిలా సీఎం కేసీఆర్ నడుపుతున్న పడవను వదిలి.. ఇతర పార్టీల్లో చేరే దుస్థితిలో టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు లేరన్నారు. బీజేపీ నేతలకు రాష్ట్రంలో అధికారంలోకి రాలేమని తెలుసు కాబట్టే రూ.2 లక్షల రుణమాఫీ హామీ ఇస్తున్నారని.. బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలుచేయడంలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కే ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ముఠా గోపాల్ ఉన్నారు.

జైరాం వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా?

కాంగ్రెస్ నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి: ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించాలని కోరుతున్న కాంగ్రెస్ జాతీయ నాయకులు.. తెలంగాణలోని కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల అంశాన్ని లేవనెత్తకపోవడం దురదృష్టకరమని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జైరాం వ్యాఖ్యలను తెలంగాణ కాంగ్రెస్ నాయకులు సమర్థిస్తున్నారా? ప్రజలకు స్పష్టంచేయాలని డిమాండ్‌చేశారు. ప్రాజెక్టులను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు.. తమ బస్సుయాత్రలో ప్రజలకు క్షమాపణ చెప్పుకోవాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రాభివృద్ధి పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధిలేదని, ఏండ్ల తరబడి జరుగుతున్న అన్యాయాన్ని ఆ పార్టీ నేతలు నియంత్రించలేదని విమర్శించారు. బస్సుయాత్రలో ఉన్న కాంగ్రెస్ నేతలు తెలంగాణ అభివృద్ధి పట్ల తమ వైఖరేమిటో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే కృష్ణా, గోదావరి జలాల వినియోగానికి హక్కు ఉన్నప్పటికీ వాటిని వినియోగించలేకపోతున్నామన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకుల ఉదాసీన వైఖరి, బానిసత్వపు రాజకీయాల కారణంగా ఈ రాష్ట్రం అభివృద్ధికి నోచుకోకుండా అన్ని రంగాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్‌పై నిందారోపణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదన్న విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2న ఈసెట్.. 12న పీజీ ఈసెట్ నోటిఫికేషన్లు

- షెడ్యూల్ జారీచేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో లాటరల్ ఎంట్రీ (ద్వితీయ సంవత్సరం ప్రవేశాలు) కోసం ఈ సెట్-2018 పరీక్ష నోటిఫికేషన్‌ను మార్చి రెండున, ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం పీజీ ఈసెట్-2018 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ మార్చి 12న విడుదల చేయనున్నట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. సోమవారం జేఎన్టీయూహెచ్‌లో జరిగిన ఈసెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. ఈసెట్‌కు సంబంధించి మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని, రూ.500 ఆలస్యరుసుంతో ఏప్రిల్ 13 వరకు, రూ.1,000తో ఏప్రిల్ 20 వరకు, రూ.5,000తో ఏప్రిల్ 27 వరకు, రూ.10 వేల ఆలస్యరుసుంతో మే 3 వరకు గడువు విధించామని చెప్పారు. మే 2 నుంచి 7 వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, మే 9న ఈసెట్ ఉంటుందని పాపిరెడ్డి వివరించారు.

పీజీ ఈసెట్‌కు 15 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

పీజీ ఈసెట్‌కు మార్చి 15 నుంచి మే ఒకటి వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. దరఖాస్తుల ఫీజు రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీలకు రూ.500గా నిర్ణయించామని తెలిపారు. రూ.500 ఆలస్య రుసుంతో మే 7 వరకు, రూ.2వేలతో మే 14 వరకు, రూ.5వేలతో మే 21 వరకు, రూ.10 వేల ఆలస్యరుసుంతో మే 26 వరకు గడువు విధించామన్నారు. మే 28 నుంచి పీజీ ఈసెట్ పరీక్షలు ఉంటాయని ఆయన వెల్లడించారు. సమావేశంలో పీజీఈసెట్-2018 కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు, జేఎన్టీయూహెచ్ వీసీ ఏ వేణుగోపాలరెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మే మొదటివారంలోగా అఫిలియేషన్లు పూర్తి

- జేఎన్టీయూహెచ్ వీసీ ఏ వేణుగోపాలరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియ మే మొదటి వారంలోగా పూర్తి చేస్తామని జేఎన్టీయూహెచ్ వీసీ ఏ వేణుగోపాలరెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు, కోర్సులకు అనుమతులిచ్చే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. సోమవారం ఎంసెట్ షెడ్యూల్ విడుదల చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు కాలేజీల్లో గత ఏడాది కంటే ఈ విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య భారీగా తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. 5వేలకు పైగా సీట్లు తగ్గవచ్చని అభిప్రాయపడ్డారు. 2017-18 విద్యాసంవత్సరంలో 19 కాలేజీలు, 2018-19లో 11 కాలేజీలు క్లోజర్స్‌కు దరఖాస్తు చేసుకున్నాయని పేర్కొన్నారు. 2018-19 విద్యాసంవత్సరంలో అన్ని కాలేజీల్లో కలిపి మొత్తం 400పైగా కోర్సులను రద్దు చేసుకుంటున్నాయని తెలిపారు. ఎంటెక్ కాలేజీల సంఖ్యతోపాటు సీట్లు కూడా భారీగా తగ్గుతున్నాయని పేర్కొన్నారు. గత ఏడాదిలో 15 వేల సీట్లు ఉండగా.. ఈ ఏడాది మరో 1,400 సీట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు.

అన్ని రంగాల్లో టెక్నాలజీ

మొదటిపేజీ తరువాయి...

వివరించారు. దేశంలో ఇలాంటి సేవలు అందించనున్న రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పారు. 86 సంవత్సరాల తర్వాత భూరికార్డుల ప్రక్షాళనను ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టారని, నకిలీలను ఏరివేసేందుకు భూములన్నింటినీ ఆధార్ నంబర్‌తో అనుసంధానించబోతున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో ఉంది. ఇదేస్ఫూర్తితో భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చాం. తెలంగాణలో డిజిటల్ మాధ్యమాల ద్వారా దాదాపు 5000 స్కూళ్లలో శిక్షణ ఇస్తున్నాం. ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ అందించేందుకు వేగంగా ముందుకు సాగుతున్నాం. టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ నెట్‌వర్క్ ద్వారా వైద్యరంగంలో ఎలాంటి మార్పులు చేయవచ్చో ఆచరణ రూపంలో చూపించాం. స్థూలంగా 'ఈ' అంటే ఎలక్ట్రానిక్ అని మాత్రమే కాకుండా ఈజీ, ఎఫెక్టివ్, ఎఫిషియెంట్ అనే విధానంతో ముందుకు సాగుతున్నాం' అని మంత్రి తెలిపారు. ఆధార్ గురించి మంత్రి కేటీఆర్ చమత్కరిస్తూ.. 'ఆధార్ సీఈవో గారి మాటల ప్రకారం ఆత్మ అంతటి విశిష్టత ఆధార్ కలిగి ఉంటుంది. పైగా బాలీవుడ్ సినిమాల్లోలాగా ఒకరి స్థానంలోకి మరో నకిలీవ్యక్తి వచ్చిచేరడం ఆధార్ పుణ్యమా అని ఇక ఎంతమాత్రం సాధ్యం కాదంటున్నారు. ఈ విధంగా ఆయన బాలీవుడ్‌కు కథలు దొరకకుండా చేశారు' అన్నప్పుడు సభలో నవ్వులు విరిశాయి.



సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఈ-గవర్నెన్స్ ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి సీఆర్ చౌదరి, మంత్రి కేటీఆర్, సీఎస్ ఎస్కే జోషి, కేంద్ర ఐటీ కార్యదర్శి అజయ్‌ప్రకాశ్ తదితరులు

పథకాలు సక్రమంగా చేరేలా చూడాలి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా ఆలోచనతో ముందుకు సాగుతుంటే ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తున్నారని, డిజిటల్ లావాదేవీలు పెరుగడమే ఇందుకు నిదర్శనమని కేంద్రమంత్రి సీఆర్ చౌదరి తెలిపారు. మూడేండ్ల ఎన్డీఏ పాలనలో ఆధార్ సహాయంతో సుమారు 3 కోట్ల నకిలీ రేషన్ కార్డులను రద్దు చేసి రూ.17 వేల కోట్లు ఆదా చేసినట్లు ఆయన వివరించారు. మేకిన్ ఇండియాకు ప్రోత్సాహం కల్పిస్తూనే ఎఫ్‌డీఐలను సైతం ఆకర్షించేందుకు ప్రధానమంత్రి సారథ్యంలో తమ ప్రభుత్వం కృషిచేస్తున్నదని వివరించారు. ఈ గవర్నెన్స్‌లో పలురాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. తన పరిధిలో ఉన్న వినియోగదారుల వివాదాల పరిష్కారశాఖలో గతంలో సమస్యల పరిష్కారానికి సుదీర్ఘ సమయం పట్టేదని, ఇప్పుడు ఒక ఫోన్‌కాల్ లేదా ఈమెయిల్‌తో నిర్ణీతవ్యవధిలో సమస్య పరిష్కారం అవుతున్నదని తెలిపారు. ఒక రాష్ట్రాన్ని చూసి మరో రాష్ట్రం మెరుగైన విధానాలను అవలంబిస్తున్నదని, ఇది ఆహ్వానించదగిన పరిణామమని కేంద్రమంత్రి చౌదరి అన్నారు. పథకాలు ప్రారంభించి వాటిని వదిలిపెట్టడం కాకుండా సమర్థంగా అమలు చేయడం లక్ష్యంగా ప్రధాని కృషిచేస్తున్నారని వివరించారు. పాలకులు పథకాలను ప్రారంభిస్తారని వాటిని అర్హులకు చేర్చడం అధికారులు, ఉద్యోగుల బాధ్యత అని పేర్కొన్నారు. యూఐడీఏఐ సీఈవో అజయ్‌భూషణ్ పాండే మాట్లాడుతూ ఆధార్ భద్రత విషయంలో అపోహలు అవసరం వద్దన్నారు. 'మానవుల ఆత్మలాగే ఆధార్ కూడా విధ్వంసం కానిది, మార్పు చేయలేనిది' అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాంకేతికంగా ముందున్నదని తెలిపారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి అజయ్‌ప్రకాశ్ సాన్వే మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో టెక్నాలజీ వినియోగం మరింత పెరగాలని ఆకాంక్షించారు. కేంద్ర డీఏఆర్‌పీ, పెన్షన్ల శాఖ కార్యదర్శి కేవీ ఈపన్ మాట్లాడుతూ ఎన్నో కీలక సదస్సులకు హైదరాబాద్ వేదికగా నిలిచిందని ప్రశంసించారు. ఈ-గవర్నెన్స్‌ను విస్తృతస్థాయిలో అమలుచేయడం వల్ల పరిపాలనలో మరిన్ని మార్పులు వస్తాయన్నారు.

మే 2 నుంచి 7 వరకు ఎంసెట్

మొదటిపేజీ తరువాయి...

రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 25 వేల మంది, మధ్యాహ్నం 25 వేల మంది చొప్పున విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 1.5 లక్షల మంది ఈ పరీక్షలకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీకి మే 2, 3 తేదీల్లో, ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి 4, 5, 7 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు దశల్లో పరీక్షలు నిర్వహించనున్నామని వెల్లడించారు. పరీక్షలను టీఎస్‌టీఎస్, టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్‌తో నార్మలైజేషన్ ప్రక్రియ రూపొందించినట్లు పేర్కొన్నారు. గేట్ కోసం అమలుపరుస్తున్న నార్మలైజేషన్ విధానాన్నే ఎంసెట్ కోసం అమలు చేస్తున్నామని తెలిపారు.

మూడు భాషల్లో పరీక్షలు..

ఎంసెట్-2018 ప్రవేశపరీక్షలను తొలిసారిగా మూడు భాషల్లో నిర్వహిస్తున్నామని విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు తెలుగు, ఇంగ్లిష్‌ల్లోనే పరీక్షలను నిర్వహించామని, సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు ఉర్దూలోనూ ప్రశ్నాపత్రాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ సందర్భంగా దరఖాస్తు ధరలను పెంచినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 400, ఇతరులకు రూ. 800 చొప్పున ఫీజును నిర్ణయించినట్లు తెలిపారు. పెరిగిన ధరలు, ఆన్‌లైన్ సేవలు, జీఎస్టీ వల్ల ఫీజు పెంచామని వివరించారు.

విద్యార్థుల ఈ మెయిల్ ఐడీ అనివార్యం..

ఎంసెట్ దరఖాస్తుల్లో విద్యార్థులు ఈ మెయిల్ ఐడీని తప్పనిసరిగా పొందుపరచాల్సి ఉంటుందని తెలిపారు. ఎంసెట్ ద్వారానే బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సులో సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. పరీక్ష నిర్వహణ, ప్రశ్నాపత్రం రూపకల్పనలో తప్పుల్లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. పరీక్షల నిర్వహణకు తెలంగాణలో 10, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తెలంగాణలో హైదరాబాద్ వెస్ట్ జోన్, హైదరాబాద్ నార్త్ జోన్, హైదరాబాద్ సెంట్రల్ జోన్, హైదరాబాద్ సౌత్ జోన్, హైదరాబాద్ ఈస్ట్‌జోన్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్, ఏపీలో కర్నూలు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్టణంలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.



జేఎన్టీయూహెచ్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ టీ పాపిరెడ్డి. చిత్రంలో ఈసెట్, ఎంసెట్ వీసీలు గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య, వీసీ వేణుగోపాలరెడ్డి

షెడ్యూల్ వివరాలు: ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 3 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రూ. 500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 11 వరకు, రూ. 1,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 18 వరకు, రూ. 5,000తో ఏప్రిల్ 24 వరకు, రూ. 10,000తో ఏప్రిల్ 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 20 నుంచి మే ఒకటి వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 9న ప్రాథమిక కీ, తర్వాత ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు.

పరీక్షల షెడ్యూల్: అగ్రికల్చర్, ఫార్మసీ సీట్ల భర్తీకి మే 2, 3 తేదీల్లో, ఇంజినీరింగ్ విభాగంవారికి మే 4, 5, 7 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పరీక్షల నిర్వహణ ఉంటుంది.

మన టీవీలో ఆర్ఆర్‌బీ అభ్యర్థులకు సలహాలు

మంత్రి కేటీఆర్ ఆదేశాలతో నేటినుంచి ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) భర్తీచేస్తున్న ఉద్యోగాల్లో సికింద్రాబాద్ జోన్‌కు సంబంధించిన 13,694 ఖాళీలకు రాష్ట్ర యువత సిద్ధం చేసేందుకు టీ-సాట్ ప్రత్యేక శిక్షణ అందించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ టీ-సాట్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (సీఈవో) ఆర్ శైలేష్‌రెడ్డికి సూచించారు. గ్రామీణ, పేద విద్యార్థులకు సహాయం దేందుకు అనుభవం కలిగిన సిబ్బందితో పాఠ్యాంశాలు బోధించాలని మంత్రి ఆదేశించారని శైలేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు మన టీవీలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా అవగాహన కార్యక్రమాలను అందిస్తామని చెప్పారు. ఆర్ఆర్‌బీ భర్తీ చేస్తున్న ఉద్యోగాల్లో లోకో పైలట్ 3,273, టెక్నీషియన్స్ 3,898, గ్రూప్-డీలో 6,323 ఉద్యోగాలున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇవే కాకుండా ఓపెన్ క్యాటగిరీలో ఇతర జోన్లలో 93,388 ఉద్యోగాలున్నాయని తెలిపారు. మన టీవీలో ప్రసారమయ్యే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ద్వారా అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు 04023553473, 04023551989, టోల్‌ఫ్రీ 18004254038 నంబర్లకు అభ్యర్థులు ఫోన్ చేయవచ్చని శైలేష్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యంపై మరింత నిఘా

171 గోదాముల్లో 1700 సీసీ కెమెరాలు • ప్రతి జిల్లాలో కమాండ్ కంట్రోల్ కేంద్రం
28న సిద్దిపేటలో ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు



సీసీ కెమెరాల నిఘాలో ఉన్న సివిల్ సప్లైశాఖకు చెందిన ఓ గోదాం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రేషన్ బియ్యం అక్రమాలను అరికట్టేందుకు ఇప్పటికే అక్రమార్కులపై పీడీ, క్రిమినల్ కేసులతో చర్యలు చేపట్టిన అధికారులు...గోదాముల నుంచి బియ్యం అక్రమ రవాణా కాకుండా కట్టడి చేస్తున్నారు. రేషన్ సరుకుల తరలింపే లారీలను జీపీఎస్‌తో అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై చెందిన 171 గోదాముల్లో 1700 సీసీ కెమెరాలను ఏర్పాటు ప్రక్రియ కూడా పూర్తికావొచ్చింది. వీటిని ప్రతిజిల్లాలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయనున్నారు. 31 జిల్లాలోని పౌరసరఫరాలశాఖ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుకు సైతం కసరత్తు మొదలైంది. 28న సిద్దిపేటలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. మార్చిలో నిజామాబాద్, వనపర్తి, జోగులాంబ గద్వాల, కరీంనగర్‌తోపాటు మరిన్ని జిల్లాల్లో అందుబాటులోకి రానున్నాయి. వీటన్నింటినీ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు.

రేషన్‌సరుకులపై నిఘా పటిష్టం

ఒక్కో గోదాం దగ్గర 5 నుంచి 10 సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. రేషన్ సరుకుల తరలింపే వాహనాల కదలికలను ప్రత్యక్షంగా వీడియోవాల్‌పై వీక్షించడానికి వీలుగా ఈ కెమెరాలను జిల్లాల్లోని కార్యాలయాలకు అనుసంధానిస్తున్నామని చెప్పారు. 31 జిల్లాల్లోని కమాండ్ కంట్రోల్‌కేంద్రాలను హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కేంద్రానికి అనుసంధానిస్తామని, 30 రోజులపాటు వాటి రికార్డింగ్ బ్యాకప్ నిక్షిప్తమై ఉంటుందన్నారు.

పేద విద్యార్థులకు బాసట

- 90 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యాప్రగతి ద్వారా పేద కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధిస్తాయని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై దృష్టిసారించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ (ఇంటర్మీడియట్, ఆపై చదువులకు) సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నది. 2015-16, 2016-17లఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు లక్ష్యం రూ.4652.37 కోట్లకుగాను రూ.4288.74 కోట్లు చెల్లించారు. ఇప్పటి వరకు 90 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించినట్టు ఆయాశాఖల అధికారులు చెప్పారు. 2017-18 విద్యాసంవత్సరం ముగియకముందే కొందరు విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. ఇప్పటివరకు అర్హులకు రూ.745.20 కోట్ల చెల్లింపు లక్ష్యం కాగా రూ.38.87 కోట్లను విద్యార్థులకు చెల్లించారు. దరఖాస్తు ప్రక్రియ, పెర్చిన దర ఖాస్తుల పరిశీలనను ఆయాశాఖలు నిర్వహిస్తున్నాయి.


మూడేండ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల వివరాలు

సంక్షేమ శాఖ	2015-16 లక్ష్యం	2015-16 చెల్లింపు	2016-17 లక్ష్యం	2016-17 చెల్లింపు	2017-18 లక్ష్యం	2017-18 చెల్లింపు
ఎస్సీ	441.98	430.74	411.86	338.22	126.72	7.81
ఎస్టీ	242.26	237.50	224.20	196.02	74.56	6.30
బీసీ	1177.51	1168.85	1185.70	1025.77	399.94	17.73
దివ్యాంగులు	0.38	0.21	0.26	0.00	0.03	0.00
ఈబీసీ	268.68	267.55	238.40	222.70	84.99	6.75
మైనారిటీ	230.79	228.31	230.37	172.82	58.96	1.28
మొత్తం	2361.58	2333.16	2290.79	1955.53	745.20	38.87

ఎక్సైజ్..రవాణా ఆదాయాల్లో జోష్

- గత ఏడాది కంటే పదిశాతం పెరిగిన రాబడి





హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎక్సైజ్..రవాణా శాఖలు ఆదాయంలో దూసుకుపోతున్నాయి. ఎక్సైజ్‌శాఖకు 2017-18 సంవత్సరానికిగాను జనవరివరకు రూ.14,500 కోట్లు ఆదాయం చేకూరింది. గత ఏడాది కంటే ఈ ఏడాది 10 శాతం అధికంగా రెవెన్యూ రాబట్టింది. 2016-17లో రూ. 14,200 రాబడిని ఎక్సైజ్‌శాఖ మార్చి 31 వరకు రాబట్టింది. ఇందులో 2.75 కోట్ల లిక్కర్ పెట్టెలను, 3.45 కోట్ల బీరు పెట్టెలను విక్రయించింది. 2017-18లో జనవరి 31 వరకు 2.60 కోట్ల లిక్కర్ పెట్టెలు, 3.60 కోట్ల బీరు పెట్టెలను విక్రయించింది. వీటి ద్వారా రూ. 14,500 కోట్ల ఆదాయం వచ్చింది. మరో రెండునెలల్లో రూ. 3 వేల కోట్లు ఆదాయం సమకూరే అవకాశమున్నదని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మార్చిలో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉండటం వల్ల బీర్ల విక్రయాలు ఊపందుకొనే అవకాశమున్నది.

రవాణాశాఖ ఆదాయం రూ.2700 కోట్లు

రవాణాశాఖ ఆదాయం రూ.2700.98 కోట్లకు చేరుకున్నది. 2017-18 రవాణాశాఖ ఆదాయం టార్గెట్ రూ. 3,400 కోట్లుగా ఉంది. ఇందులో 2018 జనవరి 31 వరకు రూ.2700.97 కోట్లు వసూలు చేసి 93.94 శాతం పెరుగుదలను నమోదుచేసింది. రవాణాశాఖ ఆదాయంలో ఐదు క్యాటగిరీలుగా ఆదాయ వనరులను విభజించి టార్గెట్‌ను నిర్ధారించింది. ఇందులో దాదాపు 93 శాతం చేరుకున్నట్టు అధికారులు వెల్లడించారు. మూడు నెలల వాహన పన్ను (క్వార్టర్లీ ట్యాక్స్) ద్వారా రూ.389.55 కోట్లు వసూలు చేసింది. లైఫ్‌ట్యాక్స్ ద్వారా రూ.1708.99 కోట్లు, రవాణాశాఖలో వివిధ కాల ఫీజుల ద్వారా 336.54 కోట్లు, సర్వీస్ ట్యాక్స్ ద్వారా రూ.97.28 కోట్లు, తనిఖీల ద్వారా 168.62 కోట్ల ఆదాయం వచ్చింది. మరో రెండు నెలలకుగాను అన్నిరకాల ట్యాక్స్‌లకు సంబంధించి మరో రూ.300 కోట్ల ఆదాయం సమకూరే అవకాశాలున్నట్టు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రంలో కర్ణాటక మీడియా బృందం

నేడు, రేపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ పనుల పరిశీలన
28న బాధిత జర్నలిస్టులకు చెక్కుల పంపిణీ • తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ వెల్లడి



సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణను కలుసుకున్న కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్దరాజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్దరాజు ఆధ్వర్యంలోని మీడియా బృందం రెండురోజుల రాష్ట్ర పర్యటన కోసం సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నట్టు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పనులు, సంక్షేమ పథకాల అమలు పరిశీలనతోపాటు తెలంగాణ మీడియా అకాడమీ కార్యక్రమాల గురించి తెలుసుకోవడానికి ఈ బృందం వచ్చిందని అన్నారు. మెదక్ జిల్లా కోమటిబండలో మిషన్ భగీరథ పనులు, సుందిళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులు, కన్నెపల్లిలో పంప్‌హౌజ్, రామడుగులో సర్జికల్‌పూల్‌ను మంగళవారం ఈ బృందం పరిశీలిస్తుందని, కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహిస్తుందని ఆయన వెల్లడించారు. బుధవారం ఉదయం టీ- హబ్‌ను సందర్శించిన అనంతరం తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీలో పాలకమండలి సభ్యులతో భేటీ బృందం అవుతుందని చెప్పారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన 74 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసే కార్యక్రమంలో కర్ణాటక మీడియా అకాడమీ బృందం పాల్గొంటుందని అల్లం నారాయణ వివరించారు.



• రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి తెప్పోత్సవం

తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం రుక్మిణి సమేతంగా శ్రీకృష్ణస్వామి వారు తెప్పలపై భక్తులకు అభయమిచ్చారు. ఉత్సవమూర్తులను తొలుత ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై స్వామివారు ఆసీనులై పుష్కరిణిలో మూడుసార్లు విహరించారు. - తిరుమల, నమస్తే తెలంగాణ

సీబీఐ దర్యాప్తునకు బ్యాంకు అధికారుల సాయం

డిప్యూటేషన్‌పై నియామకానికి రంగంసిద్ధం
క్లీన్ చిట్ ఉన్న 25 మంది అధికారులకు అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాంకింగ్, ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో వేగం పెంచేందుకు సీబీఐ కొత్త పంథాను ప్రారంభించింది. కేసుల దర్యాప్తులో జాప్యాన్ని దృష్టిలో పెట్టుకొని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో పనిచేస్తున్న సీనియర్ల సహాయం తీసుకోవాలని నిర్ణయించింది. ఇప్పటివరకు సీబీఐ దర్యాప్తులో నిపుణుల సహాయం తీసుకుంటూ నెట్టుకువస్తున్నది. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలుకనున్నది. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో నిజాయితీగా పనిచేస్తున్న అధికారులను వారి ఆసక్తి ఆధారంగా డిప్యుటేషన్‌పై నియమించుకోవాలని సీబీఐ నిర్ణయించింది. వీరికి కొంతకాలం శిక్షణ ఇచ్చి, ఆర్థిక, బ్యాంకింగ్ కేసుల దర్యాప్తుల్లో సహాయం తీసుకోవాలని సీబీఐ కార్యాచరణ రూ పొందించింది. ఈ మేరకు అన్ని పబ్లిక్ సెక్టార్ల బ్యాంకుల చైర్మన్లు, ఎండీలకు సీబీఐ డిప్యూటీ డైరెక్టర్ అనీశ్‌ప్రసాద్ ఈ నెల ఆరున లేఖ రాశారు. 25 మంది సీనియర్లను తొలుత నియమించుకోనున్నారు. ఆసక్తి ఉన్న అధికారులు దరఖాస్తు చేసుకోవాలని సీబీఐ కోరింది. వీరు డిప్యూటేషన్‌పై మూడేండ్లు పనిచేయాలని, అవసరమైతే మరో రెండేండ్లు పెంచే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

టీఆర్టీ ఎస్ఏ పరీక్ష ప్రశాంతం


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్టీలో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్ సబ్జెక్ట్), మధ్యాహ్నం నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ గణితం, సాంఘికశాస్త్రం (ఇంగ్లిష్ మీడియం) పరీక్షలు ప్రశాంతంగా పూర్తయినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఉదయం సెషన్‌లో 66.9 శాతం, మధ్యాహ్నం 70.8 శాతం హాజరు నమోదైనట్టు వివరించింది. మంగళవారం ఫిజికల్ సైన్స్, లాంగ్వేజ్ పండిట్ (ఉర్దూ, మరాఠీ, హిందీ) సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నట్టు కమిషన్ కార్యదర్శి వెల్లడించారు.

భాషాపండిట్ ప్రవేశాలకు ఎల్పీసెట్ నిర్వహించాల్సిందే

- మార్చి 15వ వరకు గడువు ఇచ్చిన హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు, హిందీ, ఉర్దూ పండిట్ కోర్సుల ప్రవేశాలకు భాషా పండితుల కామన్ ప్రవేశ పరీక్ష (ఎల్పీసెట్)ను నిర్వహించాల్సిందేనని ఉమ్మడి హైకోర్టు స్పష్టంచేసింది. ఆరువారాల్లో ఎల్పీసెట్ నిర్వహించాలని ఏకసభ్య ధర్మాసనం జారీచేసిన ఆదేశాలను సవాల్‌చేస్తూ రాష్ట్ర పాఠశాల విద్యశాఖ దాఖలుచేసిన అప్పీల్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. మార్చి 15వ తేదీ వరకు ఎల్పీసెట్‌ను నిర్వహించడానికి అవకాశమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఎల్పీసెట్‌ను నిర్వహించకపోవడాన్ని సవాల్ చేస్తూ 2016లో హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ఏకసభ్య ధర్మాసనం.. ఆరువారాల్లోగా పరీక్షలను నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. దానిపై గత ఏడాది రాష్ట్ర విద్యాశాఖ అప్పీల్ దాఖలుచేసింది. భాషా పండిట్ కోర్సులు కేవలం 9 నెలల కాలవ్యవధితో మాత్రమే ఉన్నాయని, ఆ సమయంలో ఇతర ఉపాధ్యాయ శిక్షణ కోర్సుల కాలపరిమితి రెండేండ్ల వరకు ఉన్నాయని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. భాషా పండిట్ కోర్సు విద్యాప్రమాణాలను పెంచే ఉద్దేశంతో కోర్సులను రెండేండ్లు చేయాలనే ప్రతిపాదన ఉన్నదని తెలిపింది. ఈ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. ఎన్‌సీటీఈ నిబంధల ప్రకారం ప్రస్తుతం భాషాపండిట్ కోర్సు కాలవ్యవధి తొమ్మిది నెలలు మాత్రమేనని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఎల్పీసెట్‌ను నిర్వహించాలనే ఏకసభ్య ధర్మాసనం జారీచేసిన ఆదేశాలను పాటించాల్సిందేనని స్పష్టంచేసింది.

కృష్ణాబోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వైకే శర్మ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా వైకే శర్మ సోమవారం జలసౌధలోని బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఇతర ఇంజినీర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

25న సకల ఉద్యోగుల మహాసభ

- విజయవంతం చేయాలని కారం రవీందర్‌రెడ్డి పిలుపు

సుల్తాన్‌బజార్: సీపీఎస్‌కు వ్యతిరేకంగా మార్చి 25న నిర్వహించే సకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ఉద్యోగులకు పిలుపునిచ్చారు. సోమవారం టీఎన్జీవోకు అనుబంధంగా పనిచేస్తున్న వివిధశాఖల ఫోరం సమావేశం నాంపల్లిలోని టీఎన్జీవో కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్ సమస్య ఉద్యోగులందరిది అని చెప్పారు. అందరూ కలిసి కేంద్రం అమలుచేస్తున్న పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దుచేసేందుకు ఉద్యమించాలని కోరారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల్లో 20 శాతం ఇంటి అద్దె అలవెన్సు చెల్లించడంతోపాటు పీఆర్సీ కమిషనర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్, సహ అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, కోశాధికారి రేచల్, ఉపాధ్యక్షులు రామినేని శ్రీనివాసరావు, ఎస్ రాజయ్యగౌడ్, కార్యదర్శి కొండల్‌రెడ్డి, మారం జగదీశ్వర్, అమరనేని రామారావు, 36 డిపార్ట్‌మెంట్ ఫోరంల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్నిమాపకశాఖ ఆకస్మిక తనిఖీలు

- స్కూళ్ల భవనాల యజమానులపై కేసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అగ్నిమాపకశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలుజిల్లాల్లో 15 విద్యాసంస్థల భవనాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మూడు భవనాల యజమానులపై, పాఠశాల నిర్వాహకులపై అగ్నిమాపకశాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. చిన్నచిన్న సమస్యలు ఉన్న 12 భవనాల విషయంలో పలు సూచనలు చేశారు. ఖమ్మం జిల్లా వైరా సుందరయ్యనగర్‌లో ఉన్న మధు విద్యాలయం, ఆదిలా బాద్‌లోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న మదర్స్ కేర్ హైస్కూల్ భవనం, కరీంనగర్‌లోని విద్యానగర్‌లో ఉన్న నందిని కాన్వెంట్ స్కూల్ భవనాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడంతోపాటు అగ్నిమాపకశాఖ ప్రమాణాలు పాటించలేదని తనిఖీల్లో వెల్లడైంది.

సెన్సెక్స్	నిఫ్టీ
34,446	10,583
↗ 304	↗ 91

ముడి చమురు (బ్రెంట్) ↘ 67.21 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,750
22 క్యారెట్లు	30,600
వెండి (కిలో)	38,610

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.83	68.21
బహ్రెయిన్ దినార్	159.32	183.57
కువైట్ దినార్	178.44	222.12
సౌదీ రియాల్	15.64	18.54
యూఏఈ దిర్హామ్	16.01	18.71

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	70.00
రిటైల్ లైవ్	92.00
డ్రెస్డ్	133.00
స్కిన్‌లెస్	152.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	355-00
రంగారెడ్డి	355-00
మెదక్	355-00
కరీంనగర్	357-00
వరంగల్	357-00
రిటైల్ ప్రైస్	4-15

నీరవ్ విదేశీ ఆస్తులపై ఈడీ దర్యాప్తు

■ మార్గం సుగమం చేసిన పీఎంఎల్ఏ కోర్టు ■ రెగోరేటరీ లెటర్ల జారీకి అంగీకారం




ముంబై, ఫిబ్రవరి 26: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన రూ.11,400 కోట్ల భారీ కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్.. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులైన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మామ, గీతాంజలి జెమ్స్ గ్రూపు సంస్థల అధినేత మెహుల్ చోక్సీకి విదేశాల్లో గల ఆస్తులు, వ్యాపారాలపై దృష్టి సారించింది. వీటికి సంబంధించిన వివరాలను రాబట్టేందుకు వీలుగా వివిధ దేశాలకు రెగోరేటరీ లెటర్లను (ఎల్ఆర్‌లను) జారీ చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం ముంబైలోని కోర్టును ఆశ్రయించడంతో అందుకు న్యాయస్థానం అంగీకరించింది. ఒక సార్వభౌమ దేశంలోని న్యాయస్థానం మరో సార్వభౌమ దేశంలోని న్యాయస్థానానికి చేసే విజ్ఞప్తినే రెగోరేటరీ లెటర్ అంటారు. హాంకాంగ్, అమెరికా, బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దక్షిణాఫ్రికా, సింగపూర్ తదితర దేశాల్లో నీరవ్ మోదీకి సంబంధించిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు, పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించిన పత్రాలను, ఇతర ఆధారాలను సేకరించేందుకు ఎల్ఆర్‌లను జారీ చేయాలని మనీ లాండరింగ్ నిరోధక కోర్టును కోరినట్లు ఈడీ వెల్లడించింది.

నోస్ట్రో లావాదేవీల వివరాల ఇవ్వండి..

కాగా, నీరవ్, చోక్సీలకు పీఎన్‌బీ ఇచ్చిన 293 తప్పుడు అండర్‌టేకింగ్ లెటర్లను (ఎల్‌వోయూలను) ఆధారంగా చేసుకుని ఆ బ్యాంకుకు చెందిన నోస్ట్రో (విదేశీ) ఖాతాల్లో జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలను అందజేయాలని ఐదు బ్యాంకుల ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లకు సీబీఐ స్పష్టం చేసింది. తప్పుడు ఎల్‌వోయూలను ఆధారంగా చేసుకుని పీఎన్‌బీ నోస్ట్రో ఖాతాలో కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ విదేశీ శాఖలు రూ.11,400 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని జమ చేయడంతో ఆ లావాదేవీల వివరాలను సమర్పించాల్సిందిగా సీబీఐ లేఖలు రాసినట్లు అధికారులు వెల్లడించారు.

పీఎన్‌బీ ఎండీకి ఈడీ సమన్లు

పీఎన్‌బీలో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణానికి సంబంధించి ఈడీ తాజాగా పీఎన్‌బీ ఎండీ, సీఈవో సునీల్ మెహతాకు సమన్లు జారీ చేసింది. అంతేగాక, ఈ స్కాంలో పలు కీలక సమాచారాన్ని సేకరించడానికి ఈడీ.. బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీ బ్రహ్మాజీ రావును ప్రశ్నించింది. కాగా, నీరవ్‌కి చెందిన 173 పెయింటింగ్‌లు, ఆర్ట్‌వర్క్‌లను ఐటీ శాఖ జప్తు చేసింది.



ఓబీసీ అతితెలివి!

సింభౌలీ కేసులో మోసగాళ్లకే మళ్లీ అప్పు • ప్రధాన నిందితుల్లో పంజాబ్ సీఎం అల్లుడు గుర్పాల్ సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: సంక్షోభంలో చిక్కుకున్న దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని.. కొందరు బ్యాంకర్ల అతితెలివి కోలుకోకుండా దెబ్బతీస్తున్నది. మొండి బకాయిల ఊబిలో పీకల్లోతు కూరుకుపోయిన ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పరిస్థితైతే 'గొర్రె కసాయి వాడినే నమ్ముతుంది' అన్నట్లుగా తయారైంది. వరుస కుంభకోణాలు వెలుగుచూస్తున్న వేళ.. బ్యాంకుల అమాయకత్వాన్ని మోసగాళ్లు ఎలా క్యాష్ చేసుకున్నారో తెలుస్తుంటే నవ్వాలో.. ఏడ్వాలో తెలియని దుస్థితి. అవును.. ఓసారి అప్పు తీసుకుని ఎగ్గొట్టినవాడికే పాత బకాయిని తీర్చేందుకు కొత్తగా మళ్లీ రుణాన్ని మంజూరు చేసింది ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ). ఉత్తర ప్రదేశ్‌లోని హాపూర్‌కు చెందిన సింభౌలీ షుగర్స్ లిమిటెడ్‌కు 2011లో రూ.148.60 కోట్ల రుణాన్ని ఓబీసీ మంజూరు చేసింది. 5,762 మంది చెరకు రైతుల కోసం ఇచ్చిన ఈ రుణంలో ఎక్కువ మొత్తాన్ని సంస్థ పక్కదారి పట్టించింది. దీంతో రూ.97.85 కోట్ల వసూలు ప్రశ్నార్థకంగా మారగా, దీన్ని చెల్లించేందుకు మరో రూ.109.08 కోట్ల కార్పొరేట్ రుణాన్ని 2015 జనవరి 28న సదరు సంస్థకే బ్యాంక్ ఇవ్వడం గమనార్హం. ఈ రెండింటినీ సింభౌలీ ఎగ్గొట్టింది. ఈ క్రమంలో తొలి పద్దును 2015 మార్చి 31న మొండి బకాయిగా ప్రకటించిన ఓబీసీ.. ఇదే ఏడాది మే నెలలో రూ.97.85 కోట్ల మొండి బకాయి మోసాన్ని గుర్తించింది. పాత పెద్ద నోట్లు రద్దైన 20 రోజుల తర్వాత 2016 నవంబర్ 29న మలి విడుత కార్పొరేట్ రుణాన్నీ నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ)గా ప్రకటించింది. రెండుసార్లు రుణాలు మంజూరు చేయడం, రెండో రుణం జారీ అయిన రెండు నెలల్లోపే తొలి రుణాన్ని మొండి బకాయిగా ప్రకటించడం వంటివి సింభౌలీతో బ్యాంక్ అధికారులు కుమ్మక్కై ఉంటారన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. ఏదిఏమైనా ఓబీసీ అతితెలివి వికటించింది. పద్దు పుస్తకాల్లో పాత బకాయిలను చెరిపేసేందుకు కొత్త రుణాల్ని వాడుకుందామనుకున్న బ్యాంక్ అధికారులు బొక్కబోర్లాపడ్డారు.

2015లోనే సింభౌలీపై సీబీఐ కేసు

సింభౌలీ షుగర్స్.. తమ పాత మొండి బకాయిదారేనని ఓబీసీ స్పష్టం చేసింది. రూ.148.60 కోట్ల రుణానికి సంబంధించి జరిగిన మోసంలో 2015 సెప్టెంబర్ 3న సింభౌలీపై సీబీఐ తొలి కేసును నమోదు చేసిందని తెలిపింది. తాము అదే సంస్థకు ఇచ్చిన రూ.109.08 కోట్ల కార్పొరేట్ రుణం ఎగవేతపై 2017 నవంబర్ 17న మళ్లీ సీబీఐని ఆశ్రయించినట్లు సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు బ్యాంక్ వివరించింది. దర్యాప్తులో అంతర్భాగంగానే ఆదివారం తాజా కేసులు నమోదైనట్లు పేర్కొన్నది. పాత ఎన్‌పీఏకు సంబంధించిన వివరాల్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు తెలియపరిచామన్నది. కాగా, ఓబీసీకి దాదాపు రూ.210 కోట్ల నష్టం కలిగించారన్న దానిపై కొందరు బ్యాంక్ అధికారులతోపాటు దేశంలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారాల్లో ఒకటైన సింభౌలీ షుగర్స్, దాని ఉన్నతాధికారులపై సీబీఐ కేసుల్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా హాపూర్‌తోపాటు నొయిడాల్లో ఒక్కొక్క చోట, ఢిల్లీలో ఆరు చోట్ల ఉన్న సంస్థ కార్యాలయాలు, అధికారుల ఇండ్లలో సీబీఐ సోదాలు కూడా నిర్వహించింది. సంస్థ సీఎండీ గుర్మిత్ సింగ్ మన్, డిప్యూటీ ఎండీ గుర్పాల్ సింగ్, సీఈవో జీఎస్‌సీ రావు, సీఎఫ్‌వో సంజయ్ తప్రియా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుర్సిమ్రాన్ కౌర్ మన్‌సహా మరో ఐదుగురు నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, బ్యాంక్ అధికారుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పెట్టింది. ఇందులో గుర్పాల్ సింగ్.. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ అల్లుడు కావడం గమనార్హం.

లుకౌట్ నోటీసులు

మరోవైపు ఈ కేసులో నిందితులపై సీబీఐ లుకౌట్ నోటీసులను జారీ చేసింది. నలుగురు డైరెక్టర్లు విదేశాలకు పారిపోకుండా దేశంలోని అన్ని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను అప్రమత్తం చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. వీరి రాకను అడ్డుకోవాలని, ఈ సమాచారాన్ని తమకు తెలియపరుచాలని సదరు నోటీసుల్లో అన్ని పోర్టులకు సందేశాలిచ్చినట్లు సీబీఐ స్పష్టం చేసింది.

2014లోనే ద్వారకా దాస్ ఎగవేతదారు

ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్‌పై 2014 జూన్ 30నే ఉద్దేశపూర్వక ఎగవేతదారు ముద్ర వేశామని ఓబీసీ వెల్లడించింది. దీని ఖాతాను 2014 మార్చి 31నే మొండి బకాయిగా ప్రకటించామన్నది. ఇప్పటికే ఈ సంస్థపై అటు సీబీఐకి ఫిర్యాదు చేశామని, ఇటు ఆర్బీఐకీ తెలియజేశామని తెలిపింది. ఢిల్లీకి చెందిన డైమండ్ జువెల్లరీ ఎగుమతిదారైన ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్.. ఓబీసీలో రూ.389.85 కోట్ల మోసానికి పాల్పడిందన్న ఆరోపణల్ని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. 2007-12 మధ్య ఈ మొత్తం రుణాన్ని ఓబీసీ నుంచి ద్వారకా దాస్ అందుకున్నది. ఇదిలావుంటే ఈ కేసులో ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్, దాని నలుగురు డైరెక్టర్లు సభ్య సేథ్, రీటా సేథ్, కృష్ణ కుమార్ సింగ్, రవి సింగ్‌లతోపాటు ద్వారకా దాస్ సేథ్ సెజ్‌లపై సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

పీఎన్‌బీ బకాయిలపై ఎస్‌బీఐ ఆశాభావం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: నీరవ్ మోదీ కేసులో తమకు రావలసిన రూ.1,360 కోట్ల బకాయిలను పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) త్వరలోనే చెల్లిస్తుందని ఆశిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం రూ.11,400 కోట్ల భారీ కుంభకోణంతో కుదేలైన పీఎన్‌బీకి, ఇతర బ్యాంకులకు మధ్య తలెత్తిన సమస్యలు త్వరలోనే సద్దుమణుగుతాయన్న నమ్మకం తనకు ఉందని ఆయన సోమవారం ఒక టెలివిజన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. పీఎన్‌బీ నుంచి తమకు రావలసిన బకాయిలపై స్పష్టత ఉన్నదని, ఇప్పటికే వాటిని లెక్కించి ఆ బ్యాంకుకు తెలియజేశామని, అలాగే పీఎన్‌బీలో కుంభకోణానికి పాల్పడిన సంస్థల్లో ఒకటైన గీతాంజలి జెమ్స్‌కు తాము ఇచ్చిన రుణాలను కూడా ఇప్పటికే తేల్చడం జరిగిందని, వీటిపై ఎటువంటి సమస్య లేదని, ఈ రుణాలను మళ్లీ లెక్కించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. బ్యాంకింగ్ రంగంలో మరిన్ని కుంభకోణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నదా? అని ప్రశ్నించగా, ప్రస్తుతానికి ఈ కేసు పీఎన్‌బీకి మాత్రమే పరిమితమైనట్లు కనిపిస్తున్నదని, ఎస్‌బీఐలో మాత్రం ఇటువంటి సమస్యలేమీ లేవని రజనీష్ కుమార్ చెప్పారు.

కేజీ-డీ6లో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు

■ ఆర్ఐఎల్ -బీపీ ప్రణాళికకు డీజీహెచ్ ఆమోదం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని డీ6 క్షేత్రంలోగల మూడు సహజ వాయువు (గ్యాస్) బావుల అభివృద్ధికి లైన్‌క్లియరైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)-బ్రిటీష్ పెట్రోలియం (బీపీ) రూ.40,000 కోట్ల పెట్టుబడులకు సోమవారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ (డీజీహెచ్) ఆమోదం తెలిపింది. ఈ బావులతో రోజుకు గరిష్ఠంగా 20 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల (ఎంఎంఎస్‌సీఎండీ) ఉత్పత్తి కాగలదని బీపీ చెబుతున్నది. గతేడాది జూన్‌లో కేజీ-డీ6పై రూ.40,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆర్ఐఎల్-బీపీలు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికే ఇప్పుడు డీజీహెచ్ అనుమతి లభించింది. తొలి విడుతలో భాగంగా దాదాపు 4 బిలియన్ డాలర్ల (రూ.26,000 కోట్లు) పెట్టుబడులతో కూడిన మూడు క్షేత్ర అభివృద్ధి ప్రణాళికల (ఎఫ్‌డీపీ)కు డీజీహెచ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు డీజీహెచ్ ట్విట్టర్‌లో పేర్కొనగా, కేజీ-డి6లో ఆర్ఐఎల్‌కు 60 శాతం, బీపీకి 30 శాతం, కెనడాకు చెందిన నికో రీసోర్సెస్‌కు 10 శాతం వాటాలున్నాయి.

80శాతం ఎన్‌బీఎఫ్‌సీలకు ముప్పే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దేశంలోని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల్లో (ఎన్‌బీఎఫ్‌సీ) దాదాపు 80 శాతం సంస్థలను అత్యధిక సమస్యాత్మక ఆర్థిక సంస్థలుగా అభివర్ణించింది కేంద్ర ప్రభుత్వం. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనలను పాటించని 9,491 ఎన్‌బీఎఫ్‌సీల వివరాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో భాగమైన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) విడుదల చేసిన తాజా జాబితాలో పేర్కొన్నారు. ఆర్బీఐ వివరాల ప్రకారం ఈ జనవరి నాటికి దేశవ్యాప్తంగా మొత్తం 12,000 వరకు ఎన్‌బీఎఫ్‌సీలుండగా, అందులో 9,491 సంస్థలు పీఎంఎల్ఏ నిబంధనల్ని పాటించడం లేదని గుర్తించారు. పీఎంఎల్ఏ కింద సహకార బ్యాంకులుసహా ఎన్‌బీఎఫ్‌సీలన్నీ తమ ఆర్థిక కార్యకలాపాలు, లావాదేవీల గురించి నిర్దేశిత నమూనాలో ఎఫ్ఐయూకు తెలియపరుచాల్సి ఉంటుంది. పాత పెద్ద నోట్ల రద్దు తర్వాత ఎన్‌బీఎఫ్‌సీలపైనా ఎఫ్ఐయూ దృష్టి సారించిన విషయం తెలిసిందే.

స్టాక్ మార్కెట్ల జోరు

• 300 పాయింట్లకు పైగా లాభపడ్డ సూచీ
• జోష్‌నిచ్చిన జీడీపీ గణాంకాల అంచనా



ముంబై, ఫిబ్రవరి 26: స్టాక్ మార్కెట్లు కొనుగోళ్లతో కళకళలాడాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో భారత వృద్ధిరేటు 7 శాతం స్థాయిలో నమోదవనున్నదని మోర్గాన్ స్టాన్లీ అంచనాలు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు సూచీల్లో జోష్‌ను మరింత పెంచింది. దీంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడి మూడు వారాల గరిష్ఠ స్థాయికి చేరుకోగా, నిఫ్టీ 10,500 పాయింట్ల పైకి ఎగబాకింది. ముఖ్యంగా జీడీపీ అంచనాలు పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరుచడానికి దోహదపడిందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జీడీపీ గణాంకాలను ఈ బుధవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నది. 34,225.72 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 34,483.39 గరిష్ఠ స్థాయిని తాకి చివరకు 303.60 పాయింట్ల లాభంతో 34,445.75 వద్ద ముగిసింది. ఫిబ్రవరి 5న ముగిసిన 34,757.16 పాయింట్ల స్థాయికి చేరుకున్నది. శుక్రవారం సెన్సెక్స్ 322 పాయింట్లు లాభపడ్డ విషయం తెలిసిందే. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 91.55 పాయింట్లు బలపడి 10,582.60 వద్దకు చేరుకున్నది. రంగాల వారీగా చూస్తే రియల్టీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా, మెటల్స్, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగాలు మూడు శాతానికి పైగా లాభపడ్డాయి. కానీ ఐటీ, టెక్, హెల్త్‌కేర్ రంగాల షేర్లు పతనం చెందాయి. మారుతి సుజుకీ అత్యధికంగా 3.41 శాతం లాభపడగా, అలాగే టాటా మోటార్స్ కూడా 3.22 శాతం పెరిగింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పవర్‌గ్రిడ్, హీరో మోటోకార్ప్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హెచ్‌యూఎల్, బజాజ్ ఆటో, యెస్ బ్యాంక్, ఆర్ఐఎల్, ఓఎన్‌జీసీ, టాటా స్టీల్, ఎన్‌టీపీసీలు మూడు శాతం వరకు లాభపడ్డాయి. కానీ సన్‌ఫార్మా, టీసీఎస్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, విప్రో, ఎస్‌బీఐల నష్టపోయాయి. కుంభకోణం నేపథ్యంలో పీఎన్‌బీ మరో 1.32 శాతం కోల్పోగా, గీతాంజలి జెమ్స్ 4.84 శాతం, ఒరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ 10.02 శాతం పతనం చెందాయి.

సింభౌలీ షుగర్స్ షేరు ఢమాల్

సింభౌలీ షుగర్స్ చైర్మన్ గుర్మిత్ సింగ్ మన్, కంపెనీ డిప్యూటీ ఎండీ గుర్పాల్ సింగ్‌లకు వ్యతిరేకంగా సీబీఐ కేసు దాఖలు చేయడంతో స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు ధర భారీగా పడిపోయింది. ఒక దశలో 20 శాతం వరకు క్షీణించిన షేరు ధర చివరకు 15.73 శాతం తగ్గి రూ.14.20 వద్ద ముగిసింది. దీంతో 52 వారాల కనిష్ఠ స్థాయికి జారుకున్నట్లు అయింది. దేశంలో అతిపెద్ద చక్కెర ఉత్పత్తి సంస్థల్లో సింభౌలీ షుగర్స్ ఒకటి.

ఎనిమిదేండ్ల కనిష్ఠానికి పీ-నోట్ పెట్టుబడులు

పీ-నోట్స్ ద్వారా దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి వచ్చే పెట్టుబడులు భారీగా పడిపోయాయి. జనవరి నెలలో ఈ పెట్టుబడులు ఎనిమిదిన్నరేండ్ల కనిష్ఠ స్థాయి రూ.1.19 లక్షల కోట్లకు తగ్గినట్లు స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ వెల్లడించింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను నేరుగా పెట్టకుండా, పీ-నోట్ల ద్వారా ఇన్వెస్ట్ చేయడానికి వీలుంటుంది. దేశీయ ఈక్విటీ, డెబిట్, డెరివేటివ్ మార్కెట్లలోకి రూ.1,19,556 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అంతక్రితం నెలలో ఇది రూ.1,24,810 కోట్లుగా ఉన్నాయి. ఆగస్టు 2009లో వచ్చిన రూ.1,10,355 కోట్ల పీ-నోట్ల పెట్టుబడుల కంటే ఇదే తక్కువ.

బెంజ్ ఎస్-క్లాస్ మేడిన్ ఇండియా

■ ప్రారంభ ధర రూ.1.33 కోట్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్..దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన ఎస్-క్లాస్-ఎస్350డీ డీజిల్, ఎస్450 పెట్రోల్ వెర్షన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. సోమవారం ప్రవేశపెట్టిన వాటిలో డీజిల్ వెర్షన్ రూ.1.33 కోట్లుగాను, పెట్రోల్ రకం రూ.1.37 కోట్లకు లభించనున్నది. బీఎస్-6 ప్రమాణాలకు లోబడి దేశీయంగా ఈ సరికొత్త ఎస్ క్లాస్ 350డీని రూపొందించినట్లు కంపెనీ ఎండీ, సీఈవో రోలాండ్ ఫోల్జర్ తెలిపారు.

అద్భుతమైన ఫీచర్లతో
గెలాక్సీ ఎస్-9, ఎస్-9ప్లస్

■ స్పెయిన్‌లో ఆవిష్కరించిన సామ్‌సంగ్
■ వచ్చే నెల భారత్‌లోకి ప్రవేశం



బార్సిలోనా ఫిబ్రవరి 26: ప్రపంచవ్యాప్తంగా గాడ్జెట్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న గెలాక్సీ ఎస్-9, ఎస్-9 ప్లస్ స్మార్ట్‌ఫోన్లు వచ్చేశాయి. హై-ఎండ్ స్మార్ట్‌ఫోన్ల సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని తహతహలాడుతున్న దక్షిణ కొరియా దిగ్గజ ఎలక్ట్రానిక్స్ సంస్థ సామ్‌సంగ్ స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఈ ఫోన్లను ఆవిష్కరించింది. యాపిల్ ఐఫోన్-10, గూగుల్ పిక్సెల్-2 సిరీస్ స్మార్ట్‌ఫోన్లకు పోటీగా తీసుకొచ్చిన ఈ రెండు ప్రీమియం ఫోన్లను సామ్‌సంగ్ వచ్చే నెల భారత్‌లో ప్రవేశపెట్టబోతున్నదని ఆ సంస్థ వర్గాలు వెల్లడించాయి. సూపర్ స్లోమోషన్ వీడియో రికార్డింగ్, తక్కువ వెలుతురులోనూ నాణ్యమైన ఫొటోలు తీయగలిగే డ్యూయల్ అపెర్చర్స్ (కెమెరాలు) వీటిలో ప్రధాన ఆకర్షణ. వీటి ధరలు ఎంతన్నదీ సామ్‌సంగ్ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ ప్రముఖ ఆన్‌లైన్ వ్యాపార సంస్థ అమెజాన్‌లో వీటి అడ్వాన్స్ బుకింగ్‌లను ప్రారంభించింది. వచ్చే నెల 16వ తేదీ నుంచి ఈ స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వస్తాయని ఆ సంస్థ స్పష్టం చేసింది. ఆండ్రాయిడ్ 8 (ఓరియో) ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేసే ఈ ఫోన్లను నాలుగు ఆకర్షణీయమైన రంగుల్లో (మిడ్‌నైట్ బ్లాక్, టైటానియం గ్రే, కోరల్ బ్లూ, లైలాక్ పర్పుల్) తీసుకొచ్చింది. వీటిలో 5.8 అంగుళాల స్క్రీన్‌తో రూపొందించిన ఎస్-9 స్మార్ట్‌ఫోన్ 4జీబీ ర్యామ్‌నూ, 6.2 అంగుళాల స్క్రీన్‌తో రూపొందించిన ఎస్-9 ప్లస్ 6జీబీ ర్యామ్‌నూ కలిగి ఉంటాయని, మెమరీని 400 జీబీ వరకూ విస్తరించుకునేందుకు వీలున్న ఈ రెండు ఫోన్లు మూడు రకాల ఇంటర్నల్ మెమరీ ఆప్షన్లతో (64జీబీ, 128జీబీ, 256జీబీ) లభ్యమవుతాయని సామ్‌సంగ్ వెల్లడించింది.



మరో ఐదు నోకియా ఫోన్లు

ఇదిలావుంటే, బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ (ఎండబ్ల్యూసీ) ఈవెంట్‌లో హెచ్ఎండీ గ్లోబల్ సంస్థ మరో నాలుగు స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. వీటిలో సరికొత్త నోకియా-6 మోడల్‌తో పాటు నోకియా-8 సిరోకో, నోకియా-7 ప్లస్, నోకియా-1 ఫోన్లు ఉన్నాయి. వీటితో పాటు 22 ఏళ్ల క్రితం నాటి నోకియా-8110 ఫీచర్ ఫోన్‌ను 4జీ సేవల సపోర్ట్‌తో అప్‌గ్రేడ్ చేసి దాదాపు రూ.6,300 ధరతో ఆవిష్కరించింది.

శాంతా బయోటెక్ కలరా వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌వో ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 26: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ శాంతా బయోటెక్‌కు చెందిన కలరా వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) అనుమతినిచ్చింది. +2 నుంచి +8 డిగ్రీల సెంటిగ్రేడ్ లోపు నిలువవుంచే ఈ శాంకోల్ వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌వో అనుమతినివ్వడం విశేషమని కంపెనీ ఈడీ, సీవోవో మహేష్ తెలిపారు. కలరా రాకుండా ముందుగా ఈ వ్యాక్సిన్‌ను వాడవచ్చన్నారు.

ఎస్‌బీఐ సర్వర్ డౌన్!

• రాష్ట్రంలో కొన్నిచోట్ల నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
• పదేపదే తలెత్తుతున్నా పట్టించుకోని ఎస్‌బీఐ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆటంకం కలుగుతున్నది. ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ ఎస్‌బీఐ అధికారులు సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందగించింది. కొన్నిసార్లు నెట్‌వర్క్ స్తంభిస్తున్నది. ఇటువంటి సాంకేతిక సమస్యల వల్ల శనివారం, సోమవారం రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తుల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చాలావరకు ఆగిపోయాయి. ముంబై కేంద్రంలోని సర్వర్‌లో సమస్య కారణంగా ఈ పరిస్థితి ఉత్పన్నమవుతున్నదని ఎస్‌బీఐ అధికారులు చెప్తున్నప్పటికీ సమస్యను పూర్తిగా పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవడం లేదు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఎస్‌బీఐ నోడల్ బ్యాంక్‌గా ఉంది. స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌కు ఆస్తి మార్కెట్ విలువలో ఆరు శాతం మొత్తాన్ని స్టాంప్, రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలి. దీనిని చలానా రూపంలో ఎస్‌బీఐ బ్యాంకుకు చెందిన ఏ బ్రాంచీ నుంచైనా చెల్లించవచ్చు. చలానాను జనరేట్ చేసుకుని ఈ-స్టాంప్ విధానంలో ఫీజును ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు. ఆ చలానా కాపీని తీసుకుని డాక్యుమెంట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లేదా చలానాను ఆన్‌లైన్‌లో జనరేట్ చేసుకుని ఆఫ్ లైన్‌ద్వారానే నేరుగా బ్యాం కులో ఫీజును జమచేయవచ్చు. అయితే బ్యాంకులు తమకు ఫీజు ముట్టినట్లు రశీదు ఇస్తేనే గానీ రిజిస్ట్రేషన్ జరుగదు. ముంబైలో సర్వర్ సమస్యలను సరిచేయకపోవడం వల్ల చలానా రశీదులు జనరేట్ కాక సోమవారం రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి.

పెరుగుతున్న ఐవోటీ వినియోగం!

ఆధునిక కాలంలో వ్యక్తిగత అవసరాలతోపాటు ప్రజాసేవలకూ ఎంతో ఉపయోగకరం

2020 నాటికి భారత్‌లో 15 బిలియన్ డాలర్లకు చేరుకోనున్న ఐవోటీ మార్కెట్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంట్లో బల్బులు ఆర్పేశామా? గ్యాస్ బంద్ చేశామా?.. సరిగ్గా ఇంటికి తాళం వేసి బయటికి వెళుతుంటే మనలో చాలామందికి కలిగే సందేహాలు ఇవి. అప్పటికే ఆలస్యమైందని పనుల మీద బయటకు వెళ్తాం.. వెంటనే మళ్లీ వెనుకకు రాలేం.. తీరా బయటికి వెళ్లినా రోజంతా ఆ సందేహాలు మనసును పీడిస్తుంటాయి. 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' తో అటువంటి సమస్యలు తీర్చుకోవచ్చు. మన ఇంట్లోని ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగాన్ని కంప్యూటర్లకు, మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేయడమే 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' (ఐవోటీ)..ఉదాహరణకు లైట్లు, తలుపులు, థర్మోస్టాట్లు, మంచినీటి వ్యవస్థ వంటివన్నీ ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లకు అనుసంధానం చేసుకుని వాటిని ఎక్కడి నుంచైనా ఆన్, ఆఫ్ చేయవచ్చు. ఇంట్లోకి అనుమతి లేకుండా ఇతరులు ఎవరైనా ప్రవేశిస్తే వెంటనే తెలుసుకోవచ్చు. అయితే ఇందుకు ప్రత్యేక గ్యాడ్జెట్స్ అవసరం అవుతాయి. ఆధునిక కాలంలో మారిన జీవన స్థితిగతులు, వృత్తి, ఉద్యోగ జీవితంలో పెరుగుతున్న ఒత్తిడుల కారణంగా నగర ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఐవోటీ చక్కగా పరిష్కరిస్తుందని నాస్కామ్ తెలిపింది. మనదేశంలో కూడా ఐవోటీ అవసరం, వినియోగం క్రమంగా పెరుగుతున్నది. ఈ దృష్ట్యా 2020 నాటికల్లా భారత్‌లో ఐవోటీ మార్కెట్ విలువ 15 బిలియన్‌డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటినీ అనుసంధానం చేస్తే, వాటి వినియోగంపై 10 శాతం దాకా విద్యుత్తు ఆదా అవుతుందని నిపుణులు పేర్కొన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌కి భారత్‌లో అత్యధిక ఆదరణ లభిస్తుందని ఇటీవల వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో నిపుణులు అభిప్రాయపడ్డట్లు ఆ సదస్సులో పాల్గొన్న సంస్థల ఉన్నతాధికారులు కొందరు చెప్పారు. మనదేశంలో ఐవోటీ వినియోగం ప్రజాపరిపాలనలో కూడా ప్రారంభమైంది. దీంతో ప్రజల భద్ర త, జీవన ప్రమాణాలూ పెరుగుతాయి. మంచినీరు, విద్యుత్ వంటి సేవలను మెరుగ్గా నిర్వహించడానికి ఐవోటీ ఉపయోగపడుతుంది. ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం దాదాపు 29.1 శాతం ప్రజలు ఎలక్ట్రానిక్ వస్తువులను అనుసంధానించడానికి అంగీకరించారు. ప్రధానంగా, చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులను భద్రపర్చవచ్చు. దీంతో చిన్నారి ఆరోగ్య వివరాలను డాక్టర్లు ఎక్కడ్నుంచి అయినా తెలుసుకోవడానికి వీలుంటుంది. ఐవోటీని వినియోగించి ట్రాఫిక్, కాలుష్యం, వాతావరణ సమస్యలు పరిష్కరించవచ్చు. ఈ విధంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఐవోటీ వినియోగించడంపై అధ్యయనం జరుగుతున్నట్లు సిస్కో ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.



యాదాద్రిలో వైభవంగా శ్రీచక్రతీర్థమహోత్సవం

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదోరోజైన సోమవారం శ్రీలక్ష్మీనరసింహస్వామివారి శ్రీచక్రతీర్థమహోత్సవం వైభవంగా జరిగింది. 'శ్రీనారసింహ.. జై నారసింహ' నామస్మరణతో ఆలయ ఆవరణ మార్మోగింది. మొదటగా శ్రీచక్రాళ్వార్‌కు బాలాలయంలో స్నానం చేయించిన పుణ్యజలాన్ని భక్తులపై చల్లుతూ ఆశీర్వచనం అందజేశారు. వేలాదిమంది భక్తులు శ్రీవారితో కలిసి పుణ్య స్నానాలు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి, ఈవో గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఏఈవో దోర్బల భాస్కర్ పాల్గొన్నారు. మంగళవారం అష్టోత్తర శత ఘటాభిషేకం, రాత్రి 10 గంటలకు శృంగారడోలోత్సవం నిర్వహించడంతో ఉత్సవాలు ముగుస్తాయి.



కిక్కిరిసిన ఎములాడ

వేములవాడ కల్చరల్: వేములవాడ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి సన్నిధి సోమవారం భక్తజన సంద్రమైంది. రాష్ట్రంతోపాటు ఆంధ్రా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయంతోపాటు అనుబంధ దేవాలయాలు భీమేశ్వరాలయం, బద్దిపోచమ్మ, నగరేశ్వరాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. దాదాపు 25 వేలకుపైగా మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా ఆర్జిత సేవలను రద్దుచేశారు. దాదాపు రూ.18 లక్షలకుపైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.



బాసరలో పోటెత్తిన భక్తజనం

బాసర: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఏకాదశి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకారాలు జరిపించారు. సుమారు 50వేల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అక్షరాభ్యాసానికి సుమారు మూడు గంటలకుపైగా సమయం పట్టింది. ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.12.20 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.



ధర్మపురి ఆలయంలో మృత్తిక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నమో.. నారసింహా..

- ధర్మపురిలో నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- నేడు స్వామివారి కల్యాణం.. హాజరుకానున్న మంత్రి అల్లోల

ధర్మపురి టౌన్: నవ నృసింహ క్షేత్రాల్లో ఒకటైన జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అంకురార్పణ, కలశ స్థాపనలతో వేడుకలను ప్రారంభించారు. భక్తులు సోమవారం పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయ యజ్ఞాచార్యులు కందాళై పురుషోత్తమాచారిని దేవస్థాన చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఈవో సుప్రియ, ధర్మకర్తలు ఇనుగంటి వెంకటేశ్వర్ రావు, మురికి భాగ్యలక్ష్మి, దేవాలయ సిబ్బంది. బాజాభజంత్రీలతో యజ్ఞాచార్యుల గృహానికి వెళ్లి ఆయనకు ఘనంగా స్వాగతం పలికి దేవస్థానానికి తీసుకొచ్చారు. బ్రహ్మోత్సవాల్లో 10రోజులు దాతల సహకారంతో దేవాలయ పాలకవర్గం ఆధ్వర్యంలో టీటీడీ ధర్మశాలలో నిర్వహించే ఉచిత అన్నదానాన్ని దేవస్థాన చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఈవో నాయిని సుప్రియ ప్రారంభించారు. మంగళవారం జరిగే కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తులను వేదమంత్రాలతో, మంగళ వాయిద్యాలతో చింతామణి చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి మృత్తిక పూజలు నిర్వహించారు. పుట్ట బంగారాన్ని తీసుకువచ్చారు.

నేడు నృసింహుడి కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీనృసింహస్వామి కల్యాణం నిర్వహిస్తారు. ఈ వేడుకలకు త్రిదండి చినజీయర్‌స్వామి, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, పెద్దపెల్లి ఎంపీ బాల్క సుమన్, కలెక్టర్ శరత్, ఎస్పీ అనంత శర్మ తదితరులు పాల్గొననున్నారు.

ఉద్యానసంస్థ ఆధ్వర్యంలో సుగంధద్రవ్యాల ఉత్పత్తి

- జీడిమెట్ల శుద్ధీకరణ కేంద్రాల్లో ఎనిమిది రకాల ఉత్పత్తులు
- కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధన సంస్థ సహకారంతో 2,400 టన్నుల ఉత్పత్తి
- ఆరునెలల్లో అందుబాటులోకి మాల్‌మసాలాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కల్తీ సరుకుల నేపథ్యంలో స్వచ్ఛమైన సుగంధ ద్రవ్యాల ఉత్పత్తికి రాష్ట్ర ఉద్యానాభివృద్ధి సంస్థ సంకల్పించింది. ఆహారపదార్థాల్లో వాడే అల్లం, వెల్లుల్లి, అల్లంవెల్లుల్లి మిశ్రమం, చింతపండు, చింతపండు ముద్దలు, ధనియాలు, కారం, పసుపు మొత్తం ఎనిమిది రకాల పొడులను నాణ్యతతో ప్రజలకు అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన సంస్థ (సీఎస్‌ఐఆర్) ఆధ్వర్యంలోని కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధన సంస్థ (సీఎఫ్‌టీఆర్‌ఐ)తో ఒప్పందం చేసుకున్నది. సీఎఫ్‌టీఆర్‌ఐపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఆధారంగా మొదట హైదరాబాద్‌లోని జీడిమెట్లలో రెండెకరాల్లో శుద్ధీకరణ యూనిట్లు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసింది. రూ.10.62 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ప్రాజెక్టు ప్రాథమిక పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించి ఆధునిక యంత్రాలకు టెండర్లు పిలిచి కంపెనీని ఖరారు చేయనున్నారు. కల్తీలేని సుగంధద్రవ్యాలు అందించేందుకుగాను సీఎం కేసీఆర్ గతేడాది తెలంగాణ ఉద్యానాభివృద్ధి సంస్థను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ప్రాజెక్టులో భాగం గా తొలుత 2,400 టన్నులు ఉత్పత్తి చేసి ప్రజల స్పందననుబట్టి జిల్లాల్లోనూ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించనున్నారు. జీడిమెట్ల ప్రాసెసింగ్ యూనిట్లలో కారం, వెల్లులి, అల్లం, అల్లంవెల్లులి మిశ్ర మం, చింతపండు ముద్దలను 64 టన్నుల చొప్పున ఉత్పత్తి చేయనున్నారు. చింతపండు పొడి 250, ధనియాల పొడి 900 టన్నులు ఉత్పత్తి చేస్తారు. సీఎఫ్‌టీఆర్‌ఐ సాంకేతికతతో నాణ్యమైన, స్వచ్ఛమైన సుగంధద్రవ్యాలు అందించడమే తమ ఉద్దేశమని ఉద్యానాభివృద్ధి సంస్థ ఎండీ వెంకట్రామిరెడ్డి బుధవారం తెలిపారు. ఎనిమిది రకాల పంటలను రైతులతో ప్రత్యేకంగా సాగు చేయించి కొనుగోలు చేస్తామని, ఉత్పత్తుల శుద్ధీకరణ అనంతరం ప్రజలకు విక్రయిస్తామని చెప్పారు. స్వచ్ఛమైన సుగంధద్రవ్యాలను వచ్చే ఆరునెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన వివరించారు.



హైదరాబాద్‌లోని కార్వాన్ నియోజకవర్గం గోల్కొండకు చెందిన వందలాది మంది ముస్లింలు సోమవారం డిప్యూటీ సీఎం మహమూద్ అలీ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. – మెహిదీపట్నం

లారీ ఢీకొని ఆర్ఎస్సై మృతి

కరీంనగర్ క్రైం: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట శివారులో సోమవారం సాయంత్రం జరిగిన ఓ ప్రమాదంలో రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాజా మొయినొద్దీన్ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. 13వ బెటాలియన్‌కు చెందిన ఆర్ఎస్సై ఖాజా మొయినొద్దీన్(45) ఎస్సైగా పదోన్నతిపై సిరిసిల్లకు వచ్చారు. సోమవారం సాయంత్రం వాహనంపై కరీంనగర్‌కు వస్తుండగా బావుపేట శివారులో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మొయినొద్దీన్‌ను చికిత్స కోసం దవాఖానకు తరలించగా మృతి చెందారు.

చకచకా చనాక-కొరాట

మూడున్నర దశాబ్దాల చిక్కులను ఛేదించిన సర్కార్ ● సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి.. మంత్రి హరీశ్ చొరవ
జూన్ నాటికి 10 వేల ఎకరాలకు సాగునీరు ● నేడు బ్యారేజీ పనులను పరిశీలించనున్న సీఎం కేసీఆర్

నిర్మల్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:

లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టులో అంతర్భాగమైన చనాక-కొరాట బ్యారేజీ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. జూన్ నాటికి 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ బ్యారేజీ నిర్మాణ పనులను సీఎం కేసీఆర్ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు, బ్యారేజీల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇరు రాష్ట్రాల మధ్య ప్రవహించే పెన్‌గంగా నదిపై నిర్మించే ఈ అంతర్రాష్ట్ర ప్రాజెక్టు, బ్యారేజీల నిర్మాణంపై తెలంగాణ సర్కార్ చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ముందుకు సాగుతున్నది. సుమారు 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఎల్పీజీ ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్లకు పైగా వ్యయం అవుతున్నది. వాస్తవానికి పెన్‌గంగపై మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో మూడు బ్యారేజీలు నిర్మిస్తున్నారు. ఎల్పీజీ ప్రాజెక్టును మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించే వరకు కొంత సమయం పడుతుందని.. ఆలోపే మరింత ముందుగానే జిల్లా రైతాంగానికి 51 వేల ఎకరాలకు నీరందించాలని నిర్ణయించారు. చనాక-కొరాట వద్ద నిర్మించే బ్యారేజీ ద్వారా ప్రస్తుతం మనకు నీరిచ్చే 13,500 ఎకరాలతోపాటు 38వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగు నీరు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ సర్కారు గతంలోనే రూ.1227 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చింది. లోయర్ పెన్‌గంగా కాల్వ 89కి.మీ. ఉండగా, 2 కి.మీ. నుంచి తెలంగాణలో ఉంది. 47 కి.మీ. నుంచి 89 కి.మీ. వరకు ఉన్న ఆయకట్టు 38వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు పనులు చేపట్టారు. చనాక-కొరాట బ్యారేజీ నుంచి 47కి.మీ. వద్ద నీరు నిల్వ ఉంటుందని గుర్తించి.. ఇక్కడి నుంచి 69 గ్రామాల్లోని 38 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకుగాను అవసరమైన చర్యలు చేపట్టారు. రూ.263.55 కోట్లతో చనాక-కొరాట బ్యారేజీ నిర్మాణం, రూ.200.63 కోట్లతో ఎల్పీపీ కాల్వ 47కి.మీ. నుంచి 89 కి.మీ. వరకు కాల్వల నిర్మాణం, పంప్‌హౌస్ నిర్మాణానికి రూ.81.09 కోట్లు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి రూ.18.23 కోట్లతో పనులు చేపట్టారు. వచ్చే జూన్ నాటికి 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, జోగు రామన్న, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఈ బ్యారేజీ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు.

నిర్మాణంలో ఉన్న చనాక-కొరాట బ్యారేజీ



చనాక-కొరాటలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెనుగంగపై ప్రధాన బ్యారేజీతోపాటు చనాక-కొరాట, రాజాపేట్, పింపార్డ్ వద్ద మరో మూడు బ్యారేజీల నిర్మాణం జరుగాల్సి ఉన్నది. ఇందులో ప్రధాన బ్యారేజీతోపాటు రాజాపేట్, పింపార్డ్ వద్ద బ్యారేజీలను మహారాష్ట్ర నిర్మించాలి. చనాక-కొరాట మధ్య బ్యారేజీని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్నది. ఇవన్నీ పూర్తయితే తెలంగాణకు అందాల్సిన 58వేల ఎకరాలకు సాగునీటికిగాను ఎగువన నీటి నిల్వకు అవకాశం ఉంటుంది. కానీ ఎగువన మహారాష్ట్రకు సంబంధించిన అంశం. ఆ రాష్ట్రం నిధుల్ని విడుదల చేయడంతోపాటు నిర్మాణ పనుల్ని వేగంగా పూర్తిచేయాలి. దానిపై ఆధారపడకుండా చనాక-కొరాట మధ్య బ్యారేజీని త్వరితగతిన పూర్తి చేసి, నిర్ణీత 58 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో బ్యారేజీ నుంచి కాల్వలోకి నీటిని తరలించిన తర్వాత ఎక్కడా నిల్వకు అవకాశం లేదు. అందుకే తాజాగా ఇందులో ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మిస్తే బాగుంటుందనే ప్రతిపాదనపై నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తుంది. ఈ మేరకు పెండల్వాడ దగ్గర 3.5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమైనట్టు తెలిసింది. వీటిని ప్రభుత్వం పరిశీలనకు సమర్పించినట్టు సమాచారం. సర్కారు నుంచి అనుమతి వస్తే పెండల్వాడ వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి నీటిపారుదల శాఖ చర్యల్ని ముమ్మరం చేయనున్నది.

మంత్రి హరీశ్‌రావు ఆకస్మిక తనిఖీ

- కాళేశ్వరం ప్రాజెక్టు పనుల తనిఖీలో కొత్త ఒరవడి
- కరీంనగర్ జిల్లా రామడుగులో 8వ ప్యాకేజీ పనుల పరిశీలన

రామడుగు: కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో మరింత వేగం పెంచడానికి మంత్రి హరీశ్‌రావు సోమవారం 'సర్జికల్' తనిఖీ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు సమన్వయ సమితి సదస్సులో పాల్గొన్న అనంతరం, మంత్రి రామడుగు మండలంలోని కాళేశ్వరం 8వ ప్యాకేజీ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులకు సమాచారమివ్వకుండా మంత్రి అక్కడికి చేరుకోవడంతో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది కంగుతిన్నారు. ఈనెల 22, 23వ తేదీల్లో కాళేశ్వరం పనులను పరిశీలించాలని నిర్ణయించినా, ఢిల్లీ పర్యటన, ఇతర కార్యక్రమాలతో వాయిదా పడింది. రైతు సమన్వయ సమితుల సదస్సుతో కరీంనగర్‌కు చేరుకున్నందున సమయాన్ని వృథా చేయకుండా 8వ ప్యాకేజీ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గ్రావిటీ కెనాల్‌పై నిర్మిస్తున్న 10 స్ట్రక్చర్ పనులను పరిశీలించారు. పనుల్లో మరింత వేగం పెంచాలని, కెనాల్ లైనింగ్ త్వరగా పూర్తి చేయాలని అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. వరద కాల్వ జంక్షన్ పాయింట్ డిజైన్లు ఏజెన్సీలు త్వరగా సబ్మిట్ చేయాలన్నారు. మోటర్ల బిగింపు పనులు, గేట్ల తయారీ వేగం పుంజుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ఈ ఏడాది కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు ఎత్తి తెలంగాణ బీడు భూముల్లో పారించాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యాన్ని నెరవేర్చడానికి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వర్షాకాలానికి ముందే సివిల్, మెకానికల్ పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. మంత్రి వెంట ఎంపీ బీబీ పాటిల్, ఈఎన్సీ అనిల్, కాళేశ్వరం సీఈ నల్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కాళేశ్వరం 8వ ప్యాకేజీ పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొత్త బిడ్డర్లకు ప్రభుత్వం షరతులు


- లెటర్ ఆఫ్ ఇండెంట్ అయిన 21రోజుల్లోనే పాస్‌పుస్తకాలు ముద్రించాలి
- తరువాత వారంలోపే గ్రామాలకు సరఫరా
- పకడ్బందీగా 17 ఫీచర్లతో పాస్‌పుస్తకాలు!
- యూనిక్ ఐడీ నంబర్‌లో 12 అంకెలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టైటిల్ డీడ్‌తో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను పకడ్బందీగా 17 ఫీచర్లతో ముద్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి టెండర్లు పిలిచింది. ప్రభుత్వం ముందుగా ఈ పనిని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు అప్పగించింది. అయితే ఒప్పందం తరువాత ఆ సంస్థ ముద్రణాచార్జీలు పెంచాలని డిమాండ్ చేసింది. ప్రింటింగ్‌ను నిలిపి వేసి ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేసింది. దీంతో సెక్యూరిటీ ప్రెస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి ప్రభుత్వం తిరిగి టెండర్లను పిలిచింది. బిడ్డర్ల నుంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ఈసారి అత్యంత జాగ్రత్తగా టెండర్ ప్రక్రియను నిర్వహిస్తున్నది. ఈ టెండర్ షెడ్యూల్‌లో లెటర్ ఆఫ్ ఇండెంట్ అయిన తరువాత నుంచి 21 రోజుల్లో పట్టాదార్ పాస్ పుస్తకాలను ముద్రించి, మరోవారం రోజుల్లో అన్ని గ్రామాలకు సరఫరా చేయాలని నిబంధన పెట్టింది. ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసే వారికే పాస్‌పుస్తకాల ముద్రణను అప్పగిస్తారు. పట్టాదార్ పాస్ పుస్తకానికి లోగడ నిర్ణయించిన ఫీచర్ల సంఖ్య చాలాఎక్కువ ఉన్నదని, తగ్గించాలని అధికార వర్గాల నుంచి అభిప్రాయం వ్యక్తమైంది. గతంలో 26 భద్రతా ఫీచర్లు ఉండాలని అనుకోగా ప్రస్తుతం17 ఉంటే చాలని నిర్ణయించారు. మరికొన్ని ఫీచర్లు మార్చాలని సూచించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. పాస్ పుస్తకానికి 13 డిజిట్ల యూనిక్ ఐడీ నంబర్ ఉండాలని అనుకోగా, తాజాగా 12 డిజిట్లు ఉంటే చాలన్న అభిప్రాయానికి వచ్చారు. ఈ డిజిట్లలో మొదటి అంకె రాష్ర్టాన్ని తెలియజేస్తుంది. రెండు, మూడు అంకెలు జిల్లా కోడ్‌ను, నాలుగు, ఐదు డిజిట్లు మండల కోడ్, ఆరు, ఏడు, ఎనిమిది అంకెలు గ్రామ కోడ్‌ను సూచిస్తాయి, చివరి నాలుగు డిజిట్లు గ్రామ పాస్ పుస్తకం సీరియల్ నంబర్‌ను తెలియజేస్తాయి. పట్టాదార్ పాస్ పుస్తకానికి 120 జీఎస్ఎం పేపర్ వాడాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వ లోగో అన్ని పేజీల్లో ఆరు రంగుల్లో ముద్రించాలి. పట్టాదార్ పాస్‌పుస్తకం కమ్ టైటిల్ డీడ్ నంబర్‌ను ఫ్లోరోసెంట్ ఇంక్‌తో ప్రింట్ చేయాలి. ఇది అల్ట్రా వయొలెట్ రంగులో మెరుస్తూ కనిపించాలి. కవర్ పేజీలో ప్రత్యేక కవర్ పదార్థం(బాక్రామ్)ను 150 జీఎస్ఎం వాడాలి. ఇది ఎంతోకాలం మన్నుతుంది. తెలంగాణ రాష్ట్రలోగో టైటిల్ బుక్ పేరు బంగారు రంగులో ముద్రించాలి. లోగో 3 సెంటీ మీటర్ల వ్యాసార్థంతో 16 నంబర్ సైజ్ అక్షరాలతో ఉండాలి. పాస్‌పుస్తకంలోని 16 పేజీలను హైరిజల్యూషన్‌తో మైక్రో టెక్స్ ప్రింటింగ్ చేయాలి. అన్ని పేజీలు బ్యాక్ గ్రౌండ్‌లో కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలతో ఉండాలి. ఇందులో తెలంగాణ ప్రభుత్వం లోగో వచ్చేలా డీకోడర్‌తో మిళితం చేసి ముద్రించాలి. పాస్ పుస్తకంలో వ్యక్తిగత వివరాలు ఉండే మూడు పేజీలను కాపీ చేయడానికి ఆస్కారం లేకుండా ముద్రించాలి. ఒకవేళ అలా చేస్తే కాపీ అని వచ్చేలా ఉండాలి. అన్ని లోపలి పేజీలకు పేపర్‌ను తయారు చేసేటప్పుడే అల్ట్రా వయొలెట్ ఫైబర్స్ వాడాలి. లైట్ కింద పెడితే కనిపించాలి. దీంట్లో ఫోర్లో సెక్యూరిటీ త్రెడ్ ఉండాలి. తెలంగాణ ప్రభుత్వ హోలోగ్రామ్ పట్టాదార్ పాస్‌పుస్తకంలో అధిక భద్రతా ప్రమాణాలతో 25 ఎంఎం డైమెన్షన్ రౌండ్‌లో ఉండాలి. ఆధార్ నంబర్‌తో కలిపి క్యూఆర్ కోడ్ రీడర్‌తో మాత్రమే గుర్తించే విధంగా పాస్‌బుక్‌ను రూపొందించాలి. పాస్‌బుక్‌పై ఎలాంటి రాతలు లేకుండా డాటా స్క్రీన్ ఇమేజ్ మాత్రమే ఉండాలి. పుస్తకంలోని అన్ని పేజీల్లో చిన్న అక్షరాలతో తెలంగాణ గవర్నమెంట్ అని ముద్రిస్తారు. ఇలా 17 రకాల ఫీచర్లతో 72 లక్షల పాస్‌పుస్తకాలను ముద్రిస్తారు.

నాగార్జునసాగర్ డ్యాంకు మరో స్పిల్‌వే అవసరం

రివర్సబుల్ విధానంతో డ్యాం భద్రతకు ఢోకాలేదు
డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ కమిటీ చైర్మన్ ఎంఎస్ రెడ్డి

నాగార్జునసాగర్: కృష్ణానది ఉధృత రూపం దాల్చిన సందర్భాల్లో వచ్చిన వరదను నాగార్జునసాగర్ డ్యాం నుంచి దిగువకు విడుదల చేయడానికి వీలుగా మరో స్పిల్‌వే నిర్మించాల్సిన అవసరం ఉన్నదని డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ కమిటీ చైర్మన్ ఎంఎస్ రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయవిహార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ బ్యాంక్ నిధులతో చేపట్టిన సాగర్ డ్యాం ఆధునీకరణ పనులను పరిశీలిస్తూనే డ్యాం భద్రతకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. 2009లో వచ్చిన విధంగా కృష్ణానదికి అధిక వరద వస్తే డ్యాం రేడియల్ క్రస్ట్‌గేట్ల నుంచి ఒకేసారి 12 లక్షల క్యూసెక్కుల కంటే అధికంగా నీటిని దిగువకు వదిలే అవకాశం లేదన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురిసిన సందర్భాల్లో సాగర్‌లోకి 25 లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉన్నదన్నారు. అలాంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి సాగర్ లెఫ్ట్ ఎర్త్ డ్యాం వద్ద స్పిల్ వేను నిర్మిస్తే వరద ప్రవాహాన్ని టైగర్ వ్యాలీ నుంచి దిగువ కృష్ణలోకి మళ్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నాగార్జునసాగర్ పవర్‌హౌస్‌లో విద్యుత్ ఉత్పత్తి తర్వాత రివర్సబుల్ విధానంతో నీటిని తిరిగి ప్రాజెక్టులోకి పంపింగ్ చేయడం వల్ల డ్యాంకు ఎలాంటి నష్టం లేదన్నారు. నాలుగు రోజులపాటు డ్యాంకు సంబంధించిన అన్ని ప్రాంతాలను పరిశీలించామని, దీనిపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ రమేశ్ ఉన్నారు.



నాగార్జునసాగర్‌లో మాట్లాడుతున్న డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ కమిటీ చైర్మన్ ఎంఎస్ రెడ్డి

ఏసీబీకి చిక్కిన ఎస్ఎస్ఏ ఈఈ

రూ.3లక్షల లంచం తీసుకుంటూ దొరికిన రవీందర్‌రావు



ఈఈ రవీందర్‌రావు

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా సర్వశిక్ష అభియాన్ కార్యాలయ ఈఈ మాచినేని రవీందర్‌రావు రూ.మూడు లక్షల లంచం తీసుకుంటూ సోమవారం రాత్రి ఏసీబీకి చిక్కాడు. వివరాలు.. కాంట్రాక్టర్ వన్నాల కన్న విద్యార్థులకు డ్యూయల్ డెస్కుల తయారీ కాంట్రాక్టు పొందాడు. దీనికి సంబంధించి రూ.32లక్షల బిల్లు చెల్లించేందుకు రవీందర్‌రావు రూ.ఐదు లక్షలు డిమాండ్ చేయగా, మొదట రూ.3లక్షలు చెల్లిస్తానని కన్న ఒప్పుకున్నాడు. సోమవారం రాత్రి కార్యాలయంలో రూ.3 లక్షలు తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

గంజాయి పట్టివేత: ముగ్గురి అరెస్ట్

చౌటుప్పల్ క్రైం: అక్రమంగా తరలిస్తున్న 77 కిలోల గంజాయిని పట్టుకున్నామని చౌటుప్పల్ సీఐ వెంకటయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఠాణాలో వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రిపేట, కోట్యాతండా తలంచర్లకుచెందిన తెజావత్ కిషన్, ఖమ్మం జిల్లా కారేపల్లి గ్రామానికి చెందిన గుగులోతు కిషన్ ఆటోలో గంజాయిని తరలిస్తుండగా, పక్కాసమాచారం మేరకు చౌటుప్పల్ మండల కేంద్రంలోని వలిగొండ రోడ్ చౌరస్తాలో మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోరు గ్రామానికి చెందిన దినేశ్‌సింగ్ బలూంబియ్య కారులోనికి గంజాయిని డంప్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గంజాయి సుమారు రూ.5 లక్షల దాకా విలువ ఉంటుందని సీఐ చెప్పారు. ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరోతరగతి విద్యార్థి ఆత్మహత్య

చిలుపూరు: జనగామ జిల్లా చిలుపూరు మండలం కృష్ణాజిగూడెం గ్రామానికి చెందిన సాదం విశ్వతేజ తండ్రి కొడుతాడనే భయంతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణాజిగూడెం గ్రామానికి చెందిన సాదం శ్రీనివాస్-శ్రీలత దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు విశ్వతేజ ఆరోతరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటివద్దనే ఉండగా, విశ్వతేజను తల్లి శ్రీలత జుట్టు బాగా పెరిగిందనీ, కటింగ్ చేసుకోవాలని సూచించినా వినిపించుకోకపోగా, తమ్ముడితో గొడవ పడుతున్నాడు. గమనించిన తల్లి ఇద్దరిని వారించే క్రమంలో కింద పడటంతో కాలికి గాయమైంది. దీంతో తండ్రి ఇంటికి వస్తే తనను కొడుతాడనే భయంతో విశ్వతేజ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి, పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. అతనిని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు.

మావోయిస్టు గణేశ్ గన్‌మెన్‌తోపాటు మరో ముగ్గురి లొంగుబాటు

నలుగురిపై రూ.12లక్షల రివార్డు.. బీజాపూర్ ఎస్పీ వెల్లడి

కొత్తగూడెం క్రైం: మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత ఊకే గణేశ్ గన్‌మెన్ పర్సా మున్నాతో పాటు మరో ముగ్గురు మావోయిస్టులు సోమవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ ఎస్పీ మోహిత్ గర్గ్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మోహిత్ విలేకరుల సమావేశంలో మావోయిస్టులను హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. మున్నా 2008లో మావోయిస్టు పార్టీలో చేరి, 2012 దాకా మట్వాడ లోకల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేశాడు. 2012లో మావోయిస్టు నేత ఊకే గణేశ్ గన్‌మెన్‌గా చేరాడు. 2014లో కోయిలాబేడ్‌లో ఏస్టీఎఫ్ జవాన్లపై జరిగిన మావోయిస్టుల దాడిలో మున్నా కీలక పాత్ర పోషించాడు. గణేశ్ సారథ్యంలో జరిగిన కీలకమైన ఘటనల్లో మున్నా నిందితుడని ఎస్పీ పేర్కొన్నారు. మున్నాతో సహా మరో ముగ్గురు మావోయిస్టులు టోటీ సంతూ, మహదేవ్, తెలం బుద్రులు లొంగిపోయినట్లు ఎస్పీ పేర్కొన్నారు. మున్నా తలపై రూ.8లక్షలు, సంతూ తలపై రూ.2లక్షలు, మహదేవ్ తలపై రూ.2లక్షల రివార్డులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అంతే కాకుండా లొంగిపోయిన నలుగురు మావోయిస్టులకు రూ.10వేల ప్రోత్సాహకాలను అందిచామన్నారు.



మావోయిస్టుల అరెస్టును చూపిస్తున్న బీజాపూర్ ఎస్పీ మోహిత్ గర్గ్

ద్రవిడ్ అందుకే అంత ఇష్టం-కేటీఆర్





హైదరాబాద్: భారత యువ క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌పై తన అభిమానాన్ని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కే తారకరామారావు మరోమారు చాటుకున్నారు. ఒక క్రికెటర్ గానే కాకుండా ద్రవిడ్‌ను ఓ వ్యక్తిగా అంతే ఇష్టపడుతానని కేటీఆర్ అన్నారు. ఇటీవల న్యూజిలాండ్ వేదికగా జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో పృథ్వీషా నేతృత్వంలోని యువభారత్ విజేతగా నిలిచింది. ఇందుకు క్రికెటర్లకు రూ.30 లక్షలు, చీఫ్ కోచ్ ద్రవిడ్‌కు రూ.50 లక్షలు, సహాయక సిబ్బందికి రూ.20 లక్షల చొప్పున బీసీసీఐ ప్రోత్సాహకాలను ప్రకటించింది. దీనిపై ద్రవిడ్ మీడియా సమావేశంలో స్పందిస్తూ బీసీసీఐ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. జట్టు విజయంలో భాగమైన అందరికీ సమాన ప్రోత్సాహకాలను ప్రకటించాలంటూ ద్రవిడ్ చేసిన డిమాండ్‌కు బీసీసీఐ తలొగ్గింది. రాహుల్‌తో పాటు సహాయక సిబ్బందికి రూ.25 లక్షలు ఇస్తామంటూ బీసీసీఐ ఆదివారం ప్రకటన చేసింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో వచ్చిన ఈ వార్తపై కేటీఆర్ స్పందిస్తూ 'ఒక క్రికెటర్‌గానే కాదు ఒక వ్యక్తిగా ద్రవిడ్‌ను అంతకన్నా ఎక్కువ ఇష్టపడుతా' అని తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.



షూటింగ్ క్రీడను తప్పించం: సీజీఎఫ్


న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్(2022)లో షూటింగ్ క్రీడను తప్పిస్తారని వస్తున్న ఊహాగానాలపై కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్) స్పందించింది. షూటింగ్‌ను మొత్తానికే రద్దు చేయడం లేదని, 'ఆప్షనల్ కేటగిరీలో' ఇది కొనసాగుతుందని సీజీఎఫ్ సీఈవో గ్రీవెంబర్గ్ వివరణ ఇచ్చారు. 'షూటింగ్‌ను తీసేయాలన్న నిబంధనలు ఎక్కడా లేవు. ఇందులో ఎలాంటి అనిశ్చితి లేదు. బర్మింగ్‌హామ్ గేమ్స్‌లో షూటింగ్ క్రీడ ఉండదని వస్తున్న వదంతులు తప్పు. షూటింగ్‌ను కొనసాగించాలా వద్దా అనే అంశం ఆతిథ్య నగరం నిర్ణయం తీసుకోవచ్చు. ఒకవేళ కొనసాగించినా లేకపోయినా.. షూటింగ్ మాత్రం ఆప్షనల్ కేటగిరీలో ఉంటుంది. 2015 సీజీఎఫ్ జనరల్ అసెంబ్లీ ప్రకారమే షూటింగ్ ఆప్షనల్ కిందకు తీసుకొచ్చారు. మరోసారి దానిని మేం ధ్రువీకరిస్తున్నాం' అని గ్రీవెంబర్గ్ పేర్కొన్నాడు. ఒకవేళ బర్మింగ్‌హామ్‌లో షూటింగ్ క్రీడ లేకపోతే భారత్ పతకం అవకాశాలకు పెద్ద దెబ్బ. సీడబ్ల్యూజీ ఆల్‌టైమ్ షూటింగ్ మెడల్స్ జాబితాలో రెండోస్థానంలో భారత్ ఇప్పటివరకు 118 పతకాలు సాధించింది. ఇందులో 56 స్వర్ణాలు ఉన్నాయి.

కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కెప్టెన్‌గా అశ్విన్



న్యూఢిల్లీ: భారత ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కొత్త బాధ్యతలు తీసుకున్నాడు. ఐపీఎల్ ఫ్రాంచైజీ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఈ మేరకు టీమ్ మెంటార్ సెహ్వాగ్ ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. ఐపీఎల్‌లో ఎనిమిదేండ్ల పాటు చెన్నై సూపర్‌కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అశ్విన్.. రెండేండ్లు పుణె సూపర్ జెయింట్స్‌కు ఆడాడు. తాజా వేలంలో పంజాబ్ అతన్ని రూ.7.60 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. గతంలో పంజాబ్‌ను నడిపించిన మ్యాక్స్‌వెల్ ఈసారి ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు వెళ్లడంతో ఈ తమిళనాడు స్పిన్నర్‌కు సారథ్య అవకాశం దక్కింది. కెప్టెన్‌గా తనపై నమ్మకాన్ని పెట్టినందుకు ఫ్రాంచైజీ యాజమాన్యానికి అశ్విన్ కృతజ్ఞతలు తెలిపాడు. 'ఇదో గొప్ప గౌరవం. నైపుణ్యం ఉన్న క్రికెటర్లను నడిపించే బాధ్యత నాపై పెట్టారు. ఇది గర్వించాల్సిన అంశం. అత్యుత్తమ ఫలితాలను రాబట్టేందుకు కృషి చేస్తా. సారథ్యం వల్ల నా ప్రదర్శనపై ఎలాంటి ప్రభావం పడదు. అధిక ఒత్తిడి కూడా ఉండదు. 21 ఏండ్ల వయసప్పుడు రాష్ట్ర జట్టును నడిపించా. కాబట్టి కొత్త సవాలును స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నా' అని అశ్విన్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో ఇంతవరకు ఏ జట్టుకూ కెప్టెన్‌గా వ్యవహరించని అశ్విన్.. స్టార్ హిట్టర్లు యువరాజ్, గేల్‌లాంటి సీనియర్లను ఎలా నడిపిస్తాడన్నది ఆసక్తికరం.

దిగజారిన యుకీ ర్యాంక్



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ యువ ఆటగాడు యుకీ భాంబ్రీ.. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు కిందకు దిగజారాడు. సోమవారం విడుదల చేసిన తాజా జాబితాలో యువీ 105 ర్యాంక్‌లో నిలిచాడు. దుబాయ్ డ్యూటీ ఫ్రీ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించలేకపోవడం యుకీకి ప్రతికూలంగా మారింది. రామ్‌కుమార్ రామనాథన్ మాత్రం ఏడు స్థానాలు మెరుగుపడి 133వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఏటీపీ డెల్‌రే బీచ్ ఓపెన్ టోర్నీ మెయిన్ డ్రాకు అర్హత సాధించడం వల్ల రామ్‌కుమార్ 12 పాయింట్లు సంపాదించాడు. సుమిత్ నాగల్ 220వ, ప్రజ్నేష్ గుణేశ్వరన్ 232వ ర్యాంక్‌ల్లో కొనసాగుతున్నారు. డబుల్స్‌లో రోహన్ బోపన్న 20వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, లియాండర్ పేస్ 52వ, దివిజ్ శరణ్ 54వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో టాప్ స్టార్ సానియా మీర్జా 13వ ర్యాంక్‌లో ఉండగా, సింగిల్స్‌లో అంకితా రైనా 250వ, కర్మాన్ కౌర్ థండి 281వ ర్యాంక్‌లను దక్కించుకున్నారు.

బుల్లి చిరుతకు పాలు పట్టిస్తూ..

లియోపార్డ్‌ను దత్తత తీసుకున్న పీటర్సన్



ఛత్తీస్‌గఢ్: ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ క్రికెట్‌నే కాదు, జంతువులనూ అమితంగా ప్రేమిస్తానని మరోసారి నిరూపించుకున్నాడు. గత వారం ఇండియాకు వచ్చిన పీటర్సన్ రాయ్‌పూర్‌లో ఒక బుల్లి చిరుతను దత్తత తీసుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఇండియాలో దాదాపు 40 చిరుతలను వేటగాళ్లు చంపేయడం బాధించిందని, అందుకే అనాథగా ఉన్న చిరుత పిల్లను అక్కున చేర్చుకున్నానని కేపీ సామాజిక మాధ్యమం ద్వారా తెలిపాడు. తాజాగా మరోసారి ఛత్తీస్‌ఘఢ్‌కు వచ్చిన పీటర్సన్ ఆ లియోపార్డ్‌కు ఒక సీసా ద్వారా పాలు పట్టించాడు. ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి.. "ఇందులోనే సంతోషం ఉన్నది. నా చిన్నారి చిరుత ఎంత అందంగా ఉన్నదో..?" అన్న కామెంట్‌ను జత చేశాడు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవడంతో నెటిజన్లంతా పీటర్సన్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. అనంతరం ఛత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రి రమన్‌సింగ్‌ను కలిసి సౌరాయ్(సేవ్ అవర్ రైనోస్ ఆఫ్రికా, ఇండియా)పై కాసేపు చర్చించాడు. ఈ కార్యక్రమానికి సంబంధించిన టోపీని రమణ్‌సింగ్, పీటర్సన్‌కు అందజేశారు. ఆఫ్రికా, ఆసియాలో అంతరించిపోతున్న ఖడ్గ మృగాలను కాపాడుకునే కార్యక్రమంలో కేపీ పాలుపంచుకుంటున్న సంగతి తెలిసిందే. వన్యప్రాణుల సంరక్షణ కోసం కేపీ చేస్తున్న కృషి అభినందనీయమని సీఎం రమన్‌సింగ్ ప్రశంసలు కురిపించారు.


ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్‌తో పీటర్సన్

ఆరు నూరైనా..



మూడు పదుల వయసులోనూ కుర్రాళ్లకు దీటుగా పరుగెత్తే రన్నర్.. కండ్లు చెదిరే క్యాచ్‌లతో ప్రత్యర్థికి షాక్ ఇచ్చే ఫీల్డర్..క్లిష్టమైన దశలో బౌలర్ అవతారమెత్తి వికెట్లు పడగొట్టగల స్పిన్నర్..తనదైన షాట్లతో బౌలర్లపై విరుచుకుపడి పరుగుల వరద పారించగల బ్యాట్స్‌మన్..అతడే రెండు ప్రపంచకప్‌లు ఆడిన సీనియర్ సురేశ్ రైనా..దశాబ్ద కాలంలో ఎన్నో అవార్డులు, మరెన్నో మైలురాళ్లు..కొన్నాళ్ల వైఫల్యం జట్టుకు దూరం చేసిన వైనం..అయినా పట్టు వీడలేదు, ఆరునూరైనా మరో ప్రపంచకప్ ఆడటమే లక్ష్యంగా ప్రతీ వేదికను అవకాశంగా మలుచుకుంటు దూసుకొస్తున్నాడు.

ప్రపంచకప్‌లో ఆడుతా

వన్డే జట్టులో స్థానంపై రైనా ధీమా

కుర్రాళ్లతో తీవ్రమైన పోటీ

ముక్కోణపు టోర్నీలో దుమ్మురేపడమే లక్ష్యం

(నమస్తే తెలంగాణ స్పోర్ట్స్‌డెస్క్)

టీమ్‌ఇండియాలో ఒకప్పుడు వెలుగు వెలిగిన ఆల్‌రౌండర్ సురేశ్‌రైనా, ప్రస్తుతం జట్టులో సుస్థిర స్థానం కోసం పోరాటం చేస్తున్నాడు. ఇతని దృష్టి మొత్తం 2019 ప్రపంచకప్‌పైనే ఉన్నది. అప్పటి వరకు భారత వన్డే జట్టులో చోటు దక్కించుకోవాలని తపిస్తున్నాడు. ఇందులో భాగంగానే ముందుగా టీ20ల్లో సత్తా చాటి, ఆ తర్వాత వన్డే జట్టులో చేరాలని పక్కా ప్రణాళికతోనే దూసుకొస్తున్నాడు. అందుకు తగ్గట్టుగానే దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో తనను తాను నిరూపించుకుని మొదటి అడుగు విజయవంతంగా పూర్తి చేశాడు. టీ20 సిరీస్‌లో ఈ యూపీ ఆటగాడు వరుసగా మూడు మ్యాచుల్లో 15, 31, 43 స్కోర్లు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అంతేకాదు నిర్ణయాత్మక చివరిదైన మూడో టీ20లో బౌలింగ్‌లోనూ రాణించి కీలకమైన వికెట్ పడగొట్టి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. సఫారీ పరీక్షలో పాసైన రైనా ఇప్పుడు శ్రీలంకలో జరుగబోయే ముక్కోణపు టీ20లోనూ దుమ్మురేపేందుకు సిద్ధమయ్యాడు. ఉపఖండ పిచ్‌లపై శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి బలహీనమైన జట్లను ఎదుర్కోవడం రైనాకు నల్లేరు మీద నడకే. ఓ రెండు భారీ ఇన్నింగ్సులు ఆడితే చాలు భవిష్యత్ మ్యాచుల్లో రైనా స్థానానికి ఢోకా ఉండదు.

ఎలా దూరమయ్యాడు

2005లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన రైనా పదేండ్ల పాటు భారత్ తరపున ఆడి తనదైన ముద్రవేశాడు.2011 ప్రపంచకప్ గెలిచిన జట్టులో కీలక సభ్యుడిగా తన వంతు పాత్ర పోషించాడు. 2015 ప్రపంచకప్‌లోనూ ఆడాడు. చివరిసారిగా 2015 అక్టోబర్ 25న దక్షిణాఫ్రికాపై వన్డే మ్యాచ్ ఆడాడు. స్వదేశంలో సఫారీలతో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రైనా రెండు మ్యాచుల్లో డకౌట్ అవడమే కొంప ముంచింది. ఆ తర్వాత ఒక హాఫ్ సెంచరీ చేసినప్పటికీ సెలక్టర్లు ఇతడిని పక్కన పెట్టారు. ఆ ఏడాది మొత్తం 20 వన్డేలు ఆడి 4 హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ చేశాడు. దాదాపు రెండున్నరేండ్లుగా వన్డే జట్టులో పునరాగమనం కోసం తపించిపోతున్న రైనా..గతేడాది యోయో పరీక్షలో పాసవడంతో దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే.

> "జట్టులోకి రావడం కోసం గత రెండేండ్లుగా ఎంతో శ్రమించా. చాలా కాలం తర్వాత భారత జెర్సీని ధరించడంతో ఉద్వేగానికి గురయ్యాను. 2019 ప్రపంచకప్ ఆడటమే నా లక్ష్యం. బంగ్లాదేశ్, శ్రీలంకతో జరుగబోయే ముక్కోణపు టోర్నీ, ఆ తర్వాత ఐపీఎల్..ఈ రెండూ నాకు కీలకం. ఇందులో సత్తా చాటి కచ్చితంగా వన్డే జట్టులో స్థానం సంపాదిస్తా."

రైనా బలం అదే

కుర్రాళ్లతో ఎంత పోటీ ఉన్నప్పటికీ రెండొందలకు పైగా వన్డే మ్యాచ్‌లు ఆడిన అనుభవం రైనాకు కొంత కలిసొచ్చే అంశం.ప్రస్తుత జట్టులో ధోనీ తర్వాత ఇతడే సీనియర్. బ్యాటింగ్‌లో 93కు పై చిలుకు స్ట్రైక్ రేట్, ఒత్తిడిలోనూ ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను లాగేసుకునే ఆటతీరు ఈ యూపీ బ్యాట్స్‌మన్‌కు అనుకూలించే అంశాలు. అన్నింటికీ మించి కీలకమైన సమయంలో వికెట్ తీయగల పార్ట్‌టైమ్ బౌలర్‌గానూ రైనా గతంలో అనేకసార్లు నిరూపించుకున్నాడు. ఇక అద్భుతమైన డైవ్‌లు, కండ్లు చెదిరే క్యాచ్‌లతో ఫీల్డింగ్ విషయంలో కుర్రాళ్లకు అందనంత ఎత్తులో ఉంటాడు. వన్డేల్లో ఇప్పటికే వంద క్యాచ్‌లు పూర్తి చేసుకుని నిఖార్సైన ఫీల్డర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఒక్క బ్యాటింగ్‌లోనే కాకుండా మిగతా అన్ని అంశాల్లోనూ యువ క్రికెటర్లకు దీటుగా ఉన్న రైనా, కాసింత నిలకడ ప్రదర్శిస్తే వన్డే జట్టులోకి పునరాగమనం చేయడం పెద్ద కష్టమేమీ కాదు.

- టీ20ల్లో సెంచరీ చేసిన మూడో బ్యాట్స్‌మన్
- టీ20 ప్రపంచకప్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌మన్
- మూడు ఫార్మాట్లలో సెంచరీ చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్
- వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో సెంచరీలు చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్

కుర్రాళ్లతో పోటీ

వన్డే జట్టులో తీవ్రమైన పోటీ ఉన్నది. ఓపెనర్లుగా ధవన్, రోహిత్ తమ స్థానాలు పదిలం చేసుకున్నారు. వన్‌డౌన్‌లో విరాట్ కోహ్లీ ఉండనే ఉన్నాడు. ఇక నాలుగో నంబర్‌లో అజింక్య రహానే కొనసాగుతున్నాడు. తాజాగా దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా రహానే తనకు నాలుగో నంబరే అతికినట్టు సరిపోతుందని కుండబద్దలు కొట్టిన విషయం తెలిసిందే. రైనాకు మిగిలినదల్లా ఐదో నంబరే. ఈ స్థానం కోసం ఇప్పటికే యువ బ్యాట్స్‌మెన్ పోటీపడుతున్నారు. వీరిలో మనీశ్‌పాండే, కేదార్ జాదవ్, శ్రెయాస్ అయ్యర్ రేసులో ఉన్నారు. కేఎల్ రాహుల్ సైతం ఇదే స్థానానికి పోటీ పడే అవకాశాలున్నాయి. ఓపెనింగ్ స్లాట్‌పైనే రాహుల్ ఆశలుపెట్టుకున్నప్పటికీ రోహిత్, ధవన్ తిష్ట వేసుకోవడంతో మిడిల్ ఆర్డర్‌పై దృష్టి పెట్టాడు. దీంతో రైనాకు రాహుల్‌తోనూ పోటీ ఉన్నది.


మనీష్


అయ్యర్


న దవ్

కెరీర్‌కు మోర్కెల్ గుడ్‌బై!

■ ఆస్ట్రేలియాతో సిరీసే ఆఖరిది..



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా పేసర్ మోర్నీ మోర్కెల్.. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలుకనున్నాడు. వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే సిరీస్ ముగిసిన వెంబడే రిటైర్మెంట్ ప్రకటిస్తానని స్పష్టం చేశాడు. బిజీ షెడ్యూల్ల వల్ల కుటుంబ జీవితంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నానని అందుకే వీడ్కోలు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. 'రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడం చాలా కష్టంతో కూడుకున్నది. కానీ కొత్త జీవితం ప్రారంభించేందుకు ఇదే సరైన సమయం. బిజీ షెడ్యూల్ కుటుంబ ఒత్తిళ్లను తెచ్చిపెడుతున్నది. నాలో క్రికెట్ జీవితం చాలా ఉంది. కానీ కుటుంబ జీవితాన్ని సాఫీగా సాగించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నా' అని మోర్కెల్ చెప్పాడు. 2006లో భారత్‌పై అరంగేట్రం చేసిన మోర్కెల్ సఫారీ జట్టు తరపున 83 టెస్టులు ఆడి 294 వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికా తరపున అత్యధిక వికెట్లు తీసిన ఐదో బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ప్రొటీస్‌కు ఆడటాన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నానని చెప్పిన మోర్కెల్.. ఏండ్ల తరబడి తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపాడు. 2008 నుంచి రెగ్యులర్‌గా జట్టులో చోటు సంపాదించిన ఈ పేసర్.. 117 వన్డేల్లో 188, 47 టీ20ల్లో 44 వికెట్లు పడగొట్టాడు. మోర్కెల్ నిర్ణయాన్ని తాము గౌరవిస్తామని సీఎస్ఏ సీఈవో తబాంగ్ మోరోయి అన్నారు. యువ క్రికెటర్లకు అతను స్ఫూర్తిదాయకమన్నారు.

టీఎంసీకి భూటియా రాంరాం



కోల్‌కతా: భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా తన రాజకీయ ప్రస్థానానికి వీడ్కోలు పలికాడు. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీకి వీడ్కోలు పలుకుతున్నట్లు భూటియా సోమవారం ప్రకటించాడు. 'తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని అధికారికంగా రాజీనామా చేస్తున్నాను. దేశంలో ఏ రాజకీయ పార్టీతో ఇక నుంచి నాకు ఎలాంటి సంబంధం లేదు' అని భూటియా తన ట్విట్టర్‌లో రాసుకొచ్చాడు.

ముగ్గురి భవితవ్యం తేలేది నేడే

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆఫీస్ బేరర్ల భవితవ్యం నేడు తేలే అవకాశం ఉన్నది. పలు అంశాలపై చర్చించేందుకు పాలకమండలి (సీవోఏ) మంగళవారం ముంబైలో సమావేశం కానున్నది. బీసీసీఐలో ప్రిన్సిపల్ ఆఫీస్ బేరర్స్‌గా ఉన్న తాత్కాలిక అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సీకే ఖన్నా, తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి, తాత్కాలిక కోశాధికారి అనిరుధ్ చౌదరి మూడేండ్ల పదవీ కాలం ముగియడంతో వీరిని తొలగించేందుకు సీవోఏ ప్రతిపాదించనున్నట్టు సమాచారం. దీంతో పాటు మహిళల ఐపీఎల్‌కు ప్రతిపాదనలు వస్తున్న నేపథ్యంలో ప్రయోగాత్మకంగా టీ20 ఎగ్జిబిషన్ మ్యాచ్‌లను నిర్వహించే విషయమై చర్చించనున్నది. ఈ సమావేశానికి సీవోఏ సభ్యులతో పాటు బీసీసీఐ జనరల్ మేనేజర్ సబా కరీం, ఐపీఎల్ సీవోవో హేమంగ్ అమిన్, సీఎఫ్ఓ సంతోష్ హాజరవనున్నారు.

టీటీఎల్ చాంప్ ఆదిలాబాద్

ఫైనల్లో మెదక్ మావెరిక్స్‌పై విజయం





హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగిన వెంకటస్వామి స్మారక తెలంగాణ టీ20 లీగ్(టీటీఎల్)లో ఆదిలాబాద్ టైగర్స్ విజేతగా నిలిచింది. ఆదివారం రాత్రి ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్ 9 పరుగుల తేడాతో మెదక్ మావెరిక్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. ఆదిలాబాద్ నిర్దేశించిన 149 పరుగుల లక్ష్యఛేదనలో మెదక్ 20 ఓవర్లలో 139/5 స్కోరుకు పరిమితమైంది. జట్టులో మల్లికార్జున్(38), మికిల్ జైస్వాల్(39), సందీప్(29) రాణించారు. 15 ఓవర్లకు 105/3 స్కోరుతో మెరుగ్గా కనిపించిన మెదక్..ఆఖరి ఐదు ఓవర్లలో తడబడింది. ఆఖర్లో మికిల్ జైస్వాల్ జట్టును గెలిపించేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. తొలుత బెంజమిన్(36), హితేశ్ యాదవ్(34), రవితేజ(33) బ్యాటింగ్‌తో ఆదిలాబాద్ 20 ఓవర్లలో 148/7 స్కోరు చేసింది. మికిల్ జైస్వాల్(3/31), సందీప్(2/20) రాణించారు. ట్రోఫీ ప్రదానోత్సవానికి ఎంపీలు కేశవరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్, మాజీ మంత్రి వినోద్, స్టార్ షట్లర్ పీవీ సింధు, టీటీఎల్ టోర్నీ నిర్వాహకులు ఆగంరావు, మెదక్ మావెరిక్స్ యజమాని జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక X సౌరాష్ట్ర

నేడు విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్

న్యూఢిల్లీ: ఓవైపు సూపర్ ఫామ్‌లో ఉన్న కర్ణాటక.. మరోవైపు వ్యక్తిగత మెరుపులతో సౌరాష్ట్ర.. ఇరుజట్లలో టీమ్‌ఇండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న ఆటగాళ్లు.. ఈ నేపథ్యంలో మంగళవారం రెండు జట్ల మధ్య విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్ పోరు జరుగనుంది. పటిష్టమైన బ్యాటింగ్ లైనప్, నాణ్యమైన బౌలర్లు ఉండటం కర్ణాటకకు లాభించే అంశం. జాతీయ జట్టులో కచ్చితంగా చోటు దక్కుతుందని భావించిన మయాంక్ అగర్వాల్ ఈ మ్యాచ్‌లో అత్యంత కీలకంకానున్నాడు. ఈ సీజన్‌లో అతను మూడు ఫార్మాట్లలో కలిపి 2051 పరుగులు చేశాడు. దీనికి తోడు ముగ్గురు ఆల్‌రౌండర్లు స్టువర్ట్ బిన్నీ, కృష్ణప్ప గౌతమ్, శ్రేయాస్ గోపాల్ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ జడేజా టీమ్ ఇండియాలో చోటు దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ సిరీస్‌లో ఇప్పటికే అతను 633 పరుగులు చేసి జోరుమీదున్నాడు. చతేశ్వర్ పుజార (289), అర్పిత్ (273), సమర్థ్ వ్యాస్ (296), అవి బరోత్ (174)లపై బ్యాటింగ్ భారం పడనుంది. ప్రేరక్ మన్కడ్, చిరాగ్ జానీలాంటి సూపర్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉండటం సౌరాష్ట్రకు అదనపు బలం. ధర్మేంద్ర జడేజా, రవీంద్ర జడేజా స్పిన్‌లో సత్తా చాటితే విజయం నల్లేరు మీద నడకే.

జిమ్నాస్టిక్స్ కోచ్‌కు రూ. 2 లక్షల ఆర్థిక సాయం

■ చెక్ అందజేసిన సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాష్ట్ర జిమ్నాస్టిక్స్ కోచ్ ఎస్ బ్రిజ్ కిశోర్‌కు సాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆదివారం పంజాగుట్టలోని గ్యాస్ట్రో ఎంట్రోలాజి దవాఖానాలో చికిత్స పొందుతున్న అతన్ని పరామర్శించి చెక్‌ను అందజేశారు. ఇటీవల జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో భారత్‌కు తొలి కాంస్యాన్ని అందించిన బుద్దా అరుణా రెడ్డికి బ్రిజ్ కిశోర్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. జిమ్నాస్టిక్స్ సీనియర్ ఉపాధ్యక్షులు బాలరాజు, హైదరాబాద్ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌పాల్ రెడ్డి.. బ్రిజ్ కిశోర్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

కామన్వెల్త్ ఆటగాళ్లకు 50 లక్షల బీమా

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్‌కోస్ట్ వేదికగా ఏప్రిల్ మొదలయ్యే కామన్వెల్త్ క్రీడల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించే 227 మంది ఆటగాళ్లకు ఒక్కొక్కరికి 50 లక్షల చొప్పున బీమా కల్పించారు. సోమవారం కామన్వెల్త్ అధికారిక జెర్సీ అవిష్కరణ కార్యక్రమంలో భారత ఒలింపిక్ సమాఖ్య(ఐవోఏ)..ఎడిల్‌వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది కామన్వెల్త్ క్రీడలతో పాటు ఆసియా గేమ్స్, టోక్యో ఒలింపిక్స్(2020)కు కూడా వర్తించనుంది. ఇక కామన్వెల్త్ క్రీడల ప్రారంభోత్సవ మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొనే క్రీడాకారుల కోసం రేమండ్ సంస్థతో ప్రత్యేకంగా బ్లేజర్లు డిజైన్ చేశారు. దీంతో పాటు అథ్లెట్ల అధికారిక జెర్సీని కేంద్ర క్రీడాశాఖ మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ ఆవిష్కరించారు.



బ్రిటన్‌లో భారీ పేలుడు

- నలుగురి మృతి.. మరో నలుగురికి గాయాలు
- లీసెస్టర్ నగరంలో ఘటన
- ఉగ్రవాదులతో సంబంధం లేదన్న పోలీసులు


లీసెస్టర్ నగరంలో పేలుడు కారణంగా మంటల్లో చిక్కుకున్న భవనం

లండన్, ఫిబ్రవరి 26: ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ నగరంలో మూడంతస్తుల భవనంలో ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో శక్తిమంతమైన పేలుడు సంభవించింది. ఆ వెంటనే నిప్పంటుకోవడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణ సముదాయాలు, రెండో అంతస్తు వరకు భవనం పూర్తిగా ధ్వంసమైంది. శిథిలాల కింద చిక్కుకుని నలుగురు సజీవ సమాధి అయ్యారని లీసెస్టర్ పోలీసులు సోమవారం తెలిపారు. మరో నలుగురు దవాఖానలో చికిత్స పొందుతున్నారని, వారిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని లీసెస్టర్ పోలీస్ సూపరింటెండెంట్ షాన్ ఓ నీల్ తెలిపారు. ఈ ఘటనకు ఉగ్రవాదులతో సంబంధం లేదన్నారు. అత్యవసర సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో శిథిలాలను తొలగిస్తున్నామని చెప్పారు. సహాయ చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. భవన శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకునే అవకాశం ఉన్నదన్నారు. ఈ పేలుడుపై లీసెస్టర్‌షైర్ పోలీసు, అగ్ని మాపక మరియు సహాయ శాఖల ఆధ్వర్యంలో సంయుక్త దర్యాప్తు చేస్తామని తెలిపారు. పేలుడు జరిగిన ప్రాంతంలో గుజరాత్ సంతతి వారు ఎక్కువగా జీవిస్తున్నారు. ఆదివారం రాత్రి ఏడు గంటల తర్వాత తమకు ఫోన్ కాల్ రాగానే ఆరు ఫైరింజన్లు ఘటనాస్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేసినట్లు అత్యవసర సర్వీసుల శాఖ తెలిపింది. పేలుడు సమయంలో భూకంపం మాదిరిగా పెద్ద శబ్ధం వినిపించిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. స్థానికులు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి ప్రయత్నించినా మంటలు చెలరేగడంతో తాము తప్పుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు. పేలుడు సందర్భంగా గాయపడిన 15 ఏండ్ల యువకుడిని రక్షించి అంబులెన్స్‌లో దవాఖానకు తరలించామని వివరించారు.

మేము నెలకొల్పిన పద్ధతులను పాటించడం లేదు

- దిగువ కోర్టుల్లో పలు తీర్పులపై సుప్రీంకోర్టు అసహనం
- ఇదో దురదృష్టకర పరిణామమని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దేశవ్యాప్తంగా చాలా కేసుల్లో న్యాయమూర్తులు తీర్పు ఇచ్చేటప్పుడు సుప్రీంకోర్టు నెలకొల్పిన పద్ధతులను, ఆధారాలను సరిగా అధ్యయనం చేయడం లేదని, బాధితులకు న్యాయం చేయాలనే కోణంలో ఆలోచించడం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తమ వద్దకు వస్తున్న పలు కేసులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నదని వ్యాఖ్యానించింది. దీనిని దురదృష్టకర పరిణామంగా అభివర్ణించింది. న్యాయమూర్తులు స్వతంత్రంగా వ్యవహరించాలని, వారు ఇచ్చే తీర్పులో అది కనిపించాలని జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం సూచించింది. తీర్పు ఇచ్చే సమయంలో ఆధారాలను, గత తీర్పులను ప్రామాణికంగా తీసుకొని న్యాయ కోణంలో ఆలోచించాల్సి ఉంటుందని పేర్కొన్నది. సుప్రీంకోర్టు వరకు వచ్చే కేసుల సంఖ్య పెరుగుతున్నదని, ఈ పరిణామం దిగువ కోర్టుల్లో న్యాయం సరిగా జరుగడం లేదనే అభిప్రాయాన్ని కలిగిస్తున్నదని తెలిపింది. మధ్యప్రదేశ్‌కు చెందిన భూ వివాద కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పైవ్యాఖ్యలు చేసింది. రెండు కోర్టులు పరస్పర విరుద్ధంగా ఇచ్చిన తీర్పులను పరిశీలించిన సుప్రీంకోర్టు.. చాలా మంది జడ్జీలు కేసులను 'న్యాయ' దృష్టిలో చూడటం లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది.

భూ వివాదంపై ఐదుగురు సభ్యుల ధర్మాసనం

భూ సేకరణ వివాదాలను పరిష్కరించే దిశగా స్పష్టమైన సూచనలు అందించడానికి ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన కేసులను మార్చి 6వ తేదీన విచారిస్తారని పేర్కొన్నారు. భూ సేకరణ కేసులకు సంబంధించి రెండు సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనాలు వేర్వేరుగా విచారణ జరిపి పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇవ్వడంతో వివాదం తలెత్తిన విషయం తెలిసిందే.

అమెరికా సంకీర్ణదళాల దాడుల్లో
25 మంది సిరియా పౌరులు మృతి

బీరూట్: సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదులకు పట్టున్న ఆఖరు గ్రామం అల్ షాఫా గ్రామంపై అమెరికా సంకీర్ణదళాలు విరుచుకుపడ్డాయి. ఆదివారం జరిగిన వాయుసేనల దాడుల్లో 25 మంది పౌరులు మరణించారు. సరిహద్దులోని ఐఎస్ నేత అల్బు కమల్ కంచుకోట అల్-షాఫా గ్రామంపై బాంబుల వర్షం కురిసిందని బ్రిటన్‌కు చెందిన మానవ హక్కుల పరిశీలకుడు రామి అబ్దెల్ రహమాన్ తెలిపారు. ఆదివారం రోజంతా సాగిన బాంబు దాడుల్లో ఏడుగురు చిన్నారులు సహా 25 మంది పౌరులు చనిపోయారు. ఈ గ్రామం సిరియాలో ఐఎస్‌కు పట్టున్న చిట్టచివరిది' అని ఆయన తెలిపారు. యూఫరేట్స్ నదికి ఆవల కుర్దిష్ సేనలతో కలిసి అమెరికా సంకీర్ణదళాలు నదికి పశ్చిమాన రష్యా నేతృత్వంలోని దళాలు దాడులు జరుపుతున్నాయి.


అల్-షాఫా గ్రామంలో జరిగిన సంకీర్ణ సేనల దాడుల్లో చనిపోయిన చిన్నారి

సివిల్ సర్వీసెస్ అధికారుల పోరాటగళం
సుబ్రమణియన్ కన్నుమూత



న్యూఢిల్లీ: మాజీ క్యాబినెట్ కార్యదర్శి టీఎస్‌ఆర్ సుబ్రమణియన్ (79) సోమవారం నాడు కన్నుమూశారు. 1961 బ్యాచ్ ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సుబ్రమణియన్...ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, కేంద్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. వాజపేయి, గుజ్రాల్, దేవేగౌడ ప్రభుత్వాల్లో కేబినెట్ కార్యదర్శిగా సేవలందించారు. సుబ్రమణియన్ 'పిల్' ఆధారంగా ఇండియన్ సివిల్ సర్వీసెస్ అధికారుల బదిలీలను నిర్ణయించేందుకు సివిల్ సర్వీసెస్ మండలిని ఏర్పాటు చేయాలని కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు 2013లో ఆదేశాలు జారీ చేసింది. రాజకీయ ఒత్తిళ్ల మేరకు తరచుగా సివిల్ సర్వీసెస్ అధికారుల బదిలీలు జరుగకుండా చూసేందుకు స్థిరమైన పదవీకాలాన్ని నిర్ణయించాలని కూడా కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 1998 లో పదవీవిరమణ తర్వాత కూడా సుబ్రమణియన్ బ్యూరోక్రాట్ల సమస్యలపై చురుకుగా పోరాడారు. ఆయన మృతి పట్ల ఐఏఎస్ అధికారుల సంఘంతో పాటు పలువురు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

ఐసిస్‌తో సంబంధాలున్న
భారత సంతతి మహిళ అరెస్టు

కిడ్నాప్ కేసులో అదుపులోకి తీసుకున్న దక్షిణాఫ్రికా పోలీసులు

జోహన్నెస్‌బర్గ్, ఫిబ్రవరి 26: ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదసంస్థతో సంబంధాలున్న భారత సంతతికి చెందిన ఓ మహిళని, ఆమె భర్తని దక్షిణాఫ్రికా ప్రత్యేక పోలీసుల బృందం అరెస్టు చేసింది. బ్రిటన్‌కు చెందిన దంపతులను కిడ్నాప్ చేసిన కేసులో వారిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 12న క్వాజులు నాతల్‌లోని బీవన్ డ్యామ్ వద్ద విహారానికి వెళ్లిన కేప్‌టౌన్‌లో నివాసముండే జంటను ఫాతిమా పటేల్ (27), సఫియుద్దీన్ అస్లాం దెల్ వెచియో (38) కిడ్నాప్ చేసినట్లు తెలిపాయి. వీరువురిపై కిడ్నాప్, దోపిడీ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. దొంగిలించిన క్రెడిట్ కార్డులతో శిబిరాలకు అవసరమయ్యే సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలను వీరు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఐసిస్ జెండా ఎగురుతున్న ఓ మారుమూల ప్రాంతాల్లో ఈ పరికరాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిందితులను పోలీసుకస్టడీకి కోర్టు అనుమతించిందని, కిడ్నాపైన దంపతుల కోసం గాలిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ఇండోనేషియా సముద్రంలో 6.1 తీవ్రతతో భూకంపం



జకర్తా, ఫిబ్రవరి 26: తూర్పు ఇండోనేషియాలో సోమవారం నాడు భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై తీవ్రత 6.1గా నమోదైనట్లు అమెరికా జియాలాజికల్ సర్వే తెలిపింది. ఎలాంటి సునామీ హెచ్చరికలను జారీ చేయలేదు. రాజధానికి వాయవ్యంగా 194 కిలోమీటర్ల దూరంలోని అంబన్ వద్ద సముద్రంలో 11.9 కిలోమీటర్ల లోతులో భూప్రకంపనలు సంభవించినట్లు అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. దీని కారణంగా ఎలాంటి నష్టం జరిగినట్లు సమాచారం రాలేదు.

ఐఐటీ మద్రాస్‌లో సంస్కృత గీతంపై వివాదం

చెన్నై, ఫిబ్రవరి 26: ఐఐటీ మద్రాస్‌లో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో సంస్కృత గీతాన్ని ఆలపించడం వివాదానికి దారితీసింది. ఇద్దరు కేంద్ర మంత్రులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తమిళ గీతం కాకుండా సంస్కృత గీతాన్ని ఎందుకు ఆలపించారని డీఎంకే సహా ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించాయి. నేషనల్ టెక్నాలజీ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో దివంగత ముత్తుస్వామి దీక్షితార్ రాసిన 'మహా గణపతిం మనసా స్మరామి' గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పొన్ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. తమిళనాడులో తమిళ భాషను అవమానించేందుకే పరాయి భాషా గీతాన్ని ఆలపించారని డీఎంకే నాయకుడు స్టాలిన్ ధ్వజమెత్తారు. కేంద్రం తమపై హిందీని, సంస్కృత భాషను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నదని ఎండీఎంకే నాయకుడు వైకో ఆరోపించారు.

ఐవోసీఎల్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) వివిధ రిఫైనరీ యూనిట్‌లలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ (నాన్ ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఇండియాలోని ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల్లో అతిపెద్ద వాణిజ్య సంస్థ. ఈ పోస్టులను గ్రేడ్ 4 కేటగిరీలో భాగంగా భర్తీచేస్తారు. దీనిద్వారా గువాహటి, బొంగయ్‌గావ్, గుజరాత్, హల్దియా, పారాదీప్, పానిపట్ రిఫైనరీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నారు.



- మొత్తం ఖాళీల సంఖ్య: 201 పోస్టులు
- రిఫైనరీ యూనిట్‌ల వారీగా ఖాళీలు..
- **హల్దియా రిఫైనరీ-50 ఖాళీలు**
- జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-44 (ప్రొడక్షన్, పీ అండ్ యూ, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్)
- జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్-2, మెటీరియల్స్ /టెక్నికల్ అసిస్టెంట్-4
- **గుజరాత్ రిఫైనరీ-59 ఖాళీలు**
- జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-34 ఖాళీలు (ప్రొడక్షన్, టీపీఎస్, ఫైర్ & సేఫ్టీ)
- జూనియర్ ఇంజినీరింగ్/టెక్నికల్ అసిస్టెంట్-17, క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్-5, మెటీరియల్స్ / టెక్నికల్ అసిస్టెంట్-3
- **గువాహటి రిఫైనరీ-29 ఖాళీలు**
- జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-29 ఖాళీలు (ప్రొడక్షన్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్)
- **పానిపట్ రిఫైనరీ-14 ఖాళీలు**
- జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-13 ఖాళీలు (ప్రొడక్షన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫైర్ అండ్ సేఫ్టీ)
- జూనియర్ మెటీరియల్స్/ టెక్నికల్ అసిస్టెంట్-1
- **పారాదీప్ రిఫైనరీ-20 ఖాళీలు**
- జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-19 ఖాళీలు (ప్రొడక్షన్, టీపీఎస్, ఫైర్ అండ్ సేఫ్టీ)
- జూనియర్ ఇంజినీరింగ్/టెక్నికల్ అసిస్టెంట్-1
- **బొంగాయ్‌గావ్ రిఫైనరీ-29 ఖాళీలు**
- జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-24 ఖాళీలు (ప్రొడక్షన్, పీ అండ్ యూ, ఫైర్ అండ్ సేఫ్టీ, ఇన్‌స్ట్రుమెంటేషన్)
- జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్-3, మెటీరియల్స్/ టెక్నికల్ అసిస్టెంట్-1, నర్సింగ్ అసిస్టెంట్-1
- **విభాగాల వారీగా అర్హతలు:**
- **జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ (ప్రొడక్షన్):** కెమికల్/రిఫైనరీ & పెట్రోకెమికల్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా లేదా బీఎస్సీ (ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ/ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ)లో ఉత్తీర్ణత.
- **జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ (పవర్ అండ్ యుటిలిటీస్):** మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా. పదోతరగతి+ఐటీఐ (ఫిట్టర్)తోపాటు బాయిలర్ కాంపిటెన్సీ సర్టిఫికెట్ ఉండాలి లేదా బీఎస్సీ (పీసీఎం)తోపాటు బాయిలర్ ట్రేడ్‌లో అప్రెంటిస్‌షిప్ ఉండాలి.
- **జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్ (క్వాలిటీ కంట్రోల్):** బీఎస్సీ (ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ/ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ)లో ఉత్తీర్ణత.
- **జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ (ఫైర్ అండ్ సేఫ్టీ):** మెట్రిక్యులేషన్, నాగ్‌పూర్ ఎన్ఎఫ్ఎస్సీతో సబ్ ఆఫీసర్స్ కోర్సు లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంస్థ సూచించిన శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. ఫైర్ అండ్ సేఫ్టీలో ఏడాది అనుభవం ఉండాలి.
- **జూనియర్ ఇంజినీరింగ్/ టెక్నికల్ అసిస్టెంట్:** సంబంధిత విభాగంలో మూడేండ్ల డిప్లొమా/బీఎస్సీలో ఉత్తీర్ణత.
- **జూనియర్ మెటీరియల్ అసిస్టెంట్ (మెటీరియల్స్):** మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమాలో ఉత్తీర్ణత.
- **జూనియర్ నర్సింగ్ అసిస్టెంట్ (స్టాఫ్ నర్స్):** నాలుగేండ్ల బీఎస్సీ (నర్సింగ్) లేదా నర్సింగ్ & మిడ్‌వైఫరీ లేదా గైనకాలజీ & ఒబెస్ట్రెట్రిక్స్‌లో మూడేండ్ల డిప్లొమాలో ఉత్తీర్ణత..
- **వయస్సు:** 2018 ఫిబ్రవరి 28 నాటికి 18 నుంచి 26 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 150/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **పే స్కేల్ :** రూ. 11,900-32,000/-
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్, ప్రొఫిషియన్సీ టెస్ట్ ద్వారా.
- రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. సంబంధిత సబ్జెక్ట్ నుంచి 75 మార్కులు, జనరల్ ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ అండ్ జనరల్ నాలెడ్జ్‌ల నుంచి 25 మార్కులు.
- ఈ ఆబ్జెక్టివ్ పరీక్షను 90 నిమిషాల్లో పూర్తిచేయాలి.
- నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 10
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ:** మార్చి 24
- **రాతపరీక్ష తేదీ:** మార్చి 25
- **ఫలితాల విడుదల:** ఏప్రిల్ 17
- **వెబ్‌సైట్:**www.iocrefrecruit.in

విద్య, ఉద్యోగ సమాచారం

యూజీసీ నెట్(జూలై)-2018

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)-జూలై 2018 ప్రకటనను సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

వివరాలు:

దేశంలోని యూనివర్సిటీల్లో, అనుబంధ కాలేజీల్లో లెక్చరర్లుగా చేరేందుకు, పరిశోధనలు చేసేందుకు ఈ ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత కల్పిస్తున్నది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 'యూజీసీ నెట్/జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (లెక్చరర్‌షిప్) పరీక్షను ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్నది.

- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత పీజీలో ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** 2018 జూలై 1 నాటికి జేఆర్ఎఫ్‌కు 30 ఏండ్లకు మించరాదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు వయోపరిమితి లేదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం:** మార్చి 5
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** ఏప్రిల్ 5
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఏప్రిల్ 6
- **దరఖాస్తులో తప్పు, ఒప్పుల సవరణ:** ఏప్రిల్ 25 - మే 5.
- **రాత పరీక్ష :** 2018 జూలై 8
- **వెబ్‌సైట్ :** http://cbsenet.nic.in

పవన్‌హాన్స్‌లో ఇన్‌స్ట్రక్టర్లు

నోయిడాలోని పవన్ హాన్స్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఇన్‌స్ట్రక్టర్, డెమాన్‌స్ట్రేటర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- మొత్తం ఖాళీల సంఖ్య: 16 (ఇన్‌స్ట్రక్టర్-10, డెమాన్‌స్ట్రేటర్-6)
- **అర్హత:** ఏరోనాటికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంట్స్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ / డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్) లేదా మెకానికల్, ఏవియానిక్స్ విభాగంలో బేసిక్ ఏఎంఈ లైసెన్స్, డెమాన్‌స్ట్రేటర్ పోస్టులకు ఏదైనా బ్రాంచిలో డిప్లొమాతోపాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 118/- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www. pawanhans.co.in

ఆర్‌సీఎఫ్‌ఎల్‌లో ట్రేడ్ అప్రెంటిస్‌లు

ముంబైలోని రాష్ట్రీయ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రేడ్ అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



- **పోస్టు పేరు:** ట్రేడ్ అప్రెంటిస్
- **మొత్తం ట్రేడ్‌ల సంఖ్య:** 154
- **విభాగాలవారీగా ఖాళీలు:**
- రీజినల్ డైరెక్టర్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్‌లో..87 ఖాళీలు (జనరల్-45, ఓబీసీ-23, ఎస్సీ-13, ఎస్టీ-6)
- వెల్డర్ (గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్)-2, మెషినిస్ట్-3, ఎలక్ట్రీషియన్-10, మెయింటెనెన్స్ మెకానిక్ కెమికల్ ప్లాంట్ (ఎంఎంసీపీ)-12, బాయిలర్ అటెండెంట్-4, అటెండర్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్ (ఏవోసీపీ)-30, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ కెమికల్ ప్లాంట్ (ఐఎంసీపీ), ల్యాబొరేటరీ అటెండెంట్ కెమికల్ ప్లాంట్ (ఎల్ఏసీపీ)-4, మెడికల్ ల్యాబొరేటరీ టెక్ (పాథాలజీ)-2, మెడికల్ ల్యాబొరేటరీ టెక్ (రేడియాలజీ)-1, లైబ్రేరీ అసిస్టెంట్-1, స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్)-8
- **అర్హత:** ఇంటర్, ఇంటర్ (సైన్స్, మ్యాథ్స్/కాంపిటెన్సీ వొకేషనల్ కోర్సు), బీఎస్సీ (కెమిస్ట్రీ, ఫిజిక్స్), ఇంటర్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ అండ్ బయాలజీ/కాంపిటెన్సీ వొకేషనల్ కోర్సు)లో ఉత్తీర్ణత. వెల్డర్, స్టెనోగ్రాఫర్‌కు ఏదైనా ఇంటర్‌లో ఉత్తీర్ణత.
- **ట్రెయినింగ్ పీరియడ్:** ఏడాది/రెండేండ్లు, కొన్ని ట్రేడులకు 15 నెలల వరకు శిక్షణ ఉంటుంది.
- బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్ (బీవోవీటీ)లో- 67 ఖాళీలు (జనరల్-36, ఓబీసీ-18, ఎస్సీ-9, ఎస్టీ-4)
- డిప్లొమా ట్రెయినీ (కెమికల్-19, మెకానికల్-18, ఎలక్ట్రికల్-12, ఇన్‌స్ట్రుమెంటేషన్-8, సివిల్-3, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్-5, కంప్యూటర్ /ఐటీ-2)
- **ట్రెయినింగ్ పీరియడ్:** ఏడాది
- **అర్హత:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ /ఐటీ, సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 నవంబర్ 1 నాటికి 21 ఏండ్లకు మించరాదు. (డిప్లొమా ట్రెయినీ, మరికొన్ని ట్రేడులకు 25 ఏండ్లు)
- **స్టయిఫండ్:** రూ. 5000/- లేదా రూ. 6,381/- లేదా రూ. 8,204/- (ట్రేడుల వారీగా)
- **ఎంపిక:** అకడమిక్ మార్కుల ఆధారంగా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 8
- **వెబ్‌సైట్:** www.rcfltd.com

సీజీహెచ్‌ఎస్‌లో

సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌సీ) పరిధి యూనిట్లలో ఖాళీగా ఉన్న ఎంటీఎస్ (గ్రూప్ సీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు :

సీజీహెచ్‌సీ అనేది కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తుంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 128 (మెడికల్ అటెండెంట్-77, లేడీ మెడికల్ అటెండెంట్-51)
- **అర్హత:** మెట్రిక్యులేషన్/పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఫస్ట్ ఎయిడ్‌లో సర్టిఫికెట్ ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 18,000-56,900/-
- **వయస్సు :** 18-25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** https://cghsrecruitment.mahaonline.gov.in

ఎన్‌ఐబీలో సైంటిస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయాలజికల్స్ ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు :

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయలాజికల్స్ ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో పనిచేస్తుంది.

- మొత్తం పోస్టులు: 4 (గ్రేడ్1 సైంటిస్ట్-1, జూనియర్ సైంటిస్ట్-2, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెడికల్‌లో పీజీ, జూనియర్ సైంటిస్ట్‌కు ఎమ్మెస్సీ, అసిస్టెంట్‌కు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** సైంటిస్ట్‌కు 30 ఏండ్లు, అసిస్టెంట్‌కు 35 ఏండ్లకు మించరాదు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** http://nib.gov.in